# ఎన్నికల సంస్కరణలు

## భవిష్యత్ భారతం - 2

(ఈనాడు వార్తాపత్రికలో ప్రచురితమైన వ్యాసాలు)

డా॥ జయప్రకాష్ నారాయణ్

ప్రజలే ప్రభువులు

లోక్‌సత్తా

# ఎన్నికల సంస్కరణలు

## భవిష్యత్ భారతం - 2

మొదటి ముద్రణ : డిసెంబర్, 2013

ప్రతులు : 1000

**వెల : రూ. 75/-**

*ప్రచురణ :* **Foundation for Democratic Reforms (FDR)**

*ముద్రణ :* Kalajyothi Process Pvt. Ltd., RTC "X" Road, Hyderabad

---

*ప్రతులకు*

**Foundation for Democratic Reforms (FDR)**

ఫ్లాట్ నెం. 801 & 806, శ్రీనివాస టవర్స్,

ఐటిసి కాకతీయ హోటల్ ప్రక్కన,

బేగంపేట్, హైదరాబాద్ – 500 016.

ఫ్యాక్స్ : 040 – 23419948, ఫోన్ : 23419949

E-mail : info@fdrindia.org, www.fdrindia.org

# విషయసూచిక


| వ్యాసాలు | | పేజీ నెం. |
|---|---|---|
| 1. | సామాన్యుడి ఆశలు - ఎన్నికల ఊసులు (డిసెంబరు 22, 1997) | 21 |
| 2. | నేతలకోసమే ఎన్నికలైతే దేశమేగతి బాగుపడునోయ్! (సెప్టెంబరు 6, 2004) | 27 |
| 3. | చెదిరిపోతున్న లక్ష్మణ రేఖ! (ఫిబ్రవరి 6, 2006) | 33 |
| 4. | ప్రజాస్వామ్యం మన బలమా? బలహీనతా? (జూలై 7, 2003) | 38 |
| 5. | జనచైతన్యమే ప్రజాస్వామ్యానికి బలం (ఫిబ్రవరి 24, 2003) | 42 |
| 6. | ఎన్నికల ప్రచారాంశాలు నినాదాలా, విధానాలా? (మార్చి 16, 2004) | 47 |
| 7. | అధికారం కోసం సృష్టిస్తున్న అయోమయమిది! (ఏప్రిల్ 16, 2001) | 51 |
| 8. | ఓటర్లకు స్వేచ్ఛలేని ఎన్నికలతో ఒరిగేదేమిటి? (ఏప్రిల్ 5, 2004) | 56 |
| 9. | పార్టీలన్నీ ఆ తానులో ముక్కలేగనుక ఎన్నికకు అభ్యర్థుల గుణగణాలే ప్రాతిపదిక! (ఆగస్టు 30, 1999) | 62 |
| 10. | జనాభీష్టం పేరిట ప్రజాస్వామ్యంతో చెలగాటం (ఏప్రిల్ 30, 2001) | 67 |
| 11. | పార్టీ ప్రయోజనాలముందు ప్రజాశ్రేయం దిగదుడుపేనా? (నవంబర్ 5, 2001) | 73 |
| 12. | రాజకీయ విరాళాలకు రాచబాట! (ఏప్రిల్ 12, 2004) | 78 |
| 13. | దేశ ప్రజాస్వామ్య ప్రస్థానంలో మేలిమలుపు ఎన్నికల నిధులపై చట్టం (అక్టోబరు 13, 2003) | 83 |
| 14. | ప్రచారంపై నిషేధం - రాజ్యాంగ విరుద్ధం (మార్చి 8, 2004) | 87 |
| 15. | సమస్యల ఘోషే తప్ప పరిష్కారాలపై ధ్యాసేదీ! (ఏప్రిల్ 26, 2004) | 92 |
| 16. | ప్రజల తీర్పు నేర్పుతున్న గుణపాఠాలెన్నో (అక్టోబర్ 11, 1999) | 96 |
| 17. | అధికార పీఠాలను శాసిస్తున్న ఆధునిక పిండారీలు! (ఏప్రిల్ 12, 1999) | 101 |

*18. నేడు అన్యాయాన్ని సహిస్తే రేపు మనకూ జరిగేదదే! (జూన్ 4, 2001)..................106*

*19. నేరమే అధికారమై ప్రజల్ని వేధిస్తున్న వైనం! (సెప్టెంబర్ 6, 1999)..........................112*

*20. ప్రజాస్వామ్య ప్రస్థానంలో మేలుమలుపు (మే 6, 2002)....................................118*

*21. 'ఫిరాయింపుల చట్టం'తో ప్రజాస్వామ్య ఖననం! (జూలై 5, 1999)......................123*

*22. అభ్యర్థుల ఎంపిక పార్టీల సొంత వ్యవహారం కారాదు (జూలై 26, 1999)...........128*

*23. హింసా రాజకీయాన్ని దునుమాడే వ్యూహమేది? (జూలై 24, 2000)...................134*

*24. ముళ్లబాటే అయినా ముందడుగే! (మార్చి 29, 2004)..........................................140*

*25. ఎన్నికల వాగ్దానాల్లో 'ఉచితం' అనుచితమే (ఆగస్టు 23, 1999).........................145*

*26. ప్రజా సేవకులా? జనం నెత్తినెక్కే నాయకులా? (డిసెంబర్ 29, 1997).................150*

*27. నిజమైన జనస్వామ్యంలో వ్యక్తులకన్నా సంస్థలు మిన్న (నవంబర్ 10, 1997).......155*

*28. పార్టీలకు ప్రాణ సంకటం, ప్రజలకు వినోదం మళ్లీ ఎన్నికలు (డిసెంబర్ 8, 1997)...161*

*29. ప్రజాస్వామ్యంలో సుపరిపాలనే కీలకం (మే 3, 1999).......................................167*

*30. ఎన్నికల వ్యవస్థ ప్రక్షాళనతో నిజమైన ప్రజాస్వామ్యం (జనవరి 22, 2000).............172*

*31. రాజకీయ ప్రక్షాళన కోరి మరో మహోద్యమం (ఏప్రిల్ 16, 2005).......................178*

*32. దామాషా పద్ధతే మేలు : రాజ్యసభ ఎన్నికలు (ఏప్రిల్ 28, 2003).........................184*

*33. దామాషా విధానమే సరైన ప్రత్యామ్నాయం (అక్టోబరు 27, 2003)......................188*

*34. మహిళల ప్రాతినిధ్యానికి సబబైన మార్గం (నవంబర్10, 1999)..........................193*

*35. పార్టీ రహిత ప్రభుత్వాలు పరిష్కారం కాదు (నవంబర్ 30, 1998).......................198*

*36. పదవుల కోసం ఆరాటం ప్రజాసేవకేనా? (ఆగస్టు 27, 2001)..............................203*

*37. తరతమ భేదాలతో అన్నీ ఆ తాను ముక్కలే! (జూన్ 3, 2002)............................208*

*38. నిర్దిష్ట కాలావధికాదు నిర్దుష్ట కార్యాచరణ ముఖ్యం (నవంబర్ 22, 1997)...........213*

# పీఠిక

రెండో ప్రపంచయుద్ధకాలంలో ఓ కవి ఇలా రాశారు– "ముందుగా నాజీలు యూదుల కోసం వచ్చారు. నేను యూదుణ్ణి కాదు, అందుకని పట్టించుకోలేదు. ఆ తరవాత నల్లవాళ్ల కోసం వచ్చారు. నేను నల్లవాణ్ణి కాదు, అందుకని పట్టించుకోలేదు. ఆ తరవాత ట్రేడ్ యూనియనిస్టుల కోసం వచ్చారు. నేను ట్రేడ్ యూనియన్లలో లేను, అందుకని పట్టించుకోలేదు. చివరికి నాకోసం వచ్చారు. చుట్టూ చూస్తే నన్ను రక్షించటానికి ఎవరూ మిగలలేదు".

ఆ మాటల అంతరార్థం ఈవేళ మనకు కూడా వర్తిస్తుంది. చెప్పాలంటే, ఇంకా విస్తృతంగా, ఇంకా ప్రాముఖ్యతతో. మన జీవితంలోని ప్రతిరంగాన్ని, ప్రతి అడుగునీ ప్రభావితం చేసే రాజకీయరంగం పట్ల మనం వ్యవహరిస్తున్నతీరుకు ఆ కవి మాటలు అక్షరాలా వర్తిస్తాయి.

ఈవేళ్టి తాత్కాలిక ప్రయోజనాల కోసం రేపటి జీవితాలు, తరాలు ఏమైనా ఫర్వాలేదు అని అవినీతి, పెత్తందారీ రాజకీయాన్ని, అణచివేతను, అన్యాయాన్ని మౌనప్రేక్షకుల్లా సహిస్తూ మంచి మార్పు కోసం కనీసస్థాయి ప్రయత్నం కూడా మనం చేయటం లేదు. పార్టీలు కొన్ని కుటుంబాల సొంత ఆస్తులుగా మారిపోయినా, అవినీతిపరులే నీతిసూత్రాలు వల్లిస్తూ గద్దెనెక్కుతున్నా, వారసులే అధినేతలవుతున్నా, స్థానికంగా కుల,మతాల కుంపట్లు రగులుతున్నా మనం మాత్రం కనీసం ఓటు విలువను పట్టించుకోం, రాజకీయాల్ని పట్టించుకోం, మార్పు కోసం ఆలోచన చేయం, మార్పు కోసం ప్రయత్నించేవారికి మద్దతివ్వం. పోలింగ్‌బూత్‌లకు వెళ్లాలన్నా పెద్దత్యాగంలా భావిస్తుంటారం. ఒకవేళ వెళ్లినా కులం,మతం,ప్రాంతం,భాష వంటి సంకుచిత ధోరణులతోనే ఓటు వేస్తాం. ప్రజలు గొర్రెలు అని బహిరంగంగా చెబుతున్న నేతలకే ఓటు గుద్దుతుంటాం. మనకు నచ్చని పార్టీని ఓడించటానికి అంతకంటే కాస్తతక్కువ రాక్షస రాజకీయం చేసే పార్టీకి ఓటువేస్తున్నాం తప్ప, అసలు రాక్షస రాజకీయాన్ని అంతంచేసే పార్టీకి ఓటువేసి తలెత్తుకుని సంతోషంగా బతుకుదామని, భావితరాలకు మంచి సమాజాన్ని అందించాల్సిన బాధ్యతను నెరవేరుద్దామని ప్రయత్నించటం లేదు. మనం ఉన్న సమాజం సరిగాలేదని, జరగాల్సిన అభివృద్ధి జరగటంలేదని అడుగడుగునా మనకు తెలుస్తూనే ఉంది. కానీ వాటిని ఎలా మార్చాలి,

ఆ పరిష్కారంలో మనం ఎలా భాగస్వాములం కావాలి అని ఎందుకు ఆలోచించి ప్రయత్నం చేయలేకపోతున్నాం. తాత్కాలిక దృష్టిని దాటి కొంచెం లోతుగా ఆలోచిస్తే మనకు జరుగుతున్న నష్టం దిగ్భ్రాంతి కలిగించకమానదు. ఇప్పటికే చాలా సహించాం, ఇంకా మన మనసులోని నిర్వేదాన్ని, నిర్లక్ష్యాన్ని, ఉదాసీనతను పారదోలి రాజకీయాల్ని ప్రక్షాళన చేసుకునేందుకు, అందుకు ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా ఎన్నికల సంస్కరణలను సాధించుకునేందుకు ముందుకు కదలకపోతే భారీ మూల్యం చెల్లిస్తాం. ప్రపంచంలో అంతకుముందు వేలసంవత్సరాలుగా వచ్చిన మార్పులన్నీ కలిపినా 20వ శతాబ్దంలో వచ్చిన మార్పులకంటే చాలా తక్కువగా కనిపిస్తాయి. ఎందుకంటే, శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం, ప్రపంచీకరణ. కాబట్టి మంచికైనా, చెడుకైనా కూడా ఈ 21వ శతాబ్దంలో కాలం ఎంతో విలువైంది. మనం ఓ ఐదేళ్లు నిర్లక్ష్యంగా వ్యవహరించినా, తప్పుడు నిర్ణయాలు తీసుకున్నా అందుకు భారీమూల్యం చెల్లించాల్సి ఉంటుంది. అందుకే, రాజకీయ, ఎన్నికల వ్యవస్థలలో మార్పు కోసం ఈవేళ్టి నుంచే సిద్ధమై కదలటం కార్యదక్షులు చేయాల్సిన పని. మన సమస్యను మనం పరిష్కరించుకోకుండా బైటి నుంచి ఎవరూ మనకు సాయం చేయరు. అది వ్యక్తికైనా, కుటుంబానికైనా, సమాజానికైనా, దేశానికైనా నిర్ద్వంద్వంగా వర్తించే సూత్రం.

ఏ అంశాల ప్రాతిపదికన ఈ ఎన్నికల రాజకీయాలలో మార్పులు తెచ్చుకోవాలో ముందుగా కొంత స్పష్టత తెచ్చుకుని కార్యాచరణలో రాజీలేకుండా వ్యవహరించాలి.

మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చాక ఆ స్వేచ్ఛ ద్వారా చాలా పెద్ద మార్పు వస్తుందని అందరూ ఆశపడ్డారు. అందుకే దేశస్వాతంత్ర్యం కోసం ప్రజలంతా ఏకమై పోరాడారు. కానీ స్వాతంత్ర్యం వచ్చిన 20ఏళ్లకే ఆ ఆశ స్థానంలో నిరాశానిస్పృహలు ఆవరించాయి. దేశస్వాతంత్ర్యంకన్నా భారతదేశాన్ని ఏకతాటి మీద తేవటమే గాంధీజీ సాధించిన పెద్దవిజయంగా మిగిలిపోయింది. భారతదేశం వంటి సంక్లిష్టత, అవిద్య, వైవిద్యం, తీవ్ర వెనకబాటుతనం, వివక్షలు ఉన్న దేశంలో పరిపాలనకు, ఓటుకు ఉన్న సంబంధాన్ని అర్థమయ్యేలా చేసేందుకు పటిష్టవ్యవస్థలు అవసరమనే విషయంలో మన తొలితరం నేతలు కొంత గందరగోళంతో వ్యవహరించారు. నాటి దేశవిభజన, కల్లోలాలు వంటివి వారిలో భయాల్ని పెంచివుండొచ్చు. కానీ ఆ కారణాలతో వారు కేంద్రీకృత పాలనవైపు మొగ్గుచూపటం జాతీయోద్యమ స్ఫూర్తి కనుమరుగవటం, ప్రజలలో ప్రభుత్వం నుంచి ఆశించిన సేవలు ఓ హక్కుగా అందుతాయని ఏళ్ల

తరబడి ఆశించిన ప్రజలకు తెల్లదొరలు పోయి నల్లదొరలు వచ్చారన్న భావన కలగటంతో వ్యతిరేక ఫలితాలకు దారితీయటం మొదలుపెట్టింది. కేంద్రీకృత పాలన పాతుకుపోయి స్థానిక అవసరాల కోసం ఎమ్మెల్యేలు, ఎంపీల మీద విపరీత ఒత్తిడి పెట్టటం, ఎంత ప్రయత్నించినా ఈ వ్యవస్థలో 20-30శాతానికి మించి పనులు నెరవేర్చలేకపోవటంతో నిజాయతీపరులు రాజకీయాల నుంచి తప్పుకోవటం, ప్రజల భావోద్వేగాలను, చిన్నచిన్న అవసరాలనూ సంతృప్తిపరిచేందుకు వ్యక్తిగత సమయం కూడా లేకుండా వెచ్చిస్తున్న ప్రజాప్రతినిధులు ఆ క్రమంలో అవినీతికి పాల్పడటం మొదలైంది. చట్టసభలలో గళం వినిపించాల్సిన ఎమ్మెల్యేలు అక్కడ విఫలమవుతూ ప్రజాస్వామ్యానికి అత్యున్నత పీఠాలుగా భాసించాల్సిన ఆ సభల్ని కించపరుస్తూ ప్రజలతో మమేకం పేరుతో కొత్తగా కార్యనిర్వాహక పాత్ర పోషించటం మొదలుపెట్టారు. రాజకీయాలు కేవలం గెలుపు, అధికారం చుట్టూ తిరుగుతూ అందుకోసం ఎంతకైనా దిగజారటం తీవ్రతరమైంది. దానికితోడు ఒక్క ఓటు ఎక్కువ వచ్చినా గెలిచినట్టే అనే ఇప్పుడున్న ఎన్నికల వ్యవస్థలో (ఫస్ట్ పాస్ట్ ది పోస్ట్ సిస్టం-ఎఫ్.పి.టి.పి) ప్రతి ఓటూ కీలకంగా భావించిన ప్రజాప్రతినిధులు అందుకోసం ఓటర్ల చుట్టూ తిరగటంతో ఓటునే స్థానికంగా చిన్నచిన్న, తాత్కాలిక అవసరాలకు సాధనంగా మాత్రమే ఓటర్లు వినియోగించుకోవటం మొదలైంది. నేతలు పెద్దఎత్తున అవినీతికి పాల్పడుతున్నారు కాబట్టి తమ ఓటుకు ఏదోకటి ఇవ్వాలన్నట్టు వ్యవహరించే సంస్కృతి మొదలైంది. నేతలకు కూడా ఈ ఫార్ములా చాలా వాటంగా అనిపించింది. తాము అవినీతికి పాల్పడుతూ, సంక్షేమం పేరుతో పేదరికాన్ని శాశ్వతంగా కొనసాగించే విధానాలను అమలుచేస్తూ తాయిలాల్ని, ఉచితాల్ని, ఎన్నికల సమయంలో డబ్బు, మద్యం, ఇతర ప్రలోభాలను పంచుతూ గెలవటం ఒక సౌకర్యవంతమైన సాంప్రదాయ ఫార్ములాగా మారింది. దేశరాజకీయ, ఆర్థిక, సామాజిక వ్యవస్థను భ్రష్టుపట్టించిన సాంప్రదాయ రాజకీయ నిర్మాణం ఈ ఫార్ములా. "అవినీతి + సంక్షేమం = అధికారం" అనే ఈ ఫార్ములాను గత కొన్నేళ్లలో పరాకాష్ఠకు తీసుకెళ్లి దేశవ్యాప్తంగా సాంప్రదాయ రాజకీయ (సా.రా) పార్టీలకు ఆదర్శవంతమైన రాష్ట్రంగా పేరుమోసింది ఆంధ్రప్రదేశ్.

ఇలా అటు నేతలు, ఇటు ప్రజలు చెరోదిక్కున సమస్యను పెంచి పోషిస్తూ సంక్షోభం దిశగా వెళ్తున్నారు తప్ప ఈ విషవలయాన్ని ఛేదించే పరిష్కారాల మీద దృష్టి పెట్టటం లేదు. పేదరికంలో వున్నవారు ఈ రాజకీయం ఇంతే, అవినీతిపరుల

నేతల నుంచి, దక్కిందే చాలు అన్నట్టు ఓటును వృథా చేస్తుంటే, ఈ రాజకీయం కుళ్లిపోయింది, ఎవరో మహానుభావులు వస్తే తప్ప మార్పు తేవటం మన వల్ల కాదు అని రంధ్రాన్వేషణలు చేస్తూ చాలామంది ఆలోచనాపరులు, మధ్యతరగతి వారు ఎన్నికల ప్రక్రియ పట్ల బాధ్యతారాహిత్యంతో వ్యవహరిస్తుంటే, అసలు ఈ వ్యవస్థే మంచిదికాదు, దీన్ని పూర్తిగా కూలదోసి మరో వ్యవస్థను తేవాలని మరికొందరు సీరియస్ ఆలోచనాపరులు భావిస్తున్నారు.

మనలో ఎవరు ఏ వర్గానికి చెందినా ప్రజలుగా మనందరం సమస్యలో భాగంగా ఉండకుండా పరిష్కారంలో భాగమవ్వాలంటే కొన్ని వాస్తవాల్ని గుర్తించాలి. ప్రపంచంలో ఎక్కడా కూడా ఉన్న వ్యవస్థను పూర్తిగా కూలదోసి దాంతోసంబంధం లేకుండా కొత్త వ్యవస్థ వచ్చి విజయవంతమైన దాఖలాలు లేవు. ఏదోకరోజు హఠాత్తుగా వచ్చినట్టు కనిపించే మార్పు వెనక అంతకుముందు జరిగిన మంచిపరిణామాల క్రమమంతా ఉంటుంది. 99 పరుగుల తర్వాతే సెంచరీ వస్తుంది. నాటి ఫ్రెంచి మహావిప్లవం నుంచి ఇటీవలి అరబ్ ముట్టడింపుల వరకూ నిశితంగా, నిష్పాక్షికంగా పరిశీలిస్తే ఇదే సత్యం గోచరిస్తుంది. కాబట్టి గతంలో మన వ్యవస్థలోని మంచిని కొనసాగిస్తూ, వినియోగించుకుంటూనే నూతన వ్యవస్థల సృష్టి చేసుకోవాలి. ఇప్పుడున్న రాజకీయ వ్యవస్థను పూర్తిగా నేలమట్టం చేసేంతవరకూ మేం రాజకీయాలలో పాలుపంచుకోం అనే వాదన పూర్తిగా పలాయనవాదం. కుళ్లు రాజకీయాలను మార్చాలంటే మరింత మంచి రాజకీయాల్ని చేయటమొక్కటే మార్గం, అందులో భాగస్వాములు కావటమొక్కటే మార్గం. కుంటిసాకుల్ని పక్కనపెట్టి అందరం రాజకీయాల ప్రక్షాళనలో భాగస్వాములం కావాలి.

ముందుగా మనం పట్టించుకోవాల్సిన అంశం రాజకీయ పార్టీల నిర్మాణం గురించి. పార్టీల నిర్మాణంతో మనకు సంబంధంలేదనుకుంటూ రాజకీయ పార్టీలంటే ఎవరో ఒక వ్యక్తి లేదా కొన్ని కుటుంబాల సొంత ఆస్తి అన్నట్టు వాటిని వారికే వదిలేస్తున్నాం. ఆ పార్టీల సభలకు, కార్యక్రమాలకు ఆర్భాటాలకు డబ్బు ఎక్కడ్నుంచి వస్తుదో కూడా మనం పట్టించుకోం. ఆహా, ఓహో అని బోలెడుమంది జనం వచ్చారు, పెద్దపార్టీ అని ఓట్లు గుద్దేస్తుంటాం. రాజకీయ పార్టీ నిర్మాణానికి, అధికారానికి, పాలనకు సంబంధం లేదనుకునే మెజారిటీ ప్రజల అవగాహనాలోపమే పార్టీలకదోపిడీ రాజకీయానికి ఇరుసుగా మారింది. పార్టీల్ని సొంత ఎస్టేట్‌లుగా చేసేకుని తమ

కొడుకులకు, కూతుళ్లకు, అల్లుళ్లకు, బంధువులకు అప్పచెబుతున్నారు. ఆ పార్టీని కాపాడుకోవటానికనుగుణంగా విధానాల్ని రూపొందించుకుంటున్నారు, అధికారంలోకి వచ్చాక తమకు ఆస్తుల్ని చట్టవిరుద్ధంగా పెంచుకుంటున్నారు, నల్లడబ్బుతో పార్టీని పోషించుకుంటున్నారు, అధికారబలంతో అవినీతిసొమ్మును కాపాడుకుంటున్నారు. తమ పార్టీకి నల్లడబ్బు విరాళంగా ఇచ్చిన వారిని, అవినీతికి అండగా నిలవగల నేరచరితుల్ని, అక్రమ వ్యాపారవేత్తలని పార్టీలలో నియమించుకుంటున్నారు. ప్రజల తీర్పును పరిహసిస్తూ పార్టీల్ని ఫిరాయించటం, ఒక పార్టీ పతాకం మీద గెలిచిన సభ్యులతో సహా వెళ్లి మరో పార్టీలో విలీనమవటం యధేచ్ఛగా కొనసాగిస్తున్నారు.

నిజానికి రాజకీయ పార్టీలు సొంత ఆస్తులు కావు. అవి ప్రజల సొత్తు. అయినా, పార్టీలలో తమ వారిని నియమించుకునే, ఎంపికచేసుకునే అధికారం అసలా పార్టీలకు ఎలావచ్చిందంటే, మనం, ప్రజలం నిర్లక్ష్యంగా ఉండటం వల్లే. మనం బరాక్ ఒబామా గురించో, డేవిడ్ కామెరాన్ గురించో, ఏంజిలా మెర్కెల్ గురించో చాలా సందర్భాలలో ఆసక్తిగా ఉన్నతభావనతో మాట్లాడుకుంటుంటాం. కానీ అమెరికా, బ్రిటన్, జర్మనీలలోవారు అత్యున్నత పదవులలోకి రాకముందు వారి గురించి ఎవరికైనా తెలుసా? 2006 ప్రాంతం వరకూ అమెరికాలో ఒబామా ఎవరో పెద్దగా తెలియదు. చికాగోలో ఆయనకంటే నా పేరు ఎక్కువమందికి తెలుసు. అయితే ఎప్పుడైతే ఒక ప్రసంగంతో ఒబామా ఆలోచనాపటిమ, సామర్థ్యం వెల్లడైందో డెమోక్రాటిక్ పార్టీ ఆయనకు వేదికను అందించి చకచకా ఎదిగే అవకాశాన్ని కల్పించింది. చివరకు నల్లజాతీయుడైన ఆయన అగ్రరాజ్యాధినేత కాగలిగారు. అలాగే బ్రిటన్‌లో కామరాన్, జర్మనీలో మెర్కెల్. అలాంటి ఎదుగుదల సామాన్యప్రజలకు మనదేశంలోని ఏ జాతీయ, ప్రాంతీయ పార్టీ ద్వారానైనా సాధ్యమా? సామర్థ్యం, నిజాయతీగలవారు ఎవరైనా త్వరగా ఎదిగి దేశప్రగతికి ఉపయోగపడే ఎజెండాను అమలుచేయగలిగే అవకాశాన్ని పార్టీలు కల్పిస్తున్నాయా? లేదు. పార్టీల నిర్మాణం పెత్తందారీ ధోరణితో, నియంతృత్వ పోకడలతో ఉండబట్టే మనదేశంలో రాజకీయాలు భ్రష్టుపట్టిపోయాయి. కాబట్టి మంచి నేతలు రావాలంటే పార్టీలు ప్రజాస్వామ్యయుతంగా, ప్రజల ఆస్తిగా రూపుదిద్దుకోవాలి. లోక్‌సత్తా ఒక పార్టీగా రావటానికి ఇది కూడా ఒక బలమైన కారణం. లోక్‌సత్తా అనేది జేపీ ఆస్తి కాదు అని అనేకమార్లు ప్రకటించాను. రాష్ట్రంలో, దేశంలో సత్తా కలిగిన సామాన్యప్రజలకు వేదికగా లోక్‌సత్తా ఉపయోగపడుతోంది. మహిళలు,

అణగారిన వర్గాలవారు ఎవరైనా తమ సామర్థ్యం మేర స్వేచ్ఛగా పార్టీ ద్వారా అత్యున్నతస్థాయికి ఎదిగే ప్రజాస్వామ్యయుత ఏర్పాట్లను పార్టీలో చేశాం. ఇప్పటివరకూ అవకాశాలు దక్కనివర్గాలు పోటీలో వెనకబడకుండా ఉండేందుకు వారికి పార్టీలో కొన్ని కీలకపదవులు విధిగా అందే ఏర్పాట్లు చేశాం. బహిరంగచర్చ ప్రమాణాలను పెంచుతూ, ప్రజల హక్కులను కాలరాయని రాజ్యాంగబద్ధ పోరాటవిధానాలతో నూతన రాజకీయ సంస్కృతిని పెంపొందించాం. చట్టపరమైన రిజర్వేషన్లతో సంబంధంలేకుండా అర్హులు ముందుకొస్తే మహిళలు, వెనకబడిన, అణగారినవర్గాలకు జనాభా నిష్పత్తికంటే కూడా ఎక్కువ ప్రాతినిధ్యం కల్పిస్తామని బహిరంగంగా ప్రకటించింది లోక్‌సత్తా. 2009 అసెంబ్లీ ఎన్నికలలో లోక్‌సత్తా ఎటువంటి కులరాజకీయాలు చేయకుండా పూర్తి ప్రజాస్వామ్య పద్ధతిలో టికెట్లను కేటాయించింది. పార్టీ తరుపున పోటీచేసిన ప్రతి ముగ్గురు అభ్యర్థులలో ఒకరు వెనకబడినవర్గాలకు చెందినవారు. దీన్నో ఘనకార్యంగా లోక్‌సత్తా ఏనాడూ బహిరంగంగా చాటింపువేసుకోలేదు. అలాగే ప్రజలకు లోక్‌సత్తా నుంచి మెరుగైన అభ్యర్థి లభించేందుకు అభ్యర్థి ఎంపికపై ఏకాభిప్రాయం లేని చోట ఓపెన్ ప్రైమరీని నిర్వహించాలన్న పార్టీ విధానాన్ని అనుసరించి, దేశచరిత్రలో మొదటిసారిగా పటాన్‌చెరువు అసెంబ్లీ నియోజకవర్గంలో ఇద్దరు అభ్యర్థుల మధ్య బహిరంగ ప్రాథమిక ఎన్నికల్ని ప్రజల మధ్య నిర్వహించాం. అందులో ఎక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థినే అక్కడ లోక్‌సత్తా అభ్యర్థిగా ప్రకటించాం. పటాన్‌చెరువులో ప్రయోగాత్మకంగా చేసిన ఓపెన్ ప్రైమరీని వీలున్నన్ని ఎక్కువచోట్ల నిర్వహిస్తూ అన్ని నియోజకవర్గాలకూ విస్తరించేందుకు లోక్‌సత్తా కృషి చేస్తోంది. ఈవేళ లోక్‌సత్తా భాషను దేశవ్యాప్తంగా అనేకమంది అనుకరిస్తున్నారు, లోక్‌సత్తా ఎజెండాలోని, రాజకీయ సంస్కృతిలోని అంశాలను ప్రాతిపదికగా చేసుకునే కొత్త పార్టీలు కూడా వస్తున్నాయి.

పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యం ఉండేలా వ్యవస్థీకృత మార్పులకు ఇప్పటికైనా చర్యలు ప్రారంభంకావాలి. పార్టీ అధ్యక్షుడు, ఇతర పదవులలోనివారిని పార్టీ సభ్యులే రహస్య బ్యాలెట్ ద్వారా ఎన్నుకోవాలి. పార్టీ కోసం పనిచేసే సామర్థ్యంగలవారు ఎవరైనా, ఎంతటి సామాన్యులైనా పార్టీలో ఏ స్థాయిలోకైనా ఎదిగే అవకాశం ఉండాలి. అలాగే పార్టీలకు నల్లడబ్బు రాకుండా పార్టీలకిచ్చే విరాళాలను, నిధులను పూర్తివివరాలతో ప్రజల ముందుంచాలి. పార్టీలు నల్లడబ్బు జోలికిపోకుండా

ఉండేందుకు వీలుగా పార్టీలకిచ్చే విరాళాలకు పన్నురాయితీ కల్పించేలా 2003లో జాతీయస్థాయిలో అన్ని పార్టీలనూ ఒప్పించి లోక్‌సత్తా ఒక ప్రామాణికచట్టాన్ని తీసుకొచ్చింది. కానీ ఆ చట్టాన్ని తూచ తప్పకుండా ఆచరిస్తున్నది లోక్‌సత్తా ఒక్కటే. తన ఆదాయవ్యయ వివరాలను ఏటా వెబ్‌సైట్‌లో ప్రపంచవ్యాప్తంగా అందరూ చూసేందుకు వీలుగా ఉంచిన తొలిపార్టీ భారతదేశంలో లోక్‌సత్తాయే. చివరికి జాతీయస్థాయిలో పెద్దపార్టీగా వున్న బీజేపీ కూడా ఆపని చేయలేకపోతోందని నిజాయతీకి పేరొందిన ఆ పార్టీ అగ్రనేత  ఒకరు ఓ సందర్భంలో స్వయంగా ఒప్పుకున్నారు. కాబట్టి అంతర్గత ప్రజాస్వామ్యంతో, విరాళాలుగా తీసుకునే ప్రతి రూపాయికీ లెక్కచెప్పేరీతిలో, స్వయంప్రకాశం కలిగిన నేతలతో స్వయంపోషకంగా ఉండేరీతిలో పార్టీల్ని సుస్థిరంగా కొనసాగేరీతిలో నిర్మించి వాటిని ప్రజలకు వేదికలుగా అందించటం ఈవేళ తక్షణావసరం.

ఇక రెండోది, ఓటు హక్కు వినియోగంలో మనం పూర్తి బాధ్యతాయుతంగా వ్యవహరించటం. ఇంతకుముందే అనుకున్నట్టు ఓటును వదిలేయటం, దుర్వినియోగం చేయటం పలాయనవాదం, అవగాహనారాహిత్యం. వ్యక్తిగతంగా ఎవరి జీవితంలో వారే హీరోలు. కానీ ఉమ్మడి అవసరాల కోసం మనం తప్పనిసరిగా రాజకీయ వ్యవస్థను ఏర్పాటుచేసుకోవాలి. అందులో ప్రజాస్వామ్యమే మెరుగైనది, మనకున్న జనాభారీత్యా ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం అనివార్యం. పాస్టర్ నీమోలార్ చెప్పినట్టు "న్యాయం పొందాలన్న మనిషి తపన ప్రజాస్వామ్యాన్ని సాకారం చేస్తుంది. మనిషి బలహీనత ప్రజాస్వామ్యాన్ని అవసరంగా మారుస్తుంది. మనుషులందరూ అన్నివేళలా ఉత్తములే అయితే మనకు చట్టాలు, ప్రభుత్వాల అవసరమే ఉండదు. వారంతా అన్నివేళలా దుష్టులే అయితే ఎలాంటి చట్టాలూ, ప్రభుత్వాలూ పనిచేయవు. సమానత్వంతోపాటు సమర్థతకు, స్వేచ్ఛతోపాటు న్యాయానికి సావకాశం కల్పించే ప్రభుత్వ విధానం ప్రజాస్వామ్యమొక్కటే"

కానీ ప్రజాస్వామ్యం ద్వారా మెరుగైన ఫలితాలను సాధించుకునే బాధ్యత ప్రాథమికంగా ప్రజల చేతుల్లోనే ఉంటుంది.  భావప్రకటనా స్వేచ్ఛ, ఓటుహక్కు రెండూ మనకు రాజ్యాంగం అందించిన గొప్ప ఆయుధాలు. వాటిని ఏమాత్రం దుర్వినియోగం చేసినా ఆ మేరకు మనమే మూల్యం చెల్లించాల్సి వస్తుంది. ఇప్పటిదాకా జరుగుతున్నదదే. ఈ పరిస్థితిని మార్చేందుకు ఓటును విధిగా వేయటం, సరైన

అభ్యర్థికి, పార్టీకే వేయటం, చుట్టూవున్న వారు కూడా అలా ఓటును సక్రమంగా వినియోగించేలా చేయటం, బూత్‌స్థాయిలో అక్రమాలు జరగకుండా ఓటు పండగ సరైనరీతిలో సాగేందుకు వలంటీర్లుగా పనిచేయటం మనందరం ఓ బాధ్యతగా చేపట్టాలి. "ఎన్నికలు వాటంతటవే విప్లవం కావు. జనజీవితంలో విప్లవాత్మక మార్పుల్ని తేవటానికి అవి ఓ మంచి అవకాశం మాత్రమే" అని గుర్తించి మనం ఓటును వేయాలి. అందుకే, రాజకీయ పార్టీల నుంచి మనం ఆశించాల్సిన విషయాలపై స్పష్టత ఉండాలి. స్థానిక ప్రభుత్వాలు, రాష్ట్రస్థాయి ప్రభుత్వాలు, కేంద్రప్రభుత్వం నుంచి ఏమి అడగాలో మనకు కొంతైనా అవగాహన ఉండాలి. ప్రజల కోసం పార్టీలు ఉంటాయితప్ప పార్టీల కోసం ప్రజలు ఉండరు అని గుర్తించి, రాజకీయ పార్టీల జనాకర్షక పథకాలకు లొంగకుండా మనకు వాస్తవ అవసరాలకు, మన అభివృద్ధికి, మన సంతోషమయ జీవితానికి పార్టీల నుంచి ఏమి అడగాలి, వారు చెప్పేమాటలలో నిజమెంత తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని వ్యవహరించాలి. అలాగే ఒకరి ప్రయోజనాలు ఇంకొకరికి వ్యతిరేకం అనే రీతిలో ప్రజల మధ్య చిచ్చుపెట్టటం దిగజారుడు రాజకీయం అని బండగా గుర్తించాలి. ఒక్కోసారి పరస్పర విరుద్ధమైనా సరే, అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేసే రాజకీయాన్ని ఎవరైతే తమ ఎజెండా ద్వారా చెబుతుంటారో అలాంటి వారి రాజకీయానికే మద్దతు పలకాలి. నిజాయతీని మనం ఓ గొప్ప, అరుదైన లక్షణంగా కాకుండా, కనీస అర్హతగా మనం భావించటం మొదలుపెడితే మనం రాజకీయాలలో అద్భుతమార్పుల్ని సాధించుకోగలం.

ముందుగా మనకు రోజువారీ పనులు సక్రమంగా జరిగేందుకు కావలసిన స్థానిక పాలన సక్రమంగా ఉందా, మనకపిల్లలకు సరైన విద్య అందుతోందా, సరైన వైద్యం, ఉపాధి నైపుణ్యాలు ఉన్నాయా, వ్యవసాయం లాభసాటిగా ఉందా, శాంతిభద్రతలు, చట్టబద్ధ పాలన ఉన్నాయా, స్థానిక అభివృద్ధి ఉందా– ఇలాంటివన్నీ ముందుగా ఆలోచించాలి. వాటికి ఆ పార్టీలు చెబుతున్న ఎజెండాలో ఎంత స్థానముందో చూడాలి. ఆ ఎజెండాను అమలుచేసేందుకు ఆచరణాత్మకమైన విధానాలను తెలుసుకోవాలి. ఆ తర్వాత ఆ అంశాలను చెబుతున్న పార్టీల గత ఆచరణ ఎలాఉ ందో చూడాలి. వాటిలోని వ్యక్తుల గత చరిత్రను పరిగణలోకి తీసుకోవాలి. అప్పుడు ఓటు నిజాయతీగా, నిష్పాక్షికంగా సరైన అభ్యర్థికి/పార్టీకి ఓటువేయాలి.

మన అభివృద్ధికి, సుఖమయ జీవితానికి కావలసివి ఇచ్చాక, మనలో ఎవరికైనా

కొన్ని రాయితీలు, ఉచితంగా ఇవ్వాల్సినవి తప్పనిసరిగా అవసరం ఉంటాయి కాబట్టి, అప్పుడు వాటి గురించి అడగాలి. కానీ చిట్టచివరన కొందరు అభాగ్యులకు ఇవ్వాల్సిన రాయితీల్ని, ఉచితాల్నే మొత్తం పరిపాలన అన్నట్టుగా పార్టీలు, ప్రభుత్వాలు వ్యవహరిస్తుంటే, మనం కూడా వాటిలో ఎవరు మెరుగు, గతంలో ఉన్నవారిని ఈసారి ఓడిద్దాం అనే ధోరణితో ఓటువేస్తుంటే ఇక మన జీవితాలు ఏం బాగుపడతాయి? మనలో చాలామంది ప్రయివేటు స్కూళ్లలో మంచిచదువు వస్తుందనే భ్రమలో అప్పులు చేసి మరీ పిల్లల్ని చదివిస్తున్నారు. అయితే వారిని అలాంటి చదువును పిల్లలకు ఉచితంగా ఇవ్వాలని ఎన్నికల సమయంలో పార్టీల్ని మనం ఎందుకు అడగటం లేదు? ప్రజలకు రాయితీల్ని కొనసాగించాల్సింది, పెంచాల్సింది పేదరికాన్ని నిర్మూలించే విద్య, ఆరోగ్యం, ఉపాధి నైపుణ్యాలు వంటి అంశాలలోనా? లేక పేదరికాన్ని కొనసాగించే తాత్కాలిక పథకాలలోనా? ఇటీవల రాష్ట్రంలోని కొన్ని ప్రధాన సాంప్రదాయ పార్టీల నేతలు పాదయాత్రలు, బాటలు వంటి కార్యక్రమాల్ని నిర్వహించటం పేరుతో ప్రజలలోకి వెళ్లి, ప్రజలకు ఏవో దానాలు చేస్తున్నట్టు, వరాలిస్తున్నట్టు మాట్లాడుతుంటే, ప్రజాస్వామ్యంలో ప్రభువులుగా ఉండాల్సిన ప్రజలు బిచ్చగాళ్లలా వారిని చేతులు జాచి వేడుకుంటుంటే, అంతకంటే ప్రజాస్వామ్యంలో విషాదం ఇంకేముంటుంది?

ఎప్పుడో సుమారు 30ఏళ్ల క్రితం ఎన్టీరామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పేదలకు ప్రవేశపెట్టిన కిలో రూ.2 బియ్యం పథకంలో రేటు ఇంకా తగ్గించి కిలో రూ.1కి ఈవేళ్టికీ అందించాల్సి వస్తుందంటే, అవి పేదరికాన్ని పెంచే విధానమా? లేక తగ్గించే విధానమా? అని మనకు ఎందుకు సందేహం రావటం లేదు. రైతులకు తరచుగా రుణమాఫీలు చేస్తున్నా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారే, సమస్యకు రుణమాఫీలు కాకుండా ఇంకేదో పరిష్కారం ఉంది, రైతులకు పండించిన పంటకు రేటురాకుండా ప్రభుత్వాలే అణగదొక్కి మొసలికన్నీరు కారుస్తున్నాయి అని మనం ఎందుకు అర్థం చేసుకునేందుకు ప్రయత్నించటం లేదు. రైతుల పేరుతో ఇచ్చే రాయితీలకన్నా, రైతుల ఉత్పత్తులకు డిమాండ్ ఉన్నా ధరరాకుండా కృత్రిమంగా అణగదొక్కటం వల్ల వస్తున్న నష్టం రైతులకు ఎంతో ఎక్కువ. వినియోగదారుడు రూ.100 పెట్టి ఒక వ్యవసాయోత్పత్తిని కొంటే, అందులో రూ.35లోపే రైతులకు చేరుతోంది. కుళ్లిపోయే పంటల విషయంలోనైతే రైతులకు దక్కేది కేవలం రూ.12-15. ఈ మాటను ఆ పార్టీలు ఇప్పటిదాకా చెప్పకుండా అటు రైతులను, ఇటు వినియోగదారులను ఇద్దరినీ మోసం చేస్తున్నాయి. అనుచితంగా, రాజ్యాంగస్ఫూర్తికి

విరుద్ధంగా కలర్‌టీవీలు వంటివి కూడా ఉచితంగా ఇచ్చేస్తున్నారు. రేపు ఇంటింటికీ కొంత బంగారం, కొన్ని బ్రాందీసీసాల్ని కూడా పంచుతారేమో. స్థానిక ప్రభుత్వాలకు ఎందుకు నిధులు, అధికారాలు లేవని అడగలేకపోతున్నాం. చివరికి పెనుసంక్షోభంలో ఉన్న రైతులు, కౌలుదారులు కూడా అమాయకంగా పార్టీల వలలో చిక్కి కులం, మతం, ప్రాంతం, పార్టీ పేరుతో చీలిపోయి తమ కళ్లు తామే పొడుచుకుంటున్నారు. ఇలా ప్రతివర్గం వారూ రాజకీయ పార్టీల ఓటుబ్యాంకు రాజకీయాలలో చిక్కుకుని ఓటును వృథా చేసుకుంటున్నారు. ఉన్నకొద్దీ నిరాశలో కూరుకుపోతున్నారు. అలాగే రిజర్వేషన్ల పేరుతో మంత్రి కొడుకుకో, కలెక్టర్ కూతురికో, వారి బంధువులకో మేలుజరుగుతోంది తప్ప అణగారినవర్గాలలో కోట్లాదిమంది జీవితాలు మెరుగుపడటం లేదు. ఆ లబ్ధి పొందినవాళ్లు మళ్లీ పెత్తందారీ వర్గాల ఆర్భాటపు సంస్కృతిని వంటపట్టించుకుని దోపిడీ రాజకీయంలో భాగమవుతున్నారు. అందుకే కొందరికే లబ్ధి కాకుండా, అణగారినవర్గాలలోని వారందరి ఎదుగుదలకు ఏం చేయాలి అనే చర్చ ఎన్నికల సమయంలో మనం ఎందుకు తేలేకపోతున్నాం? ఇలా ప్రతి విధానాన్నీ, మన జీవితాన్ని ప్రభావితం చేసే అంశాలను గుర్తించి వాటికి సంబంధించిన ప్రతి విధానాన్నీ క్షుణ్ణంగా అర్థం చేసుకుని, వాటిని అమలుచేయగలవారిని ఎన్నుకుంటే మనం అనుకున్న ఫలితాల్ని ఎన్నికల నుంచి, ప్రాతినిధ్య వ్యవస్థనుంచి సాధించగలుగుతాం. అలాకాకుండా ఏదోగాలివాటంగా ఓటు వేస్తుంటే, ఓటు లాంటి కీలకమైన ఆయుధం చేతులో ఉన్నా మెరుగైన ఫలితాలను ఎలా సాధించగలం?

ఎలక్ట్రానిక్ వోటింగ్ యంత్రాల (ఈవీఎం) ద్వారా చేసిన ప్రయత్నం వల్ల రిగ్గింగ్, కౌంటింగ్‌లో ఆలస్యాలు వంటి సమస్యలకు చాలామేరకు తెరపడింది. ఈ సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని ఇంకా మెరుగుపరిచి పారదర్శకం చేసే విధంగా చర్యలు తీసుకోవాల్సి ఉంది. అయితే ఇక్కడ అన్నిటికంటే కీలకమైనది, మనం ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాల్సింది ఓటరు జాబితాలు సక్రమంగా ఉండేలా చూసుకోవటం. ఓటర్ల జాబితాలో ప్రజాస్వామ్యం గల్లంతవకూడదు. ఓటర్ల జాబితా ప్రక్షాళనకు లోక్‌సత్తా ఇటు ఆంధ్రప్రదేశ్‌లోను, అటు జాతీయస్థాయిలోనూ పెద్ద కృషి చేసింది. లోక్‌సత్తా ప్రజలలో చైతన్యం తేవటంతోపాటు అందుకు తగిన సంస్థాగత ఏర్పాట్లకు చేసిన ప్రయత్నం వల్ల ఓటర్ల జాబితాలో తప్పులు గణనీయంగా తగ్గాయి. అదికాకుండా, అందరికీ అందుబాటులో పోస్టాఫీసులలో ఏడాది పొడవునా ఓటరు నమోదు, జాబితాల సవరణకు లోక్‌సత్తా గట్టి ప్రయత్నం చేసి సూత్రప్రాయంగా సాధించింది. దీన్ని ఇంకా పటిష్టపరచాల్సి ఉంది.

ఇక మూడోది, ఎన్నికల వ్యవస్థలో మార్పు. మనం వ్యక్తిగతంగా ఓటును సద్వినియోగం చేసుకోవటంతోపాటు దాన్నుంచి మనం ఆశిస్తున్న సమష్టి ఫలితాన్ని అత్యధిక స్థాయిలో సాధించుకోవటం కోసం ఇప్పుడున్న మన ఎన్నికల వ్యవస్థలో కూడా మార్పు తెచ్చుకోవాల్సి ఉంది. మనకు ఇప్పుడున్నటువంటి, ఒక్క ఓటు ఎక్కువ వచ్చినా గెలిచినట్టే అనే ఎఫ్.పి.టి.పి (ఫస్ట్ పాస్ట్ ది పోస్ట్ సిస్టం) ఎన్నికల వ్యవస్థను మార్చి, ఓట్ల శాతానికి తగ్గ సీట్లు అనే దామాషా ఎన్నికల వ్యవస్థను మనం ఏర్పాటు చేసుకుంటే, ఓటర్లు కూడా ఒత్తిడి లేకుండా మంచి పార్టీకి, అభ్యర్థులకు ఓటువేయగలుగుతారు.

1947 నుంచి మూడు దశల రాజకీయాలను గమనించవచ్చు. మొదటిదశ (1947–67)లో జాతి నిర్మాణం, కాంగ్రెస్ ఆధిపత్యానికి సవాళ్లు, ప్రత్యామ్నాయాలు గమనించవచ్చు. మూడవదశ (1989–2000)లో అన్ని రాష్ట్రాలలోనూ, కేంద్రంలోనూ అధికారం కోసం తీవ్రమైన పోటీ నెలకొన్నది. ఇప్పుడు మనం నాల్గవ దశలోకి ప్రవేశిస్తున్నాం. ఆగ్రహం, నిరుత్సాహం, రాజకీయాలంటే ఈసడింపు, నిర్వేదం, సువ్యవస్థీకృతమైన రాజకీయ పార్టీలను నిరాకరించటం, విభేదాలు, మొదటి నుంచి కొనసాగుతున్న వ్యత్యాసాలు, విచ్చలవిడి అవినీతి, సవాళ్లను ఎదుర్కోవటంలో అంతకంతకు పెరిగిపోతున్న అసమర్థత, ప్రజలతోనూ నిజాయతీగా సంప్రదించలేకపోవటం, శక్తి ఉడిగిపోవటం, అడ్డూఆపూలేని జనాకర్షక తాత్కాలిక పథకాలు ఈ నాల్గవ దశ ప్రధాన లక్షణాలు.

ఎన్నికలను వరుసగా చూస్తుంటే, ఓటర్లు ఏదోకస్థాయిలో పరిణతిని చూపుతున్నారని అర్థమవుతుంది. తప్పుచేసినవారికి బుద్ధిచెప్పేలా తీర్పుల్ని ఇస్తున్నారుగానీ, ఆ సాంప్రదాయపార్టీలన్నీ ఒకేతానులో గుడ్డలని, అందులోని నాయకులంతా ఒక ఊబిలో కూరుకుపోయివున్నారని, వాటిలో ఏపార్టీకి ఓటువేసినా పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టేనని, మురిగిపోయినట్టేనని గుర్తించి ప్రత్యామ్నాయం దిశగా ప్రజలు బలంగా కదలటంలా. జాతీయస్థాయిలో కాంగ్రెస్‌కు, బీజేపీకి తేడా ఏమిటి? వివిధ రాష్ట్రాలలోని పార్టీల మధ్య కూడా పేర్లు తప్ప ఏం తేడా ఉంటోంది? చాలా సందర్భాలలో నేతలు కూడా ఒకటే. అటు నుంచి ఇటు మారుతూంటారు. అర్థంతర ఎన్నికలు, ఉపఎన్నికలు, ఫిరాయింపులు జరుగుతున్నా ఓటరు ఏం చేయలేని పరిస్థితి నెలకొంది. పెద్ద రాక్షసుడికి బదులు చిన్న రాక్షసుడు అనే సూత్రంతో గతిలేక ముక్కుమూసుకుని ఆ పనులకు పాల్పడ్డవారికే తిరిగి ఓటు వేస్తున్నారు.

మనం అమలుచేస్తున్న మొదట గీత దాటినవాడే విజేత అనే వ్యవస్థలో ప్రతి నియోజకవర్గంలో నామమాత్రపు ఓట్లకు విజయంలో ప్రాధాన్యం ఉండటం వల్లే సుడిగుండంలో కూరుకుపోతున్నాం. ఇది అవినీతిని, పేదరికాన్ని శాశ్వతంగా కొనసాగించే రాజకీయాన్ని ప్రోత్సహించేలా ఉంది. ఈ ఎఫ్.పి.టి.పి విధానంలో అభ్యర్థికి వచ్చిన మొత్తం ఓట్లకుగానీ, పార్టీకి వచ్చిన మొత్తం ఓట్లకు గానీ ఎలాంటి ప్రాధాన్యత లేదు. కావాల్సిందల్లా, ప్రత్యర్థికన్నా కనీసం ఒక్క ఓటైనా అధికంగా సంపాదించటం. ఒక్క ఓటు ఎక్కువ అంటే విజయమే. ఒక్క ఓటు తక్కువ అంటే అపజయమే. ఈ విధానంలో రెండో బహుమతి లేదు. అందువల్ల అభ్యర్థి విజయం సాధించాలంటే నామమాత్రమపు ఓట్లు రాబట్టటానికి ఓటర్లను ఆకట్టుకోవటానికి అవినీతి అపారంగా వున్న పేదదేశంలో నామమాత్రపు ఓటర్లను ఆకట్టుకోవటానికి ఓట్లను కొనకతప్పదు. ఎక్కువ ఓట్లు సాధించినవారే విజేత అనే విధానంలో ఓటర్లు అరుదుగానే ఉత్తమ అభ్యర్థిని ఎన్నుకుంటారు. ఓటర్లు తమ అంచనాలో కనిష్ఠ అవకాశం అన్న భయం ఉంటుంది. కనక రెండవ నాసిరకం పార్టీని ఎన్నుకుంటారు. మెరుగైన అభ్యర్థులు, పార్టీలు అందుబాటులో ఉన్నప్పటికీ ఓటర్లు తమ ఓటు వృధా కాకూడదనుకుంటారు. ఎవరు ఎక్కువ ఓట్లు సాధిస్తే వారే విజేత అనే విధానంలో ఇద్దరు ప్రధానమైన అభ్యర్థులకు, రెండు ప్రధాన పార్టీలకు మాత్రమే ప్రాధాన్యం ఉంటుంది. అందువల్ల అందరూ నామమాత్రపు ఓట్లను రాబట్టటానికి ప్రయత్నం చేస్తారు. ఎవరు గెలిచినా వారు అదే పద్ధతి అనుసరిస్తారు. ఎన్నికల తర్వాత అందుకే మౌలికమైన మార్పు ఏమీ ఉండదు. డబ్బు ప్రలోభానికి లంగని చాలామంది ఓటర్లు ఎన్నికలకు దూరంగా ఉంటారు. ఎవరు ఎక్కువ ఓట్లు సాధిస్తే వారే విజేత అన్న విధానంలో సాధారణంగా ఓటింగ్ శాతం దామాషా పద్ధతికన్నా 10–15శాతం తక్కువగా ఉంటుంది. అభ్యర్థులు ఓట్లు కొనటం గనక మానేస్తే చాలా నియోజకవర్గాలలో ఓట్ల శాతం 60కాకుండా 40శాతానికి పడిపోతుంది.

ఈవేళ దేశంలో ఉన్న పరిస్థితులలో ఎవరు ఎక్కువ ఓట్లు సాధిస్తే వారే విజేత అనే విధానంలో రాజకీయపార్టీలు అత్యంత ఉత్తమ అభ్యర్థులను పోటీచేయంచరు. ఏదోరకంగా నామమాత్రపు ఓట్లను రాబట్టగలిగే అభ్యర్థులను మాత్రమే పోటీచేయిస్తారు. ఓట్లు కొనడం కోసం అపారంగా డబ్బు ఖర్చు పెట్టగలిగేవారు (కొన్ని రాష్ట్రాలలో ఒక్కో ఎమ్మెల్యే రూ.5 నుంచి 10కోట్లు దాకా ఖర్చుపెడుతున్నారు) లేదా ఆ నియోజకవర్గంలో ఆధిపత్యంలో ఉన్న కులానికి నాయకుడిగా ఎదిగినవారు, లేదా

కండబలం చూపించగలిగిన నేరస్థులు, డబ్బు, కులబలం చూపించగలిగినవారు అన్ని రాజకీయ పార్టీలకు కూడా అధికారం కోసం పోటీపడేటప్పుడు మెరుగైన అవకాశాలున్న అభ్యర్థులుగా కనిపిస్తారు. పరిస్థితులను చక్కదిద్దాలన్న తీవ్రమైన సంకల్పం ఉన్న నాయకులు కూడా అధికారం, పలుకుబడి సంపాదించాలంటే అలాంటి అభ్యర్థులనే ఎంపిక చేయకతప్పదు.

రాజకీయాలలో విజయం, మార్పునకు గల అవకాశాలను పునర్నిర్వచించటం కోసం, మన నాయకులను ఎన్నుకోవటానికి భిన్నమైన పద్ధతి అనుసరించటం కోసం దామాషా ఎన్నికల పద్ధతిని మనం పరిగణలోకి తీసుకోవాలి. ఏఎన్నికల వ్యవస్థా సంపూర్ణంగా లోపరహితమైంది కాదు. నిర్దిష్టమైన సందర్భంలో ఆచరణాత్మకమైన, ఆమోదయోగ్యమైన సమాధానాల కోసం అన్వేషించాలి. రాజకీయ నాయకులను ఈసడిస్తూ ప్రజాజీవనానికి దూరంగా ఉండటం కన్నా ఎన్నికల వ్యవస్థ మీద దృష్టి కేంద్రీకరించటం మంచిది. ఓట్లు కొనటం అవసరంలేని నిజాయతీతో కూడిన రాజకీయాలు మనగలిగే, రాగద్వేషాలకన్నా విధానాలు, ఆలోచనలకు ప్రాధాన్యం ఉండే, నిజాయతీపరులు, ప్రయోజనకరంగా ఉండే పౌరులు ఎన్నిక కాగలిగే, విషవలయంలో చిన్నచిన్న రాజకీయాలను, అవినీతిని అంతమొందించే ఎన్నికల వ్యవస్థను చట్టబద్ధంగా రూపొందించుకోగలగాలి. ఒక పార్టీకి రాష్ట్రాలవారీగా అది సంపాదించగలిగే ఓట్లను బట్టి చట్టసభలో సీట్లు వచ్చే దామాషా వ్యవస్థను అనుసరించగలిగితే మన రాజకీయాలలో, ఫలితాలలో సమూలమైన మార్పులు సాధ్యం అవుతాయి.

అలాంటి దామాషా పద్ధతి ఎన్నికల వ్యవస్థలో ఒక నియోజకవర్గంలో సీట్లు సంపాదించటానికి తిమ్మినిబమ్మిని చేసైనా నామమాత్రపు ఓట్లను సంపాదించాల్సిన అవసరం ఉండదు. ప్రతి రాజకీయపార్టీ ఒక్కో రాష్ట్రంలో సంపాదించగలిగే ఓట్లను బట్టి లోక్‌సభలో, శాసనసభలో ఆ దామాషా ప్రకారం సీట్లు సంపాదించగలుగుతుంది. పార్టీ ప్రతిష్ఠను పెంచుకోవటం కోసం మరికొన్ని ఓట్లను ఒక నియోజకవర్గంలో కొనటానికి అంత ప్రాధాన్యం ఉండదు కాబట్టి ఓట్లు కొనడం వృధా అవుతుంది. రాజకీయ పార్టీలు ప్రజాజీవనాన్ని సుసంపన్నం చేసి ఎన్నికల ద్వారా సమకూరే ప్రయోజనాలను పెంపొందించగలిగే అర్హులైన, ఉదాత్తులైన అభ్యర్థులనే పోటీకి దింపగలుతుగుతాయి. ఇప్పుడైతే అలాంటివారిని రాజ్యసభకు మాత్రమే నామినేట్ చేయగలం. ఎన్నికలలో నిలదొక్కుకోవడానికి రాజకీయ పార్టీలు అపవిత్రమైన రాజీలూ

కుదుర్చుకోవాల్సిన అవసరం ఉండదు. తమ దృక్పథం, విధానాల ఆధారంగా పార్టీలు నిజాయతీగా ఓట్లు అడగవచ్చు. అవినీతిపరులు, నిర్వేదంలో కూరుకుపోయిన రాజకీయ నాయకుల స్థానంలో నిజాయతీపరులు, సమర్థులు అయిన నాయకులు వస్తారు. వారికి సమాజంపై విశాలమైన దృక్పథం ఉంటుంది. స్వాతంత్ర్యపోరాటంలో పాల్గన్న నాయకులు వంటి నేతలు యువతరాలనుంచి వచ్చి నవభారతంలో విశ్వాసాన్ని పెంచుకోగలుగుతారు. నిర్వేదనకు, నిరాశకు గురైన పౌరులు అనేకమంది పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఎన్నికలలో పాల్గన గలుగుతారు. ప్రజాస్వామిక పునరుజ్జీవనం సాధ్యమవుతుంది. 2004లో అస్థిరపరిస్థితుల మధ్య అధికారంలోకి వచ్చిన యూపీయే ప్రభుత్వం ఆనాడు దామాషా ఎన్నికల పద్ధతి వైపు మొగ్గుచూపిందిగానీ, మిత్రపక్షాలు ముందుకురాకపోవటంతో అప్పట్లో లోక్‌సత్తా చేసిన ఆ ప్రయత్నం వెంట్రుకవాసిలో విఫలమైంది. ప్రధాన జాతీయపార్టీలు సంక్షోభంలో కూరుకుపోతున్నాయి కాబట్టి ప్రస్తుతమున్న పరిస్థితులలో దామాషా ఎన్నికల పద్ధతిని తెచ్చేదిశగా అనుకూల పరిస్థితులు కూడా నెలకొన్నాయి.

**దామాషా ఎన్నికల పద్ధతికి సంబంధించిన మరికొన్ని వివరాలు సంక్షిప్తంగా...**

- దామాషా ఎన్నికల పద్ధతి మెరుగైంది. ఎక్కువ ప్రాతినిధ్య స్వభావం కలిగింది కావటంతో పాటు ఈ విధానం ఎన్నికల వ్యయాన్ని తగ్గిస్తుంది. ధనబలాన్ని, కండబలాన్ని ఉపయోగించే అవకాశాన్ని కొంతమేర కట్టడిచేయగలుగుతుంది. ఉప ఎన్నికలను కూడా నివారించవచ్చు. దీనివల్ల సమర్థులు, నిజాయతీపరులు ఎన్నికల రాజకీయాలలో చురుకుగా పాల్గొనగలుగుతారు. అణగారిన, బలహీనవర్గాలకు కూడా రాజకీయ ప్రాతినిధ్యానికి మంచి అవకాశం ఏర్పడుతుంది.

- అత్యధిక దేశాలు ఈ దామాషా పద్ధతినే అనుసరిస్తున్నాయి. జర్మనీ, ఫ్రాన్స్, ఆసియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, బ్రెజిల్, రష్యాసహా చాలా దేశాలు వివిధ తేడాలతో దామాషా పద్ధతినే అనుసరిస్తున్నాయి. మరికొన్ని దేశాలు దామాషా పద్ధతిని, ఎఫ్‌పిటిపి పద్ధతిని కలిపి అమలుచేస్తున్నాయి.

- దామాషా పద్ధతి వల్ల పార్లమెంటులో తమ బలం తగ్గుతుందని, తద్వారా తమ రాజకీయపలుకుబడి తగ్గుతుందని ప్రాంతీయ పార్టీలు భయపడుతున్నాయి. ఈ వ్యవస్థ సంక్లిష్టమైనదని, అస్థిరతకు దారితీస్తుందని జాతీయ పార్టీలు భావిస్తున్నాయి. అయితే

ఈవేళ దాదాపు అన్ని పెద్దరాష్ట్రాలలో ప్రధాన జాతీయపార్టీలైన కాంగ్రెస్, బీజేపీల బలం క్షీణిస్తున్న నేపథ్యంలో ఆ పార్టీలు కూడా దామాషా ఎన్నికల పద్ధతి గురించి ఆలోచించకతప్పని పరిస్థితి ఏర్పడింది.

● ఎవరు ఎక్కువ ఓట్లు సాధిస్తే వారే విజేతలు అన్న విధానాన్నే అనుసరించాలని భారత రాజ్యాంగంలోఎక్కడా నిర్దేశించలేదు. చేయవలసిందల్లా ప్రజాప్రాతినిధ్య చట్టంలో దానికి అనుగుణమైన సవరణ చేస్తే చాలు, మనం దామాషా ఎన్నికల వ్యవస్థను తెచ్చుకోవచ్చు. రాజ్యాంగం నిర్దేశించేదల్లా, ప్రభుత్వం ఉమ్మడిగా పార్లమెంటుకు జవాబుదారీగా ఉండాలని, లోక్‌సభ అభ్యర్థులను ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకోవాలని.

● 2004, 2009లో ఎన్నికలలో యూపీయే 40శాతంకన్నా తక్కువ ఓట్లు సంపాదించింది. మరోరకంగా చెప్పాలంటే, అత్యధిక సంఖ్యాక ఓటర్లు– 60శాతం కన్నా ఎక్కువమంది యూపీయేకు అనుకూలంగా లేరు. కానీ ఎఫ్.పి.టి.పి పద్ధతి వల్ల యూపీయే మెజారిటీ సాధించగలిగింది. 2009 ఎన్నికలలో ఆంధ్రప్రదేశ్‌లో 5,78,92,259 మంది ఓటర్లకు గాను 4,20,58,446 మంది ఓటు వేశారు. అంటే రాష్ట్ర శాసనసభ వీరందరికీ ప్రాతినిధ్యం వహించేదిగా ఉండాలి. కానీ అసెంబ్లీలో గెలిచిన 294మంది అభ్యర్థులకీ వచ్చిన ఓట్లు కేవలం 1,72,43,593 మాత్రమే. వేసిన ఓట్లలో కేవలం 40శాతానికి మాత్రమే రాష్ట్ర శాసనసభ ప్రాతినిధ్యం వహిస్తున్నది. ఓటు వేసిన మిగిలిన 60శాతం ఓట్లకు, అంటే, 2,48,14,853 మంది ఓట్లకు ప్రాతినిధ్యం లభించలేదు. ఇవి ఓడిన అభ్యర్థుల ఓట్లు. నియోజకవర్గం స్థాయిలోనే అవి మురిగిపోయాయి. చట్టసభలు రానురాను ప్రజల విశ్వాసాన్ని కోల్పోవటానికి, ఓటు వేసినా చట్టసభలో ఈరకంగా ప్రాతినిధ్యం లేకపోవటం కూడా ఒక కారణం. ఇదే దామాషా పద్ధతి ఎన్నికలలోనైతే పార్టీలకు వచ్చిన ఓట్ల శాతం ఆధారంగా పార్టీలకు సీట్లు దక్కేవి. వేసిన ప్రతి ఓటుకీ ప్రాతినిధ్యం లభించేంది. అప్పుడు చట్టసభలో బలాబలాలు వేరుగా ఉండేవి.

● ప్రజలకు ఎంపికచేసుకోవటానికి రెండే మార్గాలు (రెండు పార్టీలు లేదా ఇద్దరు అభ్యర్థులు) ఉంటే ఎఫ్.పి.టి.పి విధానం ప్రజాభీష్టాన్ని ప్రతిబింబించగలుగుతుంది. ఉదాహరణకు బ్రిటన్‌లోలాగా. కానీ ఎంపిక చేసుకోవటానికి అనేకమార్గాలు

ఉన్నప్పుడు ఫలితాలు గందరగోళంగా, అవకతవకగా ఉంటాయి. ఎన్నికైన చట్టసభకు పూర్తి ప్రాతినిధ్య స్వభావం ఉండదు.

పార్టీల విషయంలో, ఓటు వినియోగంలో, ఎన్నికల వ్యవస్థలో ఈ దిద్దుబాట్లతోపాటు స్థానిక ప్రభుత్వాలకు వాస్తవిక అధికారాలను, వనరుల్ని బదలాయించి పటిష్ఠమైన మూడో అంచె సమాఖ్య వ్యవస్థను రూపొందించగలిగితే మన ప్రజాస్వామ్యం పరిణతి చెందుతుంది. కొత్త ఆలోచనలు కలిగిన సృజనాత్మకమైన, సమర్థవంతమైన నాయకులు ఎక్కడికక్కడ తయారవుతారు. తమ ఓటుకు ప్రజాశ్రేయస్సుకి మధ్య ఉన్న లంకెను ప్రజలు గుర్తించగలుగుతారు. ఎన్నికైన వ్యక్తి వాస్తవికంగా భిన్నమైన రీతిలో వ్యవహరించటం మొదలుపెడతాడు కాబట్టి పన్నులు, వనరులు ఎలా వినియోగిస్తున్నారో స్పష్టంగా కనిపిస్తూ ఉంటుంది. సేవలు మెరుగుపడుతుండటం ప్రజలు చూడగలుగుతారు. అధికారం జవాబుదారీతనంతో ముడిపడి ఉంటుంది. పనిచేయకపోవటానికి కుంటి సాకులు చెప్పే అవకాశం ఉండదు. ప్రజల జీవితాల్ని మెరుగుపరిచే మార్పును సాధించి చూపించగలిగేవారికి మాత్రమే అధికారం దక్కుతుంది.

గ్లాడ్‌స్టన్ ప్రశస్తంగా చెప్పినట్టు, మంచిని చేయటం సులభతరం చేసి, చెడును చేయటం కష్టతరం చేయటమే ప్రభుత్వ బాధ్యత. అలాంటి ప్రభుత్వాన్ని, సుపరిపాలనావ్యవస్థను మనం ఏర్పరుచుకోవటానికి తగిన రాజకీయ, ఎన్నికల ప్రక్షాళనకు మీ పోరాటంలో మీకు ఈ భవిష్యత్ భారతం వ్యాసాలు బహుముఖంగా ఉపయోగపడతాయి.

**డా॥ జయప్రకాష్ నారాయణ్,**

జాతీయ అధ్యక్షులు, లోక్‌సత్తా పార్టీ

2013 – డిసెంబర్

* * *

# సామాన్యుడి ఆశలు-ఎన్నికల ఊసులు

*డిసెంబర్ 22, 1997*

లెక్చర్లు ఎంతసేపు సిటీలోనే గాని పల్లెటూళ్ళలో ఎంతమాత్రం పనికిరావు. పూనా లాంటి సిటీలో లెక్చర్ ఇచ్చామంటే థౌజండు పీపుల్ వినడానికి వస్తారు. మన టౌనులోనే పెద్ద మీటింగు చేయాలంటే, డప్పులు బజాయించి, నోటీసులు కట్టి, బజార్లు కాసి తోవంటపోయేవాళ్లని యీడ్చుకు వచ్చినా యాభైమంది కారు పల్లెటూరి పీపుల్ లెక్చర్‌కి అన్‌ఫిట్. మొన్న మనం వచ్చిన బండివాడికి నేషనల్ కాంగ్రెస్ విషయమై రెండు గంటలు లెక్చరు ఇచ్చేసరికి ఆ గాడిదకొడుకు 'వాళ్ల ఊరు హెడ్ కానిస్టేబుల్‌ని కాంగ్రెస్ వారు ఎప్పుడు బదిలీ చేస్తారని అడిగాడు! విలేజెస్‌లో లెక్చర్లు ఎంతమాత్రం కార్యం లేదు". ఈ మాటలు కన్యాశుల్కం నాటకంలో గురజాడవారు గిరీశం చేత పలికించినవి. ఆ నాటకం రాసి 105 సంవత్సరాలు గడిచాయి. అప్పటికి జాతీయ కాంగ్రెస్ ఏర్పాటై ఏడేళ్ళు గడిచింది. ఆనాటికి ఇంకా స్వతంత్రం గురించిన మాటే మన నాయకులు అనలేదు. 1905 ప్రాంతంలో మొదటగా లోకమాన్య బాలగంగాధర్ తిలక్ "స్వాతంత్ర్యం నా జన్మహక్కు" అని ఎలుగెత్తి చాటారు. 1920లో లాహోర్ కాంగ్రెస్ సమావేశంలో మొదటిసారిగా పూర్ణ స్వరాజ్యం కావాలని తీర్మానించారు. అలాంటిది 1892లోనే స్వతంత్ర భారతంలో సామాన్యుడు ఏమి ఆశిస్తున్నాడో ఊహించి ఆషాడభూతి గిరీశం పాత్ర ద్వారా అద్భుతంగా చెప్పించారు గురజాడ.

## నాటి జాతీయత భావాలు - నేటికి మారని పరిస్థితులు

సామాన్యుడికి కావలసింది పెద్ద పెద్ద చట్టాలు, తీర్మానాలు కాదు. నినాదాలతో, భీషణ ప్రతిజ్ఞలతో కడుపు నిండదు. ప్రజాస్వామ్యం అంటే – ఎవరు ప్రధానమంత్రి, ఎవరు ముఖ్యమంత్రి, ఎవరు కలెక్టర్ అని కాదు. సామాన్యుడికి పాలనలో ఎంత పాత్ర ఉన్నది? రోజువారీగా పాలన యంత్రాంగం అందించవలసిన సేవలు ఏ మేరకు అందుతున్నాయి? పౌరుడు నిరంతరం వేధింపులకు గురి అవుతున్నాడా? లేక హుందాగా బతుకుతున్నాడా? ఇవి నిజమైన ప్రజా పాలనలో సమాధానం చెప్పుకోవలసిన ప్రశ్నలు. నాడైనా నేడైనా, హెడ్ కానిస్టేబుల్ కాని, మరో ఉద్యోగికాని, నాయకుడుగాని ప్రజల్ని వేధించకుండా నిరోధించడం పాలకుల ప్రథమ కర్తవ్యం. అలాంటి పాలన అందుతుందని ఆశతో ఆనాడు మనవారు లక్షలాది మంది అత్యుత్సాహంతో, దేశ భక్తితో

జాతీయోద్యమంలో పాలుపంచుకున్నారు. తెల్లవాడి పాలనలో, వలసకాలంలో దేశంలో విద్యాధికులూ, విజ్ఞులు, దేశభక్తులు అయిన పెద్దలు జాతీయతా భావాలకు పునాది వేశారు. ఈ జాతీయ భావాలకు తెల్లవాడి జాతి దురహంకారం ఆజ్యం పోసింది. పరాయి ప్రభువుల నీడన ఉన్న భారత జాతి ఆత్మగౌరవం కోసం, గత వైభవాన్ని స్మరించుకుంది. భరతమాతను ఒక దేవతగా ఆరాధించింది. ఆ విధంగా భారత జాతీయత సామాన్యుడికి అర్థం అయ్యే విధంగా రూపుదిద్దుకుంది. ఆ జాతీయత భావం స్వతంత్ర పోరాటం కాలంలో వలస ప్రభువులను సాగనపడానికి ఉపకరించింది. అలాంటి దేశభక్తి భావం స్వతంత్ర భారతంలో నిలబడాలంటే ఎవరిమీదో ద్వేషం, గత వైభవ స్మరణచాలవు. పౌరుడికి పాలనలో కావలసింది, దైనందిన జీవితంలో మెరుగైన మార్పు పిల్లలు చదువుకునే బడిలో పాఠాలు బాగా చెప్పాలి. ఆ బడి నడిపే తీరులో ప్రజల ప్రమేయం, పాత్ర ఉండాలి. ప్రజలు వెళ్లే ఆసుపత్రిలో సకాలంలో చికిత్స అందాలి. సరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయాలి. వీధులు జనం నడవడానికి, వాహనాల రాకపోకలకు వీలుగా ఉండాలి. మురుగునీరు రోడ్లమీద ప్రవహించకుండా, డ్రైనేజీ సౌకర్యం ఉండాలి. నీరు, విద్యుచ్ఛక్తి అవసరం మేరకు సకాలంలో మంచి ప్రమాణాలతో అందాలి. రేషన్ షాపులో నిత్యావసర వస్తువులు న్యాయంగా ప్రకటించిన ధరకు, తూకంలో తేడా లేకుండా అందాలి. స్థానిక ప్రభుత్వ కార్యాలయంలో ఉద్యోగులు నమ్రతగా, ప్రజల పట్ల సద్భావంతో, నిజాయితీతో పని చేయాలి. పోలీస్‌స్టేషన్‌కు రక్షణ కోసం వెళితే, పోలీసులు ఆప్తమిత్రులుగా కనిపించాలి. ధైర్యాన్నిచ్చి కాపాడాలి. అంతేగాని కర్ణకఠోరమైన  భాషతో, లాఠీల కరాళ నృత్యాలతో ప్రజల్ని బాధించకూడదు. ఇవీ జనసామాన్యం ప్రభుత్వం నుంచీ, పాలన నుంచీ కోరుకునేవి. కాని ఎన్ని ఎన్నికలు జరిగినా ఎన్ని ప్రభుత్వాలు మారినా పరిస్థితులలో మాత్రం ప్రజలు కోరే మార్పు రాలేదు. ప్రభుత్వ యంత్రాంగం అంటే చప్పున మనసులో మెదిలే భావం జుగప్స లేదా భయం ప్రజలకు నిరంతరం కలిగే అనుభవం లంచగొండితనం, పాలనలో ఎక్కడ చూసిన కానవచ్చేది మొద్దుబారిన మనస్తత్వం, అహంకారం, అసమర్థత, జనం బాధలకు స్పందించని జడత్వం, ఆశ్రిత  పక్షపాతం అందుకే ఎన్నికలంటే ప్రజలకు కలిగేది నిస్పృహ ఎవరు ఎన్ని వాగ్దానాలు చేసినా, ఆ మాటలు నీటిమీద రాతలని గతానుభవం చెబుతోంది. ప్రభుత్వాలు మారినా, పాలకుల ముఖాలూ మారినా, జన జీవితాలలో మార్పులేదు. నిరంతర పాలనా వైఫల్యం ప్రజల్ని వెక్కిరిస్తున్నది. ఈ పరిస్థితుల్లో గుండెల్లో దేశభక్తి నిలుపుకోవటం అంత తేలికేమీ

కాదు. యూనిఫారం ధరించిన పోలీస్ కానిస్టేబుళ్లని చూస్తే భయపడే పౌరుడు, ప్రభుత్వ కార్యాలయంలో ప్రవేశం దొరకాలంటేనే లంచం ఇవ్వవలసిన వ్యక్తి అప్పుడప్పుడూ లోపభూయిష్టమైన ఎన్నికల ప్రక్రియలో ఓటు వేయడం తప్ప పాలనలో మరే పాత్ర లేని సామాన్యుడు పాలన సమాచారం అందక సతమతమయ్యే ప్రజలు కనీస హుందాతనానికి, పారిశుద్ధ్యానికి నోచుకోని బీదలు, పొట్టనింపుకోవటం కోసం చిన్నారి చేతులతో  కాయకష్టం చేసే పసివాళ్ళు, ఏళ్ల తరబడి నిరీక్షించినా న్యాయం అందని బాధితులు.. వీరందరికీ దేశభక్తి భావాన్ని, జాతీయతను చాటి చెప్పి ప్రయోజనం లేదు. గిరీశం కాలంలో బండివాడి గతే నేడు ప్రజలందరికీ పడుతున్నది. ఎంతకాలం గడిచినా ఎన్ని ఎన్నికలు జరిగినా, కోరిన మార్పు రాలేదు. ఫిర్యాదులు పెరుగుతున్నాయి. పౌరుల్లో ఏహ్యభావం, ఆగ్రహం ఆకాశన్నంటుతున్నాయి. రాజకీయం పట్ల ప్రజల విశ్వాసం అడుగంటుతున్నది. స్థానికంగా ప్రజల మన్ననలందే నాయకత్వానికి స్థానం లేకపోవటంతో, వారసత్వ రాజకీయం, వ్యక్తి ఆరాధన, కులం, మతం, కండబలం, ధనబలంపై ఆధారపడ్డ రాజకీయం, సమాజాన్ని విభజించి పాలించే ధోరణులు, రెచ్చగొట్టే విధానాలు పెచ్చరిల్లి ప్రజాజీవనాన్ని శాసిస్తున్నాయి. పౌరుల్లో పెరుగుతున్న అసంతృప్తి కారణంగా, ప్రభుత్వాలు తరచూ పతమవుతున్నాయి. దాదాపు ప్రతి ఎన్నిక పాలక వర్గానికి తాత్కాలికంగా చావుదెబ్బ అవుతున్నది. ఎవరు గెలిచినా, ఎవరు ఓడినా పౌరులు మాత్రం నిరంతరం ఓటమికి లోనవుతున్నారు. ఎలాగోలా ప్రజల్ని ఆకట్టుకోవడం కోసం ప్రభుత్వాలు జనాకర్షణ పథకాలు చేపట్టి, జన సామాన్యాన్ని మభ్యపెడుతున్నాయి. స్వచ్ఛమైన పరిపాలన కంటే ఓటు బ్యాంకు  రాజకీయాలకు, ప్రభుత్వ లాంఛనాలకు, జనాల్ని వంచించేందుకు, నామమాత్రపు చర్యలకు ప్రాధాన్యం పెరిగింది. అప్పుడప్పుడు తన ప్రమేయం లేకుండా నిలబెట్టిన అభ్యర్థులలో ఎవరో ఒకరికి ఓటు వేసి, తాత్కాలికంగా కసి తీర్చుకోవడం తప్ప, పౌరుడికి మరో పాత్ర లేకుండా పోయింది. ఎన్నికలను దూరం నుంచి చూస్తే అవి – ఒక పార్టీకో, ప్రభుత్వానికో ప్రజాబలం ఉందో లేదో తెలుసుకోవడానికి ప్రజాభిప్రాయ  సేకరణవలె కనిపిస్తున్నాయి. అభ్యర్థి గుణగణాలు, బలాబలాలు కాక, పార్టీ ప్రాబల్యం మీద ఎన్నికల ఫలితాలు ఆధారపడి ఉన్నట్లు కనిపిస్తోంది. స్థానిక నియోజకవర్గంతో నిమిత్తం లేకుండా, మొత్తం దేశం లేదా రాష్ట్రంలో ఫలితాలు ఒకే విధంగా ఉండటంతో విశ్లేషకులు ఎన్నికలను “అల”లుగా వర్ణిస్తున్నారు. కాని, నియోజక వర్గ  స్థాయిలో పార్టీ కార్యకర్తల దృష్ట్యాచూస్తే పరిస్థితి వేరుగా ఉంటుంది. కార్యకర్తల దృష్టిలో ఎన్నిక అనేది, తమ ముఠా ప్రాబల్యం పెంచుకోవటానికి, తమకు వ్యక్తిగతంగా అధికారం అందుబాటులో ఉంచుకోవటానికి

పనికివచ్చే సాధనం. పార్టీ సిద్ధాంతాలు, ప్రజాసంక్షేమం ఈ స్థాయిలో ముఖ్యమైన అంశాలు కావు. ఎన్నికలలో "మన" అభ్యర్థి గెలిస్తే ప్రభుత్వంలో పైరవీలు సాగించవచ్చు అనుకూలురైన ఉద్యోగుల్ని ఉంచుకోవచ్చు. ఇష్టం లేనివాళ్లని దూరంగా బదిలీ చేయవచ్చు. నేర విచారణలోను, కోర్టు కేసుల్లోను జోక్యం చేసుకోవచ్చు. ప్రభుత్వ పథకాల లబ్ధిని ఇతరులకందకుండా తామే పొందవచ్చు. అనుకూలమైన వాళ్ళమీద కేసులు మాఫీ చేయవచ్చు. శత్రువుల మీద కేసులు బనాయించవచ్చు. అందువల్లనే ఏ పార్టీ అయినా స్థానికంగా గెలవాలంటే, అక్కడి కార్యకర్తల్ని మచ్చిక చేసుకోవాలి. కులం, ముఠా, వర్గం, డబ్బు, కండబలం అన్నీ చూసుకోవాలి. స్థానిక అభ్యర్థుల గెలుపు ఓటముల మీద ఎందరివో అదృష్టాలు ఆధారపడి ఉన్నాయి. "మన"వాడు గెలిస్తే మనకు లాభం, "వాళ్ల" వాడు గెలిస్తే మనకు నష్టం, వాళ్లకు లాభం అంతేగాని, మంచివాడు గెలిస్తే అందరికీ క్షేమకరం అనే ఆలోచనే లేదు. అందుకే ఎన్నికల రంగం రణరంగంగా మారిపోతున్నది. ఏ ఆయుధంతోనైనా సరే "మన"వాడనుకున్నవాడే గెలిచితీరవలసిందే. ధనబలం, కండబలం, దౌర్జన్యం, దొంగఓట్లు, పోలింగు బూతుల ఆక్రమణ, రిగ్గింగు, హింస, కులమత వైషమ్యాలు... అన్నీ అవసరార్థం ఉపయోగించవలసిందే. దీనితో ఏ పార్టీ అయినా విజయావకాశాలు మెరుగుపరచుకొని, ప్రభుత్వాన్ని స్థాపించటం కోసం సకల బలాలు ఉన్నవాళ్లనే అభ్యర్థులుగా నియమించవలసి వస్తున్నది. మంచివాళ్ళు, అక్రమ పద్ధతులకు పాల్పడినవాళ్లు క్రమంగా కనుమరుగవుతున్నారు. ఎన్నికల ముందు పార్టీల పరిస్థితి పరీక్షకు వెళ్లే విద్యార్థిలాగా ఉంటుంది. ఎలాగోలా గెలవటమే ప్రధానమవుతుంది. ఏ పార్టీ గెలిచినా, ఎన్నికయ్యే అభ్యర్థులంతా ఒకే మోస్తరుగా తయారువుతున్నారు. నిరంతరం ఓడిపోయి డీలా పడిపోవలసింది ప్రజలు మాత్రమే. ఏ పార్టీ గెలిచినా రాజకీయం తీరు, ప్రభుత్వ నైజం మాత్రం ఒకే రకంగా ఉంటున్నాయి. ప్రజలు ఆవేశం పట్టలేక, మళ్ళీ మళ్ళీ వచ్చే ఎన్నికలలో వీలైనంత వరకు అధికారంలో ఉన్నవాళ్లని తిరస్కరిస్తున్నారు. అయితే, రాజకీయ ప్రక్రియని మార్చకపోవటం వల్ల, మళ్లీ అలాంటి అభ్యర్థులే ఇంకో పార్టీ పేరుతో మరో గుర్తు మీద గెలుస్తున్నారు. కథ, చర్వితచరణమవుతున్నది. "ఎక్కడో లోపం ఉంది. ఎవరు అధికారంలోకి వచ్చినా, మాకు న్యాయం జరగటం లేదు. మాకు మా జీవితాలమీద పాలనమీద మరింత పట్టుకోవాలి. అది దొరకటం లేదు. ఎవరొచ్చినా పాలన తీరు మారటం లేదు" అన్న అసమ్మతిని, ప్రజలు మూకుమ్మడిగా పాతిక ముప్పై సంవత్సరాలుగా దాదాపు ప్రతి ఎన్నికలోను తెలియజేస్తున్నారు. ప్రజావాణిని పాలకవర్గాలు పట్టించుకోకపోవటంతో ప్రభుత్వాలు మారినా, పాలనలో

మార్పులేదు. దాంతో ప్రజలలో పాలకుల పట్ల విశ్వాసం సన్నగిల్లింది. దేశంలో ఏ ప్రాంతంలో ఏ వర్గం ప్రజలనడిగినా "పాలకులంతా దొంగలే" అనే అభిప్రాయం వినవస్తుంది. పార్టీలలో నిరంకుశత్వం, స్వంత ఆస్తులాగా వాటి నిర్వహణ ఇష్టం వచ్చినట్లుగా సీట్ల పంపిణీ, పార్టీలు వేరైనా ఒకే రకం అభ్యర్థులు, పదవుల పంపకాలు , ఆశ్రిత పక్షపాతం, ప్రజలకు విషయాల తెలియని రహస్య పాలన, నేతల బీరాలు, అందని ఫలితాలు, మారని ప్రభుత్వ యంత్రాంగం , అవి నీతి అసమర్థత, వేధింపు – వీటన్నిటి కారణంగా ఎన్నికలలో గద్దెపైనున్న వాళ్లకి గుణపాఠం...కొత్త ప్రభుత్వం, మళ్ళీ మునుపటి బాధలు... ఇలా నడుస్తున్న రాజకీయమంటే ప్రజలకి రోత పుట్టింది. రాజకీయంలో ఉన్నవాళ్లంటే దొంగలో, దుర్మార్గులో అనే భావం సర్వత్రా వ్యాపించింది. ఈ నేపథ్యంలో జరుగుతున్న 12వ లోక్‌సభ ఎన్నికలు మౌలికమైన మార్పుకి ఆలంబన కావాలి. ఏదో ఒక ప్రభుత్వం గద్దెనెక్కడం చాలదు. ప్రజలు ఆశించిన పాలనా సంస్కరణలను ఏవేవి ఎలా చేపడతారన్నది ప్రధానాంశం కావాలి. 1997ఆగస్టులో పార్లమెంటు ఉభయసభలు స్వతంత్ర సర్ణోత్సవ ప్రత్యేక సమావేశం జరిపి, అందరికీ కావలసిన సంస్కరణల్ని ఉద్ఘోషిస్తూ ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. అవి నీతి పోవాలని, నేరమయ రాజకీయం నశించాలని, మంచివారు రాజకీయంలో నిలబడేలా పార్టీలలో ప్రజాస్వామ్యం నెలకొనాలని, ఎన్నికల సంస్కరణలు సత్వరం చేపట్టాలని, అధికార వికేంద్రీకరణ పూర్తిగా జరగాలని, పాలన సమాచారం ప్రజలకు అందాలని, ప్రజలు ప్రభువులు కావాలని మంచి నినాదాలిచ్చారు. ఇప్పుడు కావలసింది ఆ నినాదాలకు వాస్తవరూపం ఇచ్చే కార్యాచరణ ఈ ఎన్నికలలో ప్రజలు చూడవలసింది పార్టీలు అలాంటి కార్యాచరణకి సిద్ధపడే వ్యక్తిని అభ్యర్థిగా నియమిస్తున్నాయా లేక అనవాయితీగా డబ్బు సంచులు, కండబలం, కుల ప్రాబల్యం ఉన్న అభ్యర్థులని నిలబెడుతున్నాయా అని. ఎవరు ఎన్నికైనా ఒకటేననే నిస్పృహ ప్రమాదకరమైనది. ఆలోచనపరులంతా అభ్యర్థుల ఎంపిక సజావుగా ఉండేలా, పార్టీలపై ఒత్తిడి తేవాలి. నేరగాళ్లు మాఫియా ముఠాలు, రౌడీషీటర్లు, పెద్ద నేరాలు చేశారని కోర్టుల ఛార్జిషీట్లు దాఖలైనవాళ్లు ఏ పార్టీ తరపునా అభ్యర్థులు కాకుండా నిరోధించాలి. అభ్యర్థుల గుణగణాల్ని నిశితంగా పరిశీలించి, ఓటు వేయాలి. ఎవరొచ్చినా ఏ మార్పు ఉండదని తిట్టుకుంటూ ఇంట్లో కూర్చోకుండా, విధిగా పోలింగు స్టేషనుకు వెళ్ళి ఓటు వేయాలి. ఓటు లేనివారు వెంటనే ఓటర్లుగా నమోదు చేయించుకోవాలి. ఎవరూ నచ్చకపోతే, కనీసం బ్యాలెట్ పత్రాలమీద × గుర్తుపెట్టి నిరసన తెలపాలి. అంతేగాని వ్యవస్థను తిట్టుకుంటూ కూర్చోరాదు.

## అరచేతిలో వైకుంఠం చూసి మురిసిపోరాదు

భారతదేశం మౌలిక మార్పులు సాధించటానికి సన్నద్ధంగా ఉంది. ప్రజలు నిరసన, అసంతృప్తి ఎన్నికలంటే పార్టీల భయం... ఇవన్నీ వచ్చే కొద్ది సంవత్సరాలలో సమూల సంస్కరణలకు సోపానాలవుతాయి పౌరులు చేయవలసింది మాయమాటలు నమ్మటం కాక, గురజాడవారి బండి వాడిలా, ప్రజలకు అందుబాటులో ఉండే పాలన కోసం, మనకు జవాబుదారీగా ఉండే యంత్రాంగం కోసం కృషి చేయటం. నాయకులిచ్చే లెక్చర్లు, ప్రలోభాలకు లొంగకుండా, ప్రజలకు ఇంపుగా ఉండే పాలన కోసం ప్రయత్నించాలి. 50 సంవత్సరాలుగా జరిగిన ప్రతి ఎన్నికలలోను, పాలకులు అరచేతిలో వైకుంఠం చూపెట్టి వాజమ్మల్ని చేశారు. అధికారం కోసం కొందరి మధ్య జరిగే క్రీడలో ప్రజలు పావులయ్యారు. కాని ప్రజల జీవితాలకు, ప్రభుత్వాలకు సంబంధం లేకుండాపోయింది. పాలన ఫలితాలు స్వాతంత్ర్యం ఫలాలు ప్రజలకు అందకుండా పోయాయి. ప్రజలకు కావలసింది వారి నెత్తినెక్కి మరబొమ్మలుగా ఆడించే నాయకులు కాదు. ప్రజలు అబీష్టాలకు అనుగుణంగా మంచి పాలననందించే సేవకులు కావాలి. ప్రజల్ని ప్రభువులుగా గుర్తించి, వారి సుఖ సంతోషాల కోసం కావలసిన సంస్కరణల్ని సాధించే ప్రతినిధులు కావాలి. నినాదాలు నశించి నిర్దిష్ట కార్యాచరణ చేపట్టే కార్యశీలురైన సమర్థులు కావాలి. ఏ ఎండకాగొడుగు పట్టి, పబ్బం గడుపుకునే చవకబారు మనుషుల స్థానే స్థిరచిత్తంతో జాతిహితాన్ని కోరే విజ్ఞులు కావాలి. తాత్కాలిక ఆవేశానికి లోనై గంగిరెద్దుల్లా తలలాడించే మూర్ఖుల స్థానంలో ప్రజల దీర్ఘకాలిక ప్రయోజనాల్ని కాపాడే ధీమంతులు కావాలి. ఎన్నికలు తరచు అనవాయితీగా జరిగే ఫార్సుగా కాక, పాలనలో జాడ్యాలని తుదముట్టించే ఆయుధం కావాలి. దేశంలో అన్ని వర్గాలవారు పాలన మెరుగుపడాలని కోరుకుంటున్నారు. ఆ కోర్కెకు ఎన్నికలలో మన ప్రవర్తన ద్వారా నిశ్చిత రూపాన్ని కల్పించాలి. అప్పుడే మన బిడ్డల భవిష్యత్తుకు అవసరమైన మంచిపాలన మనకందుతుంది. సమూల సంస్కరణల్ని సాధించి, నిజమైన స్వతంత్రం పొందితే గాని, గురజాడ వంటి మహనీయుల ఆత్మలు శాంతించవు. స్వతంత్ర సమరవీరుల శ్రమ సార్థకం కాదు. రెండో స్వతంత్ర పోరాటానికి ఈ ఎన్నికలు ప్రథమ సోపానం కావాలి.

* * *

# నేతలకోసమే ఎన్నికలైతే దేశమేగతి బాగుపడునోయ్!

*సెప్టెంబరు 6, 2004*

ప్రజాస్వామ్యానికి ఎన్నికలే ప్రాణం, ఆత్మ కూడా. రాచరికాల్లో రాజు తరువాత అతడి కొడుకో, కూతురో రాజ్యాధికారం చేపడతారు. నియంతృత్వాల్లో ఒక వ్యక్తి కానీ, ముఠా కానీ తీవ్ర అణచివేత చర్యలు, కఠిన ఆంక్షలతో పరిపాలన సాగిస్తుంది. కేంద్రీకృత పాలనా వ్యవస్థల్లో ఒక పార్టీ లేదా బృందం యావత్ ప్రభుత్వ యంత్రాంగాన్ని, సంస్థలనుతన గుప్పెట్లో పెట్టుకొని నిరంకుశంగా అధికారం చెలాయిస్తుంది. ఒక్క ప్రజాస్వామ్యంలో మాత్రమే ఎలక్షన్ల ద్వారా మన ప్రతినిధులను ఎన్నుకొంటాం. అధికార దుర్వినియోగాన్ని అడ్డుకోవడానికి అనేక సంస్థలుంటాయి కానీ కొన్నిసార్లు ఎన్నికలు మరీ ఎక్కువైపోతాయి. మూడు నెలల క్రితమే సుదీర్ఘ ఎన్నికల పోరాటం జరిగింది. పార్లమెంటుకు, కొన్ని రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరిగాయి. అప్పుడు కొన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీ సీట్లకూ, కొన్ని లోక్‌సభ సీట్లకూ ఉప ఎన్నికలు వచ్చాయి. ఉప ఎన్నికలు అనగానే తీవ్ర ఉద్రిక్తత ఏర్పడుతుంది. రాజకీయ టక్కుటమారాలు మొదలవుతాయి. పరిపాలన నుంచి ప్రజాకర్షణ వైపునకు ప్రభుత్వ దృష్టి మళ్లుతుంది. సమాజం మతాలుగా, కులాలుగా, వర్గాలుగా చీలిపోతుంది. ఏటేటా ఉప ఎన్నికలు వస్తూనే ఉంటాయి. పరిపాలనా వ్యవస్థ సక్రమంగా సాగడానికి ఎన్నికలు దోహదపడాలి. కానీ సదరు ప్రక్రియ ఎన్నికలతోనే ముగుస్తోంది.

ఎన్నికల ప్రస్థానంలో అనేక మజిలీలున్నాయి. 1999, 2004లలో ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీకి, లోక్‌సభకు జమిలి ఎన్నికలు జరిగాయి. అనేక రాష్ట్రాల్లో అసెంబ్లీలకు, లోక్‌సభలకు వేర్వేరుగా ఎన్నికలు జరిగాయి. 1998, 1999లలో జరిగిన విధంగా మళ్లీ మళ్ళీ మధ్యంతర ఎన్నికలు జరిగితే ఇక దేశమంతా నిత్యం ఎన్నికల సందడే. లోక్‌సభ సుస్థిరంగానే ఉన్నప్పటికీ వివిధ రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు జరగడం వల్ల ఆర్థిక నిర్వహణ, ప్రభుత్వ విధానాలు, పరిపాలన వ్యవస్థల నుంచి జాతి దృష్టి మళ్లుతుంది. ఉదాహరణకు 2003 డిసెంబర్‌లో మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, రాజస్థాన్, ఢిల్లీ విధానసభలకు జరిగిన ఎన్నికలు యావత్ దేశం దృష్టిని

ఆకర్షించాయి. ఆ ఎన్నికలపై సర్వత్రా ఉత్కంఠ ఏర్పడింది. వాస్తవంలో ఈ నాలుగు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలే లోక్‌సభ రద్దుకు, ముందస్తు ఎన్నికలకు దారితీశాయి.

రాష్ట్రాల్లో ఒక విధానసభ కాలపరిమితి ముగిసేలోగా ఎన్నో ఎన్నికలు జరుగుతుంటాయి. స్థానిక సంస్థలకు ప్రతి అయిదేళ్లకోసారి ఎన్నికలు నిర్వహించాలి. కానీ చాలా రాష్ట్రాల్లో పంచాయతీ ఎన్నికలను, మున్సిపల్ ఎన్నికలను వేర్వేరుగా నిర్వహిస్తున్నారు. పంచాయతీల్లోనే గ్రామపంచాయతీలకు, జిల్లా పరిషత్‌లు, మధ్యస్థాయి పంచాయతీలకు విడివిడిగా ఎన్నికలు జరుపుతున్నారు. ఇక సహకార ఎన్నికలైతే సార్వత్రిక ఎన్నికల స్థాయిలో జరుగుతుంటాయి. సహకార సంస్థల్లో ప్రభుత్వ విపరీత జోక్యం వల్ల, రాజ్యాంగ విరుద్ధమైన నియంత్రణ వల్ల ఈ ఎన్నికలు పూర్తి స్థాయిలో రాజకీయ రంగు పులుముకొంటున్నాయి. ఒక గ్రామంలో లేదా గల్లీలో ఉండే మొత్తం వయోజనులకన్నా సహకార ఎన్నికల్లో ఓటర్లుగా పేర్లు నమోదు చేయించుకొనేవారి సంఖ్యే ఎక్కువగా ఉంటుంది. ప్రతి ఏటా ఏవో ఎన్నికలు జరుగుతూనే ఉంటాయి. దాంతో ఎప్పుడు చూసినా ఎన్నికల వాతావరణమే కనిపిస్తుంది. రాజకీయాల మోతాదు ఎక్కువైపోయి పరిపాలన వ్యవస్థకు విఘాతం కలుగుతుంది. ఈ పరిస్థితిలోంచి బయటపడాలంటే ఏదో ఒకటి చేయక తప్పదు.

## అమెరికా విధానం.. ఆదర్శం

ఎన్నికలను ఎప్పుడెప్పుడు, ఏ విధంగా నిర్వహించాలన్న దానిపై అనేక దేశాల్లో నిర్దిష్ట ప్రమాణాలున్నాయి. నిర్ధారిత కాలావధులున్నాయి. ఉదాహరణకు అమెరికాలో అధ్యక్ష ఎన్నికను ప్రతి నాలుగేళ్లకోసారి నవంబరు నెలలో మొదటి సోమవారం తరువాత వచ్చే మంగళవారంనాడు నిర్వహిస్తారు. ఈ ఏడాది నవంబరు రెండున ఎన్నికలు జరిగాయి. ఆ రోజు ఎన్నికలు జరుగుతాయన్న విషయం ఎన్నో ఏళ్లముందుగా తెలుసు. అంతెందుకు- 2008 అధ్యక్ష ఎన్నికలు నవంబరు 4, 2012 అధ్యక్ష ఎన్నికలు నవంబరు 6న జరుగుతాయనీ తెలుసు. అధ్యక్ష ఎన్నికే కాదు, అమెరికా కాంగ్రెస్ దిగువ సభ అయిన ప్రతినిధుల సభకు కూడా అదే రోజు ఎన్నికలు జరుగుతాయి. మూడు వంతుల సెనెటర్లు, సగం మంది గవర్నర్లు సగం రాష్ట్ర శాసనసభలు, స్థానిక ప్రభుత్వాలకు, ఇంకా అనేక అధికార పదవులకు అదే రోజున ఎన్నికలు నిర్వహిస్తారు. నాలుగేళ్లలో ఒక్కసారి మాత్రమే మధ్యంతర ఎన్నికలు జరుపుతారు. అదీ-అధ్యక్ష ఎన్నికలయ్యాక కచ్చితంగా రెండేళ్ల తరువాత. ఆ

సందర్భంగా రెండేళ్ల కాలావధి కలిగి ఉండే ప్రతినిధుల సభకు సభ్యులను ఎన్నుకోవడంతోపాటు మూడింట ఒక వంతు సెనెట్ పదవులకు, సగం గవర్నర్ పదవులకు, సగం రాష్ట్రాల శాసనసభలు, స్థానిక ప్రభుత్వాలకు ఎన్నికలు జరుపుతారు.

అమెరికాలో ఎన్నికలు ఇంత నియమబద్ధంగా, నిర్దిష్టంగా జరగడానికి మూడు కారణాలు ఉన్నాయి. అందులో మొదటిది– ప్రభుత్వాధిపతులను ప్రజలు నిర్దిష్ట కాలావధి కోసం ప్రత్యక్షంగా ఎన్నుకోవడం. అందువల్ల ప్రభుత్వాలు నిర్ధారిత కాలంపాటు కచ్చితంగా మనుగడ సాగిస్తాయి. ఒకవేళ దేశాధ్యక్షుడో, రాష్ట్ర గవర్నరో మరణిస్తే రాజీనామా చేస్తే లేదా ఉద్వాసనకు గురైతే–ఆ స్థానాన్ని ఆటోమేటిగ్గా భర్తీ చేయడానికి ప్రణాళికాబద్ధ ఏర్పాటు ఉంటుంది. ఉదాహరణ అధ్యక్ష పదవి ఖాళీ అయితే ఉపాధ్యక్షుడు సభాపతి, సెనెట్ ప్రెసిడెంట్ ప్రొటెంపోర్ (ఉపాధ్యక్షుడి తరువాతి స్థాయి కలిగిన సెనెట్ రెండో ప్రిసైడింగ్ ఆఫీసర్), విదేశాంగమంత్రి (వరుస క్రమంలో)తో దానిని భర్తీ చేస్తారు. ఇలా ఏ ఖాళీ ఏర్పడినా–నిర్దిష్ట కాలావధిలోగా మళ్లీ ప్రజల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేకుండా నిర్ధారిత ప్రక్రియ ప్రకారం భర్తీ చేస్తారు. కొన్ని రాష్ట్రాల్లో గవర్నర్ల రీకాల్‌కు సంబంధించిన నిబంధన ఒక్కటే ఇందుకు మినహాయింపు. కాలిఫోర్నియా గవర్నర్ గ్రే డేవిస్‌ను నిరుడు ఈ నిబంధన ప్రకారమే రీకాల్ చేశారు. పదవిలో ఉన్న వ్యక్తిని తొలగించాలా, వద్దా అనే విషయమై ఎన్నిక నిర్వహించినప్పుడే, సదరు వ్యక్తిని తొలగించిన పక్షంలో వారసుడెవరన్న అంశంపైనా ప్రజాభిప్రాయం కోరతారు. దాంతో విడిగా ఎన్నిక నిర్వహించాల్సిన అవసరం తప్పుతుంది. ఏడాది క్రితం జరిగిందదే. గ్రే డేవిస్ దిగిపోవాలని అభిప్రాయపడిన మెజారిటీ ఓటర్లు–అదే రోజు, అదే పోల్‌లో ఆయన వారసుడిగా అర్నాల్డ్ ష్వాజ్‌నెగల్‌ను ఎన్నుకొన్నారు.

రెండో కారణం–అమెరికా ప్రజాస్వామ్య వ్యవస్థలో చట్టసభను దేశాధ్యక్షుడు రద్దు చేయజాలడు. చట్టసభ నిర్దిష్ట కాలావధి కోసం ఎన్నికై ఉంటుంది. గడువు తీరేవరకు అది కొనసాగుతుంది. ఎన్నికైన కార్యనిర్వాహక వర్గాన్ని చట్టసభ దించివేయజాలదు. చట్టసభ కాలపరిమితిని కార్యనిర్వాహక వర్గం కుదించడానికి వీల్లేదు. అందువల్ల అర్ధాంతరంగా ఎన్నికలు వచ్చిపడే అవకాశమే లేదు.

మూడో కారణం–సభ్యుడి మృతి, రాజీనామా లేదా బహిష్కరణ కారణంగా చట్టసభలో ఒక సీటు ఖాళీ అయితే– సభ మిగతా కాలం కోసం ఆ సీటుకు ఎన్నిక

జరపకుండానే భర్తీచేస్తారు. ఆయా రాష్ట్రాల్లోని చట్టాలను బట్టి ఈ ప్రక్రియ విషయంలో రాష్ట్రానికి, రాష్ట్రానికి మధ్య తేడాలుంటాయి. అమెరికా సెనెట్‌లో ఒక రాష్ట్రానికి సంబంధించిన సీటు ఖాళీ అయితే ఆ రాష్ట్ర శాసనసభ సెనెట్ మిగతా కాలం కోసం ఒక సెనెట్‌ను ఎన్నుకొని పంపుతుంది. కొన్ని సందర్భాల్లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించడానికి, సెనెటర్‌ను రాష్ట్ర గవర్నర్ నామినేట్ చేస్తారు. ఉప ఎన్నిక అవసరమే ఉండదు.

వెస్ట్‌మినిస్టర్ పద్ధతిని అనుసరిస్తున్న బ్రిటన్‌లో ఉప ఎన్నికలు జరుగుతాయి. అక్కడ నియోజకవర్గాలు చాలా చిన్నవి. ప్రజలు బాగా తెలివైనవారు. ఉప ఎన్నికలు సాఫీగా, సాదాసీదాగా జరిగిపోతాయి. పరిపాలన వ్యవస్థకు ఎలాంటి అవరోధం ఏర్పడదు. ఇటీవల ఏర్పాటు చేసిన స్కాట్లాండ్, వేల్స్ అండ్ నార్తర్న్ ఐర్లాండ్ ప్రాంతీయ పార్లమెంటు ఫెడరలిజం విషయంలో బ్రిటన్‌పై ఒత్తిడి తెస్తున్నప్పటికీ, ఆ భావన కొన్ని ప్రాంతాలకే పరిమితమై ఉంది. బ్రిటన్ దీవుల్లో అదిపెద్దదైన ఇంగ్లాండ్‌లో నేటికీ యూనిటరీ ప్రభుత్వమే కొనసాగుతోంది.

భారతదేశంలో నిరంతర ఎన్నికల కోలాహలానికి స్వస్తిచెప్పి సుస్థిరత, అవిచ్ఛిన్నత సాధించడానికి మనమేమైనా చేయగలమా? పరిపాలనాపరమైన అవరోధాలను, సంకుచిత ప్రాతిపదికలపై రాజకీయ పునరేకీకరణలను, ఎప్పటికప్పుడు అర్ధాంతర ఎన్నికలకు దారితీస్తున్న అస్థిరతను నిరోధించగలమా?

పరిస్థితిని గణనీయంగా మెరుగుపరచేందుకు నాలుగు మార్గాలున్నాయి. మొట్టమొదట చేయాల్సిన పని ప్రభుత్వాధినేతను ప్రత్యక్షంగా ఎన్నుకోవడం, రాష్ట్ర స్థాయిలో చట్టసభలకు నిర్దిష్ట కాలావధి నిర్ణయించడం, ప్రజలు ప్రభుత్వాధినేతను నిర్దిష్ట కాలావధి (ఉదాహరణకు అయిదేళ్ల) కోసం ప్రత్యక్షంగా ఎన్నుకొంటారు. అదే సమయంలో అంతే కాలావధి కోసం ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకొనే శాసనసభతోపాటే ఆయన ప్రభుత్వం కొనసాగుతుంది. అలాంటప్పుడు రాష్ట్రస్థాయిలో ఉప ఎన్నికలు జరపాల్సిన అవసరమే ఉండదు. ప్రభుత్వాధినేత పదవి ఖాళీ అయితే రాజకీయ ప్రక్రియ ద్వారా దాని భర్తీకి ఒక విధానాన్ని ఏర్పరచుకోవాలి. రాష్ట్రస్థాయి చట్టసభలో ఖాళీ ఏర్పడితే ఆ ప్రాంతంలోని స్థానిక సంస్థల ప్రతినిధులు మిగతా కాలావధి కోసం లెజిస్లేటర్‌ను ఎన్నుకోవాలి. దీనివల్ల సుస్థిరత కొనసాగుతుంది. ఉప ఎన్నికలు ఉండవు. ఉత్తమ పౌరులు రాజకీయాల్లోకి, పదవుల్లోకి వస్తారు. అవినీతి ద్వారా

ప్రైవేటు ప్రయోజనాలు పొందడానికి కాకుండా నిజాయితీగా, ప్రజాప్రయోజనాలే ప్రాతిపదికగా ప్రభుత్వాల్ని నడపడానికి వీలుకలుగుతుంది.

రెండో మార్గం–అన్ని స్థాయిల్లో ఎన్నికలకు సంబంధించి దామాషా ప్రాతినిధ్య వ్యవస్థను ఏర్పరచడం. పార్టీలకు– అవి పొందిన ఓట్ల శాతాన్ని బట్టి చట్టసభల్లో సీట్లు లభిస్తాయి. ఒక పార్టీ తరపున ఖాళీని భర్తీ చేయాల్సి వచ్చినప్పుడు–ఎన్నికల సమయంలో ప్రజాస్వామ్య బద్ధంగా రూపొందించిన అభ్యర్థుల జాబితాలో నుంచి ఒకరిని ఎంపిక చేసుకొని సదరు ఖాళీని ఆ పార్టీ భర్తీ చేయవచ్చు. ఉప ఎన్నికలు జరపాల్సిన అవసరం ఉండదు. ప్రజల తీర్పునూ మన్నించినట్లవుతుంది.

మూడో మార్గం–నిరర్థక ఉప ఎన్నికలను నిరోధించడం. ఒకే అభ్యర్థి ఒకే సభకు రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తుంటారు. లేదా ఒకేసారి రాష్ట్ర అసెంబ్లీ సీటుకూ, లోక్‌సభ సీటుకూ పోటీ చేస్తుంటారు. ఇలాంటిది తరచుగా జరుగుతుంటుంది. ఈ ధోరణిని నిరుత్సాహపరచాలి. ఒకే అభ్యర్థి అనేక నియోజకవర్గాల నుంచి పోటీచేయడాన్ని చట్టం ద్వారా నిషేధించాలి. లేదా రెండు చోట్ల నుంచి ఎన్నికయ్యాక ఒక సీటును వదులుకొనే సభ్యుడే అక్కడ ఉప ఎన్నిక జరపడానికి అయ్యే ఖర్చునంతా భరించేలా చూడాలి. మరో పార్టీ తరపున ఉప ఎన్నికలో పోటీచేసే ఉద్దేశంతో ఉన్న సీటుకు రాజీనామా చేసే వారుంటారు. అలాంటి రాజీనామాలను నిరోధించే అవకాశం లేదు. నియోజకవర్గంలో తన పట్టును నిరూపించుకోవడానికి అదే పార్టీ తరపున మళ్లీ పోటీ చేసేందుకు వీలుగా సీటుకు రాజీనామా చేసే సభ్యులూ ఉంటారు. అనంతపురం జిల్లా పెనుగొండ నియోజకవర్గంలో కొన్నేళ్ల క్రితం అలాగే జరిగింది. కొన్ని సందర్భాల్లో సభ్యులు సిద్ధాంతాల కోసం అధికార పదవులను వదిలి, సీటుకు రాజీనామా చేస్తుంటారు. ఎనిమిదో లోక్‌సభలో వి.పి.సింగ్ అలాగే చేశారు. ఆర్థిక మంత్రిగా తన పదవికి పార్లమెంటు సభ్యత్వానికి ఆయన రాజీనామా చేశారు. తరువాత అలహాబాద్ నుంచి ప్రతిపక్ష అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి మార్గాలను పూర్తిగా మూసివేయలేం. ఈ సందర్భాల్లో ఒకే అభ్యర్థి అనేక నియోజకవర్గాల నుంచి పోటీచేయడాన్ని నిషేధించాలి. నిషేధం వీలుకాకపోతే ఉప ఎన్నికకు అయ్యే ఖర్చును ఆ అభ్యర్థే భరించేలా చూడాలి. కొంతమంది రాజకీయ ప్రయోజనాలకోసం పన్ను చెల్లింపుదార్లపై మరింత భారం మోపే అగత్యం దానివల్ల తప్పుతుంది.

## ప్రజాస్వామ్య పురోగతే ఎన్నికల పరమార్థం

చివరగా–అన్ని స్థాయుల్లో దామాషా ప్రాతినిధ్య పద్ధతి రాష్ట్ర స్థాయిలో కార్యనిర్వాహక వర్గానికి ప్రత్యక్ష ఎన్నిక దిశగా మళ్లే ముందు వ్యయ–ప్రయాసలు, కాలహరణం, అస్థిరతలకు కారణమయ్యే ఉప ఎన్నికలను పరిహరించాల్సిన అవసరం ఉంది. ఒక ప్రాతినిధ్య సభలో ఖాళీ ఏర్పడితే దానికన్నా దిగువన ఉండే ప్రాతినిధ్య సభ సభ్యుల ద్వారా ఆ ఖాళీని భర్తీ చేయాలి. ఉదాహరణకు లోక్‌సభలో ఒక ఖాళీ ఏర్పడితే ఆ లోక్‌సభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యేలు లోక్‌సభ మిగతా కాలం కోసం ఒక సభ్యుడిని ఎంపిక చేసి పంపాలి. అలాగే రాష్ట్ర అసెంబ్లీలో ఒక ఖాళీ ఏర్పడితే అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన స్థానిక సంస్థల ప్రతినిధులు అసెంబ్లీ మిగతా కాలావధి కోసం ఒక సభ్యుడిని ఎంపిక చేసి పంపాలి. దీనివల్ల వ్యయ–ప్రయాసలకు, కాలహరణానికి కారణమయ్యే ఉప ఎన్నికల అవసరం ఉండదు. పరిపాలన వ్యవస్థకూ విఘాతం కలగదు. మన ప్రజాస్వామ్యం సాఫీగా, సజావుగా పనిచేసేలా చూసేందుకు తగిన విధానాలు మనకు అవసరం. అదృష్టవశాత్తు–ఉత్కృష్టమైన, ఆచరణయోగ్యమైన, ప్రజాస్వామ్య బద్ధమైన పద్ధతులెన్నో మనముందున్నాయి. ఎన్నికలన్నవి తమ వ్యక్తిగత అధికారం, …హోదాల పెంపునకు ఉద్దేశించినవి కాదని, ప్రజాస్వామ్యం, ప్రజల సార్వభౌమాధికారాన్ని పరిపుష్టం చేయడానికే దోహదపడాలని మన రాజకీయ పార్టీలు, శాసనకర్తలు ప్రతిపాదించాల్సిన అవసరం ఉంది.

* * *

# చెదిరిపోతున్న లక్ష్మణ రేఖ

*ఫిబ్రవరి 6, 2006*

ప్రజాస్వామ్యంలో అసమ్మతి, అనివార్యం. కానీ అసమ్మతిని తెలియజేయడానికి అడ్డమైన మార్గాలను అనుసరించవచ్చా? విదేశీ పాలకులతో పోరాటానికి ఉపయోగించిన పద్ధతులనే ఇప్పుడు స్వేచ్ఛ, స్వయం పాలన కలిగి ఉన్న కాలంలో అసమ్మతిని తెలియజేయడానికి ఉపయోగించడం సమంజసమేనా? మన ప్రజాస్వామ్యం బతికి బట్టకట్టాలంటే ఈ ప్రశ్నలకు వాస్తవికంగా, నిజాయితీగా సమాధానాలు చెప్పవలసిన అవసరం ఉంది.

చరిత్రను తిరగరాస్తే-మానవజాతి వివిధరకాల ప్రభుత్వాలతో చేసిన ప్రయోగాలే అంతటా కనిపిస్తాయి. నలభై వేలేళ్లు- అరవై వేల ఏళ్ల క్రితం ఆవిర్భవించిన ఆధునిక మానవుడు, నాటి నుంచి బృందాలుగా జీవిస్తున్నాడని జీవశాస్త్రవేత్తలు అంటున్నారు. ఆదిమానవులు సైతం గుంపులుగా నివసించి, వేటాడేవారు. కానీ, భాష- సంభాషణా రెండూ లేక వారు ఆటవికంగానే బతికేవారు. ఉమ్మడిగా వేటాడటానికి, పిల్లలపాలన, పోషణలో పరస్పరం సహకరించుకోవడానికి వారు పరిమితమయ్యేవారు. తరువాత భాష రూపొందింది. వారు మరింతగా సంఘటితమయ్యారు. వారి మధ్య సమాచార వారధి ఏర్పడింది. విజ్ఞానాన్ని ఒకతరం నుంచి మరోతరానికి అందజేసే సామర్థ్యం పెరిగింది. దాంతో మనిషి సంఘజీవిగా మారాడు. ఆధునిక ఉపకరణాలు తయారయ్యాయి. వాణిజ్యం విస్తృతమైంది. అప్పటి నుంచి మనిషి వివిధ రకాల సంఘాలు, తనవైన పాలన పద్ధతులతో ప్రయోగాలు చేస్తూనే ఉన్నాడు.

ప్రభుత్వానికి ఆచరణాత్మకమైన, ఉపయోగకరమైన నిర్వచనాన్ని 1860లలో గ్లాడ్‌స్టన్ ఇచ్చారు. "మంచి జరగడానికి మార్గం సుగమం చేయాలి. చెడుకు అడ్డుకట్ట వేయాలి. అదే ప్రభుత్వ ఉద్దేశం కావాలి" అని ఆయన అన్నారు. మనుషులందరికీ మంచి చేయాలనే ఉంటుంది. కానీ ఒక్కోసారి చెడువైపు ఆకర్షితులవుతారు. మంచి చెడు సారాన్ని గ్రహించడానికి మనం స్వర్గనరకాలను నమ్మాల్సిన పనిలేదు. లోకజ్ఞానం కలిగి ఉండి, ఆచరణత్మక వైఖరిని అనుసరిస్తే సరిపోతుంది. సంఘంలో జీవిస్తున్నప్పుడు వ్యక్తిగత లక్ష్యాలు, ఆశలు, ఆశయాలకన్నా ఉమ్మడి ప్రయోజనాలకే అత్యంత ప్రాధాన్యం ఇవ్వవలసి ఉంటుంది.

పాస్టర్ నీమోలార్ చెప్పినట్లు– న్యాయం పొందాలన్న మనిషి తపన ప్రజాస్వామ్యాన్ని సాకారం చేస్తుంది. మనిషి బలహీనత ప్రజాస్వామ్యాన్ని అవసరంగా మారుస్తుంది. మనుషులందరూ అన్ని వేళలా ఉత్తములే అయితే మనకు చట్టాలు, ప్రభుత్వాల అవసరమే ఉండదు. వారంతా అన్ని వేళలా దుష్టులే అయితే ఎలాంటి చట్టాలు ప్రభుత్వాలు పని చేయవు. సమానత్వంతో పాటు సమర్థతకు, స్వేచ్ఛతోపాటు న్యాయానికి సావకాశం కల్పించే ప్రభుత్వ విధానం ప్రజాస్వామ్యమొక్కటే.

## స్వేచ్ఛా సహనాలే పునాదులు

విశాల సమాజాల్లో ప్రతిసారీ అన్ని విషయాలపై ఉమ్మడిగా నిర్ణయం తీసుకోవడమన్నది ప్రజలకు సాధ్యపడదు. అందుకే ప్రాతినిధ్య ప్రభుత్వాన్ని కలిగి ఉన్నాం. మన సేవకులుగా ఉంటూ మన తరపున మనల్ని పరిపాలించడానికి కొంతమందిని ఎన్నుకోవడం రివాజుగా మారింది. అయినా, పౌరులే సార్వభౌములు. ప్రభుత్వంలో ఉన్నవారు ఎంత ఉన్నతస్థాయి కలిగినవారైనా మన సేవకులే. ప్రజా సంక్షేమం కోసం మన వనరులను, మనం ఇచ్చిన అధికారాన్ని వారు వినియోగించుకొంటున్నారు. ప్రజాస్వామ్యమే ఉత్తమ ప్రభుత్వ వ్యవస్థగా గత 60 ఏళ్లలో సర్వజనామోదం పొందింది. ప్రజాస్వామ్యం బాగా పనిచేయాలంటే రెండు మౌలిక నియమాలను పాటించాల్సి ఉంటుంది. మొదటిది– స్వేచ్ఛా సహనాలే ప్రజాస్వామ్యానికి పునాదులు. ప్రజాస్వామ్యం విశృంఖలంకాదు, కారాదు. ప్రజాస్వామ్యం ఒకరికి వరమైతే, మరొకరిపాలిట అదే శాపంగా మారరాదు. అలా అయితే అరాచకమే రాజ్యమేలుతుంది. అందుకే, స్వేచ్ఛ బాధ్యత అన్నవి ఒకే నాణానికి బొమ్మా–బొరుసు వంటివని అందరూ అంగీకరించాలి. అంతా బాధ్యతతో వ్యవహరించడంతోపాటు సహనం పాటిస్తేనే స్వేచ్ఛను వినియోగించుకొనే అవకాశం చిక్కుతుంది. రెండోది– ప్రభుత్వంతో విభేదించడం ప్రజల మౌలిక హక్కు. ప్రభుత్వం ప్రజల సృష్టి. అందుకే దాంతో విభేదించే హక్కు ప్రజలకు ఉంది. లేకపోతే ప్రభుత్వాలు నిరంకుశంగా, జవాబుదారీతనం లేకుండా వ్యవహరిస్తాయి. అలాగని, ప్రతి ఒక్కరూ ఏదో ఒక విధంగా అసమ్మతి, అసంతృప్తి వ్యక్తపరచడమే పనిగా పెట్టుకొంటే–ప్రభుత్వం స్తంభించిపోతుంది. అందుకే బాధ్యతాయుతంగా అసమ్మతి తెలిపే మార్గాలను పౌరులు ఎంచుకోవాలి. ప్రజాభిప్రాయాలకు ప్రభుత్వాలు తలొగ్గాలి.

ప్రజాస్వామ్యంలో అసమ్మతి అవసరం, అనివార్యం. కానీ అసమ్మతిని తెలియజేయడానికి అడ్డమైన మార్గాలను అనుసరించవచ్చా? విదేశీ పాలకులతో

పోరాటానికి ఉపయోగించిన పద్ధతులనే ఇప్పుడు స్వేచ్ఛ, స్వయంపాలన కలిగి ఉన్న కాలంలో అసమ్మతిని తెలియజేయడానికి ఉపయోగించడం సమంజసమేనా? మన ప్రజాస్వామ్యం బతికి బట్టకట్టాలంటే ఈ ప్రశ్నలకు వాస్తవికంగా, నిజాయితీగా సమాధానాలు చెప్పుకోవలసిన అవసరం ఉంది.

విమానాశ్రయాల్లో ప్రామాణిక మౌలిక వసతుల కల్పనలో ప్రైవేటు భాగస్వామ్యానికి వ్యతిరేకంగా ఉద్యమం జరుగుతోంది. సర్పంచుల 'శంఖారావం' లాఠీఛార్జీకి దారి తీసింది. ఇలాంటి ప్రదర్శనలు వందలాదిగా కొనసాగుతున్నాయి. అనేక రూపాల్లో అసమ్మతిని, అసంతృప్తిని వ్యక్తపరచడం జరుగుతోంది. ప్రజాస్వామ్యం, అసమ్మతికి సంబంధించి మౌలిక సూత్రాలను అటు ఉద్యమకారులు, ఇటు ప్రభుత్వం విస్మరిస్తున్నాయని దీనిని బట్టి స్పష్టమవుతోంది. వాస్తవాలను ప్రజలముందు ఉంచి వారికి నచ్చజెప్పడంలో ఎప్పటికప్పుడు విఫలమవుతున్న ప్రభుత్వాలదే పెద్దతప్పు. ప్రభుత్వం దూకుడుగాను, దురుద్దేశాలతోనూ అనేక నిర్ణయాలు తీసుకుంటోంది. కొన్నిసార్లు దురుద్దేశాలు లేకపోయినా, శాంతియుత చర్చల ద్వారా సామరస్యంతో సమస్యలను అవి పరిష్కరించలేకపోతున్నాయి. ఉద్యమాలు హింసాత్మకంగా మారాకగానీ అవి దిగిరావడం లేదు. ఇలాంటి వైఖరి నిర్హేతుకమైనది. పైగా దుష్ఫలితాలిస్తుంది. వాస్తవాలు, న్యాయబద్ధతే ప్రభుత్వ విధానానికి పునాది కావాలి. ప్రజా ప్రయోజనాలే ధ్యేయం కావాలి. అలా ఉండటం లేదు. ఉద్యమం, హింస, అభివృద్ధి నిరోధక వైఖరి వల్ల వాస్తవాలు మరుగున పడిపోవు. ఉద్యమం కారణంగా ఒప్పు తప్పై పోదు. ప్రభుత్వం ఆయా విషయాలను నిష్పక్షపాతంగా పరిశీలించడం లేదనడానికి ఈ వైఖరి నిదర్శనం. ప్రభుత్వ హింసకు, ఉద్యమానికి లొంగిపోవడమంటే– హింసకు పాల్పడితే తప్ప పనులు కావన్న అభిప్రాయానికి తావీయడమే. ప్రభుత్వ వైఖరివల్ల దుష్ఫలితాలు వస్తాయనేది అందుకే. ఒక విధానం వల్ల విశాల ప్రజానీకానికి ప్రయోజనం చేకూరేట్టయితే – ఆ విధానాన్ని కొనసాగించడం, తన వైఖరి విజ్ఞతతో కూడుకున్నదేనని ప్రజల్ని ఒప్పించడం ప్రభుత్వ బాధ్యత, హింస, ఉద్యమాలు తలెత్తిన ప్రతిసారీ విధానాలు మార్చుతూపోతే అరాచకత్వానికి ఆహ్వానం పలికినట్టే.

ప్రభుత్వ విధానంతో లేదా నిర్ణయంతో విభేదించే వారు ప్రజాస్వామిక సిద్ధాంతాలన్నింటినీ మరచిపోతున్నారు. ప్రతి వర్గం హింసాత్మక నిరసన ప్రదర్శనలకు దిగితే – బలవంతపు హర్తాళ్లు, బంద్‌లు, రాస్తారోకోల ద్వారా పౌరుల స్వాతంత్ర్యానికి

విఘాతం కలిగిస్తే– స్వేచ్ఛకు అర్థం లేనట్టే. పరిపాలించడమన్నది చట్టబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వం బాధ్యత. పరిపాలనలో భాగంగా ప్రభుత్వం చట్టాలు చేస్తుంది. వివిధ నిర్ణయాలు తీసుకొంటుంది. ఆ చట్టాలు, నిర్ణయాలు రాజ్యాంగ పరిధికి లోబడి ఉన్నంత కాలం వాటికి కట్టుబడి ఉంటే హక్కు ప్రభుత్వానికి ఉంటుంది. ప్రభుత్వ నిర్ణయాలు అవివేకమైనవి, అనాలోచితమైనవి, ప్రజా ప్రయోజనాలకు భంగకరమైనవని భావిస్తే వాటిపట్ల అసంతృప్తిని, అసమ్మతిని వ్యక్తపరిచే హక్కు ప్రజానీకానికి ఉంది. రాజ్యాంగం మనకు వాక్ స్వాతంత్ర్యం, సభలు– సమావేశాలు జరుపుకొనే హక్కు ఇచ్చింది. వాటిని ఉపయోగించుకొని ప్రజాభిప్రాయాన్ని కూడగట్టడానికి, మన వాదనను అంగీకరించేలా ప్రభుత్వానికి నచ్చజెప్పడానికి హక్కు ఉంది. అంతే తప్ప – మన వాదనను అంగీకరించి తీరాల్సిందేనంటూ బలవంతం చేస్తే, ప్రతి వర్గం అలాంటి మార్గాన్ని అనుసరిస్తే ఆరాచకత్వం, విధ్వంసం తప్పవు. సాటి పౌరులపై మనకు ఎలాంటి హక్కులు లేవు. ఎట్టి పరిస్థితుల్లోనూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడానికి, దుకాణాలను, వివిధ సంస్థలను, బలవంతంగా మూసివేయించడానికి, హింసకు పాల్పడటానికి మనకెలాంటి అధికారం లేదు. అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్నా అన్ని వేళలా నియమ– నిబంధనలు అమలు కావాల్సిందే. పన్నులు– సుంకాలు పెంచినందుకు, సర్పంచుల చెక్‌పవర్‌కు 'చెక్' పెట్టినందుకు... ఇలా అనేక విషయాల్లో మనం నిరసన వ్యక్తం చేయవచ్చు. కానీ ఈ సందర్భాల్లో ప్రజాస్వామిక నియమ– నిబంధనలనే అనుసరించాలి. మనకు స్వేచ్ఛ ఉన్నప్పటికీ–సహనంతో, బాధ్యతగా వ్యవహరించవలసిన అవసరం కూడా ఉందని గ్రహించాలి. వివిధ అంశాలపై నిజాయితీగా బహిరంగ చర్చ జరపడం, హేతుబద్ధంగా వాదన వినిపించడం, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ, శాంతియుతంగా సభలు ఏర్పాటు చేసుకోవడం... చట్టబద్ధమైన లక్ష్యాల సాధన కోసం మనకు రాజ్యాంగం ప్రసాదించిన ఉపకరణాలివి. అవాంతరాలు సృష్టించడం, హింసకు పాల్పడటమంటే ఇతరుల స్వాతంత్ర్యాన్ని నిరోధించడమే. ఇలాంటి చర్యల ద్వారా మనం మన హక్కులనే భంగపరచుకొంటున్నాం. ప్రజాస్వామ్యానికి చెరుపుచేస్తున్నాం.

## ప్రజాభిప్రాయానికి మన్నన

న్యాయమైన ప్రజాభిప్రాయాలను ప్రభుత్వాలు మన్నించాలి. స్వలాభాపేక్ష వీడి, విశాల జనహితం కోసం తగు విధానాలను రూపొందించాలి. తప్పులు

చేసినప్పుడు – పొరపాటై పోయిందని ఒప్పుకోవాలి. ఉద్యమాలు తలెత్తక ముందే వాటిని దిద్దుకోవాలి. తాము తీసుకున్న నిర్ణయాలు న్యాయంగా ప్రజా ప్రయోజనాలకు ఉద్దేశించినవేనని, అవి రాజ్యాంగానికి, చట్టానికి లోబడే ఉన్నాయని భావిస్తున్నట్లయితే, అందుకు సంబంధించి వాస్తవాలు వెల్లడించి ప్రజల్ని ఒప్పించాలి. తప్పును దిద్దుకోవడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ హింస చెలరేగేదాకా ఆగరాదు. సరైన నిర్ణయాలను ఒత్తిళ్లకు లొంగి మార్చుకోరాదు. ప్రజాస్వామిక వ్యవస్థకు సంబంధించిన ఈ నియమ నిబంధనలను పౌరులు, వారు ఎన్నుకొన్న ప్రభుత్వాలు పాటించినప్పుడే నాగరిక పరిపాలన సుసాధ్యమవుతుంది. అప్పుడే అందరి హక్కులకు రక్షణ చేకూరుతుంది. అప్పుడే ప్రజలకు మేలు జరుగుతుంది.

* * *

# ప్రజాస్వామ్యం మన బలమా? బలహీనతా?

*జులై 7, 2003*

ప్రధానమంత్రి వాజపేయి చైనాయాత్ర ఫలవంతమైందా, లేదా అనే విషయంలో చాలా భేదాభిప్రాయాలున్నాయి. ప్రపంచంలోని రెండు అతి పెద్ద దేశాల మధ్య సయోధ్యకు ఆయన పర్యటన దోహదం చేసిందని, అందువల్ల ప్రపంచ శాంతికి, మన రెండు దేశాల్లో ఆర్థికాభివృద్ధికి మార్గం సుగమమవుతుందని కొందరి అభిప్రాయం. టిబెట్‌పై చైనా సార్వభౌమత్వాన్ని భారత్ సూత్రప్రాయంగా అంగీకరించటంతోపాటు, సిక్కిం సరిహద్దులోని నాథులా కనుమగుండా అంతర్జాతీయ వాణిజ్యానికి అనుమతించటం వల్ల చైనా లాభపడిందని, కాని భారత్‌లో సిక్కిం విలీనాన్ని గుర్తించటం, సరిహద్దు వివాదానికి తెరదించటం వంటి అంశాల్లో చైనా సానుకూలంగా స్పందించలేదని మరి కొందరు విమర్శిస్తున్నారు.

## సరైన విధానాలే చైనా విజయ రహస్యం

ఈ వాదనల నేపథ్యంలో - వాజపేయి పర్యటన ఫలితాలు ఎలా ఉన్నా ఇరు దేశాల ఆర్థిక ప్రగతిని మరోసారి తులనాత్మకంగా పరిశీలించవలసి ఉంది. గత 25 ఏళ్ళుగా చైనా అసాధారణ ఆర్థికాభివృద్ధిని సాధించిందని, దానితో పోలిస్తే భారత్ నత్తనడక నడుస్తోందని పరిశీలకుల అభిప్రాయం. చైనా అభివృద్ధి- నియంతృత్వాల సామర్థ్యానికి, భారత్ కష్టాలు ప్రజాస్వామ్యాల అసమర్థతకు అద్దం పడుతున్నాయని కొందరు వాదిస్తున్నారు. చైనా అభివృద్ధికి కారణం నియంతృత్వమా? లేక మంచి విధానాలా? మన నత్తనడకకు కారణం ప్రజాస్వామ్యంలో సహజంగా ఉండే బలహీనతలా? లేక అసంబద్ధ విధానాలు, ప్రాథామ్యాలా? ఈ ప్రశ్నలకు నిజాయితీగా, నిర్మొహమాటంగా సమాధానాలు అన్వేషించటం మన దేశ ప్రగతికి అవసరం. చైనాలో నియంతృత్వాన్ని అభిమానించేవారు- ఆ దేశం కమ్యూనిస్టు పాలన తొలి దశాబ్దాలలో ఎదుర్కొన్న ఘోర పరాజయాలను, జన నష్టాన్ని విస్మరిస్తున్నారు. 1950లలో ఛైర్మన్ మావో అనుసరించిన 'గ్రేట్ లీప్ ఫార్వర్డ్' విధానం కారణంగా చైనాలో 1959-61 మధ్య కాలంలో రెండు కోట్ల మంది ప్రజలు ఆహారం లేక ఆకలి బాధతో మరణించారు. ప్రపంచ చరిత్రలో అంత పెద్ద ఎత్తున ఒక దేశంలో ఆకలి కారణంగా జన నష్టం మరెన్నడూ జరగలేదు. 1960లలో చైనా చేపట్టిన

'సాంస్కృతిక విప్లవం' ఒకటి రెండు తరాలకు అంతులేని వేదననే మిగిల్చింది. విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థలు మూత పడ్డాయి. మేధాశక్తి మూగపోయింది. కేవలం నియంతృత్వ పాలన కారణంగానే, ప్రజల గొంతు నొక్కినందువల్లనే ఆ రెండు ఉద్యమాలు సాధ్యమయ్యాయి. జనాన్ని అంతులేని నరకయాతనలకు గురి చేశాయి. చైనా నియంతృత్వం తీవ్ర విషాదానికి దారితీసిందని రుజువు చేయటానికి పైన ఉదహరించిన రెండు ఉదంతాలు చాలు. 1978 తరువాత చైనా అసాధారణ ప్రగతి సాధించటానికి కారణాలేమిటి? మావో వైఫల్యాలు ఎన్ని ఉన్నా, సామ్యవాదంలో ఉన్న మంచి లక్షణాలు, విధానాలు తరువాతి కాలంలో స్వేచ్ఛా వాణిజ్యానికి, ఆర్థిక ప్రగతికి పునాదులయ్యాయి. ఇతర కమ్యూనిస్టు దేశాల్లోలాగానే చైనాలో పాఠశాల విద్యకు, ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చారు. దాంతో నైపుణ్యం, ఆరోగ్యం ఉన్న జనాభా పెరిగింది. ఉత్పత్తికి, ఉత్పాదకతకు, ఉపాధికి పనికివచ్చే తరం తయారయింది. ఇది కేవలం వనరుల కేటాయింపు సమస్య మాత్రమే కాదు. ఉదాహరణకు భారత్‌లో ఆరోగ్యంపై జాతీయాదాంలో 5.2 శాతాన్ని వెచ్చిస్తున్నారు. ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెట్టే ఖర్చు అందులో 17 శాతం మాత్రమే. ఆ కొద్దిపాటి ఖర్చు కూడా చాలా మేరకు వృథా అవుతోంది. చైనాలో జాతీయాదాయంలో 5.1 శాతం మాత్రమే ఆరోగ్యంపై వెచ్చిస్తారు. కాని అందులో 42 శాతం ప్రజారోగ్యానికి కేటాయించి, దాన్ని సద్వినియోగం చేస్తున్నారు. చైనా కేవలం మానవాభివృద్ధితోనే తృప్తిపడలేదు. గ్రామ ప్రాంతాల్లో సాంకేతిక విజ్ఞానాన్ని అందిచటానికి, మౌలిక సదుపాయాల కల్పనకు 1978కు పూర్వమే విశేష కృషి చేసింది. అది అత్యాధునిక సాంకేతిక విజ్ఞానం కాకపోవచ్చు. జనజీవనాన్ని మార్చే చవకైన, సాధారణమైన పనికివచ్చే సాంకేతిక విజ్ఞానాన్ని అందించటంతో మంచి ఫలితాలు వచ్చాయి.

ఆ తరువాత 1978లో మావో శకం అంతమయ్యాక డెంగ్ సియావో పింగ్ అధికారంలోకి వచ్చారు. ఆయన స్వేచ్ఛా వాణిజ్యాన్ని ప్రవేశపెట్టి ఆర్థిక విప్లవానికి నాంది పలికారు. నాలుగు రంగాల్లో ఆధునికీకరణ పేరుతో కొత్త విధానాలకు, సాంకేతికాభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఆనాడు చైనా ఆర్థికంగా ఏకీకృతం కాలేదు. ఎక్కడికక్కడ ఇతర ప్రాంతాలతో సంబంధం లేకుండా ఉత్పత్తి, వినియోగం జరిగేవి. ఈ వికేంద్రీకరించిన ఆర్థిక వ్యవస్థ డెంగ్ ఒక అవకాశంగా మలుచుకున్నారు. దాంతో స్థానిక కుటీర పరిశ్రమలు వివిధ రూపాల్లో వెలిశాయి. లక్షలాదిగా పట్టణ-గ్రామ పరిశ్రమల పేరుతో కొత్త ఉత్పత్తి కేంద్రాలు ఏర్పడి కోట్ల మందికి ఉపాధి కల్పించాయి.

ఆ చిన్న పరిశ్రమల పుణ్యమా అని చైనా నుంచి ఇరత దేశాలకు ఎగుమతులు అనూహ్యంగా పెరిగాయి. ప్రపంచంలో చైనా ఉత్పత్తులకు ఒక్కసారి గిరాకీ పెరిగింది. దాంతో చరిత్ర గతి మారింది. నియంతృత్వంతో చైనా సాధించిన ప్రగతి అసాధారణమయింది. వాస్తవానికి ప్రపంచంలోని చాలా నియంతృత్వ దేశాల్లో–దేశ ప్రగతి, సమాజ శాంతి– రెండూ కొరవడ్డాయి. కొంత మేరకు అభివృద్ధిని, సుస్థిరతను సాధించిన నియంతృత్వ దేశాల్లో కూడా ఎందరో పౌరుల ప్రాణాలను, స్వేచ్ఛను బలిగొన్నారు. హేతుబద్ధంగా ఆలోచిస్తే నియంతృత్వం చైనాకు శాపమని, ఇప్పటికి కూడా ఏకపార్టీ నియంతృత్వం ఆ దేశానికి గుదిబండగా మారి, ఇటీవలి ఆర్థిక ప్రగతి ఫలాలను ప్రజలకు అందకుండా చేసే ప్రమాదం ఉంది. చైనా ప్రగతికి కారణం క్రూర నియంతృత్వం, బల ప్రయోగం కాదు. సవ్యమైన విధానాలను అనుసరించడం, ఆర్థిక వికేంద్రీకరణ, స్వేచ్ఛా వాణిజ్యం, పెట్టుబడులను ప్రోత్సహించడం– ఇవన్నీ చైనా రూపురేఖలను మార్చేశాయి.

## శుష్క నినాదాలకే భారత్ పరిమితం!

భారత్ ప్రజాస్వామ్యం ఎందుకు సత్ఫలితాలను సాధించలేకపోయింది ? సోషలిజం పేరుతో మనం వ్యక్తి చొరవను, సృజన శక్తిని అడ్డుకున్నాం. విద్య, ఆరోగ్యం, గ్రామ ప్రాంతాల్లో సాంకేతిక సరఫరా, మౌలిక సదుపాయాలు– ఈ నాలుగు రంగాల్లో శ్రద్ధ చూపకపోవడం వల్ల జరిగిన నష్టం మనందరికీ తెలుసు. లైసెన్సు–పర్మిటు–కోటా రాజ్యాన్ని స్థాపించటంతో అవినీతి పెరిగింది. పెట్టుబడులు తగ్గాయి. ఉత్పత్తి, ఉత్పాదకత అడుంటాయి. 20 ఏళ్ళ క్రితం ఎందరో మధ్యతరగతి వారు ఇళ్ళు కట్టుకోవాలంటే సిమెంటు పర్మిట్ల కోసం అధికారుల అధికారుల ముందు పడిగాపులు కాయవలసి వచ్చేది... ముడుపులు చెల్లించవలసివచ్చేది. పాలకులు కృత్రిమ కొరతను సృష్టించి ఉక్కులాంటి వస్తువులమీద నియంత్రణలు విధించారు. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రభుత్వం తాను విధిగా చేయవలసిన పనులను విస్మరించింది. అనవసర విషయాల్లో జోక్యం చేసుకుని వ్యక్తి స్వేచ్ఛను, ప్రజల చొరవను పెట్టుబడులను హరించి వేసింది. ప్రజాసామ్యం కేవలం ఓ ప్రహసనంగా తయారైంది. ప్రతి నియోజకవర్గంలో ఆధునిక జమీందారీలు వెలిశాయి. భూస్వామ్య వ్యవస్థ మళ్ళీ ఊపిరిపోసుకుంది. అవినీతికి, కుటుంబ పాలనకు మన ప్రజాస్వామ్య వ్యవస్థ దారి తీసింది. చట్టబద్ధ పాలన మృగ్యమైంది. కేవలం తరచు జరిగే ఎన్నికలు, నాయకుల మార్పు, రాజకీయ

స్వేచ్ఛ మాత్రమే మన దేశాన్ని ఆధునికి ప్రజాస్వామ్యంగా నిలబెట్టలేవు. చట్టబద్ధ పాలన, పౌరుల సార్వభౌమత్వం, ఆర్థిక స్వేచ్ఛ, మానవాభివృద్ధి, స్వయం పరివర్తన సాధించే సంస్థాగత ఏర్పాట్లు– ఇవన్నీ ప్రజాస్వామ్య విజయానికి, శీఘ్ర ఆర్థిక ప్రగతికి ప్రాణం. గత 30 ఏళ్ళలో ఈ పరిస్థితిని సరిదిద్దటానికి మనకెన్నో అవకాశాలు వచ్చినా– మార్పులపై దృష్టి పెట్టకుండా విఫలమైన విధానాలనే మన పాలకులు కొనసాగిస్తూ వచ్చారు. మన పంచవర్ష ప్రణాళికలన్నీ ఒకే మూసలోంచి వచ్చాయి. ఒక ప్రణాళికలో ప్రకటించే ప్రాథమ్యాలకు, నినాదాలకు, మరో ప్రణాళికలో ప్రకటించే వాటికి తేడా ఏమీలేదు. అడపాదడపా సాధించిన స్థానిక విజయాలను దేశవ్యాప్తంగా ప్రవేశపెట్టే సంస్థాగత ఏర్పాట్లు, సత్ఫలితాలను సాధించే యంత్రాంగం కరవయ్యాయి. శుష్కనినాదాలకు, చిత్తశుద్ధి లేని ప్రకటనలకు మన నాయకులు పరిమితమయ్యారు. సంపద సృష్టిని విస్మరించారు. ఈ వైఫల్యాలు ప్రజాస్వామ్య వ్యవస్థని కావు. ప్రజాస్వామ్యం పేరుతో మనం ప్రవేశపెట్టిన అపసవ్య ధోరణులవి. భారత్‌లో పాలకులు జనసామాన్యానికి కనీస పరిజ్ఞానం, నైపుణ్యం అందించకుండా అంధకారంలోకి నెట్టారు. ఓట్ల కోసం ప్రజలలో విభేదాలను రెచ్చగొట్టి, వ్యక్తిలోని ఉదాత్తతను అణచివేసి క్రూర ధోరణులను ప్రోత్సహించారు. కులం, మతం, వర్గం, భాష– ఇవన్నీ వ్యక్తి స్వేచ్ఛ కన్నా, మంది హితం కన్నా ఎక్కువగా జనం దృష్టిని ఆకర్షించేలా సమాజాన్ని గందరగోళంలోకి నెట్టారు. అందుకు ప్రజాస్వామ్యం మీద, జనసామాన్యం మీద నెపం మోపడం మూర్ఖత్వానికి పరాకాష్ట. నిజమైన ప్రజాస్వామ్య వ్యవస్థను నెలకొల్పడంలో నాయకులు నిర్లక్ష్యం వహించారు. మన వైఫల్యాలకు కారణం ప్రజాస్వామ్యం కాదు, ప్రజాస్వామ్యం పేరుతో కొనసాగిస్తున్న అపరిపక్వ విధానాలు! మనకు కావలసింది మరింత స్వేచ్ఛ–అంతే కాని శృంఖలాలు కాదు. ఈ స్వేచ్ఛ, చట్టబద్ధ పాలన మిళితం కావాలి. ఒకరి స్వేచ్ఛ మరొకరికి ప్రతిబంధకం కారాదు. స్వేచ్ఛను, చట్టబద్ధపాలన, ఆర్థిక ప్రగతిని మనం కచ్చితంగా ఏకకాలంలో సాధించగలం. అందుకు మనకు కావలసింది ఆత్మవిశ్వాసం. మనం చేపట్టవలసింది సహేతుక విశ్లేషణ. వాస్తవాల నిర్దిష్ట పరిశీలన తప్ప కుహనా వాదనలు, అసంబద్ధ వాదనలు కాదు. మన పాలకులు అమలు చేయవలసింది హేతుబద్ద విధానాలను, దీర్ఘకాలిక ప్రణాళికలను తప్ప తాత్కాలిక జనాకర్షక పథకాలనే, ప్రతి రోజూ పరగడుపులాంటి మూర్ఖ విధానాలను కాదు.

* * *

# జనచైతన్యమే ప్రజాస్వామ్యానికి బలం

**ఫిబ్రవరి 24, 2003**

ఇరాక్‌పై యుద్ధానికి వ్యతిరేకంగా గత వారం పాశ్చాత్య దేశాలలోనూ, ఆస్ట్రేలియాలోనూ లక్షల మంది వీధుల్లోకి వచ్చి ప్రదర్శనలు నిర్వహించారు. లండన్, పారిస్, న్యూయార్క్, బ్రస్సెల్స్, రోమ్, ప్రేగ్, బార్సిలోనా, ఆమ్‌స్టర్‌డాం, సిడ్నీ- ఇంకా వందల నగరాల్లోనూ, పట్టణాల్లోనూ దాదాపు కోటి మంది ఈ యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలలో పాల్గొన్నారు. అమెరికా, బ్రిటన్‌లు ఇరాక్‌పై యుద్ధానికి సన్నద్ధం అవుతుండగా, ఫ్రాన్స్, జర్మనీలు ఐక్యరాజ్యసమితి పర్యవేక్షణకు మరింత అవకాశమివ్వాలని పట్టుబడుతున్నాయి. ఈ విధంగా రెండో ప్రపంచ యుద్ధం తరువాత తొలిసారిగా పాశ్చాత్య దేశాల మధ్య తారాస్థాయిలో విభేదాలు చోటుచేసుకున్నాయి. ప్రభుత్వాల మధ్య తలెత్తిన విభేదాలు ప్రపంచమంతటా ప్రజలలో వాదోపవాదాలకు, అభిప్రాయభేదాలకు, భావాల మధ్య సంఘర్షణకు దారితీశాయి. వియత్నాం యుద్ధం జరుగుతున్న 1960లు, 70ల కాలంలో ప్రపంచమంతటా యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలు జరిగేవి. మళ్ళీ 28 సంవత్సరాల తరువాత ఇంత పెద్ద స్థాయిలో యుద్ధానికి వ్యతిరేకంగా ప్రజలు సమీకృతమవుతున్నారు. ప్రపంచమంతటా గత కొద్ది మాసాల నుంచి ఇరాక్‌పై యుద్ధానికి సంబంధించిన చర్చలు, వాదోపవాదాలు, ప్రదర్శనలు ప్రధానంగా చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా పాశ్చాత్య దేశాల్లోనూ, అరబ్ ప్రపంచంలోనూ ఈ అంశంపై ఉత్కంఠ నెలకొంది. పాశ్చాత్య ప్రజాస్వామ్యాలలో ఈ అంశంపై తలెత్తిన వివాదం-ప్రజల్లో ప్రస్ఫుటమయిన విభేదాలు, తమ భావాలను అక్కడి ప్రజలు, జనమాధ్యమాలు వ్యక్తంచేస్తున్న తీరు, చర్చల సరళి మనదేశంలో బహిరంగ చర్చ జరిగే తీరుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. ఇరాక్‌పై యుద్ధం ఏ మేరకు హేతుబద్ధమయిందనే ప్రశ్నను అలా ఉంచి, పాశ్చాత్య దేశాలలో బహిరంగ చర్చ జరిగే తీరును, విభేదాలను ప్రకటించే పద్ధతులను మనం లోతుగా పరిశీలిస్తే ఎన్నో ఆసక్తికరమయిన అంశాలు బయటపతాయి.

### అక్కడ...హుందాతనం

ఈ చర్చ జరుగుతున్న పాశ్చాత్య దేశాలన్నీ పరిణతి చెందిన ప్రజాస్వామ్య దేశాలు. ఆ దేశాలన్నింటిలోనూ వ్యక్తి స్వేచ్ఛకు, మానవ హక్కులకు, భావ ప్రకటనకు,

చట్టబద్ధ పాలనకు పెద్దపీట వేశారు. ఈ కారణాలన్నింటి వల్ల భావప్రకటనలో అక్కడ ఎంతో సంయమనం కావస్తుంది. ప్రదర్శలన్నీ శాంతియుతంగా, హుందాగా జరిగాయి. గడ్డ కట్టే చలిలో లక్షల మంది ప్రశాంతంగా వీధుల్లో తమ మనోభావాలను వ్యక్తం చేశారు. ఎంతమంది ప్రదర్శనలో పాల్గొన్నా ప్రభుత్వాలు రాజీనామా చేయాలంటూ ఎక్కడా నినాదాలు కాని, ఆందోళనలు కాని లేవు. ఒక్క ప్రదర్శనలో కూడా హింస చోటుచేసుకోలేదు. పరుష పదజాలాన్ని వడటంగాని, తమ భావాలను వ్యతిరేకించే వారిని అవమానించటంగాని జరగలేదు. అంటే తమకు బలమైన అభిప్రాయాలున్నా, వాటిని ప్రకటించే ప్రయత్నాలు జరిగాయే తప్ప వీధుల్లో కయ్యానికి కాలుదువ్వే వైఖరి కనిపించలేదు. అలాగే ఈ ప్రదర్శనలు జరగటానికి ముందు గత కొద్ది వారాలుగా పత్రికల్లో, టెలివిజన్లలో చాలా ఆసక్తికరమయిన చర్చ జరుగుతూ వస్తోంది. ఐరోపాలోని అనేక దేశాల్లో గణనీయమైన సంఖ్యలో ప్రజలు యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్నారని తెలింది. అమెరికా, బ్రిటన్, ఇతర దేశాల ప్రభుత్వాలు ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవడంలేదని స్పష్టమైన తరువాతే లక్షల మంది ప్రదర్శనలకు దిగారు. అంటే బహిరంగ ప్రదర్శనలు వారి భావ ప్రకటనలో తొలి అడుగుకాదు. అన్ని జనమాధ్యమాలను, ప్రజాభిప్రాయ సేకరణ పద్ధతులను ఉపయోగించాక, అప్పటికీ ప్రభుత్వాలు తమ భావాలను ఖాతరు చేయటం లేదన్న నిర్ణయానికి వచ్చాక ప్రజలు బహిరంగ ప్రదర్శనలకు దిగారు. ఈ ప్రదర్శనలలోనూ, భావ ప్రకటనలోనూ పార్టీ రాజకీయాలు చోటు చేసుకోలేదు. బ్రిటన్‌లో లేబర్ పార్టీ అధికారంలో ఉంది. ప్రధానమంత్రి టోని బ్లెయిర్ ఆది నుంచీ ఉగ్రవాద వ్యతిరేక పోరాటంలో భాగంగా ఇరాక్‌పై యుద్ధం చేసైనా సరే ఆ దేశాన్ని నిరాయుధీకరించాలని, అందుకు అమెరికాకు అండగా నిలబడాలని వాదిస్తున్నారు. అయినా బ్రిటన్‌లో ప్రదర్శనలు లేబర్ పార్టీకి, ప్రతిపక్షమయిన కన్సర్వేటివ్ పార్టీకి మధ్య రాజకీయ పోరాటంగా రూపొందలేదు. ప్రజలు పార్టీల పేరుతోకాక, ఈ విషయంలో భిన్నాభిప్రాయాల కారణంగా చీలిపోయారు. ఈ మొత్తం వ్యవహారంలో రాజకీయ పార్టీలు ఎలాంటి జోక్యమూ చేసుకోవడం లేదు.

## ఇక్కడ...అంతా రాజకీయం

మనదేశంలో బహిరంగ చర్చలు ఇందుకు పూర్తి భిన్నంగా ఉంటాయి. ఏ విధానంపైనైనా విభేదాలు తలెత్తగానే పార్టీలు ఆరోగ్యకరమైన చర్చను ప్రోత్సహించే బదులు త్వరపడి ఏకపక్ష నిర్ణయనికి వచ్చేస్తాయి. అలా నిర్ణయించాక, ఇక పార్టీల

కార్యకర్తలు వీధినపడతారు. కీలకమైన అంశాలపై సామరస్య వాతావరణంలో చర్చ జరగడం చాలా అరుదవుతోంది. వాదనలలో సత్యాసత్య నిరూపణకన్నా, పరుష పదజాలం, తిట్లు, శాపనార్థాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రత్యర్థుల భావాలను సానుభూతితో అర్థం చేసుకునే ప్రయత్నంగానీ, తమ వాదనను సాక్ష్యాధారాలతో హేతుబద్ధంగా వివరించి ఎక్కువ మందిని తమ మార్గంవైపు ఆకర్షింపజేసుకునే ప్రయత్నంగానీ మన సమాజంలో కొరవడుతున్నాయి. ఓ ప్రదర్శన అనగానే బంద్‌లు, హర్తాళ్లు, రాస్తారోకోలు బలవంతంగా ఇతరుల స్వేచ్ఛకు ఆటంకం కలిగించటం, ప్రజలకు ఎంత అసౌకర్యం కలిగిస్తే అంతగా తమ ప్రదర్శన విజయవంతమయిందనే తరహా ఆలోచనలు మనందరికీ అనుభవమే. అందుకే ప్రదర్శనలంటేనే జనం హడలిపోతున్నారు. ఇక పౌర సమాజానికి 'పార్టీ బయట ప్రజాభిప్రాయాన్ని కూడగట్టే చొరవగానీ, శక్తి గానీ కొరవడ్డాయి. ఆ కారణంగానే బహిరంగ చర్చ అంతా కొద్ది మంది పార్టీవాదుల సొంత వ్యవహారంగా కొనసాగుతోంది. పౌరసమాజం నిస్తేజంగా, నిద్రాణంగా ఉండి– బహిరంగ చర్చను అప్పటికే స్థిర అభిప్రాయాలను ఏర్పరచుకున్న పార్టీలకు వదిలివేస్తోంది. పార్టీలు చర్చలను తమ రాజకీయ ఎత్తుగడలలోనూ, అధికార క్రీడల్లోనూ, వ్యూహ ప్రతివ్యూహాల్లోనూ భాగంగా పరిగణిస్తున్నాయే తప్ప సమాజ హితాన్ని పెంపొందించే ప్రక్రియగా గుర్తించడం లేదు. అందుకే ఏ చిన్న సంఘటన జరిగినా, ఏ భేదాభిప్రాయం వచ్చినా చేసే మొదటి డిమాండ్ ఎన్నికైన ప్రభుత్వం రాజీనామా చేయాలని. నిజానికి ఎన్నికలు జరిగి కొత్త ప్రభుత్వం బాధ్యతలను చేపట్టిన వారం రోజులకే మన దేశంలో ఆ ప్రభుత్వం రాజీనామాకు ఆందోళనలు మొదలవుతాయి. ఒకసారి ప్రభుత్వం ఎన్నికయ్యాక, ఆ ప్రభుత్వానికి మన తరపున నిర్ణయాలు తీసుకునే బాధ్యత ఉందని, రాజ్యాంగ విలువలను, ప్రజాస్వామ్య ప్రమాణాలను పాటిస్తున్నంత కాలం కేవలం అభిప్రాయ భేదాల కారణంగా ఆ ప్రభుత్వాన్ని గద్దెదింపే ప్రయత్నం చేయటం ప్రజాస్వామ్యానికే ప్రమాదమని మన దేశంలోని పార్టీలు గుర్తించడం లేదు. అందుకే బహిరంగ చర్చలో రణగొణ ధ్వనులు, హింస, రాజకీయ ఎత్తుగడలు, 'త్వంశుఠ' అంటే 'త్వంశుఠం' అనే రీతిన పరస్పర దూషణలు చోటు చేసుకుంటున్నాయి.

పాశ్చాత్య దేశాలలో కనిపించే మరో విశిష్ట లక్షణం ప్రభుత్వ పక్షం ప్రదర్శించే సహనం. వీధుల్లో ప్రదర్శనల్ని భావ ప్రకటనను ప్రజల ప్రాథమిక హక్కుగా ఆ

దేశాల్లోని ప్రభుత్వాలు పూర్తిగా గుర్తించి గౌరవిస్తున్నాయి. జనమాధ్యమాల మీద ఒత్తిడి తెచ్చే ధోరణులుగాని అక్కడ కనిపించవు. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించే వారిపై నిఘా పెట్టడం, వారి ఫోన్లను ట్యాప్ చేసి సంభాషణలను రహస్యంగా, చట్ట వ్యతిరేకంగా వినటం, వారి పైకి పోలీసులను, నిఘా విభాగాలను ఉసిగొల్పటం– ఇవన్నీ ఆ సమాజాల్లో ఊహించటానికే అసాధ్యం. ఏ ప్రభుత్వమయినా అలా ప్రయత్నిస్తే, అది కుప్పకూలడం తథ్యం. మన దేశంలో రాజకీయ ప్రత్యర్థులకు, దేశ వ్యతిరేక శక్తులకు మధ్య తేడా లేనట్టుగా ప్రభుత్వాలు ప్రవర్తిస్తాయి. బలప్రయోగం చేసి అయినా సరే ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనలను నిరోధించటానికి అధికార యంత్రాంగం వెనుకాడదు. తమతో విభేదించిన వారినందరినీ దేశద్రోహులుగా పాశ్చాత్య ప్రభుత్వాలు చిత్రిస్తే అక్కడి ప్రజలందరి నుంచి, జనమాధ్యమాల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురవుతుంది. కాని మన దేశంలో ప్రత్యర్థులను దేశ ద్రోహులుగా, జాతి వినాకారులుగా, మీరజాఫర్‌లు, జయచంద్రులుగా చిత్రించటం, అవమానించటం, వారి దేశభక్తిని శంకించటం, భావాల మధ్య వైరుధ్యాలను గోరంతలు కొండంతలుగా చేయటం ఆనవాయితీ అయింది. మన రాజకీయాల్లో, బహిరంగ చర్చల్లో చోటుచేసుకుంటున్న విష పరిణామాలను చూడాలంటే ఎక్కడికో వెళ్ళనవసరం లేదు. చట్టసభల్లో సభ్యుల ప్రవర్తనను ఏ రోజయినా ఒక్కసారి పరికిస్తే చాలు మన రాజకీయాల పట్ల, బహిరంగ చర్చ పేరుతో జరిగే రాద్ధాంతం పట్ల వెగటు కలుగుతుంది. ఏ అంశాన్నయినా ప్రజాసంక్షేమం, దేశ ప్రయోజనాల రీత్యా విశ్లేషించటం కాక, పరనింద, ఆత్మస్తుతి, మొండితనం, హింసాత్మక ధోరణులు మనకు చట్టసభల్లో రోజూ దర్శనమిస్తాయి. ఈ ధోరణుల వల్ల జన సామాన్యంలో రాజకీయాల పట్ల రోత, ప్రజాస్వామ్యం పట్ల విసుగు పెరుగుతున్నాయి. ప్రజాస్వామ్యం అంటే శాంతియుతంగా మార్పును సాధించే ప్రక్రియ. ఆ విశ్వాసం ప్రజలకు కలిగినప్పుడే, ఆహ్వానించదగ్గ మార్పును సాధించగలిగినప్పుడే సమాజం ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తుంది. అలాకాక ప్రజాస్వామ్యమంటే నిరంతర అధికార క్రీడగా రూపాంతరం చెందితే ఆ వ్యవస్థ పట్ల ప్రజలకు ఆదరణ తగ్గుతుంది. ప్రజాస్వామ్యం ద్వారా అనుకున్న లక్ష్యాలను శాంతియుతంగా సాధించగలమనే నమ్మకం సడలినప్పుడు హింస ప్రజ్వరిల్లుతుంది. వ్యవస్థ నైతికత పట్ల విశ్వాసం కోల్పోయినప్పుడు అరాచకం పెచ్రేగుతుంది. చట్టబద్ధ పాలనకు చరమగీతం పాడాల్సి వస్తుంది.

## పరిణామ క్రమంలో పరిణతి

మన ప్రజాస్వామ్యంలో తలెత్తుతున్న అపశ్రుతుల పట్ల నిరాశ అక్కరలేదు. ప్రపంచంలో అన్ని ప్రజాస్వామ్యాలు ఎన్నో ఒడుదొడుకులకు లోనై పరిణతి చెందాయి. ఒకే రోజున ఆకస్మాత్తుగా అద్భుత ప్రజాస్వామ్య సృష్టి ఎక్కడా జరగలేదు. మన దేశంలో కూడా ప్రజలలో అక్షరజ్ఞానం, అవగాహన శక్తి పెరుగుతున్నాయి. ప్రపంచ దేశాలను చూసి మన సంస్థలు, వ్యవస్థ మరింత రాణించాలనే పట్టుదల పెరుగుతోంది. ప్రభుత్వం, ప్రజాస్వామ్యం ప్రజల జీవన స్థితిగతులు బాగుపడటం కోసం స్వేచ్ఛ వికసించటం కోసమేగాని కొద్ది మంది అందలాలెక్కటం కోసం కాదనే స్పృహ పెరుగుతోంది. అన్నింటినీ మించి అభిప్రాయ భేదాలు ఏ ఇద్దరి వ్యక్తుల మధ్యనైనా సహజమేనని, విభేదించిన వారంతా శత్రువులగా భావించటం అజ్ఞానమని, సామరస్యంగా బహిరంగ చర్చ జరగటం నాగరికతకు నిదర్శనమని, ఇతరులతో అంగీకరించనంత మాత్రాన వారి చిత్తశుద్ధిని శంకించటం అనాగరికమని, తిట్లతో, పరుష పదజాలంతో తమ వాదన బలహీనమవుతుందని, అరుపులు, పెడబొబ్బలు వాదనాపటిమకు చిహ్నం కాదని మనందరం గుర్తించటం సమాజ హితానికి, ప్రజాస్వామ్యానికి పరిణతికి అవసరం. మన అనుభవాన్నుంచి ఇతరుల ఆలోచనల నుంచి నేర్చుకుని పరిస్థితులను మార్చే శక్తి మనిషికున్న అపురూప వరం. దురుసుతనంతో, హింసతో, మూర్ఖత్వంతో నేర్చుకునే శక్తిని, శాంతియుతంగా వ్యవస్థను సంస్కరించే చేవను కోల్పోతే భావితరాలు ఇక్కట్లపాలవుతాయి.

* * *

# ఎన్నికల ప్రచారాంశాలు నినాదాలా, విధానాలా?

**మార్చి 16, 2004**

దేశమంతటా ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ప్రతి పక్ష నాయకురాలు సోనియా గాంధీ సుడిగాలి పర్యటనలు, ఉప ప్రధాన మంత్రి, బిజెపి అగ్ర నాయకుడు అద్వానీ చేపట్టిన 'భారత్ ఉదయ్ యాత్ర' చంద్రబాబు నాయుడు నిర్వహించిన విజయభేరి, శంఖారావం లాంటి భారీ సభలు– ఇవన్నీ రాజకీయ వాతావరణాన్ని వెడెక్కించాయి. లోక్‌సభకు ఇప్పుడు జరుగుతున్న ఎన్నికలు నూతన రాజకీయ ధోరణులకు నాంది పలుకుతున్నాయి.

అయిదు కీలకమయిన అంశాలు ఈ ఎన్నికల్లో ప్రజల ముందుకు వస్తున్నాయి. గత దశాబ్దంలో చోటు చేసుకున్న పరిణామాలు మన రాజకీయాలను అనూహ్యంగా మార్చివేశాయి. ఈ మార్పులను, భవితవ్యాన్ని ప్రభావితం చేసే అంశాలను క్షుణ్ణంగా పరిశీలించటం అవసరం. కుల, మతాల విద్వేషాలు, ఉద్రిక్తతల స్థానే ఆర్థికాభివృద్ధి ఈ ఎన్నికల్లో కీలకమైన అంశం కావడం అందులో మొదటిది. ఆర్థికాభివృద్ధి ప్రధాన అంశంగా ఎన్నికలు జరగనుండటం గడచిన నలభై ఏళ్ళలో ఇదే మొదటిసారి. యూనియన్ స్థాయిలో అధికారంలో ఉన్న ప్రభుత్వం తాను సాధించిన విజయాల ఆధారంగా ప్రజల విశ్వాసాన్ని మళ్ళీ చూరగొనాలని ప్రయత్నించటం 1962 ఎన్నికల తరువాత ఇదే మొదటిసారి. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డిఏ కూటమి తన పాలనలో సాధించిన అభివృద్ధిని ప్రస్తుత ఎన్నికల్లో ప్రధానాంశం చేయడం మన ప్రజాస్వామ్యానికి శుభప్రదం. ఇది మన రాజకీయాల పరిణతిని సూచిస్తోంది. ఎన్నో రంగాల్లో అభివృద్ధి సరిగ్గా జరగలేదన్నదీ, మన ఆర్థిక విధానాల్లో ప్రభుత్వ ప్రాథమ్యాలలో లోపాలున్నాయన్నదీ వాస్తవమే అయితే అభివృద్ధి మీద చర్చ జరగడం, రాజకీయాలను ఆర్థిక ప్రగతి ప్రభావితం చేయటం దేశ ప్రజలకు మేలు చేస్తుంది.

## ఆర్థిక వ్యవస్థ పటిష్టం

ఈ ఎన్నికల్లో ప్రజల ముందుకు వస్తున్న మరో కీలక అంశం ఆర్థిక సంస్కరణలు. 1996 నాటి ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వం నూతన ఆర్థిక విధానాలపై ఎన్నికల్లో ప్రజల తీర్పును కోరే సాహసం చేయలేకపోయింది. ఆ సంస్కరణలు మన ఆర్థిక వ్యవస్థ గతిని మార్చినా, ఆ మార్పు ప్రజలతో సంబంధం లేకుండా

జరిగింది. అలాకాక ఇప్పుడు ఎన్‌డిఎ ప్రభుత్వం స్వేచ్ఛాయుత ఆర్థిక విధానాలనూ, పోటీనీ, ప్రయివేటు ప్రపంచీకరణను సమర్థిస్తూ ఎన్నికల ప్రచారానికి సిద్ధపడింది. దేశ రాజకీయాల్లో ఇదో సాహసోపేతమైన నిర్ణయం. 1960ల నుంచి రెండు దశాబ్దాల పాటు మనం పాటించిన ఆర్థిక విధానాలు మన దేశాన్ని ఆర్థికంగా దెబ్బతీశాయి. చైనా 1978లోనే తన పాత విధానాలకు స్వస్తి చెప్పి ఆర్థిక సంస్కరణలను చేపట్టినా, మనం 1991 దాకా పాత పద్ధతుల్లోనే పట్టుకునే వేలాడుతూ వచ్చాం. ఆ తరువాత కూడా సంపదను సృష్టించడంపై సరైన ధ్యాస పెట్టకుండా అన్యమనస్కంగానే ఆర్థిక సరళీకరణను కొనసాగించాం. అయితే గడిచిన అయిదేళ్ళలో ఎన్‌డిఎ ప్రభుత్వం స్వేచ్ఛా వాణిజ్య విధానాలను నిస్సంకోచంగా అమలు చేసింది. నిజానికి 13వ లోక్‌సభ కాలంలో అత్యధికంగా చట్టాలు పార్లమెంటు ఆమోదాన్ని పొందాయి. ఎన్‌డిఎ, కాంగ్రెస్– ఈ రెండు పార్టీలూ కలిపికట్టుగా వ్యవహరించి నూతన ఆర్థిక విధానాలను సమర్థించాయి. ఆ కారణంగా టెలికాం, సమాచార సాంకేతిక రంగాలలోనూ, మౌలిక సదుపాయాల కల్పనలోనూ, దేశం మున్నెన్నడూ లేనంత ప్రగతిని సాధించింది. విద్యుత్ రంగం, విద్య, వ్యవసాయం, ఉపాధికల్పన వంటి రంగాల్లోనూ ఆరోగ్య సేవలందించటంలోనూ ఇప్పటికీ ఎన్నో లోపాలున్నాయి. అయినా మన ఆర్థిక వ్యవస్థ వేగంగా ఎదగటానికి కావలసిన పునాదులు పటిష్టమవుతున్నాయని, ప్రపంచపోటీని తట్టుకునే శక్తి పెరుగుతోందని చాలా మంది అభిప్రాయపడుతున్నారు.

ఎన్‌డిఎ తన ఆర్థిక విధానాలను ఈ ఎన్నికల్లో నిర్ద్వంద్వంగా ప్రచారాస్త్రాలుగా వినియోగించడం అసాధారణ పరిణామం. సాధారనంగా మన ప్రభుత్వ రంగంలోని ఆస్తుల ప్రయివేటీకరణను చాలా గోప్యంగా, పెద్ద హడావిడి లేకుండా చేపట్టడం సంప్రదాయం. ఇక ఎన్నికల సమయంలో ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాను ప్రజలకు, ప్రయివేటు సంస్థలకు అమ్మకానికి పెట్టడం మన ఊహించని పరిస్థితి. ఇక కార్మిక సంస్కరణల జోలికి పోయే సాహసాన్ని ఏ పార్టీ ఇంత వరకూ చేయలేదు. అలాంటిది బిజెపి, ఎన్‌డిఎలు నిర్మొహమాటంగా కార్మిక చట్టాలలో మార్పులు తెచ్చి ఎక్కువమందికి ఉపాధి లభించేలా చూసేందుకు కట్టుబడి ఉన్నామని ప్రకటించాయి. అంటే రేపు ఎన్నికల్లో ప్రజలు ఈ విధానాలకు మద్దతిస్తే సరళీకృత ఆర్థిక విధానాల విషయంలో సందిగ్ధం పూర్తిగా తొలగిపోతుంది. అభివృద్ధి చెందుతున్న ప్రజాస్వామ్య సమాజంలో ఇది ఓ మలుపు.

## సంకీర్ణానికి సుస్థిరత

ఈ ఎన్నికల వెనుకనున్న మరో కీలక అంశం సంకీర్ణ ప్రభుత్వాల సుస్థిరత. 1999 వరకు కాంగ్రెస్ పార్టీ తప్ప మరే రాజకీయ కూటమి దేశంలో సుస్థిర ప్రభుత్వాన్ని అందించలేకపోయింది. 1977-79 మధ్య జనతా పార్టీకి ప్రజలు మెజారిటీ కట్టబెట్టినా, అనతికాలంలోనే రాజకీయ అస్థిరత నెలకొంది. 1989-91 మధ్య కాంగ్రెసేతర ప్రభుత్వం ఏర్పడినా, కొద్ది కాలంలోనే రెండు ప్రభుత్వాలు పతనమయ్యాయి. 1996-98 మధ్య కాంగ్రెస్ మద్దతుతో ఏర్పడిన రెండు ప్రభుత్వాలు కొద్ది కాలం మాత్రమే మనగలిగాయి. ఈ నేపథ్యంలో అయిదేళ్ళ పాటు సుస్థిర పాలననందించిన తొలి కాంగ్రెసేతర ప్రభుత్వంగా ఎన్‌డిఎ చరిత్రలో నిలిచిపోయింది. ఒక రకంగా మన రాజకీయ పరిణితికి, పార్టీల సంయమనానికి ఇది నిదర్శనం. ప్రస్తుతం దేశ రాజకీయాల్లో ప్రధాన పాత్ర పోషిస్తున్న రెండు ప్రధాన పార్టీలు సంకీర్ణ ప్రభుత్వాలు అనివార్యమనే వాస్తవాన్ని గుర్తించాయి. ఒకప్పుడు ఏకపార్టీ పాలనతోనే తప్ప మరో రకంగా సుస్థిరత సాధ్యంకాదని భావించాం. ఒప్పుడు సుస్థిరతే కాకుండా, ఆర్థిక ప్రగతి కూడా సంకీర్ణాల ద్వారా సాధ్యమవుతుందని రుజువయింది. సంకీర్ణాలు అనివార్యం కావడంతో ఆర్థిక విధానాల విషయంలో అన్ని ప్రధాన పార్టీల మధ్య ఏకాభిప్రాయం సాధ్యమయింది. ఎన్నో భాషలు, కులాలు, ప్రాంతాలు, మతాలు సమజీవనం చేస్తున్న భారత్‌లో ఇలా సంకీర్ణాలు నిలదొక్కుకోవడం రాజకీయ సుస్థిరతకు, సమాజంలో సయోధ్యకు శ్రేయస్కరం. సంకీర్ణాల విషయంలో అనుభవంలేని కాంగ్రెస్ కూడా ఇతర పార్టీల సహకారంతో సుస్థిరత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ముందుకు వచ్చింది. పార్టీ భవిష్యత్తుకు సంకీర్ణాలు అవసరమని గుర్తించినందు వల్లే కాంగ్రెస్ ఈ నిర్ణయం తీసుకుందన్నది సుస్పష్టం. బిజెపితో జతకట్టటానికి చాలా పార్టీలు సిద్ధపడుతున్నాయంటే అందుకు కారణం- ఆ పార్టీ సంకీర్ణ ధర్మాన్ని పాటిస్తుందని, ఇతర పార్టీలను చిన్నచూపు చూడదని వాటికి నమ్మకం కుదరడమే. సంకీర్ణ ప్రభుత్వాలను నడిపిన అనుభవం లేకపోవడం వల్ల కాంగ్రెస్‌కు ఈ విషయంలో రాజకీయంగా అవరోధా లేర్పడుతున్నాయి. ఈ ఎన్నికలకు ముందే తేలిపోయిన మరో కీలకమైన అంశం కేంద్ర-రాష్ట్ర సంబంధాలు. మనది ఫెడరల్ వ్యవస్థ అని రాజ్యాంగంలో పేర్కొన్నా ఆచరణలో జాతీయ స్థాయిలో అధికారంలో ఉన్న పార్టీయే రాష్ట్రాల మీద పెత్తనం చెలాయించగలిగింది. 1996 నుంచి ప్రాంతీయ పార్టీల పాత్ర దేశ రాజకీయాల్లో పెరగడం వల్లను, 356 అధికరణం దురుపయోగాన్ని అరికడుతూ కోర్టులిచ్చిన

తీర్పుల వల్లను రాష్ట్రాల విషయంలో తలదూర్చి చికాకులు కల్పించే అవకాశం కేంద్ర ప్రభుత్వానికి చాలా వరకు లేకుండా పోయింది. దాంతోపాటు సంకీర్ణ ప్రభుత్వాలు అనివార్యం కావడంతో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ చాలా బాధ్యతతో, హుందాగా వ్యవహరించి ఫెడరల్ వ్యవస్తను పటిష్టపరిచింది. అందువల్లనే చాలా పార్టీలు ప్రస్తుతం ఎన్‌డిఎతో జతకట్టకపోయినా–ఎన్నికలయ్యాక తటస్థంగానో, లేదా ఎన్‌డిఎకి అనుకూలంగానో వ్యవహరించే అవకాశాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి.

ఈ ఎన్నికల్లో ప్రజల ముందుకు ప్రస్ఫుటంగా వస్తున్న మరో కీలక అంశం వంశపారంపర్య పాలన. స్వతంత్రం వచ్చిన నాటి నుంచి కాంగ్రెస్ పార్టీ చాలా వరకు నెహ్రూ కుటుంబీకుల నాయకత్వం మీదే ఆధారపడింది. 18 నెలల పాటు లాల్‌బహుదూర్ పాలనలో తప్ప 1991 వరకు ఆ పార్టీ–ఒకే కుటుంబం పెత్తనం కింద నడిచింది. రాజీవ్‌గాంధీ హత్యానంతరం 1991-96 మధ్య పి.వి. నరసింహారావుకు సోనియా మద్దతుతో అధికారం దక్కింది. మళ్ళీ 1997 నుంచి సోనియా నాకత్వం తప్ప వేరే గతిలేదని కాంగ్రెస్ భావించడంతో ఆ పార్టీలో మరోమారు ఏక కుటుంబ నాయకత్వం వారసత్వ రాజకీయాలు అనివార్యమయ్యాయి. ఇప్పుడు కాంగ్రెస్‌కు ఓ విచిత్ర సమస్య ఎదురవుతోంది. సోనియానో, ఆమె కుటుంబీకులో లేకపోతే కాంగ్రెస్‌లో ఐక్యత కొనసాగదని, అధికారం కోసం ఆ కుటుంబం మీదే ఆధారపడితే కాంగ్రెస్ ప్రజల మద్దతును కోల్పోతోందని, అధికారాన్ని పొందటం దుర్లభమని ఆందోళన చెందుతున్నారు. 'ముందు చూస్తే నుయ్యి, వెనుక చూస్తే గొయ్యి'లా ఉంది ప్రస్తుతం కాంగ్రెస్ పరిస్థితి..! కుటుంబ పాలనను దేశ ప్రజల్లో అత్యధికులు వ్యతిరేకిస్తున్నట్లు స్పష్టమవుతోంది. పార్టీలో ఐక్యతను కాపాడుకుంటూ, ప్రజాస్వామ్యయుతమైన నాయకత్వాన్ని ప్రతిష్టించటం మీద కాంగ్రెస్ పార్టీ మనుగడ చాలా వరకు ఆధారపడి ఉంటుంది. ఈ సారి ఎన్నికల సందర్భంగా కీకలమైన అయిదు అంశాల్లో కనిపిస్తున్న ప్రగతి మన ప్రజాస్వామ్యం మరింత బలపడుతోందనడానికి నిరద్శనం. మనం కొన్ని గణనీయమైన ఫలితాలను సాధించినా, జాతి ముందు మరెన్నో సవాళ్లున్నాయి. అయితే త్వరలో జరగనున్న ఎన్నికలు నిస్సందేహంగా జాతి ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి. మన రాజకీయాలను మరింత సుసంపన్నం చేస్తాయి. పార్టీల జయాపజాలతో నిమిత్తం లేకుండా, ఈ పరిణామాలు జాతికి శుభసూచకాలనడం నిర్వివాదం.

* * *

# అధికారం కోసం సృష్టిస్తున్న అయోమయమిది!

ఏప్రిల్16, 2001

మద్రాసు హైకోర్టులో జయలలిత పెట్టుకున్న దరఖాస్తుపై జస్టిస్ మలాయ్ సుబ్రమణ్యన్ చేసిన వ్యాఖ్యలు సందిగ్ధానికి దారితీశాయి. టాన్సీ భూముల కుంభకోణంలో జయలలిత అవినీతికి పాల్పడ్డారని నిర్ధారిస్తూ ప్రత్యేక కోర్టు గతంలో తీర్పునిచ్చింది. జయలలిత రెండు నేరాలకు పాల్పడినట్లుగా న్యాయస్థానం తీర్పునిచ్చి, అవినీతి నిరోధక చట్టం కింద ఆమెకు ఒక కేసులో రెండేళ్ళు, మరో కేసులో మూడేళ్ళు శిక్ష విధించింది. అయినా తాను హైకోర్టుకు అప్పీలు చేసుకున్న కారణంగా ఎన్నికలలో పోటీ చేసే అవకాశం ఉండాలని జయలలిత వాదన.

## అనర్హతపై విస్పష్ట చట్టం

1951వ సంవత్సరపు ప్రజా ప్రాతనిధ్య చట్టంలో సెక్షన్ 8(1) ప్రకారం అవినీతికి పాల్పడ్డవాళ్ళు ఆరు సంవత్సరాల పాటు ఎన్నికలలో పోటీకి అనర్హులు. అదే చట్టంలో సెక్షన్8(2) ప్రకారం నిత్యావసర వస్తువుల చట్టాన్ని ఉల్లంఘించినందుకు శిక్ష పడ్డవాళ్ళు, ఆహారం కల్తీకి పాల్పడ్డ వాళ్ళు, వరకట్న నిషేధ చట్టం, లేదా సతీసహగమన నిరోధ చట్టాన్ని ఉల్లంఘించిన వాళ్ళు దోషులుగా రుజువై, వారికి ఆరు నెలలకు తగ్గకుండా జైలు శిక్ష పడితే వాళ్ళు ఆనాటి నుంచి శిక్షా కాలం పూర్తయ్యాక ఆరు సంవత్సరాలు పాటు ఎన్నికలలో పోటీ చేయరాదు. సెక్షన్ 8(3) ప్రకారం ప్రజాప్రాతినిధ్య చట్టంలో నిర్దేశించిన నేరాలు కాక మరే నేరమైనా రుజువై రెండేళ్ళకు తగ్గకుండా శిక్షపడితే తీర్పు వచ్చిన నాటి నుంచి శిక్ష పూర్తయ్యాక ఆరేళ్ళపాటు ఎన్నికలలో పోటీకి అనర్హులు. సెక్షన్ 8(4) ప్రకారం ఆయా నేరాలు చేసినట్టుగా న్యాయస్థానం తీర్పునిచ్చే నాటికి నేరస్తుడు పార్లమెంటులో కాని రాష్ట్ర శాసనసభలోగాని సభ్యుడయితే, తీర్పునిచ్చాక 90 రోజులు దాటాకగాని పోటీకి అనర్హత అమలు కాదు. ఈ లోగా హైకోర్టుకు నేరస్తుడు అప్పీలు చేసుకున్నటయితే విచారణ పూర్తయి తీర్పు వచ్చేదాకా ఎన్నికలలో పోటీకి అర్హులే. ప్రజా ప్రాతినిధ్య చట్టం చాలా స్పష్టంగా, నిర్దిష్టంగా ఏయే నేరాలకు పాల్పడితే ఎంత కాలం పోటీకి అనర్హులో నిర్దేశించింది.

1977 దాకా 8(4) సెక్షన్‌లో చట్టసభల సభ్యులకు తాత్కాలికంగా ఇచ్చిన మినహాయింపును ఎన్నికల అధికారులు అందరూ అభ్యర్థులకు చట్టవిరుద్ధంగా వర్తింపజేశారు. చట్టసభకు ఓ సభ్యుడు ఎన్నికయ్యాక అతణ్ని నేరస్థుడిగా నిర్ధారిస్తూ ఏదైనా కేసులో తీర్పు వస్తే వెంటనే అనర్హుణ్ని చేయటం వల్ల కొన్ని ఇబ్బందులున్నాయి. చట్టసభలో ఆ సభ్యుడి స్థానం ఖాళీ అయి మళ్ళీ ఉప ఎన్నిక జరగాల్సి వస్తుంది. అందుకు ఎంతో ఖర్చు సమయం అవసరం కావటమే కాక రాజకీయ అనిశ్చితి కూడా ఏర్పడే అవకాశం ఉంది. తీరా ఉపఎన్నిక జరిగాక ఆ వ్యక్తి అప్పీలులో గెలిచి అతని మీద కింది కోర్టు ఇచ్చిన తీర్పు రద్దయితే అనవసరంగా బోలెడంత హైరానా, అందుకే కేవలం చట్టసభల సభ్యులుగా ఉన్న వాళ్ళకు మాత్రం తాత్కాలికంగా అప్పీలు విచారణ పూర్తయి హైకోర్టు తీర్పు వచ్చేదాకా మినహాయింపును చట్టంలోనే ఇచ్చారు. ఎన్నికలలో పోటీకి అనర్హురాలవుతానన్న భయంతో తనకు వేసిన శిక్షను నిలుపుదల చేయమని జయలలిత కోర్టును అభ్యర్థించడంతో ప్రస్తుతం వివాదం మొదలయింది. ఇప్పటికే అప్పీలును విచారణకు స్వీకరించి హైకోర్టు ఆమె మీద ఇచ్చిన తీర్పును తాత్కాలికంగా నిలుపుదల చేసింది. తీర్పు అమలు కానప్పుడు ప్రస్తుతానికి శిక్ష కూడా అమలు కాదు. ప్రత్యేకంగా శిక్షను నిలుపుదల చేస్తే ఆ వంకతో ఎన్నికల పోటీకి అనర్హత నుంచి తప్పు కోవచ్చుని, ఆలా పోటీ చేసి గెలిచి మళ్ళీ ముఖ్యమంత్రి పదవిని మరోమారు చేజిక్కించుకోవచ్చని ఆమె ఆశ. చట్టం చాలా స్పష్టంగా ఉంది. చట్టానికి కావలసింది అవినీతికి పాల్పడి నేరం చేశారనే రుజువు మాత్రమే. అది జురువై తీర్ప వెలువడ్డాక అప్రయత్నంగా ఆరు సంవత్సరాలపాటు పోటీకి అనర్హులౌతారు. ఈ అర్హతకు అసలు శిక్షతో నిమిత్తమే లేదు. సెక్షన్8(2)లో పేర్కొన్న నేరాలకు మాత్రం 6 నెలలు శిక్ష పడితే ఈ అనర్హత అమలవుతుంది. ఇతర నేరాలకు రెండేళ్ళకు మించి శిక్షపడితే ఆ పోటీకి అనర్హులవుతారు. తీర్పు వచ్చినప్పుడు చట్ట సభ్యులయితే మాత్రం 90 రోజులులోగా అప్పీలు చేసుకుంటే, తుది నిర్ణయం వచ్చేదాకా అనర్హత ఉండదు. అరటి పండు వలిచినట్లుగా ఇంత స్పష్టంగా చట్టం ఉన్నప్పటికీ గత కొద్ది వారాలుగా అనవసరమయిన సందిగ్ధత నెలకొంది. కొందరు న్యాయవాదులు, మాజీ న్యాయమూర్తులు విషయాన్ని గందరగోళం చేసి, వాస్తవాలను దాచిపెట్టి, చట్టాన్ని వక్రీకరించి, ఏదో ఒక విధంగా జయలలిత నామినేషన్ పత్రాన్ని అంగీకరింపజేయాలని విశ్వప్రయత్నం చేస్తున్నట్లుగా కనిపిస్తోంది. అందుకే అవినీతి కేసులలో శిక్షాకాలానికి, పోటీకి అనర్హత చట్టానికి మధ్య ఏదో ఒక విధంగా

సంబంధాన్ని సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. ఇలా లంకె వేస్తే ఎలాగోలా జయలలిత నామినేషన్‌ను అంగీకరిస్తారని వారి అంచనా. అలాగే చట్టం ప్రకారం కేవలం తీర్పు వచ్చినప్పుడే చట్ట సభల సభ్యులుగా ఉన్నవారికి మాత్రమే కేసు అప్పీలు హైకోర్టులో విచారణలో ఉన్నప్పుడు అనర్హత వర్తించదనే సౌకర్యం ఉన్నా తీర్పు వచ్చేనాటికి శాసనసభ్యురాలు కాని జయలలితకు కూడా ఈ చట్టంలోని లొసుగు ఉపయోగపడాలని వారి సంకల్పం. 1997 వరకు ఎన్నికల అధికారులు ఈ మినహాయింపును అందరు అభ్యర్థులకూ వర్తింపజేస్తూ వచ్చారు. కాని నాలుగేళ్ళ క్రితం ఎన్నికల సంఘం చట్టాన్ని ఉటంకిస్తూ అలా చేయరాదని, చట్ట సభల సభ్యులు కాని వారిని కోర్టులు దోషులుగా నిర్ధారిస్తే వారిని అనర్హులుగా గుర్తించి నామినేషన్లను తిరస్కరించాలని ఆదేశించింది. ఈ నేపత్యంలో జయలలిత పెట్టుకున్న దరఖాస్తును ఒకపక్క తిరస్కరిస్తూనే హైకోర్టు న్యాయమూర్తి చేసిన కొన్ని వ్యాఖ్యలు అనవసరంగా అయోమయానికి దారితీశాయి. చట్టం ప్రకారం అవినీతి అభియోగాలు రుజువైనట్లు తీర్పు వస్తే పోటీకి అనర్హులని స్పష్టంగా ఉంటే, తీర్పుకంటే శిక్ష ముఖ్యమని, తీర్పుపై 'స్టే' మంజూరు చేశారు కాబట్టి శిక్ష కూడా ఆగిపోయినట్లేనని న్యాయమూర్తి వ్యాఖ్యానించటం విడ్డూరం. ఆపైన సుప్రీంకోర్టు వేరే సందర్భంలో చెప్పిన మాటలను అసందర్భంగా హైకోర్టు ఉటంకిస్తోంది. మరోకేసులో సుప్రీంకోర్టు తీర్పు చెబుతూ, క్రిమినల్ కేసులలో సహజంగానే అప్పీలు విచారణ పూర్తయ్యే వరకు అతణ్ని నిర్దోషిగానే పరిగణించాలని పేర్కొంది. అది కేవలం నేరస్మృతి ప్రకారం చేసిన వ్యాఖ్య. కాని పౌర సంబంధమయిన సివిల్ విషయాలలో కూడా అది వర్తిస్తుందని పేర్కొనటం విచిత్రం. అంతటితో ఆగక జయలలిత తరపున న్యాయవాది ఆమెకు పోటీ చేసే అవకాశం లేకపోతే పూరించలేని నష్టం జరుగుతుందని చేసిన వాదనను న్యాయమూర్తి తిరస్కరించకుండా ఆమోదించినట్లు కనిపిస్తోంది. ఎన్నికలలో పోటీ చేసే హక్కు ప్రాథమిక హక్కు కాదు. ఓ శాసన సభ్యుడిగా మంత్రిగా, ముఖ్యమంత్రిగా పదవిని చేపట్టటం ఎవరికీ హక్కు కాదు. పోటీ కేవలం ప్రజాస్వామ్య హక్కు మాత్రమే. ఆ హక్కు పరిధులకు నిర్వచించేటప్పుడు రెండు విరుద్ధమైన అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. ప్రజలకు ప్రాతినిధ్యం వహించే ఓ వ్యక్తిత హక్కు, మంచి వ్యక్తులను మాత్రమే ప్రతినిధులుగా ఎంచుకునే ప్రజల హక్కు– ఈ రెండింటి మధ్య సంఘర్షణ చెలరేగుతుంది. అలాంటప్పుడు సమాజహితం వ్యక్తి హక్కు కంటే ముఖ్యమవుతుంది. ఈ సంఘర్షణలో సమాజం హక్కుదే పైచేయి అవుతుంది. ఇది అర్థం చేసుకోవటానికి గొప్ప పాండిత్యం

అక్కరలేదు. కాస్తంత ఇంగిత జ్ఞానం, కొంచెం ప్రజాస్వామ్య దృక్పథం ఉంటే చాలు. ఇవి చాలదన్నట్లు న్యాయమూర్తి మరో వ్యాఖ్య చేశారు. జయలలిత ఓ ప్రధాన రాజకీయ పార్టీకి అధ్యక్షురాలు కాబట్టి, ఆమె తమిళనాడు ఎన్నికలలో అధికారం కోసం పోటీ పడుతున్న ఓ బలమైన కూటమి నాయకురాలు కాబట్టి ఆమెను అనర్హురాలిగా ప్రకటించరాదనే భావాన్ని న్యాయమూర్తి ప్రకటించారు. ఈ వాదన ప్రకారం మన ప్రజాస్వామ్యంలో పలుకుబడి గలవాళ్ళకు ఒక రకమయిన చట్టం, సామాన్యులకు మరో రకమయిన చట్టం వర్తించాలన్న మాట! రాగద్వేషాలకు పక్షపాతాలకు అతీతంగా పౌరులందరిని చట్టానికి బద్ధులుగా భావించే సంస్థ న్యాయస్థానం. అలాంటి న్యాయస్థానమే చట్టబద్ధ పాలనను కించపరుస్తూ కొందరు వ్యక్తులు చట్టాలకు అతీతమనే భావాన్ని పరోక్షంగానైనా బలపరచడం అత్యంత దురదృష్టకరం. గుడ్డిలో మెల్ల ఏమంటే ఇలాంటి వ్యాఖ్యలు చేసినా చివరికి న్యాయస్థానం ఈ కేసులో జోక్యం చేసుకోవటానికి తిరస్కరించింది. ఇప్పుడీ అంశం సుప్రీం కోర్టుకో, ఎన్నికల సంఘానికో వెళుతుంది. ఈ పవిత్ర రాజ్యాంగ సంస్థలు ప్రజాస్వామ్యాన్ని, స్వచ్ఛమయిన రాజకీయాన్ని, నిజాయితీని, చట్టబద్ధ పాలనను కాపాడుతూ సముచిత నిర్ణయం తీసుకుంటాయని ఆశిద్దాం

## చర్చ జరగాల్సింది దేనిమీద?

ఇప్పుడు జరగవలసిన చర్చ అవినీతి కేసుల్లో దోషులుగా రుజువయిన వాళ్ళు పోటీకి అర్హులా, అనర్హులా అని కాదు. కోర్టులో ప్రాథమిక విచారణ తరువాత నేరారోపణ జరిగిన అనంతరం తీర్పు వచ్చేలోగా అలాంటి వాళ్ళు పోటీకి అర్హులా, కాదా అనే అంశం మీద అసలు చర్చ జరగాలి. ప్రస్తుత చట్టం ప్రకారం సాక్షాత్తూ ఇందిరాగాంధీనో, రాజీవ్‌గాంధీనో హత్య చేసిన వాళ్ళు కూడా కోర్టులో తీర్పు వచ్చిన శిక్ష పడేదాకా పోటీకి అర్హులు! అంటే 1991 నుంచి 1998 దాకా ఏడేళ్ళ పాటు అంతటి 'నరహంతకులు' కూడా మన ప్రజాస్వామ్య వ్యవస్థ ఏ అడ్డంకీ లేకుండా పోటీ చేయవచ్చు! నాగరిక సమాజంలో ఇంతకన్నా మరో దారుణం లేదు. అలాంటిది హైకోర్టు అభిప్రాయాల ప్రకారం జయలలిత వాదన ప్రకారం, అలా హత్య చేసిన వాళ్ళు దోషులని న్యాయస్థానంలో రుజువయినా, హైకోర్టుకు అప్పీలు చేసుకుంటే తీర్పు వచ్చే దాకా పోటీ చేసేవీలుంది. రాజకీయ పార్టీలు, నేతలు రోజూ నీతి నిజాయితీని గూర్చి ఊకదంపుడు ఉపన్యాసాలు చేస్తున్నారు. అవినీతిని

అంతమొందించాలని, ఎన్నికల నిర్వహణను సమూలంగా ప్రక్షాళించాలని ఊరదగొడుతున్నట్లు రుజువయిన వాళ్ళు పోటీకి అర్హులని వాదించటం ప్రజాస్వామ్యం విలువల పతనాన్ని సూచిస్తోంది. ఇప్పటికే మన ప్రజాస్వామ్యానికి తూట్లు పడ్డాయి. ఈ పార్టీల నిర్వాకమా అని ప్రజలలో వ్యవస్థ పట్ల తీవ్రమయిన నిరసన వ్యక్తమవుతోంది. ప్రజలలో మార్పు కావాలనే కాంక్ష ప్రబలంగా ఉంది. ఇంకా తాత్సారం చేయకుండా ఎన్నికలలో నేరచరితుల ప్రవేశాన్ని నిషేధిస్తూ నిజాయితీపరులు ధర్మ మార్గాన్ని ఎన్నికయ్యేలా ప్రక్షాళన చేస్తూ మౌలిక సంస్కరణలు చేపట్టాలి. సమయం మించితే అది మన స్వేచ్ఛకు స్వపరిపాలనకు గొడ్డలిపెట్టవుతుంది. విషబీజాల నుంచి అమృత ఫలాలు రావు. అక్రమ ఎన్నికల ద్వారా మంచి ప్రభుత్వాలు, సుపరిపాలన అసాధ్యం.

* * *

# ఓటర్లకు స్వేచ్ఛలేని ఎన్నికలతో ఒరిగేదేమిటి?

**ఏప్రిల్ 5, 2004**

ఈ ఎన్నికల్లో మున్నెన్నడూ లేనంతగా పార్టీ ఫిరాయింపులను చూస్తున్నాం. ముఖ్యంగా లోక్‌సభ ఎన్నికలతోపాటు శాసన సభ ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాలలో ఈ కప్పదాటు రాజకీయాలు మరీ మితిమీరిపోయాయి. 97వ రాజ్యాంగ సవరణను కొంత కాలం క్రితమే మన పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించగా, అది రాష్ట్రపతి ఆమోదంతో చట్టమైంది. దాని ప్రకారం ఎన్నికయిన చట్టసభ సభ్యులు పార్టీ ఆదేశాన్ని ధిక్కరించి సభలో ఓటు వేస్తే వారందరి పదవులు పోతాయి. గతంలో 52వ సవరణ చేపట్టినప్పుడు, సభాపక్షంలో మూడోవంతుకు మించి సభ్యులు విప్‌ని ధిక్కరిస్తే వారిని చిలిక పార్టీగా గుర్తించే ఏర్పాటు చేశారు. దాని వల్ల ఒకరిద్దరు పార్టీని ఫిరాయిస్తే వారిని సభ్యత్వం రద్దుకాగా, మూకుమ్మడిగా ఫిరాయిస్తే అధికారం, హోదా లభిస్తూ వచ్చాయి. ఇటీవల తెచ్చిన రాజ్యాంగ సవరణ పార్టీలలో ఆ విధమైన 'చీలిక'ను గుర్తించకుండా కట్టుదిట్టాలు చేసింది. అయితే అదంతా ఇప్పుడు వర్తించదు. ఎన్నికలకు ముందు ఫిరాయింపులను ఏ చట్టమూ ఆపలేదు. విధిగా ఫలానా పార్టీలోనే కొనసాగాలని ఏ పౌరుడినీ నిర్బంధించలేం. అలాంటి చట్టమేమయినా చేస్తే అది తమకిష్టమయిన సంఘాలను ఏర్పరచటానికి, ఇష్టం వచ్చిన వారితో కలిసి పని చేయటానికి గల స్వేచ్ఛకు అవరోధమవుతోంది. అలాంటి నిబంధన రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులకు వ్యతిరేకం కాబట్టి చెల్లదు. అయితే చట్టంతో, రాజ్యాంగంతో నిమిత్తం లేకుండా ఇలా పార్టీ ఫిరాయింపులకు పాల్పడటం సిగ్గుచేటని మనందరికీ అనిపిస్తుంది. ఓ వంక పౌరుల స్వేచ్ఛను అరికట్టకుండా, మరో వంక ఈ ఆయారాం-గయారాం రాజకీయాలకు స్వస్తి చెప్పటమెలా?

## కొనసాగుతున్న గుత్తాధికారం

ఇదే సమస్యను మరో కోణంలో నుంచి చూడవచ్చు. 1991లో చేపట్టిన ఆర్థిక సంస్కరణలు అంతక్రితం లైసెన్సు-పర్మిట్, కోటా రాజ్యంలో హరించి వేసిన వ్యక్తి స్వేచ్ఛను పునరుద్ధరించటానికి ఉద్దేశించినవి. ఆనాటి వరకు ఏ వ్యాపారం చేయాలన్నా, పరిశ్రమను స్థాపించాలన్నా ఎన్నో చట్టపరమయిన ప్రతిబంధకాలు ఉండేవి. ఆ విధంగా కొద్ది మందికి లైసెన్సులు పేరిట గుత్తాధిపత్యాన్ని కట్టబెట్టారు.

1991లో ఆ విధమైన కృత్రిమ అడ్డగోడలను తొలగించారు. అలాగే వినియోగదారులకు మార్కెట్టులో వస్తువులు ఎంచుకునే అవకాశం కూడా లేదు. గుత్తాధికారం ఉన్న పరిశ్రమ లేదా వ్యాపారస్తుడు అమ్మిన వస్తువులను వాళ్ళు చెప్పిన ధరకు కొనుక్కోవటం తప్ప గత్యంతరం ఉండేదికాదు. పోటీ లేకపోవడం వల్ల కోట్ల మంది సామాన్యులు అధిక ధరలకు నాసిరకం ఉత్పత్తులను కొని నిట్టూర్చాల్సి వచ్చేది. అలాంటి దోపిడీని, దివాలాకోరు విధానాలను అంతం చేయటానికి 1991లో ఆర్థిక సంస్కరణల పేరుతో అంకురార్పణ జరిగింది. దాని పర్యవసానంగా గుత్తాధిపత్యం పోయి పోటీ పెరిగింది. పలుకుబడి, రాజకీయ అండలేని ఎందరో పరిశ్రమలను పెట్టుకుని ఉత్పత్తి చేయటం సాధ్యమయింది. వినియోగదారులకు వివిధ ఉత్పత్తుల మధ్య నచ్చిన వాటిని ఎంచుకునే అవకాశం కలిగింది. నాణ్యత పెరిగి ధరలు అదుపులోకి వచ్చాయి. పరిశ్రమల సామర్థ్యం, ఉత్పాదకత పెరిగాయి. ప్రపంచ పోటీలో కూడా క్రమక్రమంగా నిలదొక్కుకోగలుగుతున్నాం. కాని మన రాజకీయంలో మాత్రం ఇకా పలుకుబడిలేనివాళ్ళు బలమైన అభ్యర్థులుగా మన ముందుకు వచ్చే అవకాశం లేదు. చిత్తశుద్ధి, సామర్థ్యం ఉన్నా, ప్రజలకు సరయిన సేవలందించే శక్తి ఉన్నా, సమాజానికి పనికొచ్చే భావాలు, విధానాలు, ఆలోచనలు ఉన్నా, వారికి నేటి రాజకీయంలో స్థానం లేదు. కొందరి గుత్తాధిపత్యం నేటికీ అలానే కొనసాగుతోంది. పౌరులకు సమర్థులయిన ప్రతినిధులను ఎంచుకునే స్వేచ్ఛ లేకుండాపోయింది. రాజకీయంలో స్వేచ్ఛ అంటే పార్టీలను ఇష్టం వచ్చినట్లు ఫిరాయించే హక్కుగా మనం భావించలేం. చాలా ఫిరాయింపులు కేవలం వ్యక్తిగత ప్రయోజనాల కోసం, పదవుల కోసం జరిగేవే కాని ఓటర్లకు ఎంపిక చేసుకునే స్వేచ్ఛను పెంచటానికి ఉద్దేశించినవి కావు. నిజానికి నేడు ప్రధాన పార్టీలన్నీ ఒకే మూసలో ఉన్నాయి. అన్నీ ఒకే తానులో ముక్కలే. ప్రతిపార్టీ నేతలూ తాము ఇతర పార్టీలకన్నా విభిన్నమైన వారమని కనిపించటానికి చాలా తాపత్రయపడుతున్నారు. అందు కోసం వాక్బాణాలను సంధిస్తున్నారు. కొత్త నినాదాలను లేవనెత్తుతున్నారు. కాని వాస్తవానికి అన్ని పార్టీలూ ఒకేరీతిలో నడుస్తున్నాయి. అందుకే ఎన్నిక 'స్వేచ్ఛగా' 'న్యాయంగా' జరిగినా, ఓటుర్లుగా మనం మోసోతున్నామనే భావం కలుగుతోంది. ప్రజలకు నిజమైన ప్రత్యామ్నాయాలు కరువయ్యాయి. అలాగే రాజకీయవాదులు ఎప్పటికప్పుడు గోడదాటి పార్టీలు ఫిరాయిస్తున్నారు. అదేమంటే అన్ని పార్టీలు ఒకే రకంగా ఉన్నాయి కదా అని వాదిస్తున్నారు. నిజానికి జండా, నాయకుల పేర్లు, పార్టీ ఎన్నికల చిహ్నాం మినహాయిస్తే, వివిధ పార్టీల మధ్య గుర్తించదగ్గ తేడాయే లేకుండా పోతోంది. ఏ రోజున, ఎవరు,

ఏ పార్టీలో దర్శనమిస్తారో ఊహించటం కూడా అసాధ్యమయిపోతోంది. ఓ పార్టీలో అగ్రనాయత్వం తప్ప, ఎవరయినా, ఎప్పుడయినా పార్టీలు మారవచ్చు. కొన్ని సందర్భాల్లో అగ్రనాయకులు కూడా సులువుగా పార్టీ మార్చేశారు. 1980లో భజన్‌లాల్ హర్యానా ముఖ్యమంత్రిగా ఉంటూనే తన రాష్ట్రంలో జనతా పార్టీ మొత్తంతో సహా కాంగ్రెస్‌లో కలసిపోయారు! అలాగే 1991లో గుజరాత్‌లో చిమన్‌భాయ్‌పటేల్ జనతాదళ్ ముఖ్యమంత్రిగా ఉంటూనే, తన మొత్తం పార్టీ సభ్యులతో కాంగ్రెస్‌లో చేరిపోయారు! పార్టీలను మార్చటం షేరు మార్కెట్‌లో ఓ కంపెనీ వాటాలు అమ్మేసి మరో కంపెనీ షేర్లు కొనుక్కోవటమంత సులువయిపోయింది. కేవలం ఈ లావాదేవీల వల్ల వచ్చే లాభం, తాత్కాలిక లబ్ధి మాత్రమే ప్రధానమయిన అంశాలు. అయితే పౌరులుగా మనం రాజకీయాలలో కోరుకునేది ఇలాంటి 'పోటీ', 'స్వేచ్ఛ' కాదు. అలాంటప్పుడు 'స్వేచ్ఛ, పోటీ పౌరులకు ఎంచుకునే అవకాశం– వీటిని సిద్ధాంతాలు, నీతి నియమాలు, ప్రజా సంక్షేమంతో సంధానించటం ఎలా? మనం గౌరవించి, విశ్వసించే రాజకీయ వ్యవస్థను నిర్మించాలంటే ఈ ప్రశ్నకు సమాధానాన్ని వెదకాలి. ప్రజలకు ఎంచుకోటానికి సరయిన అవకాశాన్ని ఇవ్వటం ఎలా? నిజమయిన పోటీని, భావ సంఘర్షణను పెంచటం ఎలా? సమర్థులకు, సచ్ఛీలురకు నాయకత్వ అవకాశాల్ని కల్పించటం ఎలా? రాజకీయ రంగంలో స్వేచ్ఛను విస్తరించటం ఎలా?

## నిజమైన ప్రజాస్వామ్యం

## ఇందుకు నాలుగు మార్గాలున్నాయి.

మొదటిది : రాజకీయ పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యం కావాలి. ప్రస్తుతం వివిధ నియోజకవర్గాల్లో పార్టీ అభ్యర్థుల ఎంపిక పూర్తిగా ఆ పార్టీ అగ్ర నాయకత్వ నిర్ణయం మీద ఆధారపడి ఉంది. చాలా పార్టీల్లో అసలు పార్టీ నాయకత్వమే ఎన్నికలు లేకుండా కేవలం నామినేషన్ల ద్వారా అధికారం చేపట్టింది. గతంలో ఒక పరిశీలకుడన్నట్లు, మన దేశంలో బలవంతంగా కిరీటాన్ని లాక్కుని తన నెత్తిమీద పెట్టుకున్నవాడే రాజు! ఆ తరువాత అతడికి ఎదురుండదు. ఇలాంటి నిరంకుశ సంస్కృతిలో పార్టీ సభ్యులు కేవలం పల్లకీలను మోసే బోయిలుగా మారిపోయారు. తన నియోజకవర్గంలో తమ పార్టీ తరపున అభ్యర్థులెవరో ఎంచుకునే హక్కు సభ్యులకు లేదు. పైవాళ్ళు ఎవర్ని తమ నెత్తిని రుద్దితే వాళ్ళే తమ నాయకులు! అభ్యర్థిత్వాన్ని ఆశించే వారి మధ్య ఆరోగ్యకరమైన పోటీ లేకుండా పోవడంతో, నాయకత్వం ఎదిగే అవకాశం లేదు. తమ సిద్ధాంతాలను ప్రజలముందు పెట్టి మన సమాజం

ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారాలను అన్వేషించే సంప్రదాయం గాలికెగిరిపోయింది. ఇటీవలే అమెరికాలో అధ్యక్ష పదవికి డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థిని నిర్ణయించటానికి జరిగిన ప్రాథమిక ఎన్నికలను చూస్తే ఈ తేడా స్పష్టమవుతుంది. ఆ దేశంలో కొన్ని నెలలపాటు బహిరంగంగా, పారదర్శకంగా, స్వేచ్ఛగా అన్ని రాష్ట్రాలలోనూ అభ్యర్థి ఎంపిక కోసం పార్టీ సభ్యుల నిర్ణయం ప్రకారమే చివరికి అభ్యర్థి నిర్ణయం ఖరారు అయింది. పార్టీ నాయకుల ప్రమేయం కాని, పెత్తందార్ల ఒత్తిడి కాని లేవు. మార్చిలో 'సూపర్ ట్యూస్‌డే' పేరుతో పది పెద్ద రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో బ్యాలట్లను లెక్కించే వరకు అభ్యర్థి ఎవరో ఎవరికి తెలియదు. ప్రాథమిక ఎన్నికల్లో వివిధ దశలలో హోవర్డ్‌డీన్, కాన్ ఎడ్వర్డ్స్, జో లిబర్‌మన్, డిక్ గెఫార్డ్, వెస్లీక్లార్క్ – అందరికీ ఎన్నికయ్యే అవకాశాలు వచ్చాయి. చివరికి అధిక సంఖ్యా సభ్యుల మద్దతుతో జాన్ కెర్రీ అభ్యర్థిగా ఎన్నికయ్యారు. అదీ పార్టీలలో నిజమైన అంతర్గత ప్రజాస్వామ్యం అంటే.

రెండవది : రాష్ట్ర, యూనియన్ స్థాయిలలోని గుత్తాధిపత్యం, అధికార కేంద్రీకరణ అంతం కావాలి. స్థానిక ప్రభుత్వాలకు నిజమైన అధికారాలను, బాధ్యతను అప్పగిస్తే, ప్రజలకు నిజంగా సమర్థులను ఎంచుకునే అవకాశం లభిస్తుంది. పార్టీ కార్యకర్తలకు సరయిన అవకాశాలు పుష్కలంగా దొరుకుతాయి. ప్రస్తుతం యూనియన్, రాష్ట్రాల స్థాయిల్లో కేవలం 5000 మంది చట్టసభ సభ్యులను మాత్రమే దేశమంతటా ప్రజలు ఎన్నుకుంటున్నారు. ఈ పదవులు మాత్రమే కీలకం కావడంతో, ఏదో ఒక విధంగా తమ పార్టీ టిక్కెట్లను, ఈ పదవులను పొందటానికి రాజకీయవాదులు నానా అగచాట్లు పడుతున్నారు. ఇలా పదవుల కోసం పడే ఆరాటం, కుమ్ములాటలు, అతి విధేయత, బల ప్రదర్శనలు, అవకాశం చేజారిపోతే ఎగసిపడే ఆగ్రహజ్వాలలు, వెల్లుబికే అసమ్మతి–ఇవన్నీ జుగుప్సాకరంగా తయారయ్యాయి. చివరికి పార్టీలకు, ప్రజాస్వామ్యానికి ఈ ధోరణులు ప్రతిబంధకంగా అవుతున్నాయి. రాజకీయంలో పదవులు ఆశించటం పాపం కాదు. స్థానిక ప్రభుత్వాలకు నిజమయిన అధికారాలు కట్టబెట్టి, ఆ విధంగా కీలకమైన పదవులను పెంచి, అదనపు అవకాశాలను కల్పించినట్లయితే, ఎందరో ఆసక్తి సామర్థ్యం ఉన్న రాజకీయవాదులకు సరయిన స్థానం దొరుకుతుంది. ఆ విధంగా వారి శక్తి సామర్థ్యాలను, నాయకత్వ పటిమను ప్రజాసంక్షేమానికి వినియోగించుకోవచ్చు. అలాంటి పరిస్థితి లేకపోవడంతో ప్రస్తుతం వాళ్ళ శక్తంతా ప్రత్యర్థులను, తమను పోటీవచ్చే వాళ్ళను అణిచి వేసే ప్రయత్నంలోనే వృథా అవుతోంది!

మూడోది : కొత్త రాజకీయ శక్తులు, చిన్న పార్టీలు ఎదిగే అవకాశాలు కరవవడంతో గుత్తాధిపత్యం కొనసాగుతోంది. ప్రస్తుతం దాదాపు అన్ని పెద్ద రాష్ట్రాల్లోనూ ఓ పార్టీకి 35 శాతం మించి ఓట్లు పడితేనే గణనీయమైన సంఖ్యలో స్థానాలు పొందే అవకాశం ఉంది. ఆ కారణంగా వాస్తవానికి దేశంలో దాదాపు అన్ని పెద్ద రాష్ట్రాల్లోనూ రెండే ప్రధాన పార్టీలు ఎన్నికల్లో పోటీ పడుతున్నాయి. ఆ పార్టీల వారు మాత్రమే చట్టసభ సభ్యులయ్యే అవకాశముంది. మిగిలిన పార్టీలు నామమాత్రమవడంతో పోటీ పరిమితమయింది. ప్రజలకు సరైన వాళ్ళను ఎంచుకునే అవకాశం లేదు. ఎన్నికల్లో ఇరు అభ్యర్థులు 'దొందూ దొందే'గా దర్శనమిస్తున్నాయి. అలాగే మంచి అభ్యర్థులకు కూడా ప్రస్తుత ఎన్నికలు నిరుత్సాహాన్ని కలగజేస్తున్నాయి. స్థానికంగా కులబలం, పెద్దయెత్తున అక్రమ ఖర్చు లేకపోతే గెలుపు దాదాపు అసాధ్యంగా మారింది. అన్నింటినీ మించి, ఓడిన అభ్యర్థులకు, పార్టీలకు నియోజకవర్గంలో పడ్డ ఓట్లకు ఏ విలువా లేకుండా నిరర్థకమయిపోతున్నాయి. సగం కంటే తక్కువ ఓట్లు పడ్డ పార్టీకి అధికారం దక్కి, అధిక సంఖ్యాకుల అభిప్రాయాలకు గౌరవం లేకుండా పోయింది. అలా ప్రజాస్వామ్యం పలచనయింది. ఇవన్నీ నియోజకవర్గాల వారీగా ఒక్కొక్క ప్రతినిధిని ఎన్నుకోవడం వల్ల వచ్చిన తంటాలు. ఈ ఎన్నికల వ్యవస్థలో సరయిన పోటీగాని, ప్రజల అభిప్రాయాలను ప్రతిబింబిచే అభ్యర్థుల పాత్రగాని ఉండవు. అలాగే చాలా సందర్భాల్లో ఓటర్లకు ఓ గడ్డు సమస్య ఎదురవుతుంది. తమకు నచ్చిన అభ్యర్థి తాము మెచ్చే పార్టీలో ఉండకపోవచ్చు. మంచి అభ్యర్థికి ఓటు వేద్దామంటే, అతడి పార్టీ విధానాలు నచ్చకపోవచ్చు. ఎందరో ఓటర్లు ఎన్నికల్లో ఈ సంకటం నుంచి బయటపడలేకపోతున్నారు. ఈ సమస్యలకు సమాధానం పార్టీలకు ఓ రాష్ట్రంలో పడ్డ ఓట్ల శాతాన్ని బట్టి ఆ పార్టీ అభ్యర్థులు ఎన్నికయ్యే దామాషా పద్ధతి. ఆ విధంగా వివిధ పార్టీల మధ్య భావాల మధ్య నిజమైన పోటీ ఉంటుంది. ప్రజలకు మంచి అభ్యర్థులను, నచ్చిన పార్టీలను ఎన్నుకునే అవకాశం పెరుగుతుంది. నియోజకవర్గంలో ప్రాతినిధ్యం కోసం, పార్టీకి, అభ్యర్థికి మధ్య ఎంచుకోవడం తేలికవడం కోసం సగం మంది ప్రతినిధులను ఇప్పటిలాగా నియోజకవర్గాల ద్వారా ఎన్నుకోవచ్చు మిగిలిన సగం మందిని పార్టీ జాబితాల ద్వారా, దామాషా పద్ధతిలో ఎన్నుకోవచ్చు. మొత్తం మీద చట్టసభలలో సభ్యులు ఓట్ల నిష్పత్తిలో ఉండేలా చర్యలు తీసుకోవచ్చు. అలాగే మరీ చిన్న చిన్న పార్టీలు వచ్చి అస్థిరత్వాన్ని పెంచకుండా, కనీసం 10 లేదా 15 శాతం ఓట్లు రాష్ట్రంలో వచ్చిన పార్టీలకు మాత్రమే సీట్లు దక్కెలా ఏర్పాట్లు చేయవచ్చు. ఈ శాతానికి పోటీని ప్రోత్సహించేందుకు వీలుగా

మరీ ఎక్కువ చేయరాదు. అలాగే కులం పేరుతో చిన్న పార్టీలు సమాజాన్ని చీల్చటాన్ని నిరోధించేందుకు వీలుగా మరీ తక్కువ కాకుండా ఉండాలి. ఆ విధంగా పోటీ, స్వేచ్ఛ, ప్రజల ముందు ఎంపిక చేసుకునే అవకాశాలు పెరుగుతాయి.

## ప్రత్యక్షంగా నేత ఎన్నిక

రాజకీయంలో పోటీని, స్వేచ్ఛను, ప్రజల నిర్ణయాధికారాన్ని పెంచే నాలుగో చర్య రాష్ట్రాధి నేతల ప్రత్యక్ష ఎన్నిక. మన ప్రస్తుత వ్యవస్థలో పౌరులు ప్రతినిధులను నియోజకవర్గాలలో ఎన్నుకుంటే, వారు తమకిష్టమయిన నాయకుడి ఆధ్వర్యంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారు. వాస్తవానికి ప్రజల ఓటు నాయకులమీద తీర్పులాగా తయారయింది. ప్రజల దృష్టిలో నేటి ఎన్నిక వాజపేయి– సోనియా గాంధీల మధ్య, లేదా జయలలిత–కరుణానిధిల మధ్య జరుగుతోంది. కాని రేపు ఎన్నిక పూర్తయ్యాక, మన మెన్నుకున్న ప్రతినిధులు ప్రజల అభీష్టం మేరకు నాయకులను ఎన్నుకుంటారన్న హామీ ఏమీ లేదు. కొన్ని రాష్ట్రాలలలో అర్ధరాత్రి కుట్రలతో నాయకత్వం క్షణాల మీద మారుతుంది. ప్రజల ఓటుకు, ప్రభుత్వం ఏర్పాటుకు మధ్య సంబంధం స్థిరంగా లేదు. ఓ సారి ఎన్నికయిన ప్రతినిధుల ఇష్టారాజ్యంగా చెలామణీ అవుతోంది. శాసనసభ్యుల చేతుల్లో ప్రభుత్వం బంధీ అవుతోంది. కాబట్టి అవినీతికి, ఆశ్రితపక్షపాతానికి, అన్యాయానికి అంతులేకుండా పోతోంది. దుష్పరిపాలన తప్పడం లేదు. అధికారమంటే బదిలీలు, కాంట్రాక్టులు, నేర పరిశోధనలో జోక్యం, ప్రత్యర్థులను వేధించటంగా మారిపోయింది. ఈ పరిస్థితి పోవాలంటే చట్టసభకు, ప్రభుత్వానికి మధ్య రాష్ట్రాలలో అడ్డుగోడ ఉండాలి. ప్రభుత్వాధినేతను ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకోవాలి. ప్రభుత్వం స్వేచ్ఛగా ప్రజల తీర్పు మేరకు నిర్ణయాలు చేయగలగాలి. చట్టసభ శాసనాలు చేయటంలో, ప్రభుత్వాన్ని అదుపు చేయటంలో కీలకపాత్ర వహించాలి.

నిజమైన ఆర్థిక సంస్కరణలు పోటీని పెంచి, సామర్థ్యాన్ని, నాణ్యతను ప్రోత్సహిస్తాయి. ధరలను తగ్గుముఖం పట్టిస్తాయి. అయితే స్వేచ్ఛ, పోటీ ఆర్థిక వ్యవస్థలోనే కాదు, రాజకీయంలోనూ రావాలి. అప్పుడే ప్రజాస్వామ్యం సార్థకమవుతుంది. నిజమైన నాయకత్వం ఎదుగుతుంది. మనం సార్వభౌములమవుతాం. అప్పటిదాకా ఈ ఎన్నికలు కేవలం ఓ అధికార క్రీడ మాత్రమేగానీ, మన స్వేచ్ఛకు, స్వపరిపాలనకు సంకేతాలు కావు.

* * *

# పార్టీలన్నీ ఆ తానులో ముక్కలే గనుక... ఎన్నికకు అభ్యర్థుల గుణగణాలే ప్రాతిపదిక!

*ఆగస్టు 30,1999*

పార్టీల సీట్లు పంపిణీ తతంగం పూర్తయి ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. మొదటి విడత పోలింగు తేదీ దగ్గరపడింది. ఇప్పటి దాకా జరిగిన భాగోతం గమనించిన వారికి అసలు ఎవరు ఏ పార్టీ ఏయే సిద్ధాంతాలకు కట్టుబడి ఉందో, ఎవరు గెలిస్తే ఏమి జరుగుతుందో అంతుపట్టడం లేదు. కొన్నేళ్ళ క్రితం ఓ ఉన్నతాధికారి మర్యాద పూర్వకంగా నన్ను కలవటానికి మా ఇంటికి వచ్చారు. అప్పటికి ఆయన పదవీ విరమణకు రోజులు దగ్గర పడ్డాయి. తన భవిష్యత్తును గురించి మాట్లాడుతూ ఆయన రాజకీయాల్లో చేరి ఎన్నికలలో పోటీ చేద్దామని ఆలోచిస్తున్నట్లు చెప్పారు. ఏ పార్టీ తరపున పోటీ చేస్తారని ప్రశ్నించినప్పుడు ఆయన సమాధానం నా కళ్ళు తెరిపించింది. 'ఏ పార్టీ అయినా ఫరవాలేదు. తెలుగుదేశం సీటిస్తే ఆ పార్టీ తరపున పోటీకి సిద్ధం. కాంగ్రెస్ సీటిస్తే ఆ పార్టీకి అయినా ఫరవాలేదు' అని సెలవిచ్చారాయన. ఆ తరువాత అనుకున్నట్లుగానే ఒక పార్టీ తరపున పోటీ చేశారు!

## నిరంతరం ఓడుతున్నది ప్రజలే

ప్రస్తుతం పార్టీల పరిస్థితిని పరిశీలిస్తే రాజకీయం మొత్తం అధికార భోగాల చుట్టూ తిరుగుతోందని తెలుస్తుంది. అధికారం పొందటానికి పార్టీ అనేది ఒక సోపానం తప్ప, అంతకు మించి ప్రధాన పార్టీలకు నిజమైన లక్ష్యాలు, సిద్ధాంతాలు లేవని ఎన్నో మార్లు రుజువయింది. ఒక ప్రాంతంలో ఒక ముఠా ఓ పార్టీని అంటిపెట్టుకుంటే, ప్రత్యర్థి ముఠా వేరే పార్టీలో ఉంటుంది. ఏ కారణంగానయినా ఒక ముఠా నాయకుడు ఉన్న పార్టీని వదిలి వేరే పార్టీని ఆశ్రయిస్తే ప్రత్యర్థులు కూడ వెంటనే పార్టీలు మారతారు. అంటే పార్టీలు ఏవయినా, స్థానికంగా అధికారం కోసం వాళ్ళ శత్రుత్వం మాత్రం శాశ్వతం! ఈ వైకుంఠపాళిలో కొందరు నిచ్చెనలెక్కుతారు, మరికొందరు పాముల బారిన పడతారు! గద్దెనెక్కినవాళ్ళు తమ ప్రత్యర్థుల భరతం పడతారు. అధికారం అందనివాళ్ళు ప్రతీకారం కోసం వేచి ఉంటారు. మళ్ళీ అవకాశం దొరికినప్పుడు పాత్రలు తారుమారవుతాయి. రెండు వర్గాలలో ఎవరు ఏ పక్కన ఉన్నా ప్రజలు మాత్రం నష్టపోతారు. ఆ విషయాన్ని గుర్తెరగక రెండు వర్గాల మధ్య, ముఠాల

మధ్య, కుటుంబాల మధ్య, కులాల మధ్య జరుగుతున్నట్లు కనిపించే పోరాటంలో వారు కూడా పూర్తిగా లీనమైపోతారు. వాస్తవానికి అధికారం కోసం జరిగే ఈ ముఠాల పోరాటంలో నిరంతరం ఓడిపోయేది ప్రజలే. ఒక రకంగా చూస్తే అసలు ఎన్నికలలో పోరాటం జరిగేది రెండు పార్టీల మధ్య, రెండు వర్గాల మధ్య కాదు. నిజమైన పోరాటంలో అన్ని వర్గాలకు చెందిన నాయకులు ఒకవైపు పులులులాగా ఉండగా, సామాన్య ప్రజలు మరోవైపు లేగదూడలలాగా బిక్కుబిక్కుమంటూ ఉన్నారు. అలాంటి ముఠాలు పులులు గెలుస్తాయో, లేక లేగదూడలు బలయిపోతాయే చెప్పటానికి పెద్దగా తెలివితేటలు అక్కరలేదు! ప్రజాస్వామ్యంలో సిద్ధాంతం ప్రకారం ప్రజలే ప్రభువులు, సార్వభౌములు. ఎన్నికయిన వాళ్ళు ప్రజలకు సేవకులుగా, ప్రజా సంక్షేమానికి వారు ధర్మకర్తలుగా పని చేయాలి. కాని రోజువారిగా జరుగుతోందేమిటో మనకి తెలుసు. అధికారం పూర్తిగా వ్యక్తిగతమైన అవకాశంగా మారిపోయింది. పదవి అనేది ప్రజా ధనాన్ని దోచుకునే సాధనమయింది. అందుకే పదవిలోకి రాగానే చేసే పనులకు–మంచి పాలనకు సంబంధం లేకుండా పోయింది. ఎన్నికలలో రిగ్గింగు చేసో, ప్రజలని మభ్యపెట్టో, ఓట్లు కొనో, కుల, మత ద్వేషాలు రెచ్చగొట్టో, కల్లబొల్లి కబుర్లు చెప్పో ఒక సారి పదవిలోకి వచ్చాక ఆ అయిదేళ్లూ ఏం చేసినా అడిగే నాథుడుండడు. ఆ శాసనసభ్యుడు తన నియోజకవర్గానికి రారాజు. అక్కడ ఏ పనయినా అతని అనుమతితోనే జరగాలి. కాంట్రాక్టులు, టెండర్లు అతనికి బినామీ పేర్లతో ఇవ్వాలి. లేదా అతను చెప్పిన వాళ్ళకు ఇవ్వాలి. ప్రజా ధనాన్ని ఖర్చు చేసే ప్రతి కార్యక్రమంలోనూ అతని అనుమతి ఉన్నవాళ్ళకే ప్రయోజనం చేకూరాలి. అవి సబ్సిడీలు కావచ్చు. రేషన్ కార్డులు కావచ్చు, ఇళ్ళు కావచ్చు– అన్నీ అతడే నిర్ణయించాలి. అక్కడి ఉద్యోగులు, ఆ జిల్లాలో అధికారులు అతని కనుసన్నల్లో నడవాలి. నచ్చినవాళ్ళను అక్కడే వేయించుకోవడం, మాట వినని వాళ్ళను బదిలీ చేయించి శంకరగిరి మాన్యాలు పట్టించటం అతని జన్మహక్కు. తనకు డబ్బులు ఎవరు ముట్టచెబితే వాళ్ళకు కావలసినచోటికి బదిలీలు, లేకపోతే నానాతిప్పలు! ఆ ప్రాంతంలో పోలీసుస్టేషన్లలో తాను చెప్పిందే వేదం. తనను ఆశ్రయించిన నేరస్తులకు ఆటవిడుపు. తనని వ్యతిరేకించిన వాళ్ళమీద దొంగకేసులు, దౌర్జన్యం, వేధింపులు! అప్పటిదాకా ఏ ఆస్తిపాస్తులూ లేకపోయినా, ఎంఎల్ఎ కాగానే కోట్లకు పడగలెత్తాలి. ఒకప్పుడు ఎన్నికలలో పోటీ చేయాలంటే ఆస్తులను అమ్ముకునేవాళ్ళు. కొంత కాలం రాజకీయంలో ఉంటే ఆర్థికంగా నష్టపోయేవాళ్ళు. ఇప్పుడు నూటికి ఐదుగురు అలా ఉన్నారేమో!

మిగిలిన 95 శాతం ఒకసారి ఏదో విధంగా ఎన్నికలలో గెలిస్తే ఇక కొన్ని తరాల వరకు ఏ ఢోకా లేదు! అందుకే పార్టీల సీట్ల కోసం అంత హంగామా, హడావుడి, ఒత్తిడి, ఆతృత! పార్టీ ఆఫీసుల ముందు, నేతల ఇళ్ళ ముంగిళ్ళలో అంతగా పడిగాపులు. సీటు రాకపోతే ఆవేశం, దు:ఖం, కోపం, కుట్రలు, కుతంత్రాలు, పార్టీ ఫిరాయింపులు, తిరుగుబాట్లు, అందువల్లే ఎన్నికలకు, ప్రజల భవిష్యత్తుకు ఏ మాత్రమూ సంబంధం లేకుండా పోయిది. ఆ కారణంగానే ఎన్నికలలో ఎవరు గెలిచినా మనం నిరంతరం ఓడిపోతున్నాం. ఏరోజు ఎవరు ఏ పార్టీలో ఉంటారో తెలియదు. 1977లో హర్యానా శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ వ్యతిరేక ప్రభంజనంలో జనతాపార్టీ గెలిచింది. శాసనసభా పక్ష నాయకునిగా భజన్‌లాల్ గెలిచి ముఖ్యమంత్రి అయ్యారు. 1980 ఎన్నికల్లో ఇందిరాగాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ మళ్ళీ అధికారంలోకి వచ్చింది. వెంటనే భజన్‌లాల్ హర్యానాలో జనతా పార్టీ మొత్తాన్ని తన బద్ధశత్రువైన కాంగ్రెస్ పార్టీలో కలిపేసి ముఖ్యమంత్రిగా కొనసాగారు. ఆ తరువాత 1982లో హర్యానా శాసనసభ ఎన్నికలప్పుడు, 'ఏ పార్టీ గెలిచినా, శాసనసభ్యునిగా ఎన్నికయితే మళ్ళీ నేనే ముఖ్యమంత్రిగా కొనసాగుతా'నని ప్రకటించారు. అలాగే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఓడిపోయినా, శాసనసభ్యులకు కొని, రాత్రికి రాత్రే పార్టీల ఫిరాయింపులను, ప్రోత్సహించి, ఎంఎల్ఎల క్యాంపులు నిర్వహించి తానే ముఖ్యమంత్రిగా కొనసాగారు. 1974లో గుజరాత్‌లో నవనిర్మాణ్ సమితి ఆధ్వర్యంలో లోక్‌నాయక్ జయప్రకాష్‌నారాయణ్ నేతృత్వంలో విద్యార్థులు అవినీతికి, దుష్పరిపాలనకు వ్యతిరేకంగా ఉద్యమం చేపట్టారు. అప్పుడు కాంగ్రెస్ ముఖ్యమంత్రి చిమన్‌భాయ్‌పటేల్ మోరార్జీ దేశాయ్ నిరాహార దీక్షతో ప్రధాని ఇందిరాగాంధీ ఎకట్టకేలకు శాసనసభను రద్దు చేసి మళ్ళీ ఎన్నికలు నిర్వహించారు. ఆ ఎన్నికలలో కాంగ్రెస్ ఓడిపోగా చిమన్‌భాయ్‌పటేల్ పదవిని కోల్పోయి, బాబూభాయ్‌పటేల్‌కాంగ్రెసేతర ప్రభుత్వంలో ముఖ్యమంత్రి అయ్యారు. అదే గుజరాత్‌లో 1989లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడి, జనతాదళ్ ప్రభుత్వం ఏర్పడింది. 1989లో జనతాదళ్ ముఖ్యమంత్రిగా సాక్షాత్కారించింది అదే చిమన్‌భాయ్ పటేల్! 1989లో జనతాదళ్ ప్రభుత్వం కూలిపోయాక చిమన్‌భాయ్ పటేల్ జనతాదళ్ పార్టీలో అత్యధిక శాసన సభ్యుల సహా ప్రతిపక్ష కాంగ్రెస్‌లో చేరిపోయారు. జనతాదళ్‌పక్షాన గెలిచినా, కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా కొనసాగారు! ప్రస్తుతం కర్ణాటకలో అలాంటి బాగోతమే జరిగింది. జెహెచ్ పటేల్–జనతాదళ్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి–జనతాదళ్ 1994 ఎన్నికల్లో

కాంగ్రెస్, బిజెపిలకు వ్యతిరేకంగా పోరాడి గెలిచింది. గెలిచాక బిజెపి వ్యతిరేకత ప్రధానాంశంగా జనతాదళ్ వ్యవహరించింది. ఆ విధంగానే కేంద్రంలో కాంగ్రెస్ మద్దతుతో ప్రభుత్వాన్ని నడిపింది. అలాంటి జనతాదళ్ ముఖ్యమంత్రి జెహెచ్‌పటేల్ అకస్మాత్తుగా తన పార్టీని చీల్చి, ఎక్కువ మంది మద్దతు కూడగట్టుకుని బిజెపి ఆధ్వర్యంలోని జాతీయ ప్రజస్వామ్య కూటమి (ఎన్‌డిఎ)లో చేరిపోయారు. శాసనసభలో ఇబ్బంది అవుతుందనే అభిప్రాయంతో– అకస్మాత్తుగా అసెంబ్లీని రద్దు చేయించి ఎన్నికల్లో బిజెపితో పొత్తు పెట్టుకున్నారు. అధికారపక్షం ఏదో, ప్రతిపక్షమేదో తెలియక ప్రజలు తెల్లబోతున్నారు! చివరికి కర్ణాటకలో రాజకీయం అంతా కులాల ఆధారంగా జరుగుతోంది తప్ప విధానాల మీద, ప్రభుత్వాల పనితీరుమీద కాదు! ఈ పరిస్థితుల్లో పార్టీల ఉనికే ప్రశ్నార్థకంగా మారిపోయింది. అసలు పార్టీల మధ్య తేడాలు అంతరించిపోయాయి. పైకి ఏమి చెప్పినా ప్రధాన పార్టీలన్నీ ఒకే మోస్తరుగా ఉన్నాయి. ఎవరు ఏ పార్టీలో ఉంటారో, ఎవరు ఎవరితో పొత్తులు పెట్టుకుంటారో ఊహిచటం గగనమైపోతోంది. పార్టీలు కేవలం ఎన్నికల గుర్తులకు, డబ్బు వసూలు చేయటానికి, అధికారం పంచుకోటానికి పరిమితమైపోయినాయి. ఏదో ఒక విధంగా ధ్రాధనం దోచుకోవడం, పదవులు చేపట్టి పెత్తనం చెలాయించటం తప్ప ప్రధాన పార్టీలకు వేరే పరమార్థం లేదు. అందుకే గూండాలకు, నేర చరితులకు, అవినీతి పరులకు ప్రధాన పార్టీలు పెద్దపీటలు వేశాయి. అదేమంటే తాము నేరరాజకీయాలకు వ్యతిరేకమని, అయినా ప్రత్యర్థులు గూండాలను నిలబెట్టడంతో తప్పనిసరిగా తాముకూడా నేరస్తులను, హంతకులను, గూండాలను రంగంలోకి దింపవలసి వస్తోందని గడుసుగా చెప్పి తప్పించుకోజూస్తున్నాయి. అంటే మంచిపాలన తమ లక్ష్యం కాదని, ప్రజాసంక్షేమం తమ ధ్యేయం కానేకాదని, ఏదో ఒక విధంగా గూండాల ద్వారా ప్రజలను భయభ్రాంతులని చేయటం, అధికారం కైవసం చేసుకోవటం మాత్రమే తమ సంకల్పమని పార్టీలు చెప్పకనే చెబుతున్నాయి. ఈ కారణంగానే దాదాపు 40మందికి పైగా పేరుమోసిన నేరచరితులు వివిధ పార్టీల తరపున మన రాష్ట్రంలో ఎన్నికల రంగంలో అభ్యర్థులుగా ఉన్నారు.

## నిరసన తెలిపేందుకో మార్గం

పార్టీల ప్రవర్తన ఇంత నీతిబాహ్యంగా, నిర్లజ్జగా, ప్రజావ్యతిరేకంగా ఉన్నప్పుడు మనమేం చెయ్యాలి? ఓటు ఎవరికి వేయాలి. అభ్యర్థి గుణగణాలను చూశా? పార్టీ

సిద్ధాంతాలను చూశా? వాస్తవానికి అన్ని ప్రధాన పార్టీలు ఒకే మూసలోనివే. ఎవరు ఎప్పుడు ఏ పార్టీలోఉంటారో చెప్పడం అసాధ్యం. చెడ్డ అభ్యర్థిని నిలబెట్టే పార్టీ మంచిది ఎలా అవుతుంది? పార్టీ పేరుతో చెడ్డవాడు గెలిస్తే, రేపు ఆ పార్టీ ఆ చెడ్డవాడి దోపిడీని, అన్యాయాన్ని ఆపగలదా? ఒకవేళ అతడు దుర్మార్గానికి పార్టీ అడ్డుపడితే ఆ చెడ్డవాడు ఆ పార్టీనే అంటిపెట్టుకుని ఉంటాడా? ఏ విధంగా ఆలోచించినా పార్టీ పేరుతో దుర్మార్గులకు ఓటు వేయడం ఆత్మహత్యా – సదృశ్యం. ఇప్పటి పరిస్థితులలో పార్టీని పట్టించుకోకుండా ఉన్నంతలో మంచి అభ్యర్థులకు ఓటువేయడం శ్రేయస్కరం. అదృష్టవశాత్తూ ప్రధాన పార్టీలన్నీ ఓ నియోజకవర్గంలో మంచి అభ్యర్థులను నిలబెడితే, అప్పుడు నచ్చిన పార్టీకి ఓటు వేయవచ్చు. పార్టీలన్నీ దుర్మార్గులను బరిలో దింపితే బ్యాలెట్ పత్రంపైన పెద్ద ఇంటూ గుర్తు పెట్టి నిరసన తెలిపితే కనీసం మనపేరుతో పడే దొంగఓట్లు ఆపవచ్చు. మన నిరసన ప్రకటించడం ద్వారా పార్టీలకు కొంతమేరకు కనువిప్పు కలిగించవచ్చు. ఇలా కొద్దిమంది ఆలోచించి ఓటువేసినంత మాత్రాన ఏమైనా మార్పు వస్తుందా అన్న నిర్వేదం అక్కరలేదు. ఆలోచించే వారు విచక్షణతో ఓటువేసేవారు ప్రతీ నియోజకవర్గంలో ఐదు వేల మంది ఉన్నాచాలు. వారంతా విధిగా పోలింగ్‌లో పాల్గొని ఉన్నవాళ్ళలో మంచి అభ్యర్థులకు ఓటువేయడం కర్తవ్యంగా భావిస్తే ఖచ్చితంగా కొంతమేరకు మార్పు సాధ్యమవుతుంది.

* * *

# జనాభీష్టం పేరిట ప్రజాస్వామ్యంతో చెలగాటం

*ఏప్రిల్ 30, 2001*

దాదాపు 2005 సంవత్సరాలకు పూర్వం జీసస్ క్రైస్ట్ ఆనాటి రోమన్ సామ్రాజ్యంలో జుగీయాలో జన్మించారని ప్రతీతి. 30 సంవత్సరాల వయసు వచ్చాక జీసస్ చేసిన బోధనలన్నీ ప్రేమ, సౌభ్రాత్రం చుట్టూ అల్లుకుని ఉండేవి. మానవేతిహాసంపై జీసస్ బోధనల ప్రభావం అనితరసాధ్యమైనది. మానవాళిని రక్షించటానికి భూమి మీదకు వచ్చిన దైవకుమారుడుగా జీసస్‌ను క్రైస్తవులు విశ్వసిస్తారు. క్రైస్తవేతరులు కూడా జీసస్‌ను ఓ మహోదాత్తుడైన బోధకుడుగా, మహోన్నత తత్వవేత్తగా పరిగణిస్తారు. ఇస్లాం మత ప్రవక్త మహమ్మదు జీసస్‌ను గొప్ప ప్రవక్తగా భావించి ఆయన సందేశాలనెన్నింటినో తన బోధనలలో మిళితం చేశారు. నేటి ప్రపంచంలో క్రైస్తవ మత ప్రభావం మనందరికి తెలుసు. అంతగా మానవాళిని ప్రభావితం చేసిన జీసస్‌ను ఎలా సిలువ వేసి శిక్షించారో తలచుకుంటే మనకెన్నో చరిత్ర పాఠాలు బోధపడతాయి.

## ఎన్నికలు వేరు - న్యాయ నిర్ణయం వేరు

జీసస్ బోధనలు నచ్చని సంప్రదాయ యూదుల మతాచార్యులు ఆయనకు శత్రువులయ్యారు. జెరూసలెం నగరంలో ప్రమాదం పొంచి ఉందని తెలిసినా జీసస్ నిర్భయంగా అక్కడికి వెళ్ళారు. ప్రాణత్యాగం చేసైనా సరే మానవాళిని రక్షించటానికి సిద్ధపడ్డ జీసస్ దేన్నీ ఖాతరు చేయలేదు. ఆయన యూదుల పర్వదినాలయిన 'పాసోవర్ వీక్'లో జెరూసలెం నగరంలోకి ప్రవేశించారు. అవినీతికి పాల్పడి మతం పేరుతో వ్యాపారం చేస్తున్న వాళ్ళను యూదు దేవాలయం నుంచి వెళ్ళగొట్టారు. దాంతో యూదు మతాచార్యులంతా జీసస్‌పై పగబట్టారు. జీసస్ శిష్యుడైన జూదాస్ ఇస్కారియేత్ 30 వెండి నాణేలకు ఆశపడి 'పాసోవర్ వీక్' లో గురువారంనాడు తన గురువుకు ద్రోహం తలపెట్టాడు. జీసస్‌ను శాన్‌హెడ్రిక్ అనే యూదుల ఉన్నత న్యాయస్థానానికి తీసుకువెళ్ళి పండుగరోజులలో విచారణ నిషిద్ధమయినా ప్రశ్నించారు. ఏ సాక్ష్యమూ దొరక్కపోయినా ఆయన దైవకుమారుడుగా చెప్పుకుంటూ దైవద్రోహం చేస్తున్నాడని నేరం ఆరోపించారు. మర్నాడు శుక్రవారం ఉదయం జీసస్‌ను బాడియా గవర్నరయిన పాంటియస్ పైలాత్ వద్దకు తీసుకువెళ్ళి రాజద్రోహ నేరాన్ని మోపారు. ఆ పాసోవర్

పండుగ రోజులలో ఒక యూదు ఖైదీని గవర్నరు వదిలిపెట్టడం ఆచారం. గవర్నరు జీసస్‌ను, మరణశిక్ష పడిన ఓ హంతకుడు బరబ్బాస్‌ను తన రాజభవన ప్రాంగణంలో మెట్ల మీద నిలబెట్టారు. వారిద్దరినీ అక్కడ మూగిన జనానికి చూపి, వారిరువురిలో ఎవరో ఒకరిని వదిలిపెట్టడానికి ఆచారం ప్రకారం తాను సిద్ధమని, వారిలో ఎవరిని విడిచి పెట్టాలో చెప్పాలని కోరాడు. అక్కడున్న జనమంతా జీసస్‌కు వ్యతిరేక హంతకుడు బరబ్బాస్‌ను వదిలి పెట్టాలని కోరారు. ఇక చేసేది లేక గవర్నరు జీసస్‌ను సిలువ వేసి శిక్షించాలని ఆదేశించారు. ఆ శుక్రవారమే ఆ శిక్షను అమలు చేయటంతో కొన్ని గంటల వేదన తరవాత జీసస్ మరణించటం, మళ్ళీ ఈస్టర్ ఆదివారంనాడు ఆయన ప్రత్యక్షం కావటం, తదుపరి నలభైరోజులపాటు శిష్యులకు బోధనలు చేసి స్వర్గాన్ని చేరుకోవటం బైబిల్‌లో వివరించిన ఉదంతం.

ఇదంతా ఎందుకు ఏకరువు పెట్టాల్సి వచ్చిందంటే న్యాయాన్యాయ విచక్షణ సామాన్య జనానికి వదిలిపెట్టే అంశం కాదు. ఆనాటి పరిస్థితులనుబట్టి ప్రజలు భావావేశాలకు, రాగద్వేషాలకు లోనై సచ్చరితులను హింసించి అవమానించవచ్చు లేదా దుర్మార్గుల పక్షం వహించి వాళ్ళను నెత్తికెక్కించుకోవచ్చు. ఆనాటి జుడియాలో జనసామాన్యం అలాంటి దురన్యాయానికి ఒడిగట్టారు. అందుకే గజదొంగ, హంతకుడు బరబ్బాస్‌ను వదిలేసి పరమ పవిత్రుడు, సచ్ఛీలుడయిన జీసస్‌ను శిక్షించాలని నిర్ణయించారు. ప్రజాస్వామ్యంలో నిస్సందేహంగా ప్రజలే ప్రభువులు. ఎన్నికయిన వాళ్ళు కేవలం ప్రజలకు సేవకులుగా వారి జీవితంపై కొద్దిపాటి అధికారాన్ని తాత్కాలికంగా చేతబుచ్చుకున్నారు. అలా ఎన్నికయిన వాళ్ళు తప్పుచేస్తే వాళ్ళను అదుపు చేయటంకోసం, శిక్షించటం కోసం న్యాయస్థానాలున్నాయి. ఆ న్యాయస్థానాలకు స్వతంత్ర ప్రతిపత్తి ఉంది. వారి తీర్పుమీద పైకోర్టులో అప్పీలు చేసుకోవచ్చు. తుదకు న్యాస్థానాల తీర్పు అందరికీ శిరోధార్యం. జనం పాత్ర తమకు నచ్చిన ప్రతినిధులను ఓటు ద్వారా తమ సేవకులుగా ఎన్నుకోవటం మాత్రమే. అలా ఎన్నుకున్నాక తమ పేరుతో గద్దెనెక్కిన వాళ్లు బాధ్యతనెరిగి ప్రవర్తించేలా తమకు జవాబుదారీగా ఉండేలా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి. ఓటు ద్వారా ప్రజల తీర్పు కేవలం తమ ప్రాతినిధ్యానికి మాత్రమే పరిమితమయినది. ఓటు నలుపును తెలుపుగా, లేదా నేరస్తుణ్ణి నిర్దోషిగా మార్చలేదు. అలాగే ఓటు ద్వారా ఏ పాపం తెలియని అమాయకుణ్ని జైల్లో పెట్టడం సాధ్యం కాదు, సచ్ఛీలుర్ని ప్రజాభిప్రాయం నేరగాళ్లుగా రుజువు చేయలేదు. ప్రజలే న్యాయనిర్ణేతలని భావిస్తే– జీసస్‌ను శిక్షించాలన్న నాటి ప్రజల నిర్ణయమే

న్యాయమని మనం అంగీకరించాలి! అంతకన్నా మహాపరాధం మరొకటుండదు. ఓటు ద్వారా మనం నిర్ణయించేది కేవలం నాలుగు ప్రశ్నలకు సమాధానాలు మాత్రమే. మన పేరుతో ఎవరు చట్టాలను చేయాలి? ఆ చట్టాలను ఎవరు అమలుచేయాలి. ప్రజాధనాన్ని ఎవరి ద్వారా వినియోగించాలి? మన నుంచి జీతం తీసుకుంటున్న ప్రభుత్వ సిబ్బంది ఎవరి ఆధీనంలో పనిచేయాలి? – ఇందులో న్యాయనిర్ణయం ప్రసక్తి లేదు. మంచైనా– చెడైనా, మన జీవితాలకు సంబంధించిన నిర్ణయాలను చేసే హక్కు ప్రత్యక్షంగానో పరోక్షంగానో మనకు ఉండటమే ప్రజాస్వామ్యంలో మూల సూత్రం. అంతేకాని కేవలం ఎన్నికలలో అధిక సంఖ్యాకుల మద్దతు పొందినంత మాత్రాన అవినీతిపరుడు సచ్ఛీలుడు కానేరదు, హంతకుడు నిర్దోషి కాలేడు. గజదొంగ రుజువర్తనుడుగా మారడు. అలాగే కేవలం ఎన్నికలలో ఎక్కువ ఓట్లు పొందలేనంత మాత్రాన సచ్చరితుడు దోషి కాడు. అలా అంగీకరిస్తే ఓడిన ప్రతి వాళ్ళను ఉరికంబం ఎక్కించాలి. గెలిచిన వాళ్ళు ఓడిన వాళ్ళను చంపేసే హక్కుండాలి. అదే ఫాసిజం. మన దురదృష్టమేమంటే మన రిపబ్లిక్ ఏర్పడి 51 సంవత్సరాలు గడిచాక ఎన్నికలలో గెలిస్తే నేరం మాఫీ అయినట్లేననే దారుణమయిన వాదనల్ని వింటున్నాం. అలాగే ఓడిన వాళ్ళు శిక్షకర్హులనే భావనను మనముందు పెడుతున్నారు. మన ఎన్నికలలో ధనబలం, రిగ్గింగ్, కుల ప్రభావం, అసత్య ప్రచారం, సారాయి ప్రభావం, దొంగ ఓట్లు, అక్రమాల పుణ్యమా అని సచ్ఛీలురు నిజాయితీగా పోటీచేస్తే గెలవటం చాలా కష్టం. సాక్షాత్తూ మహాత్మాగాంధీయో, బాబా సాహెబ్ అంబేద్కరో మళ్ళీ ప్రత్యక్షమై ఎన్నికలలో పోటీకి దిగితే ఓడిపోవటం దాదాపు ఖాయం. అలాంటప్పుడు ఎన్నికలకు న్యాయ నిర్ణయం ఆపాదించటమంత మూర్ఖత్వం, అజ్ఞానం మరొకటి లేదు.

తమిళనాడులో ఎట్టకేలకు సస్పెన్సు వీడి నాలుగు నియోజకవర్గాలలో ఎన్నికల అధికారులు జయలలిత వేసిన నామినేషన్లనను తిరస్కరించారు. ఆమె అవినీతికి పాల్పడ్డట్టు న్యాయస్థానంలో రుజువై శిక్ష పడ్డ కారణంగా చట్ట ప్రకారం పోటీకి అనర్హురాలని వారు ప్రకటించారు. సాక్షాత్తు హైకోర్టు న్యాయమూర్తే నీళ్ళు నమిలిన నేపథ్యంలో మామూలు అధికారులయినా నిజాయితీగా, నిర్భీతితో చట్టాన్ని అమలుచేయటం సంతోషదాయకం. వారి నిర్ణయం నచ్చకపోతే జయలలిత న్యాయస్థానానికి ఎన్నికల పిటిషన్ ద్వారా వెళ్ళవచ్చు కాని ఆమె అనుచరులు, లాయర్లు వితండవాదన చేస్తున్నారు. జయలలిత దోషో, నిర్దోషో నిర్ణయించే అవకాశం ప్రజలకుండాలట! ప్రజలకు ఆ నిర్ణయం చేసే అధికారాన్ని లేకుండా చేయటం

దారుణమట! అది అప్రజాస్వామికమట! వీరంతా విస్మరిస్తున్న మాటేమిటంటే ప్రజాస్వామ్యానికి చట్టబద్ధ పాలన ప్రాణం. అధికారంతో, పలుకుబడితో, ప్రజల ఓట్లతో నిమిత్తం లేకుండా చట్టం అందరికీ సమానంగా వర్తించటం, చట్టమే పరిపాలన చేయటం, ప్రతి వ్యక్తి ఆ చట్టానికి లోబడి వ్యవహరించటం చట్టబద్ధ పాలనలో కీలకమయిన అంశాలు. ఈ మౌలికసూత్రాన్ని న్యాయకోవిదులుగా వాసికెక్కిన వారు, రాజనీతిజ్ఞులుగా పేరొందిన వారు విస్మరించటం దురదృష్టం. ఇంత గడిచాక జయలలిత మరో వాదన చేస్తున్నారు. తమ పార్టీ కూటమి ఎన్నికలలో గెలిస్తే ముఖ్యమంత్రి పదవి తనదేనట! కోర్టులు నేరం చేసిందని శిక్ష వేసినా, చట్టప్రకారం శాసనసభ్యురాలిగా పోటీ చేసే అర్హత లేకపోయినా తానే శాసనసభాపక్షం నాయకురాలిగా ఎంపికై ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తుందట! రాజ్యాంగం ప్రకారం శాసనసభ్యులు కానివాళ్ళు మంత్రులు కావచ్చు కాని మంత్రిపదవి చేపట్టిన ఆరు నెలల్లో శాసనసభ సభ్యులుగా కాలేకపోతే ఆ పదవిని కోల్పోతారు. అలాంటప్పుడు శాసనసభ సభ్యత్వానికే అర్హత లేకపోతే మంత్రి అయ్యే అర్హత ఎలా వస్తుంది? తమిళనాడు శాసనసభ్యులంతా కలసి తమకిష్టమయింది కదా అని ఆ రాష్ట్రంలో ఓటరుగా నమోదుకాని వేలుపిళ్ళై ప్రభాకరన్‌నో, ఇతర రాష్ట్రాలకు, ఇతర దేశాలకు చెందిన మరో వ్యక్తినో తమ నాయకుడుగా ఎన్నుకునే హక్కులేదు. ఒకవేళ అలా ఎన్నుకుంటే ఆ వ్యక్తి ముఖ్యమంత్రి కానేరడు. మనదేశ ప్రజలలో బిల్‌క్లింటన్‌కు అపారమయిన ఆదరణ ఉంది కదా అని రేపు లోకసభలో అధిక సంఖ్యాకులు ఆయన్ని నాయకుడుగా చేసుకుని ప్రధానమంత్రి పదవి అప్పగించాలని కోరితే అది రాజ్యాంగ విరుద్ధమవుతుంది. ఓటరు కాని వాడు, లేదా చట్టసభకు పోటీ చేసే అర్హత లేనివాడు ఆ చట్టసభలో మెజారిటీ, లేదా మైనారిటీ పక్ష నాయకుడు కావటం హాస్యాస్పదం, రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి అపచారం. ఒకవేళ తమిళనాడులో ఎ.ఐ.ఎ.డి.ఎం.కె. కూటమి గెలిచి, మెజారిటీ శాసనసభ్యులు జయలలితనే నాయకురాలిగా ఎన్నుకుంటే రాష్ట్ర గవర్నరు ఆమెను మంత్రివర్గం ఏర్పాటు చేయమని ఆహ్వానించటం అసాధ్యం. ఏదో విధంగా బలవంతం చేసి, గవర్నరు మీద ఒత్తిడి తెచ్చి ముఖ్యమంత్రి పదవిని తానే చేపట్టాలని జయలలిత ఉద్దేశం కావచ్చు. అలా పదవిలోకి వచ్చాక ఆరు నెలలకు ఒకరోజు ముందుగా రాజీనామా చేయవచ్చు. మళ్ళీ ఒకరోజు గడిచాక మరోసారి ముఖ్యమంత్రి పదవిని చేపట్టవచ్చు ఇలా ఆరునెలలకోసారి రాజీనామా చేస్తూ చిన్న చిన్న అవాంతరాలతో ఐదేళ్ళపాటు అధికారం

చలాయించవచ్చు. ఇది అభూతకల్పనలా అనిపించినా శాసనసభ్యత్వానికి అర్హతలేని జయలలిత తానే ముఖ్యమంత్రి పదవికి అభ్యర్థినని ప్రకటించటంలో అంతర్యం ఇదే!

1967 తరవాత చాలా రాష్ట్రాలలో అయారాం–గయారాం సంస్కృతి రావటం, పార్టీ ఫిరాయింపులు విరివిగా జరగటం మన ప్రజాస్వామ్యాన్ని కించపరిచాయి. అది మన వ్యవస్థ పతనంలో మొదటి ఘట్టం కాగా కాంగ్రెస్ వ్యతిరేక పవనాలలో 1977లో గెలిచిన జనతా పార్టీ శాసనసభ్యులందరితో పాటు 1980లో హర్యానాలో భజన్‌లాల్ కూడా పార్టీని ఫిరాయించి కాంగ్రెస్‌లో చేరి ముఖ్యమంత్రి కావటం ఫిరాయింపుల పర్వంలో పరాకాష్ఠ. అలాంటి సంఘటనే 1990లో చిమన్‌భాయ్ పటేల్ ఆధ్వర్యంలో గుజరాత్‌లో జరిగింది. ఇక మన ప్రజాస్వామ్య పతనంలో రెండో ఘట్టం అర్ధరాత్రి కుట్రల ద్వారా ప్రభుత్వాలను మార్చటం. 1984లో కాశ్మీర్‌లో ఫరూక్ అబ్దుల్లా ప్రభుత్వాన్ని గద్దె దింపి జి.ఎం.షాని ముఖ్యమంత్రిని చేయటం, అదే సంవత్సరం ఆంధ్రప్రదేశ్‌లో ఎన్.టి.ఆర్. ప్రభుత్వాన్ని అక్రమంగా రద్దు చేయటం ఇందుకు మంచి ఉదాహరణలు. ఆ తరవాత ఆంధ్రప్రదేశ్‌తో సహా పలు రాష్ట్రాలలో ఇలా అర్ధరాత్రి మంతనాల ద్వారా రహస్యంగా ప్రభుత్వాలు మారాయి. ఈ పతనంలో మూడో ఘట్టం బీహార్‌లో లాలూప్రసాద్ యాదవ్‌పైన కోర్టులో న్యాయమూర్తి నేరారోపణ (చార్జిషీట్) చేసినప్పుడు ఒత్తిడికి తలొగ్గి ఆయన ముఖ్యమంత్రి పదవినుంచి వైదొలగి, ఆ క్షణం వరకు రాజకీయంతో, ప్రజాజీవనంతో ఏ సంబంధమూ లేని తన భార్య రబ్రీదేవిని ముఖ్యమంత్రిగా కూర్చోబెట్టడం. ఇక ఈ ప్రజాస్వామ్య పతనంలో నాలుగో ఘట్టం ఉత్తరప్రదేశ్‌లో 1997లో మెజారిటీ మద్ధతు ఉన్న కళ్యాణ్‌సింగ్ ప్రభుత్వాన్ని రద్దు చేసి జగదాంబికాపాల్‌ను ముఖ్యమంత్రిగా చేసినప్పుడు జరిగిన సంఘటనలు – ఆనాటి వరకు అధర్మంగా, అక్రమంగా రాజ్యాధికారాన్ని చేపట్టినా, కనీసం అధికార మార్పిడి ప్రశాంతంగా జరిగేది. కాని జగదాంబికాపాల్‌ను బలవంతంగా ముఖ్యమంత్రి పదవి నుంచి దించాల్సి వచ్చింది. హైకోర్టు అధికార మార్పిడి చెల్లదని ఉత్తర్వులిచ్చినా, అదేపనిగా ఏడుస్తూ తన కుర్చీని దిగనని, ముఖ్యమంత్రి కార్యాలయం ఖాళీ చేయనని మొరాయించిన జగదాంబికాపాల్‌కు ఎలాగోలా నచ్చచెప్పి అతణ్ణి ఆ గదిలోంచి బయటకు రప్పించటంలో అధికారులకు తలప్రాణం తోకకు వచ్చింది. ఒకవేళ రేపు ఎ.ఐ.ఎ.డి.ఎం.కె. కూటమి గెలిచి జయలలిత ముఖ్యమంత్రి పదవిని చేపడతానని మొండికేస్తే, అందుకు గవర్నరు అనుమతించి ప్రమాణస్వీకారం చేయిస్తే, అది మన

ప్రజాస్వామ్య ప్రహసనంలో ఐదవ ఘట్టం కావచ్చు. లాలూ యాదవ్ కోర్టులో తనపైన నేరాలు రుజువుకాకపోయినా, న్యాయమూర్తి ప్రాథమిక ఆధారాలున్నాయని భావించి నేరారోపణ చేసిన కారణాన పదవి నుంచి వైదొలిగారు. తన భార్యను గద్దెనెక్కించి తెరవెనక రాజకీయాన్ని నడుపుతున్నారు. అది అనైతికమయినా, అప్రజాస్వామికమయినా, కుటుంబపాలన అయినా రాజ్యాంగ విరుద్ధం కాదు. కాని జయలలిత అక్రమంగా పదవిని పొందాలనుకుంటున్నారు. రాజ్యాంగ విరుద్ధమయిన పాలనను అందించాలనుకుంటున్నారు.

## ప్రత్యక్ష ఎన్నికే శ్రేయస్కరం

ఈ ఐదో ఘట్టాన్ని మనం చూస్తామా, లేదా అనేది వచ్చే రెండు వారాలలో తేలిపోతుంది. కాని ఇలా ప్రభుత్వాల ఏర్పాటు శాసనసభలో క్షణ క్షణం మారే సంఖ్యాబలం మీద ఆధారపడినంత కాలం మన ప్రజాస్వామ్యం ప్రహసనం కాక తప్పదు. జాతీయ స్థాయిలో వివిధ కారణాల వల్ల ప్రభుత్వాధినేతను ప్రత్యక్షంగా ఎన్నుకోవటం మంచిది కాదు. ఒకే వ్యక్తి అధికారానికి చిహ్నంగా నిలిస్తే మనలాంటి దేశంలో నియంతృత్వ పోకడలు వస్తాయని భయపడటం సహజం. కాని రాష్ట్రాలలో ఆ భయానికి తావులేదు. యూనియన్ ప్రభుత్వం, న్యాయస్థానాలు, రాజ్యాంగ సంస్థలు ఓ రాష్ట్ర ప్రభుత్వాధినేత నియంత కాకుండా సులభంగా నిలవరించగలవు. కాబట్టి ఇకనైనా రాష్ట్రాలలో ప్రత్యక్షంగా ప్రభుత్వాధినేతను ఎన్నుకోవటం శ్రేయస్కరం. అప్పుడే ఈ ప్రజాస్వామ్య పతనాన్ని ఆపగలం. ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకున్న వ్యక్తి పదవిని చేపట్టి నిర్దిష్ట కాలం పరిమితమయిన అధికారాన్ని చలాయిస్తే స్పష్టత, నిజాయితీ, నిర్భీతితో కూడిన పాలన సాధ్యమవుతాయి. ఆ వ్యక్తి అదుపు తప్పకుండా చట్టసభ, న్యాయస్థానాలు నిలువరించగలుగుతాయి. అధికారాల విభజన ద్వారా పాలనలో జవాబుదారీతనం పెరుగుతుంది. రాష్ట్రాలలో ప్రత్యక్ష ఎన్నికలు వచ్చేంత వరకు ప్రజాస్వామ్యం పతనం, పార్టీల ఫిరాయింపు, అర్ధరాత్రి కుట్రలు, రిమోట్ కంట్రోలు ముఖ్యమంత్రులు బలవంతంగా గద్దె దింపటాలు, ఎన్నిక కాని వాళ్ళు అధికారం చేపట్టడాలు తప్పవు. గత అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే రాష్ట్రాలలో, స్థానిక ప్రభుత్వాలలో ప్రజలు ప్రత్యక్షంగా ప్రభుత్వాన్ని ఎన్నుకునే ఏర్పాటు చేయటం శ్రేయస్కరం.

* * *

# పార్టీ ప్రయోజనాలముందు ప్రజాశ్రేయం దిగదుడుపేనా?

*నవంబర్ 5, 2001*

రాజ్యసభ ఎన్నికలకు సంబంధించి కేంద్ర మంత్రివర్గం తాజాగా రెండు కీలక నిర్ణయాలు తీసుకుంది. రాజ్యాంగం ప్రకారం రాజ్యసభ రాష్ట్రాల సభ. ఎగువసభ సభ్యులు రాష్ట్రాల ప్రయోజనాలను పరిరక్షించాలి. కాబట్టి, ఆ సభకు ఓ రాష్ట్రం నుంచి ఎన్నికయ్యేవారు ఆ రాష్ట్రంలో నివసించేవారయి ఉండాలని 1951వ సంవత్సరపు ప్రజాప్రాతినిధ్య చట్టంలో మూడో సెక్షన్ ప్రకారం నిబంధన ఉంది. ప్రధాన పార్టీలు వివిధ కారణాల వల్ల రాజ్యసభ ఎన్నికలలో అభ్యర్థులుగా ఇతర ప్రాంతాల వారిని ఎంపిక చేస్తున్నాయి. అలాంటప్పుడు గత్యంతరంలేక ఆ అభ్యర్థులు తాము ఎన్నికలలో పోటీచేసే రాష్ట్రంలోనే నివాసముంటున్నట్లు చెప్పుకొంటున్నారు. చివరికి మన్మోహన్‌సింగ్ లాంటి నిజాయితీపరుడు కూడా అస్సాంవాసిగా చెప్పుకొని ఎన్నిక కావాల్సివచ్చింది. సహజంగానే అలాంటి ఎన్నికపై విమర్శలు చెలరేగుతాయి. అలా ఎన్నికయినవారికి రాజకీయంగా చిక్కులు వస్తాయి. అందుకే ఇక అలాంటి ఇబ్బందులు లేకుండా ఆ రాష్ట్రవాసులే పోటీకి దిగాలనే నిబంధనను తొలగించే రాజ్యాంగ సవరణను మంత్రివర్గం ప్రతిపాదిస్తోంది. ప్రధాన పార్టీలకు ఈ ఇబ్బంది ఉంది కాబట్టి ఈ సవరణపైన అంగీకారం కుదిరే అవకాశం ఉంది. రాజ్యసభ ఎన్నికలలో రహస్య బ్యాలెట్ పద్ధతిని తీసివేసి, బహిరంగంగా అందరికీ తెలిసేలా ఓటు వేసేలా 1951వ సంవత్సరపు ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 59, 128 సెక్షన్లను సవరించాలనేది రెండో నిర్ణయం. గత 20 ఏళ్ళకు పైగా రాజ్యసభ సభ్యుల ఎన్నికలలో డబ్బులు చేతులు మారటం, సాక్షాత్తు శాసనసభ్యులే డబ్బు తీసుకుని ఓటు వేయటం తెలిసిందే. ప్రధాన పార్టీలకు చెందిన ఎందరో అధికార అభ్యర్థులు క్రాస్ ఓటింగ్ వల్ల ఎన్నిక కాకుండాపోయారు. డబ్బు సంచులతో మరెందరో ఎన్నికయ్యారు. చివరికి ఏదైనా పార్టీ అభ్యర్థి నెగ్గాలంటే ఆ పార్టీ శాసనసభ్యులకే డబ్బు ఇవ్వాల్సిన పరిస్థితి చాలాచోట్ల ఉత్పన్నమయింది. దాంతో పార్టీలకు రాజ్యసభ ఎన్నికలు సంకటంగా తయారయ్యాయి. పార్టీల నాయకత్వానికి తలనొప్పులు రాకుండా రహస్య బ్యాలెట్‌ను తొలగించాలని మంత్రివర్గం ప్రతిపాదిస్తోంది.

## కొరవడుతున్న చిత్తశుద్ధి

చూడటానికి ఈ ప్రతిపాదనలలో అంతగా వ్యతిరేకించాల్సిన అంశాలు లేవు. సమైక్య భారతావనిలో నివాసం మార్పు, రాష్ట్రాలలో రాజ్యసభ ఎన్నికల అభ్యర్థిగా నిలబడటం అంత కష్టమయిన అంశాలు కారాదు. విదేశంలో పుట్టిన సోనియా గాంధీ మనదేశంలో పౌరసత్వాన్ని పొంది ప్రధానమంత్రి పదవిని ఆశిస్తున్నారు. అలాంటప్పుడు మనదేశంలోని వారు వేరే రాష్ట్రంలో ఎన్నికవ్వాలని ప్రయత్నం చేస్తే తప్పులేదు. అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రంలో గవర్నరు పదవికి ఎన్నికయిన జెఫ్‌బుష్ ప్రస్తుత అధ్యక్షుడు జార్జిబుష్ తమ్ముడు. ఫ్లోరిడా ఆయన సొంత రాష్ట్రం కాదు. అయినా ఆ రాష్ట్రంలో గవర్నరు కాగలిగాడు. అలాగే మాజీ అధ్యక్షుడు బిల్‌క్లింటన్ సతీమణి స్వరాష్ట్రం కాని న్యూయార్క్ నుంచి ఎగువసభ సెనేట్‌కు ప్రత్యక్షంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా మన పౌరసత్వం ఉన్నవారు నివాసంతో నిమిత్తం లేకుండా ఎన్నికకావటంలో అనౌచిత్యం ఏమీ లేదు. అలాగే రాజ్యసభ ఎన్నికలు బేరసారాలకు, లంచాలకు, శాసనసభ్యుల బెదిరింపులకు దారితీయటం సిగ్గుచేటు. కాబట్టి ఎన్నికలలో డబ్బు సంచుల ప్రమేయాన్ని తగ్గించేలా రహస్య బ్యాలెట్ స్థానే బహిరంగంగా ఓటు వేయించే ప్రతిపాదనను కూడా కొంతమేరకు సమర్థించవచ్చు. రహస్య బ్యాలెట్ లేకుండా ఎన్నిక జరపాల్సిరావటం సిగ్గుచేటు. కాని మన రాజకీయం మరీ భ్రష్టుపట్టకుండా ఇలాంటి చర్య చేపట్టడం వెనక కారణాలను మనం అంగీకరించకపోయినా అర్థం చేసుకోవచ్చు. నిజానికి 1984 నుంచి మన రాష్ట్రంలో రాజ్యసభ ఎన్నికలలో రహస్యాన్ని ఛేదించి శాసనసభ్యులు వారి పార్టీ నిలబెట్టిన అధికార అభ్యర్థికే ఓటు వేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి శాసనసభ్యుడు ప్రత్యామ్నాయ ఓటు వేసే అవకాశం ఉంది. దాన్ని ఆసరాగా తీసుకుని తెలుగుదేశం పార్టీ 1984లో తన పార్టీ శాసనసభ్యులందరికీ విడివిడిగా ఒక నిర్దిష్టమైన 'కీ'ని ఇచ్చి అదేరీతిన ప్రాధాన్యక్రమంలో ఓట్లు వేయమని ఆదేశించింది. ఆరుగురికి వేసే ఓట్ల క్రమాన్ని మారుస్తూపోతే 720 రకాలుగా ఓట్లు వేయవచ్చు. ఓట్లు లెక్కించేటప్పుడు ఏ బ్యాలెట్ పత్రంపై ఓట్లు ఏ ప్రాధాన్య క్రమం ప్రకారం వేశారో గమనించి, తాము ఇచ్చిన 'కీ' ప్రకారం శాసనసభ్యుడు ఓటు వేశారో, లేదో తెలుసుకోవచ్చు అలా శాసనసభ్యులలో పార్టీ విధేయతను పాదుకొల్పి తెలుగుదేశం పార్టీ క్రాస్ ఓటింగ్‌ను నిరోధిస్తూ వచ్చింది. కొందరు అభ్యర్థులు కేవలం వంద రూపాయల తేనీటి ఖర్చుతో రాజ్యసభ సభ్యులై మంచి సేవలందించిన సందర్భాలనేకం ఉన్నాయి. కాబట్టి ఇప్పుడేదో

కొత్తగా రహస్య బ్యాలెట్‌కు భంగం కలిగిందని బాధపడాల్సిన అవసరం లేదు. అయితే ఈ రెండు ప్రతిపాదనలు పార్టీల నాయకత్వాలకు మరింతగా అధికారాలను పెంచుతాయి. ఇష్టం వచ్చినట్లుగా రాజ్యసభ సభ్యులను నామినేట్ చేసే అవకాశం పార్టీ నేతలకు కలుగుతుంది. వారు శాసనసభ్యులను మరింతగా తమ అదుపాజ్ఞలలో ఉంచుకోగలుగుతారు. ఇప్పటికే పార్టీలలో నిరంకుశత్వం రాజ్యమేలుతోంది. ఒకసారి ఏదో ఒక విధంగా పార్టీలో పెత్తనం సంపాదించాక ఇక అధినాయకులకు అడ్డులేకుండా పోతోంది. పార్టీ నాయకత్వాన్ని ఎదిరించే అవకాశంగాని, పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్య లక్షణాలు గానీ, నాయకులను నిజమైన పోటీ ద్వారా తొలగించే సంప్రదాయంగాని మన పార్టీలలో మచ్చుకు కూడా లేవు. వివిధ ఎన్నికలలో అభ్యర్థుల ఎంపిక పూర్తిగా పార్టీల అధినేతల చేతులలోనే ఉంది. అలాంటప్పుడు మన రాజకీయ సంస్కృతిని మార్చటం, అందుకోసం పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని ఉండేలా నియంత్రించేందుకు సమగ్ర చట్టాన్ని తేవటం అవసరం. అందుకు ఏ ప్రయత్నమూ చేయకుండా అధినేతల పట్టును పెంచే చట్టాలు చేయ సంకల్పించటం విడ్డూరం. ఈ తత్వం మన నాయకుల అభద్రతాభావానికి, అధికార దాహానికి, ప్రజాసంక్షేమం పట్ల వారి నిర్లక్ష్యానికి అద్దంపడుతోంది. ఈ ప్రతిపాదనలతో మన పార్టీలు ప్రజాప్రయోజనాలకంటే తమ రాజకీయ ప్రయోజనాలకు ఎంతటి ప్రాధాన్యమిస్తున్నాయో రుజువు చేస్తున్నాయి. ఎన్నికలలో నేరచరితుల ప్రవేశాన్ని నిషేధించాలని ఎంతోకాలంగా జనాభిప్రాయం వినవస్తోంది. ఇటీవల తమిళనాడులో జయలలిత కేసులోని నాటకీయ పరిణామాలు ఈ సమస్య తీవ్రతను తేటతెల్లం చేశాయి. అయినా అలాంటి చట్టాలు తెచ్చే విషయంలో పార్టీలు, ప్రభుత్వం తాత్సారం చేస్తున్నాయి. అలాగే నల్లధనం, అక్రమార్జన రాజకీయంలో ప్రధానపాత్ర వహిస్తూ ప్రజాస్వామ్యాన్ని కళంకితం చేస్తున్నాయి. అయినా ఎన్నికల నిధుల సంస్కరణల కోసం ఆరాటం కనిపించటంలేదు. ప్రజలకు పాలన సమాచార హక్కు కావాలని చాల ఏళ్లుగా ఉద్యమాలు నడుస్తున్నాయి. అలాంటి చర్యల ద్వారా జవాబుదారీతనాన్ని పెంచి లంచగొండితనాన్ని తగ్గించాలన్న ఆకాంక్ష ప్రభుత్వాలలో, పార్టీలలో మచ్చుకు కూడా కనిపించటం లేదు. ఢిల్లీ రెంట్ కంట్రోల్ చట్టానికి పార్లమెంటు సవరణలు తెచ్చి అవి రాష్ట్రపతి ఆమోదాన్ని పొంది అయిదేళ్ళు దాటిపోయింది. ఆ చట్టం ఈనాటికీ అమలుకు నోచుకోలేదు. అయినా పార్టీలకు, ప్రభుతానికీ చీమకుట్టినట్లు లేదు. ప్రసారభారతి చట్టం ఎట్టకేలకు 1997లో పార్లమెంటు ఆమోదాన్ని పొందింది. దానిలో మార్పులు కావాలన్న వంకతో ప్రభుత్వం జనమాధ్యమాలపై తన అదుపును

కొనసాగిస్తోంది. కొత్త చట్టం ప్రతిపాదించి ఏళ్ళు గడిచినా ఆ చట్టానికి ఈనాటికీ మోక్షం లేదు. విజిలెన్స్ కమిషన్‌కు స్వతంత్ర ప్రతిపత్తి కలిగించి అవినీతి నిరోధానికి పెద్ద పీట వేయాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చి అయిదేళ్లు దాటింది. అందుకు కావలసిన చట్టం చేసే ప్రయత్నాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా నిలిచిపోయాయి. ఇలా దేశంలో పాలనను బాగుచేసే చర్యల విషయంలో ప్రధాన పార్టీలు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నాయి. అలాంటప్పుడు రాజ్యసభ ఎన్నికలకు సంబంధించి ఈ మార్పులకు నడుంకట్టడం అసంబద్ధంగా కనిపిస్తుంది. మంత్రివర్గం ప్రతిపాదనలు చట్టరూపం ధరించాలంటే ఆ చట్టానికి పార్లమెంటు ఉభయసభల ఆమోదం కావాలి. చిన్న ప్రయోజనాలకే ఇంత పెద్ద ప్రయత్నానికి సిద్ధపడుతున్న పార్టీలు మరోపక్క ప్రజాప్రయోజనాల పరిరక్షణకు, అవినీతిని అంతం చేయటానికి, జవాబుదారీతనాన్ని పెంచటానికి ఉద్దేశించిన చట్టాల విషయంలో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయి.

అలాగని రాజ్యసభ పరిస్థితి అంతా సజావుగా ఉందని కాదు. ప్రజల మద్దతు పొంది లోక్‌సభలో స్పష్టమైన ఆధిక్యం ఉన్నా పాలకపక్షానికి చట్టాలు చేయటం అసాధ్యమవుతోంది. రాజ్యసభలో పార్టీల సంఖ్యాబలం ఆనాటి ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించకపోవటంతో ప్రభుత్వం ప్రతిపాదించిన చట్టాలు ఎగువసభలో వీగిపోతున్నాయి. ఆర్థిక బిల్లులు తప్ప మిగిలిన అన్ని అంశాలపైన ఉభయసభలకు సమానాధికారం ఉండటంతో రాజ్యసభ మద్దతు లేకుండా చట్టాలు చేయటం అసాధ్యం. సభ్యులు విషయ ప్రాధాన్యాన్ని బట్టికాక కేవలం పార్టీల నాయకత్వ ఆదేశాలకు తల ఒగ్గటంతో చట్టసభలు ఆశించిన ఫలితాలను అందించడంలేదు. పార్టీలు విప్‌ను రాజ్యసభలో కూడా అన్నిరకాల ఓటింగ్‌కు వర్తింపజేయటం ఆనవాయితీ అయింది. పార్లమెంటరీ వ్యవస్థలోఉన్న అతి ముఖ్యమైన ప్రయోజనం ఎన్నికయిన ప్రభుత్వం సులభంగా చట్టాలను చేయగలగటం. కాని, ఇలాంటి కారణాల వల్ల ఈ ప్రయోజనం నెరవేరకుండా పోతోంది.. ఈ పరిస్థితిని మార్చడం మన ప్రజాస్వామ్య పటిష్టతకు అత్యవసరం. అందుకు రెండు పద్ధతులున్నాయి. మొదటిది రాజ్యసభ అధికారాలను కుదించటం. రెండోది ఎన్నిక తీరును మార్చడం.

## రాజ్యసభ అధికారాలు-ఎన్నిక

రాజ్యసభ అధికారాల విషయానికి వస్తే అది రాష్ట్రాల సభ కాబట్టి రాష్ట్రాల హక్కులకు, రాజ్యాంగ సవరణలకు సంబంధించిన అంశాలలో దానికి సమానాధికారాన్నివ్వాలి. మిగిలిన అంశాలలో మాత్రం చట్టానికి సవరణలు ప్రతిపాదించటం, లేదా ఆ చట్టాన్ని కొంతకాలంపాటు (ఆరు నెలలు, లేదా సంవత్సరం)

ఆపటం, లోక్‌సభ పునః పరిశీలన కోసం పంపించటం తప్ప లోక్‌సభ ఆమోదించిన చట్టాన్ని తిరస్కరించే అవకాశం లేకుండా చేయాలి. 1911, 1949 సంవత్సరాలలో బ్రిటన్‌లో ఎగువసభ (హౌస్ ఆఫ్ లార్డ్స్) అధికారాలను ఇలాగే కుదించారు. ఎగువసభ సభ్యులను వంశపారంపర్యంగా నియమించే సంప్రదాయానికి నిరుడు స్వస్తి చెప్పారు. 1909లో బడ్జెట్‌ను తిరస్కరించి, ఎగువసభ బడ్జెటులో జోక్యం చేసుకోరాదని 260 సంవత్సరాలకు పైగా ఉన్న సంప్రదాయాన్ని లార్డ్స్ ఉల్లంఘించారు. దాంతో 1909–11 మధ్య రెండుసార్లు ఆ అంశంపై ఆనాటి ప్రధాని లాయిడ్ జార్జి పార్లమెంటును రద్దుచేసి ఎన్నికల రూపంలో ప్రజల తీర్పును ఆహ్వానించారు. అలా రెండుసార్లు గెలిచాక 1911లో ఎగువసభ అధికారాలను కుదించటానికి చట్టం చేశారు. మనం ఇప్పటికయినా తగిన చట్టాన్ని చేసి ప్రజాభిప్రాయాన్ని గౌరవించేలా, ఎన్నికయిన ప్రభుత్వానికి చట్టాలు చేయటంలో అవరోధాలు తొలగించేలా మార్గం సుగమం చేయటం అవసరం. ఇక రెండో పద్ధతి రాజ్యసభ ఎన్నిక తీరును మార్చటం. రాజ్యసభ సభ్యులు మూడోవంతుమంది రెండేళ్ళకోమారు ఆరేళ్ల పదవీకాలానికి ఎన్నికవటంతో ఆ సభ ఆనాటి శాసనసభల అభిప్రాయాలను ప్రతిబింబించటం లేదు. కాబట్టి ఆనాటి శాసనసభ, లేదా రాష్ట్ర ప్రభుత్వాల భావాలకు ప్రాతినిధ్యం ఉండేలా ఎన్నికను మార్చాలి. జర్మనీలో రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఏటా తమ తరపున ఎగువసభలో కూర్చునే సభ్యులను ఎంపిక చేసి పంపుతాయి. ప్రభుత్వం మారినప్పుడు సభ్యులు కూడా మారతారు. మనం ఆ మార్పును చేపట్టవచ్చు లేదా రాష్ట్ర శాసనసభ ఎన్నికలు కాగానే ఆ రాష్ట్రం నుంచి రాజ్యసభకు సభ్యులందరినీ ఒకేసారి ఎన్నుకుని, వారి పదవీ కాలాన్ని శాసనసభ పదవీకాలంతో ముడిపెడితే రాజ్యసభ – రాష్ట్రాల శాసనసభలకు సరైన ప్రాతినిధ్యం వహిస్తుంది. జాతీయస్థాయిలో ఉభయసభల మధ్య సయోధ్యను పెంచటానికి, ప్రభుత్వాలు నిస్సహాయమైపోకుండా చేయటానికి, ప్రజల తీర్పు మేరకు చట్టాలను సులభంగా ఆమోదించటానికి ఈ రెండు రకాల సంస్కరణలు అవసరం. జాతిప్రయోజనాలను కాపాడేందుకు, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు, ప్రజల తీర్పునకు విలువ ఇచ్చేందుకు నడుం కట్టవలసిన ప్రభుత్వాలు, పార్టీలు కేవలం తమ అధికారాన్ని, రాజకీయ ప్రయోజనాలను పదిలపరచుకునే చర్యలకు ఒడిగట్టడం అవివేకం. ప్రభుత్వాలు, పార్టీలు కాస్తంత దూరదృష్టిని, వివేకాన్ని ప్రదర్శించినప్పుడే మంచి పాలన సాధ్యమవుతుంది. అవి లేనప్పుడు పాలన ఇప్పటిలాగానే ఒకడుగు ముందుకు, రెండడుగులు వెనక్కిపోతూ ఉంటుంది. వ్యక్తిగత ప్రయోజనాలను జాతిప్రయోజనాలుగా భ్రమించడం విజ్ఞుల లక్షణం కాదు.

* * *

# రాజకీయ విరాళాలకు రాచబాట!

*ఏప్రిల్ 12,2004*

మన రాష్ట్రంలో నామినేషన్ల ఘట్టం ముగియటంతో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఈ రోజుల్లో ఎన్నికల వ్యయం విపరీతంగా పెరిగిపోతోంది. ప్రపంచంలోని ఇతర ప్రజాస్వామ్య దేశాలతో పోలిస్తే ఇండియాలోనే ఎన్నికల ఖర్చు ఎక్కువ. రాజకీయాలలో ధన ప్రభావంపై క్షుణ్ణంగా విశ్లేషించినప్పుడే సత్పరిపాలనకు పునాదులు వేయగలం. రాజకీయాలు అన్నాక ఎంతో కొంత ఖర్చు తప్పదు. పార్టీలు తమ సిద్ధాంతాలను ప్రజల్లో ప్రచారం చేసుకోవాలి... సంస్థాగత కార్యకలాపాలు నిర్వహించాలి.. తరచూ పర్యటనలు చేయాలి.. ప్రచార సామగ్రిని సిద్ధం చేసుకోవాలి.. వివిధ విషయాలను నిశితంగా అధ్యయనం చేయడానికి యంత్రాంగాన్ని సమకూర్చుకోవాలి... ప్రసారమాధ్యమాలతో నిరంతరం సంబంధాలు నెలకొల్పుకోవాలి..పత్రికలలోను, టెలివిజన్‌లోను ప్రచారం నిర్వహించటానికి పార్టీలకు డబ్బు కావాలి.. ఇతరత్రా ప్రచారానికీ అవి ఖర్చు పెట్టాలి. కాబట్టి రాజకీయాల్లోను, ఎన్నికలలోను పెట్టే ఖర్చునంతా వృథా వ్యయంగా భావించటం అవివేకం. నిజానికి ఆ రాజకీయ ప్రక్రియ సజావుగా సాగాలంటే అందుకు వనరులు అవసరం.

## పరిమితికి మించి వ్యయం

ఎన్నికలు, కంపెనీలు, ఆదాయం పన్ను- వీటికి సంబంధించిన చట్టాలను సవరిస్తూ, పార్లమెంటు 2003లో ఓ మంచి చట్టాన్ని చేసింది. గతంలో ఎన్నో కమిటీలు ఎన్నికల సంస్కరణలను సూచించాయి. వి.పి.సింగ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన దినేష్‌గోస్వామి కమిటీ చాలా విషయాలను చర్చించింది. ఎమర్జెన్సీకి ముందు లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ అభీష్టం మేరకు జస్టిస్ తార్కుండే అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ కొన్ని ప్రతిపాదనలను చేసింది. యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వ హయాంలో ఇంద్రజిత్‌గుప్తా అధ్యక్షతన ఏర్పడిన సంఘం ఎన్నికల ఖర్చుకు సంబంధించి కొన్ని ప్రతిపాదనలు చేసింది. లా కమిషన్ కూడా కొన్ని సూచనలు చేయడంతోపాటు నమూనా చట్టాలనూ రూపొందించింది. ప్రజాప్రాతినిధ్య చట్టం (1951)లోని 77వ సెక్షన్‌కు 1974లో చేర్చిన వివరణపై సుప్రీంకోర్టు కొన్ని

వ్యాఖ్యలు చేసింది. ఆ వివరణ ప్రకారం ఓ అభ్యర్థి తరఫున అతని పార్టీగానీ, వేరెవరయినాగానీ ఎన్నికల్లో ఖర్చు పెడితే అది ఆ అభ్యర్థి వ్యయపరిమితి కిందికి రాదు! అంటే ఎన్నికల ఖర్చుపై పేరుకు పరిమితి ఉన్నా, వాస్తవానికి ఏ పరిమితీ లేనట్లే! ఆ కారణంగా ఎందరో అభ్యర్థులు తాము ఎన్నికల్లో పెట్టే ఖర్చు కోట్ల రూపాయల్లో ఉన్నా, లెక్కల్లో మాత్రం కేవలం కొన్ని లక్షల రూపాయలనే చూపెడుతున్నారు. రాజ్యాంగం పనితీరును సమీక్షించడానికి ఎన్.డి.ఎ. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంఘం కూడా ఎన్నికల నిధుల విషయంలో సంస్కరణలపై కొన్ని సూచనలు చేసింది. ఎన్నికల సంఘం కూడా కొన్ని ప్రతిపాదనలను చేసింది. ఇలా ఎన్ని ప్రయత్నాలు జరిగినా, దాదాపు 30 ఏళ్లపాటు పరిస్థితిలో మార్పు రాలేదు. 1997 వరకు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థి వ్యయ పరిమితి లక్షన్నర రూపాయలు ఉండేది. లోక్‌సభ అభ్యర్థులకు ఆ పరిమితి నాలుగున్నర లక్షల రూపాయలు ఉండేది. తరువాత పెద్ద రాష్ట్రాలలో అభ్యర్థుల వ్యయ పరిమితిని అసెంబ్లీ ఎన్నికలలో ఆరు లక్షల రూపాయలకు, లోక్‌సభ ఎన్నికలలో రూ.15 లక్షలకు పెంచారు. 2003లో ఆ పరిమితిని అసెంబ్లీ ఎన్నికలకు రూ.10 లక్షల వరకు, లోక్‌సభ ఎన్నికలకు రూ.25 లక్షల వరకు పెంచారు. ఈ పరిమితులను ఇలా ఎంతగా పెంచుతూ వస్తున్నా, వాస్తవానికి ఎన్నికల వ్యయం అంతకు పదిరెట్లవుతుంది. లోక్‌సభకు పోటీచేసే అభ్యర్థి ఎన్నికల వ్యయ పరిమితిని 15 లక్షల రూపాయలుగా నిర్ణయించినా వాస్తవానికి ప్రధాన అభ్యర్థులు సగటున– గ్రామ ప్రాంతాలలో 75 లక్షల రూపాయలు, పట్టణ ప్రాంతాలలో రూ.1.25 కోట్లు ఖర్చు చేసినట్లు 1999లో ఎన్నికల సంఘం చేపట్టిన ఓ అధ్యయనంలో వెల్లడైంది. ఇదంతా పైకి కనిపించిన ఖర్చు మాత్రమే. నిజానికి అభ్యర్థి చేసే మొత్తం ఎన్నికల వ్యయంలో ప్రచారం కోసం పెట్టే ఖర్చు కొద్దిభాగం మాత్రమే. పార్టీ కార్యకర్తల కోసం చేసే ఖర్చు, వాహనాల వినియోగం, బహిరంగ సభల నిర్వహణ, అభ్యర్థి ప్రచారం, ప్రయాణాలు తదితరాలకు, పోలింగు రోజున, ఓట్లు లెక్కింపు రోజున చేసే వ్యయం– ఇవి మాత్రమే పైకి కనిపించే ఖర్చులు. ఎన్నికలలో బయటికి కనిపించకుండా అడ్డదోవన చేసే ఖర్చు సగటున 70 శాతం ఉంటుంది. అంటే కనిపించే ఖర్చు కోటి రూపాయలైతే, కనిపించకుండా అక్రమంగా చేసే ఖర్చు రెండు, మూడు కోట్ల రూపాయల వరకు ఉంటుంది. ఈ వ్యయం ప్రధానంగా ఓట్ల కొనుగోలు, సారాయి పోయించడానికి, సభలకు కిరాయి జనాన్ని సమీకరించడానికి,

కొన్నిచోట్ల గుండాలను, కండబలం ఉన్న ముఠాల్ని నియమించుకోవడానికి, అడపాదడపా పోలీసు యంత్రాంగానికి, ఎన్నికల సిబ్బందికి లంచాలిచ్చేందుకు, పోలింగు రోజున ఓటర్ల రవాణాకు, కొందరు 'కుల' పెద్దలకు, లేదా ముఠా నాయకులకు డబ్బిచ్చి ప్రలోభ పెట్టడానికి, ఇతరత్రా ఓటర్లను మచ్చిక చేసుకోవటానికి చేసేదే. ఎన్ని చట్టాలను చేసినా, ఎంతగా నిఘా పెట్టినా, ఈ అక్రమ ఖర్చును లెక్కకట్టడం, నిరోధించడం చాలా కష్టం.

కొన్ని ప్రాంతాలలోను, నియోజకవర్గాలలోను ఎన్నికల ఖర్చు సగటు ఖర్చు కంటే చాలా ఎక్కువ ఉంటుంది. ఉదాహరణకు మిగిలిన ప్రాంతాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడులలో ఎన్నికల ఖర్చు కొన్ని రెట్లు ఎక్కువ. ఆంధ్రప్రదేశ్‌లో ఓ అసెంబ్లీ నియోజకవర్గంలో పోటీ చేసే ప్రధాన అభ్యర్థులకు సగటున కోటి రూపాయల మేరకు ఎన్నికల వ్యయం అవుతుంది. కొన్ని నియోజకవర్గాలలో ఇది మూడు, నాలుగు కోట్లదాకా ఉంటోందని వినికిడి. కర్ణాటకలోని బెంగుళూరు శివార్లలో ఉన్న కనకపుర నియోజకవర్గంలో ఓ ఏడాది క్రితం జరిగిన లోక్‌సభ ఉప ఎన్నికకు రూ.20 కోట్లు ఖర్చయిందని అంచనా. ఆ ఎన్నికలలో మాజీ ప్రధానమంత్రి దేవగౌడ, ప్రస్తుత కర్ణాటక మంత్రి డి.కె.శివకుమార్ ప్రధాన ప్రత్యర్థులు. ఇద్దరూ ఎన్.డి.ఎ.కు వ్యతిరేకులే. వీరిలో ఎవరు గెలిచినా పార్లమెంటులో ప్రతిపక్షంలో కూర్చోవలసినవారే. ఉప ఎన్నికలో గెలిచాక లోక్‌సభలో ఉండబోయేదీ ఏడాదిన్నరో... రెండేళ్లో..! తీరా లోక్‌సభకు ముందస్తు ఎన్నికలు రావడంతో వారికి మిగిలింది సంవత్సర కాలమే. అంటే కేవలం సంవత్సర కాలం ప్రతిపక్షంలో కూర్చోవటానికి రూ.20 కోట్లు ఖర్చు పెట్టారన్న మాట! తమిళనాడులోని సైదాపేట నియోజకవర్గంలో 2001 అసెంబ్లీ ఎన్నికలలో కరుణానిధి శాసనసభ్యుడుగా ఎన్నికైనా ఆయన పార్టీ పరాజయం పాలైంది. దాంతో శాసనసభ సభ్యత్వానికి ఆయన రాజీనామా చేశారు. జయలలిత నాయకత్వంలోని ఎ.ఐ.డి.ఎం.కె.కు తమిళనాడు శాసనసభలో ఎదురులేని మెజారిటీ ఉన్న దృష్ట్యా- అక్కడి ఉప ఎన్నికలో ఎవరు గెలిచినా ప్రభుత్వ మనుగడకు ఢోకా లేదు. అయినా అక్కడ రూ.10 కోట్లకు పైగా ఖర్చు చేశారని అంచనా. ఈ ఉదంతాలను బట్టి ఎన్నికల వ్యయానికి, చట్టం విధించిన పరిమితికి మధ్య పొంతనే లేదని స్పష్టమవుతోంది. చట్టంలో ఎన్నో లసుగులుండటం వల్ల, రాజకీయ విరాళాలకు ప్రోత్సాహకాలు లేకపోవటం వల్ల - రాజకీయ కార్యకలాపాల కోసం సక్రమంగా

చేయాల్సిన ఖర్చునూ చట్టబద్ధంగా పెట్టడానికి అవకాశం లేకుండా పోయింది. అయితే 2003 సెప్టెంబరులో చేసిన చట్టం ఈ అవసరమైన ఖర్చు కోసం పకడ్బంధీ ఏర్పాట్లను చేసింది. వ్యక్తులుగానీ, కంపెనీలుగానీ పార్టీలకు ఇచ్చే విరాళాల మీద ఇప్పుడు ఈ చట్టం ప్రకారం నూటికి నూరుపాళ్లు ఆదాయం పన్ను రాయితీ ఉంది. అంటే దాతలు– తమ ఆదాయం నుంచి ఆ విరాళం సొమ్మును మినహాయించి మిగిలిన మొత్తంపైనే పన్ను చెల్లించవచ్చు. ఎంత మొత్తాన్ని విరాళంగా ఇవ్వవచ్చుననే దానిమీద పరిమితులేమీ లేవు. వ్యక్తిగతంగా విరాళాలు ఇచ్చేవారు తమ ఆదాయాన్ని మించి విరాళం ఇచ్చే అవకాశం ఎలాగూలేదు. కంపెనీలైతే మూడేళ్ల కాలంలో అవి సాధించిన సగటు నికర లాభంలో అయిదు శాతాన్ని మించి విరాళాలివ్వరాదు. ప్రస్తుతం మన దేశంలోని ప్రైవేటు కంపెనీల లాభాలు దాదాపు రూ.50,000 కోట్లు ఉండవచ్చు. అంటే ఏటా రూ.2500 కోట్ల వరకు అంటే 5 సంవత్సరాలలో రూ.12,500 కోట్ల వరకు పూర్తి పన్ను రాయితీతో– పార్టీలకు వనరులను అవి విరాళాలుగా ఇవ్వవచ్చు. రాజకీయ నిధుల సమీకరణకు ఇది అతి సులువయిన మార్గం. రూ.20,000 మించి విరాళాలనిచ్చినప్పుడు, వాటి వివరాలన్నీ ఎన్నికల సంఘానికి, ఆదాయ పన్ను శాఖకు తెలియచేయాలని ఈ చట్టం నిర్ధేశిస్తోంది. పార్టీలిచ్చిన ఆ వివరాలను ఎన్నికల సంఘం ప్రజలకు నివేదిస్తుంది. ఇప్పటికే పార్టీల నిధుల వివరాలను, జమాఖర్చుల లెక్కలను ఎన్నికల సంఘం ఇంటర్‌నెట్ ద్వారా ప్రజల ముందు పెడుతోంది. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 77వ సెక్షన్‌కు 1974లో చేర్చిన వివరణ కారణంగా ఎన్నికల వ్యయ పరిమితికి అర్థం లేకుండా పోయి, చట్టం హాస్యాస్పదమయింది. ఇప్పుడా వివరణను మార్చటంతో ఓ పార్టీగానీ, ఇతరులుగానీ ఎన్నికలలో పెట్టే అన్ని ఖర్చులూ అభ్యర్థి చేసే వ్యయం కిందికే వస్తాయి. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు ఎలక్ట్రానిక్ ప్రసాదర మాధ్యమాలలో ఉచితంగా సమయాన్ని కేటాయించే అంశం 2003 సెప్టెంబరు నాటి చట్టంలో ఉంది. దానిపై ప్రభుత్వం నిబంధనలను ఇంకా రూపొందించలేదు. ఆ ప్రతిపాదన ఆచరణలోకొస్తే సక్రమ పంథాలో ఎన్నికలలో వ్యయం చేయడంపై రాజకీయ పార్టీలకు ఇక బెంగ ఉండదు.

## నిధులపై పారదర్శకత

రాజకీయాలు ఓ వ్యాపారంగా మారడమే నేటి ఎన్నికలలో అసలు సమస్య. ఓట్ల కొనుగోలుకు, కిరాయి గూండాలకు, లంచాలకు, ఇతర ఖర్చులకు కోట్లు

వెదజల్లి అధికారాన్ని కైవసం చేసుకుని, అంతకు పదింతలు ఆర్జించే రాజకీయ బేహారులు మన సమాజంలో కోకొల్లలుగా ఉన్నారు. ఆ అక్రమ వ్యయాన్ని అరికట్టాలంటే ఎన్నికల వ్యవస్థలోను, ప్రభుత్వ నిర్వహణలోను, రాజకీయాల్లోను మౌలికమైన మార్పులు రావాలి. ఈలోగా నిజాయితీగా రాజకీయాలను నడపడానికి చట్ట రూపంలో ఓ మార్గం లభించడం ముదావహం. ప్రస్తుత చట్టం పూర్తిగా అమలులోకి వచ్చి ఎన్నికల నిధుల విషయంలో పారదర్శకత సాకారమైతే– ఆ మేరకు నిజాయితీపరులు సమర్థులు, సచ్ఛీలురు రాజకీయంలో రాణించే అవకాశం పెరుగుతుంది. ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవటం, దానిపై పార్టీలలో, ప్రజలలో, అవగాహనను పెంపొందించడం మన వ్యవస్థ ప్రక్షాళనకు అవసరం.

* * *

# దేశ ప్రజాస్వామ్య ప్రస్థానంలో మేలిమలుపు ఎన్నికల నిధులపై చట్టం

**అక్టోబరు 13, 2003**

దేశంలో ఎన్నికల నిధులకు సంబంధించిన సంస్కరణలపై కీలకమైన చట్టం ఇటీవల అమలులోకి వచ్చింది. దాదాపు 15 ఏళ్లనాటి నుంచి దేశంలో ఎన్నో కమిటీలు, సంస్థలు ఎన్నికల సంస్కరణలను ప్రతిపాదిస్తూ వచ్చాయి. ఎట్టకేలకు ఎన్నికలు ఇతర సంబంధిత చట్టాల (సవరణ) బిల్లు ఈ ఏడాది ఆగస్టులో పార్లమెంటు ఉభయసభల ఆమోదాన్ని పొందింది. సెప్టెంబరులో రాష్ట్రపతి సంతకంతో అది చట్టమైంది. ఈ చట్టం ద్వారా ఎన్నికల వ్యయానికి, పార్టీలకు సంబంధించి చాలా మౌలికమైన సంస్కరణలను అమలులోకి తెచ్చారు.

## ప్రక్షాళన దిశగా ముందడుగు

నిజానికి ఈ చట్టం కాకతాళీయంగా రాలేదు. ఇటువంటి చట్టం ఉండాలని 2001లో 'లోక్‌సత్తా' ఉద్యమం నిర్దిష్ట ప్రతిపాదనలను చేసింది. దేశంలోని అన్ని పార్టీలకు, పార్లమెంటు సభ్యులకు, మంత్రులకు, పత్రికలకు, పరిశోధన సంస్థలకు, అధికారులకు వాటిని నివేదించింది. ఆ తరువాత ఎన్‌డిఎ ప్రభుత్వంలోని అరుణ్ జైట్లీలాంటి మంత్రులతోనూ, కాంగ్రెస్ పార్టీలోని సోనియాగాంధీ, మన్మోహన్ సింగ్ వంటి అగ్రశ్రేణి నాయకులతోనూ, ప్రణబ్ ముఖర్జీ, రామ్‌జెఠ్మలానీ, శివరాజ్ పాటిల్ లాంటి సీనియర్ నాయకులతోనూ సవివరమైన చర్చలు జరిగాయి. అలా అందరినీ ఒప్పించిన నేపథ్యంలో, రాజకీయ నిదుల సమీకరణ కోసం చట్టబద్ధమైన, నీతివంతమైన మార్గాలను అన్వేషించాలనే సంకల్పంతో డాక్టర్ మన్మోహన్ సింగ్ అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ నివేదికపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఓ బిల్లును తయారు చేసి పార్లమెంటులో ప్రవేశపెట్టింది. కేంద్ర ప్రభుత్వమే అభ్యర్థులకు నేరుగా ఎన్నికల నిధులు అందించాలన్న సూచనను తప్ప లోక్‌సత్తా ప్రతిపాదించిన దాదాపు అన్ని అంశాలనూ ఆ బిల్లులో చేర్చారు. ప్రణబ్ ముఖర్జీ అధ్యక్షతన ఏర్పాటైన పార్లమెంటరీ సంఘం బిల్లులో కొన్ని మార్పులు, చేర్పులు చేసింది. ప్రధానంగా పార్టీల నిధులను కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ సూచించిన వారితో ఆడిట్ చేయించాలనే అంశాన్ని తొలగించాలని ఆ కమిటీ సిఫారసు

చేసింది. ఇలాంటి మార్పులతో మరో కొత్త బిల్లును పార్లమెంటులో 2003లో ప్రభుత్వం ప్రవేశపెట్టగా అది నేటికి చట్టమైంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో పౌరసమాజం, పార్టీలు, ప్రభుత్వం, చట్టసభలు కలిసి నిర్మాణాత్మకంగా ఎలా పనిచేయగలవో రుజువు చేయడానికి ఇది ఒక ఉదాహరణ. ఈ చట్టం మన ప్రజాస్వామ్య వ్యవస్థ పరిణామక్రమంలో ఓ మేలిమలుపు వంటిది. అన్ని పార్టీలు కలిసి వచ్చి మన రాజకీయ ప్రక్షాళనకు పూనుకొంటాయనే విశ్వాసాన్ని ఇలాంటి చట్టాలు బలపరుస్తాయి. మన దేశంలో జరిగే ఎన్నికల ఖర్చులో సింహభాగం చట్టవిరుద్ధమైనది (చట్ట పరిమితిని దాటి, లెక్కలు చూపకుండా పెట్టే ఖర్చు), అనైతికమైనది (డబ్బుతోనూ, సారాతోనూ ఓట్లు కొనడానికి, ఎన్నికల అధికారులను లంచాలతో లోబరచుకోవడానికి, కిరాయి గూండాలను వినియోగించుకోవడానికి పెట్టే ఖర్చు) ఎన్నికల కోసం నిధులను ఎక్కడ నుండి వసూలు చేస్తున్నదీ, ఎలా ఖర్చు చేస్తున్నదీ అత్యధిక పార్టీలు, అభ్యర్థులు బయట పెట్టకపోవడానికి కారణం అదే. ఈ నేపథ్యంలో ప్రస్తుత చట్టం మన రాజకీయ వ్యవస్థ ప్రక్షాళన దిశగా పడిన పెద్ద ముందడుగు అని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఈ చట్టంలో ప్రధానంగా మూడు అంశాలున్నాయి. 1974లో చేసిన చట్ట సవరణ ద్వారా ఎన్నికల నిధుల విషయంలో ఏర్పడిన లోసుగును సరిచేయడం అందులో మొదటిది. ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు – కొందరు చట్టసభ సభ్యులు ఎన్నికల్లో పరిమితికి మించి వ్యయం చేశారన్న కారణంగా వారి ఎన్నిక చెల్లనేరదని న్యాయస్థానాలు తీర్పునిచ్చాయి. అందుకు విరుగుడుగా 1951 నాటి ప్రజాప్రాతినిధ్య చట్టంలోని 77వ సెక్షన్‌కు అనుబంధంగా అప్పట్లో ఒక వివరణను చేర్చారు. ఆ వివరణ ప్రకారం – ఓ రాజకీయ పార్టీగానీ, అభ్యర్థికాక మరెవరైనా వ్యక్తిగాని, సంస్థగాని ఎన్నికల ఖర్చు చేసినట్లయితే, ఆ మొత్తం ఆ అభ్యర్థి ఎన్నికల వ్యయ పరిమితి కిందకు రాదు. చట్టబద్ధంగా విధించిన ఎన్నికల వ్యయ పరిమితిని ఆ సవరణ నీరుగార్చింది. దాంతో ఆనాటి నుంచి చట్టాన్ని రాజకీయ నాయకులు చాలా సులువుగా ఉల్లంఘిస్తూ వచ్చారు. చట్టపరమైన ఆ లొసుగును ప్రస్తుత సవరణ చట్టంలోని 4వ సెక్షన్ ద్వారా ఇప్పుడు తొలగించారు. దీని ప్రకారం – పార్టీ నాయకుల ప్రయాణ ఖర్చులను మాత్రమే అభ్యర్థి ఎన్నికల వ్యయ పరిమితి నుంచి మినహాయిస్తారు. గుర్తింపు పొందిన పార్టీలకైతే 40 మంది నాయకులకు, గుర్తింపులేని పార్టీలకైతే 20 మంది నాయకులకు అలా ప్రయాణ ఖర్చులలో మినహాయింపు ఉంటుంది. మిగిలిన అన్ని ఖర్చులు కలిసి వ్యయ పరిమితికి లోబడే ఉండాలి. అక్రమంగా, అనైతికంగా పెట్టే ఖర్చు ఈ రకమైన చట్ట సవరణ వల్ల బయటపడకపోవచ్చు. ప్రచారం కోసం

చేసే, కనిపించే ఖర్చు మొత్తం అభ్యర్థి బయటపెట్టాల్సి ఉంటుంది. కానట్లయితే.. ఎన్నికల సంఘం అంచనా వేసి పరిమితి దాటితే అభ్యర్థిని పదవి నుంచి తొలగించేందుకు, పోటీకి అనర్హులుగా ప్రకటించేందుకు చట్టబద్ధ చర్యలు తీసుకోవచ్చు.

ఈ చట్టంలో రెండో కీలకమైన అంశం పార్టీలకు నిధులు విరాళంగా ఇవ్వటాన్ని ప్రోత్సహిస్తూ ఆదాయం పన్ను రాయితీని కల్పించడం. సంస్థాగత కార్యకలాపాలకు, ప్రజాభిప్రాయాన్ని కూడగట్టడానకి, తమ భావజాలాన్ని ప్రచారం చేసి ఇతర పార్టీలతో పోటీ పడటానికి పార్టీలకు నిధులు అవసరం. అలాగే అభ్యర్థులు తమను గూర్చి ఓటర్లకు తెలియజెప్పడానికి, తమ భావాలను ప్రచారం చేయడానికి డబ్బు అవసరం. ఈ పరిస్థితులలో రాజకీయ నిధుల సమీకరణను ప్రోత్సహించకపోవడం వల్ల మన ఎన్నికల ప్రక్రియలో చాలా అపశృతులు చోటుచేసుకున్నాయి. పార్టీలు, అభ్యర్థులు తమ పలుకుబడిని ఉపయోగించి బలవంతంగా డబ్బు వసూలు చేయడం పరిపాటైంది. దానికి తగ్గట్లు మనదేశంలో ఏర్పాటైన 'లైసెన్సు పర్మిటు–కోటా' రాజ్యం పుణ్యమా అని పదేళ్ల క్రితం వరకు ఇలా అక్రమార్జన చేయటం సులభమైంది. పార్టీలు నిజాయితీగా నిధులు సేకరించేందుకు తగు ఏర్పాట్లు చేయలేకపోయాం. చట్టపరంగా ఎన్నో పిల్లిమొగ్గలు వేశాం. పార్టీలకు కంపెనీలు విరాళాలిచ్చేందుకు వీలుగా 1960లో చట్టాన్ని సవరించినా 1969లో కంపెనీ విరాళాలను నిషేధించారు. మళ్లీ 1985లో రాజీవ్‌గాంధీ ప్రభుత్వం చట్టాన్ని సవరించి మూడేళ్ల నికరలాభంలో అయిదు శాతం వరకు రాజకీయ విరాళాలిచ్చే వీలును కంపెనీలకు కల్పించింది. అందులో పన్ను రాయితీలు లేకపోవడంతో అత్యధిక కంపెనీలు పార్టీలకు రహస్యంగా విరాళాలిస్తున్నాయి. సర్వత్రా వ్యాపించిన నల్లధనం సంస్కృతి, ఓ పార్టీకి బహిరంగంగా నిధులిస్తే ఇతర పార్టీల ఆగ్రహానికి గురవుతామన్న భయం, తమకు అనుకూలంగా ప్రభుత్వాలు నిర్ణయాలు చేయటం కోసం, లేదా తమను వేధించకుండా ఉండటం కోసం నిధులు లంచంగా ఇవ్వవలసి రావడం – ఇవన్నీ ఇందుకు ప్రధాన కారణాలు. ప్రస్తుత చట్టం ద్వారా దేశ చరిత్రలో తొలిసారిగా వ్యక్తులుగాని, కంపెనీలుగాని పార్టీలకు ఇచ్చే విరాళాలకు పూర్తి ఆదాయం పన్ను రాయితీని కల్పించారు. ఆదాయం పన్ను చట్టంలోని 80 జి.జి.బి., 80 జి.జి.సి సెక్షన్లను అందుకోసం కొత్తగా చేర్చారు. పన్నుల రాయితీ కల్పించడంతో పాటు రూ.20,000లకు మించిన విరాళాలన్నింటినీ పార్టీలు ఎన్నికల సంఘానికి తెలియజేయాలన్న నిబంధననూ చట్టంలో పొందుపరిచారు. ఆ వివరాలన్నింటినీ ప్రజల ముందు ఉంచుతారు. అందువల్ల పార్టీలకు అందే విరాళాలకు, ప్రభుత్వ నిర్ణయాలకు మధ్య ఏమైనా సంబంధం

ఉందేమో మనం నిశితంగా పరిశీలించవచ్చు. నిధుల సేకరణలో పారదర్శకత కూడా పెరుగుతుంది. ఎన్నికల సరళిలో ముందుముందు అతిపెద్ద మార్పునకు దోహదపడేలా రేడియో, టివిల ద్వారా ప్రచారానికి వీలు కల్పించే నిబంధన ఈ చట్టంలోని మూడో ప్రధానాంశం. గుర్తింపు పొందిన పార్టీలకు ఇకనుంచి ప్రైవేటు, ప్రభుత్వ ఛానళ్ల ద్వారానూ, కేబుల్ నెట్‌వర్క్ ద్వారానూ ఉచితంగా ప్రచారం చేసుకునే వీలు ఉంటుంది. ఆ పార్టీలకు గతంలో వచ్చిన ఓట్లను బట్టి ఆ సమయాన్ని ఎన్నికల సంఘం కేటాయిస్తుంది. ఈ నిబంధనను ఎన్నికల సంఘం సృజనాత్మకంగా వినియోగిస్తే ఎన్నికల ప్రచారం తీరునే సమూలంగా మార్చవచ్చు. ఆమెరికాలో అధ్యక్ష పదవికి జరిగే ఎన్నికలలో మాదిరి అభ్యర్థుల మధ్య బహిరంగ చర్చలను నిర్వహించవచ్చు. ప్రత్యక్షంగా ప్రసారం చేయవచ్చు. తద్వారా పార్టీలకు ప్రచార ఖర్చు బాగా తగ్గుతుంది. ఇలా సమయాన్ని కేటాయించడం వల్ల కోట్ల సంఖ్యలో ప్రజలకు ప్రత్యక్షంగా తమ విధానాలను ఉచితంగా చెప్పుకునే అవకాశం పార్టీలకు లభిస్తుంది.

## సంస్కరణలకు నాంది

మన ప్రజాస్వామ్యంలో ఎన్నికల సంస్కరణం శకానికీ చట్టం నాంది పలుకుతోంది. అన్ని పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించిన ఈ చట్టం మన రాజకీయాల పరిణతికి అద్దం పడుతోంది. అవినీతిని అదుపు చేయడం ఇప్పటికైనా అవసరమని, ఎన్నికల సంస్కరణలు అందుకు కీలకమని పార్టీల్లో అవగాహన పెంపొందించడానికి ఈ చట్టం నిదర్శనం. అంత మాత్రాన మన రాజకీయాల్లోని లొసుగుల పరిష్కారానికి ఈ చట్టం ఒక్కటే చాలదు. ఎన్నికల ఖర్చులో చాలా భాగం అనైతికమైనది, అక్రమమైనది. అందుకే అక్రమార్జనపరులు చాలా మంది రాజకీయాలను ఓ పెద్ద వ్యాపారంగా మార్చేశారు. నియోజకవర్గంవారీ ఎన్నికలు, శాసనసభ్యుల మద్దతు ఆధారపడి ప్రభుత్వాలు మనుగడ సాగించాల్సిన వ్యవస్థ మనం మన రాజకీయాలను భ్రష్టు పట్టించి ప్రజాస్వామ్యాన్ని తీవ్ర సంక్షోభంలో పడేసింది. ఈ దుస్థితి నుంచి బయటపడాలంటే అసలు ఎన్నికల వ్యవస్థనే సమూలంగా సంస్కరించాలి. ఎన్నికల నిధులకు సబంధించిన ప్రస్తుత సంస్కరణ మన వ్యవస్థ ప్రక్షాళనలో ఓ కీలకమైన ఘట్టం. నిజాయితీతో కూడిన రాజకీయాలను ప్రోత్సహించి, సత్పరిపాలన అందించే మార్గం. ఇది ఓ మంచి ముందడుగు.

* * *

# ప్రచారంపై నిషేధం రాజ్యాంగ విరుద్ధం

*మార్చి 8, 2004*

టెలివిజన్‌లో ఎన్నికల ప్రచారంపై వాదోపవాదాలు చెలరేగుతున్నాయి. ఎన్నికల ప్రచార ప్రకటనలను నిషేధించిన ఎన్నికల సంఘం – చట్టాన్ని, ప్రభుత్వాన్ని తప్పుపడుతుండగా, ప్రస్తుత పరిస్థితికి ఎన్నికల సంఘానిదే బాధ్యత అని ప్రభుత్వం అంటున్నది. ఈ వాదోపవాదాలలో సత్యమేమిటో తేలటం అవసరం.

## అసంబద్ధ నిబంధనలు

ఈ అంశంపై నాలుగు చట్టబద్ధమైన ప్రకరణలున్నాయి. ఆ నాలుగింటినీ కూలంకషంగా పరిశీలిస్తే వాస్తవం నిగ్గుతేలుతుంది. మొదటిది – 1995వ సంవత్సరం నాటి కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్‌ను నియంత్రించే చట్టం. ఈ చట్టంలోని 6వ సెక్షను ప్రకారం ఒక కేబుల్ సర్వీసు ద్వారా అడ్వర్టయిజుమెంటు నిబంధనలను ఉల్లంఘించే ఏ ప్రకటన అయినా ప్రసారం చేయడంగాని, పునఃప్రసారం చేయడం కాని నిషిద్ధం. అయితే ఉపగ్రహాల ద్వారా ప్రసారమయ్యే విదేశీ ఛానళ్లు కనుక మరే పరికరాలు, డికోడర్లు అవసరం లేకుండా అందుకునే అవకాశం ఉంటే, వాటికి ఈ నిషేధం వర్తించదు. ఉపగ్రహాల ద్వారా ప్రసారమయ్యే విదేశీ ఛానళ్లను నియంత్రించే అవకాశం మన ప్రభుత్వానికి ఎలాగూ లేదు కాబట్టి వాటిని మినహాయించినట్లు భావించవచ్చు. మన దేశం నుంచి ఛానళ్లు ప్రసారమైనా, విదేశీ ఛానళ్లకు డబ్బు కట్టి డికోడర్ల ద్వారా మాత్రమే ప్రసారాన్ని పొందే అవకాశమున్నా, ఆ ఛానళ్లలో డబ్బిచ్చివేయించే ప్రకటనలన్నీ ప్రభుత్వం విధించే నిబంధనలకు లోబడి ఉండాలి. ఇక రెండో చట్టపరమైన ప్రకరణం – 1994లో వెలువరించిన కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్ నిబంధనలు. అందులో 7వ నిబంధనలో మూడవ క్లాజు ప్రకారం డబ్బిచ్చి చేసే ఏ ప్రకటన అయినా మత ప్రచారానికి, రాజకీయ ప్రచారానికి ఉపయోగపడరాదు. అంటే ఈ రెండు లక్ష్యాల కోసం చేసే ప్రకటనలన్నీ నిషిద్ధం. 1995 కేబుల్ నెట్‌వర్క్ చట్టంలోని ఆరవ సెక్షను ప్రకారం టివి ఛానళ్లలోని వ్యాపార ప్రకటనలన్నీ ఈ నిషేధానికి లోబడి ఉండాలి. అంటే 1994వ సంవత్సరం నాటి నిబంధనలు అమలులో

ఉన్నంతవరకు మత సంబంధమైన, రాజకీయ సంబంధమైన ప్రకటనలను ప్రసారం చేయటం సాధ్యంకాదు. ఈ చట్టాన్ని పార్లమెంటు చేయగా, నిబంధనలను ప్రభుత్వం రూపొందించింది. కాబట్టి రాజకీయ, వ్యాపార ప్రకటనలను (అడ్వర్టయిజ్‌మెంట్లు) టివి ఛానళ్లలో ప్రసారం చేయరాదని ఎన్నికల సంఘం ఉవాచ. ఎన్నికల సంఘం పార్టీల చేతుల్ని కట్టిపడేసిందని ప్రభుత్వ వాపోతోంది. ఈ మేరకు సమాచార, ప్రసారశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ ప్రకటన చేయగా, ఇందుకు బాధ్యత చట్టానిది, ప్రభుత్వానిదే కాని తమది కాదని ఎన్నికల సంఘం చేతులు దులుపేసుకుంది.

ఇది చాలా విచిత్రమైన పరిస్థితి. మనది ప్రజాస్వామ్య వ్యవస్థ. ఈ వ్యవస్థకు ప్రాథమిక హక్కులు, భావ ప్రకటన స్వేచ్ఛ పునాదులు. తమ భావాలను, సిద్ధాంతాలను పార్టీలు, అభ్యర్థులు ప్రచారం చేసుకునే అవకాశం లేకపోతే ఇక ఎన్నికలకు, ప్రజాస్వామ్యానికి అర్థంలేదు. ప్రజాస్వామ్యంగా ఓ దేశానికి గుర్తింపు ఉండాలంటే కనీసం నాలుగు లక్షణాలుండాలి. మొదటిది – వివిధ పార్టీల మధ్య నిజమైన పోటీ ఉండి ఎన్నికలు సకాలంలో, సజావుగా జరగాలి. రెండోది – తమ భావాలను స్వేచ్ఛగా ప్రజలకు చెప్పుకొనే అవకాశం పార్టీలకు, వ్యక్తులకు ఉండాలి. మూడోది – గెలిచిన వాళ్లు ఓడిన వాళ్ళను హింసించడమో, వేధించడమో, ప్రాణాలు తీయడమో చేయరాదు. అధికారంలో ఉండగా కాని, పౌర జీవనంలో కాని ఏమైనా నేరాలకు పాల్పడితే, చట్టబద్ధమైన పద్ధతులననుసరించి న్యాయ విచారణ జరిపి, నేరం రుజువైతే శిక్ష పడాలి తప్ప, ఎన్నికలలో గెలిచిన వాళ్లు ఓడినవాళ్లపైన కో సాధించడం కోసం ఏ శిక్షలు వేయరాదు. నాలుగవది – ఎన్నికైన ప్రభుత్వం తమనెన్నుకున్న ప్రజలకు జవాబుదారీగా ఉండాలేకాని, సైన్యానికో, మతాధిపతులకో, మరో ముఠాకో లోబడి పనిచేయరాదు. మన దేంలో స్వతంత్రం వచ్చిన నాటి నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థ కొనసాగుతోంది. క్రమబద్ధ ఎన్నికలు, పార్టీల మధ్య నిజమైన పోటీ, భావ ప్రకటన స్వేచ్ఛ మన వ్యవస్థకు పునాదులు. చివరికి ఎమర్జెన్సీ పేరుతో అర్ధ నియంతృత్వాన్ని స్థాపించినప్పుడు కూడా 1977లో జరిపించిన ఎన్నికలలో పార్టీల మధ్య పోటీ, తమ విధానాలను ప్రచారం చేసుకునే స్వేచ్ఛ, ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు కొనసాగాయి. అందుకే ఆ ఎన్నికల్లో తొలిసారిగా కాంగ్రెస్ ఓటమిపాలై, కొత్తగా ఇతర పార్టీల కలయికతో ఏర్పడ్డ జనతాపార్టీ విజయం సాధించి ప్రభుత్వాధికారాన్ని చేపట్టింది.

## బహిరంగ చర్చ అవసరం

ఇక మూడవ అంశం – మన రాజ్యాంగం, రాజ్యాంగంలోని 19(1) (ఎ) అధికరణం ప్రకారం మన పౌరులందరికీ వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటన స్వేచ్ఛ ఉన్నాయి. పత్రికా స్వేచ్ఛ, రేడియో, టివీలలో భావాలను ప్రకటించే స్వేచ్ఛ ఈ ప్రాథమిక హక్కులో భాగాలు. డబ్బిచ్చి చేసే వ్యాపార ప్రకటనలు కూడా ఈ భావ ప్రకటనా స్వేచ్ఛ కిందకే వస్తాయి. రాజ్యాంగంలోని 19(2) అధికరణం ప్రకారం ఈ స్వేచ్ఛకు చట్ట ప్రకారం కొన్ని హేతుబద్ధమైన పరిమితులు విధించవచ్చు. అయితే ఆ పరిమితులను రాజ్యాంగంలో పొందుపరిచిన కారణాల కోసం మాత్రమే విధించవచ్చు. ఇలా రాజ్యాంగంలో 8 కారణాలను నిర్దిష్టంగా పేర్కొన్నారు. వాక్ స్వాతంత్ర్యానికి పరిమితులు విధించే అవకాశం కల్పించే ఈ కారణాలు దేశ సార్వభౌమత్వం, సమగ్రత, దేశ భద్రత, ఇతర దేశాలతో స్నేహ సంబంధాలు, శాంతి భద్రతలు, నైతిక విలువలు, కోర్టు ధిక్కారానికి దారితీసే అంశాలు, ఇతరుల ప్రతిష్టను దిగజార్చే అంశాలు. ఓ నేరాన్ని ప్రేరేపించే పద్ధతులు. ఈ ఎనిమిది అంశాలు తప్ప మరే కారణాల వల్లనూ భావ ప్రకటనా స్వేచ్ఛను హరించే అధికారం పార్లమెంటుకు కూడా లేదు. ఇక అలాంటి చట్టాన్ని చేసే అవకాశమే లేనప్పుడు, నిబంధనల ద్వారా రాజకీయ ప్రకటనలను నిషేధించే హక్కు ఏ ప్రభుత్వానికీ లేదు. ఇదే విధంగా 1999లో రాజకీయ వ్యాపార ప్రకటనలను టివిలో ఎన్నికల సంఘం నిషేధించినప్పుడు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆ ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధమని కొట్టివేసింది. అలాంటప్పుడు ఇప్పుడు మళ్లీ కేబుల్ టెలివిజన్ నియంత్రణ నిబంధనల ప్రచారం కోసం డబ్బిచ్చి ప్రకటనలు చేయరాదని శాసించడం విడ్డూరం. ఇక నాలుగో అంశం – ఎన్నికల నిధులకు సంబంధించిన చట్ట నిబంధనలు 2003 సెప్టెంబరులో 1951వ సంవత్సరపు ప్రజా ప్రాతినిధ్య చట్టంలో కొన్ని సవరణలు చేసి ఎన్నికల నిధుల సేకరణకు, పార్టీల ప్రచారానికి వెసులుబాటు కల్పించారు. ఈ సవరణలలో భాగంగా, ప్రజాప్రాతినిధ్య చట్టంలో 39–ఎ సెక్షనును చేర్చారు. దీని ప్రకారం వివిధ పార్టీలు గతంలో ఎన్నికలలో పొందిన ప్రజాదరణను బట్టి వాటి భావాల ప్రచారానికి ఎన్నికల సంఘం ఎలక్ట్రానిక్ జనమాధ్యమాలలో తగిన సమయాన్ని విధిగా కేటాయించాలి. కానీ ఇందుకు సంబంధించిన నిబంధనలను ఇంత వరకు ప్రభుత్వంగానీ, ఎన్నికల సంఘం గానీ రూపొందించలేదు. అలా నిబంధనలను రూపొందించి ఈ చట్టాన్ని అమలు చేస్తే

అన్ని గుర్తింపు పొందిన పార్టీలకు టివి ఛానళ్లలోనూ, కేబుల్ నెట్‌వర్క్‌లలోనూ, రేడియోలోనూ ఎన్నికల ప్రచారానికి సమయాన్ని కేటాయించవచ్చు. ఇప్పటికే ప్రభుత్వ ప్రసార మాధ్యమాలలో ఇలా సమయాన్ని కేటాయించే సంప్రదాయం చాలా కాలంగా మన దేశంలో అమలులో ఉంది. ఇప్పుడది ప్రైవేటు ఛానళ్లకు, ఎలక్ట్రానిక్ మాధ్యమాలకు కూడా వర్తిస్తుంది. ఇప్పటివరకు రేడియో, దూరదర్శన్‌లలో ఆ సమయాన్ని పార్టీలు తమ ప్రసంగాలకు వినియోగించుకుంటున్నాయి. ప్రజలకు ఆసక్తిగొలిపే చర్చలుగానీ, ఆకర్షణీయమైన రీతిలో ప్రచారం గానీ లేకుండా, విసుగుపుట్టే ప్రసంగ పాఠాలను చదవటంతో ఈ ప్రచారం ప్రభావం ఎన్నికల మీద లేకుండా పోయింది. ఏదో మొక్కుబడిగా సమయాన్ని కేటాయించడం, నిస్సారంగా, చప్పగా ప్రసంగాలు సాగడం తప్ప, ఈ సమయం, అవకాశం నిరర్ధకమవుతున్నాయి. ఎన్నికల సమయంలో పార్టీల రాజకీయ ప్రచారానికి సమయాన్ని విధిగా కేటాయించాలని ఓ చట్టం నిర్ధేశిస్తుండగా, వేరే నిబంధనల ప్రకారం రాజకీయ ప్రచారానికి డబ్బిచ్చి వేసే ప్రకటనలు నిషేధించబూనడం హాస్యాస్పదం. ఈ వైరుధ్యంతో పాటు, ఈ నిషేదం రాజ్యాంగంలో విస్పష్టంగా ప్రసాదించిన భావప్రకటన స్వేచ్ఛకు అవరోధమవుతుంది. కాబట్టి ఇది రాజ్యాంగ విరుద్ధం.

## మూడు చర్యలు ముఖ్యం

ఈ పరిస్థితులలో ఎన్నికల సంఘం, ప్రభుత్వం మూడు నిర్ధిష్ట చర్యలను చేపట్టడం మన ప్రజాస్వామ్య వ్యవస్థ ఆరోగ్యానికి అవసరం. మొదటగా – ఈ నిషేధాన్ని తొలగించి, రాజకీయ పార్టీలుగానీ, అభ్యర్థులుగానీ ఏ అవరోధం లేకుండా ఎలక్ట్రానిక్ మాధ్యమాల ద్వారా తమ ప్రచారం చేసుకునే అవకాశాన్ని కల్పించాలి. రెండోది – వెంటనే ప్రైవేటు మాధ్యమాలలో అన్ని పార్టీలను, వాటికి గత ఎన్నికలలో తేలిన జనబలాన్ని బట్టి విధిగా సమయాన్ని కేటాయించాలి. అందుకు వీలుగా చట్టం సూచించిన విధంగా వెంటనే నిబంధనలను జారీ చేయాలి. మూడోది – ఈ సమయాన్ని వినియోగించుకోవడానికి ఆసక్తికరమైన, ఆకర్షణీయమైన మార్గాలను అన్వేషించాలి. ఎన్నో ప్రజాస్వామ్య దేశాలలో చక్కని చర్చలు, ఆసక్తి గొలిపే వాగ్వివాదాలు ఈ మాధ్యమాలలో చోటుచేసుకుంటాయి. కోట్ల మంది చాలా నిశితంగా తమ నేతల వాదనలను గమనించి ఎవరికి ఓటు వేయాలో నిర్ణయించుకుంటారు. అమెరికాలో 1960లో అధ్యక్ష ఎన్నికల సందర్భంగా జాన్ కెనడీ, రిచర్డ్ నిక్సన్‌ల

మధ్య టివీలో బహిరంగ చర్చను ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఆ తరువాత 1976లో జిమ్మీ కార్టర్, జెరాల్డ్ ఫోర్డులు అధ్యక్ష పదవికి పోటీపడినప్పుడు మళ్లీ అలాంటి బహిరంగ చర్చలను ప్రసారం చేశారు. ఆనాటి నుండి అక్కడ ప్రతి ఎన్నికలలో క్రమం తప్పకుండా ఈ బహిరంగ చర్చలను ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నారు. 1988 నాటి నుంచి అధ్యక్ష పదవికి పోటీ పడే ప్రధాన అభ్యర్థుల మధ్య ముఖాముఖి చర్చను నిర్వహించి ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు అన్ని ప్రధాన టివి ఛానళ్లు కలిసి ఓ సంస్థను ఏర్పాటు చేశాయి. మనదేశంలో కూడా అలాంటి సంప్రదాయానికి శ్రీకారం చుట్టాలి. మంచి ప్రమాణాలతో కూడుకున్న బహిరంగ చర్చలేని ఎన్నికలు వ్యర్థం. ఎన్నికల సంఘం, ప్రభుత్వం, పార్టీలు, పత్రికలు, టివి ఛానళ్లు, పౌరసమాజం ఈ అంశంపై శ్రద్ధపెట్టి ఎన్నికల చర్చ అర్థవంతంగా, ఆసక్తికరంగా ఉండేలా, భావ ప్రకటనా స్వేచ్ఛ సార్థకమయ్యేలా సత్వరచర్యలు తీసుకోవడం అవసరం.

* * *

# సమస్యల ఘోషే తప్ప పరిష్కారాలపై ధ్యాసేదీ

*ఏప్రిల్ 26, 2004*

మన రాష్ట్రంలో మొది దశ పోలింగ్ ఏప్రిల్ 20న పూర్తయింది. ఈ వేళ రెండో దశ పోలింగు జరుగనుంది. మొదటి దశ పోలింగులో లక్షల ఓట్లు గల్లంతయ్యాయని తీవ్రమైన ఫిర్యాదులు వచ్చాయి. ఎందరో పౌరులకు ఓటరు గుర్తింపు కార్డులు కూడా మంజూరయ్యాయి. అయినా పోలింగు స్టేషన్లకు వెళితే ఓటు లేదని మొండిచేయి చూపారు. కొద్ది మాసాల క్రితమే ఎన్నికల సంఘం పెద్ద ఆర్భాటంతో ఓటర్ల జాబితాల్లో సవరరణలను చేపట్టింది. 66 లక్షల ఓట్లను తొలగించామని, కొత్తగా దరఖాస్తులు పెట్టిన వారిలో 32 లక్షల మందిని తిరస్కరించామని, 22 లక్షల మందిని కొత్త ఓటర్లుగా నమోదు చేశామని అధికారులు ప్రకటించారు. ఆనాడే ఓటర్లు జాబితాల సవరణలో అవకతవకలు చోటుచేసుకున్నాయని రాజకీయ పార్టీలు ఘోషించాయి. తొందరపాటుతో ఓటర్లు జాబితాలు సవరించటం తగదని, కాస్త ఆలస్యమయినా నింపాదిగా ఈ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని 'లోక్‌సత్తా' ఆనాడే ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేసింది. కాని తామే సర్వజ్ఞులమన్న అహంభావం, ముందుచూపులేనితనం, ఎన్నికల ప్రక్రియను ప్రజలకు చేరువగా తేవాలన్న సంకల్పం లేకపోవడం, తాము చేపట్టిన పనిలో సత్ప్రమాణాలు పాటించాలన్న ఇంగిత జ్ఞానం లోపించడం, పట్టుదల కొరవడటం– వంటివాటి కారణంగా ఎన్నికల సంఘ ఆనాడు ఆదరాబాదరాగా తూతూ మంత్రం చందంగా ఓటర్ల జాబితా సవరణను ముగించింది. దాని పర్యవసానమే ఇప్పుడు పోలింగు సమయంలో బయటపడ్డ అవకతవకలు. దురదృష్టమేమంటే, ఒకసారి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యాక, నామినేషన్లు వేయటానికి తుదిగడువు ముగిశాక, ఓటర్ల జాబితాలలో మార్పులు, చేర్పులు, తొలగింపులు సాధ్యం కావు. కేవలం సాంకేతిక లోపాలవల్ల, సిబ్బంది పొరపాట్లవల్ల ఓ కాగితం అచ్చు పడకపోతే, ఆ పొరపాటును సరిదిద్దవచ్చు. అంతేగాని జాబితాను సవరించటం సాధ్యం కాదు. నిజానికి ఎన్నికలకు కొన్ని మాసాల ముందు నుంచే ఈ మార్పులు, చేర్పులు చేపట్టడానికి పాలనా యంత్రాంగం సుముఖత చూపదు. ఎందుకంటే రాజకీయ వాతావరణం వేడెక్కాక ఓటర్ల జాబితాలో మార్పులకు సిద్ధపడితే

ప్రతి నియోజకవర్గంలోను వేలాది దరఖాస్తులు కుప్పలుతిప్పలుగా వచ్చిపడతాయి. తాత్కాలిక రాజకీయ లబ్ధికోసం ఏదో విధంగా అక్రమాలకు, దొంగ ఓట్లకు పాల్పడాలని పార్టీలు ప్రయత్నించటం సహజం. కాబట్టి ఎన్నికలకు ముందు వచ్చే ఒత్తిళ్ళను తట్టుకోవటానికి మనస్కరించక ఓటర్ల జాబితాలో సవరణలను చేపట్టడానికి అధికార యంత్రాంగం విముఖత చూపటంలో ఆశ్చర్యం లేదు. సమస్యను తాత్కాలికంగా దాటవేయాలని చూడకుండా శాశ్వత పరిష్కారాన్ని అన్వేషించటం అవసరం.

## అంతటా అవకతవకలు

ఈ మొత్తం అవకతవకలకు అక్రమాలకు కారణం ఓటర్ల నమోదు కార్యక్రమం ప్రజలకు చాలా దూరంగా ఉండటం. ఈ ప్రక్రియను కేంద్రీకరించి ప్రజలకు అందుబాటులో లేకుండా చేయటం ఓటర్ల నమోదులో పౌరుల పాత్ర నామమాత్రమయింది. చివరకు ఓటర్ల జాబితాలో పేరున్నదో లేదో తెలుసుకోవాలంటేనే నానా అగచాట్లు పడాల్సివస్తోంది. ఓ గ్రామంలో వ్యవసాయ కూలీ రామయ్య ఓటర్ల జాబితాలో తన పేరుందో లేదో తెలుసుకుని, లేకపోతే ఓటరుగా నమోదు చేయించుకుందామని భావించాడనుకోండి. ఆ రామయ్య దాటవలసిన అడ్డంకులు చూస్తే మనకు ఓటర్ల నమోదు ఎంత గందరగోళంగా ఉందో తెలుస్తుంది. ముందుగా రామయ్య తన ఊరికి దూరంలో ఉన్న మండల కేంద్రానికి వెళ్ళి అక్కడి ఎం.ఆర్.ఓ. ఆఫీసులో సమాచారాన్ని తెలుసుకోవాలి. తన గ్రామంలో పోలింగు కేంద్రం నెం. (పార్టు నెంబరు) ఎంత? దాని ఓటర్ల జాబితా కొనటానికి చెల్లించాల్సిన మొత్తం ఎంత? దాన్ని ఏ అకౌంట్‌లో జమ చేయాలి? (మేజరు హెడ్, సబ్ హెడ్, మైనర్ హెడ్– ఇలా మూడు అకౌంటు వివరాలు తెలవాలి) ఈ సమాచారం తెలిశాక మరింత దూరంగా ఉన్న పాత తాలూకా కేంద్రంలో సబ్ ట్రెజరీకి వెళ్ళాలి. అక్కడ ఛలానా ఫారం నింపి, ఆ డబ్బును సబ్ ట్రెజరీలో జమచేసి రసీదు తీసుకోవాలి. మళ్ళీ ఆ రసీదుతో సహా మండల రెవెన్యూ ఆఫీసుకు వెళ్ళాలి. అక్కడ ఆ రసీదు నమోదు చేసి ఓటర్ల జాబితాను పొందాలి– అదీ ఆ జాబితాలు వారి దగ్గర ఆనాడు అందుబాటులో ఉంటేనే. లేదంటే మళ్ళీ ఆ జాబితాలు దొరికేదాకా పడిగాపులు కాయాలి. ఆ తరవాత తన పేరు వుందో లేదో జాబితాలో చూసుకోవాలి. ఒకవేళ పేరు లేకపోతే మళ్ళీ మండల ఆఫీసులో ఆరో నంబరు దరఖాస్తులను రెండు ప్రతులు తీసుకోవాలి. రెండు

ప్రతులలో దరఖాస్తును ఓటు నమోదు కోసం పెట్టి, ఎం.ఆర్.ఒ.కు అందించాలి, అప్పుడా అధికారి దయతలిస్తే ఆ దరఖాస్తు వివరాలు తెలియజేస్తూ, ఆ నమోదుకు అభ్యంతరాలేమైనా ఉంటే వారంలోగా తనకు రాయవలసిందిగా నోటీసు బోర్డులో ప్రకటించాలి. అభ్యంతరాలేమైనా వస్తే వారం తరవాత విచారణ చేయాలి. ఆ తరవాత తన నిర్ణయాన్ని ప్రకటించాలి. అన్నీ సజావుగా ఉంటే అప్పుడు రాతపూర్వకంగా తెలపాలి. ఆ వివరాలన్నీ ఒకసారి గబగబా చదివితేనే మనకు శోష వస్తుంది! ఇంతా చేస్తే రామయ్య తన తరపున దరఖాస్తును సమర్పించవచ్చు కాని, తన కుటుంబంలో గాని, పొరుగిళ్ళలోగాని ఓటర్లుగా నమోదు కాగోరే వారి దరఖాస్తులు సమర్పించే వీలు లేదు. ఆ దరఖాస్తులు వారంతా విడివిడిగా, స్వయంగా కాని, పోస్టు ద్వారా గాని సమర్పించాలి! కేవలం ఓటర్ల జాబితాను పొందటానికి ఓటరుగా నమోదు కావటానికి అంత తతంగాన్ని పెట్టాం! ఇక జాబితాలలో అవకతవకలున్నాయంటే ఆశ్చర్యం ఏముంటుంది?

## మాటలు కాదు చేతలు కావాలి

అయితే ఈ సమస్యకు పరిష్కారమేమిటి? శాశ్వత ప్రాతిపదికన పౌరులకు ఓటర్ల జాబితాలు, నమోదు కార్యక్రమం అందుబాటులోకి తేవాలి. అందుకు మార్గమేమిటి? ప్రతి ఊరిలో, వాడలో స్థానిక పోస్టాఫీసును ఓటర్ల నమోదుకు కేంద్రంగా చేయటమే. దేశంలో రెండు లక్షల యాభైవేల పోస్టాఫీసులున్నాయి. అందరికీ పోస్టాఫీసు అందుబాటులో ఉంది. మన ప్రభుత్వ సంస్థలలో బహుశా పోస్టాఫీసు అంటేనే ప్రజలకు అతి ఎక్కువ గురి, నమ్మకం ఉన్నాయి. మరే ఆఫీసుకు వెళ్ళాలన్నా సామాన్యుడికి భయం, గుండెదడ, ఆందోళన తప్పవు! ఆ పోస్టాఫీసుల్లో ఆ గ్రామానికి లేదా వార్డుకు చెందిన ఓటర్ల జాబితాలను అందుబాటులో ఉంచి, కొనదలచిన వారికి పోలింగు కేంద్రానికి చెందిన జాబితాను అయిదు లేదా పది రూపాయల చొప్పున దేశమంతటా ఒకే ధరకు అమ్మవచ్చు. అక్కడే ఓటర్లను నమోదు చేయటానికి, పేర్లు తొలగించటానికి కావలసిన దరఖాస్తులను అందుబాటులో ఉంచవచ్చు. పూరించిన దరఖాస్తులను స్వీకరించవచ్చు. పోస్టల్ సిబ్బందికి అన్ని చిరునామాలు తెలుసు కాబట్టి ప్రాథమిక విచారణ తరవాత పేర్లను నమోదు చేసే అధికారం పోస్టాఫీసుకే ఇవ్వవచ్చు. నమోదులో పొరపాటు జరిగితే, ఆ నిర్ణయంపైన ఎం.ఆర్.ఒ.కు ఇతరులకు అప్పీలు చేసుకునే అవకాశాన్ని కల్పించవచ్చు. అలా జరిగితే ఓటర్ల నమోదు ప్రక్రియ, జాబితాలు

ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటాయి. ఈ పద్ధతి అమెరికా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, హాంగ్‌కాంగ్, ఫిజి దేశాలలో అమలులో ఉంది. మనదేశంలోనూ కేరళలో పోస్టాఫీసుల ద్వారా ఓటర్ల జాబితా సవరణ సమయంలో తనిఖీలు విజయవంతంగా చేశారు. మరి పోస్టాఫీసును ఓటర్ల నమోదుకు కేంద్రంగా చేయటానికి ఇబ్బంది ఏమిటి? అయిదేళ్ల నుంచి లోక్‌సత్తా ఇందుకోసం తీవ్ర ప్రయత్నం చేస్తోంది. ఎన్నో సమావేశాలు, చర్చలు, ఉత్తర ప్రత్యుత్తరాల తరవాత ఆ మార్పు రావాలని ఎన్నికల సంఘం, పోస్టల్ అధికారులు అంగీకరించారు. అయితే చాలాకాలంపాటు "ఎవరు ఎవరికి ముందుగా ఉత్తరం రాయాలి" అనేది తేల్చుకోలేక ఫైళ్లకు బూజుపట్టింది. మళ్ళీ 'లోక్‌సత్తా' ప్రయత్నంతో పోస్టల్ మంత్రి అరుణ్‌శౌరి, అనాటి ప్రధాన ఎన్నికల కమిషనర్ లింగ్డో జోక్యం చేసుకున్నారు. ఆ సమావేశం జరిగింది పోస్టాపీసును ఓటర్ల నమోదు కేంద్రం చేయాలని సూత్రప్రాయంగా అంగీకరించారు. కాని నేటికీ అమలు కాలేదు. ఆ ఒత్తిడి కారణంగా కొద్ది మాసాల క్రితం జరిగిన ఓటర్ల జాబితాల సవరణలో ప్రతి గ్రామంలోని గ్రామసభలోనూ, పట్టణాల్లోని వార్డుసభలోనూ ఓటర్ల పేర్లు చదివి, అక్కడే దరఖాస్తులు స్వీకరించే ఏర్పాటును దేశమంతటా చేశారు. ఒక్క మన రాష్ట్రంలోనే దాదాపు కోటి పేర్లు తొలగించినట్లుగా చెప్పారు. అయితే ఇలా టోకున పేర్లు తీసేస్తే చాలా మంది అర్హుల పేర్లు కూడా లేకుండాపోతాయి – ప్రస్తుతం జరిగిందిదే. ప్రస్తుతం ఎన్నికలలో మనం చూసిన అవకతవకలు ఎన్నికల సంఘానికి కనువిప్పు కావాలి. ఇప్పటికయినా జ్ఞానోదయమై ప్రతిగ్రామంలో, వాడలో పోస్టాఫీసును ఓటర్ల నమోదుకు కేంద్రంగా మార్చాలి. ఎప్పుడూ సమస్యను ఏకరువు పెట్టడం కాకుండా, చిత్తశుద్ధితో సమస్య శాశ్వత పరిష్కారం కోసం నడుంకట్టాలి. పౌర సమాజం, పత్రికలు, ప్రజా ఉద్యమాలు సమిష్టిగా పూనుకుని ఈ మార్పులు ఆచరణలో పెట్టాలి. కేవలం కంఠశోషతోనో, తాత్కాలిక వార్తలతోనో, నిరర్ధకమయిన చర్చలతోనో పని జరగదు.

* * *

# ప్రజల తీర్పు నేర్పుతున్న గుణపాఠాలెన్నో...

*అక్టోబర్ 11, 1999*

దేశ ప్రజలంతా ఎంతో ఉత్కంఠతో ఎదురుచూసిన ఎన్నిక ప్రక్రియ పూర్తయింది. బి.జె.పి. కూటమికి కేంద్రంలో ప్రభుత్వాన్ని నడపడానికి అవసరమైనంత మేరకు లోక్‌సభలో సంఖ్యాబలం లభించింది. కర్ణాటక, కేరళ రాష్ట్రాలను మినహాయించి దేశంలో అన్ని ప్రధాన రాష్ట్రాలలోను బి.జె.పి. కూటమికి ప్రజలు గణనీయమైన మద్దతునిచ్చారు. ఉత్తరప్రదేశ్‌లో అంతర్గత కలహాల వల్ల, ప్రభుత్వ వైఫల్యాల వల్ల బి.జె.పి. స్థానాలు దాదాపు సగానికి తగ్గాయి. అయినా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర లాంటి రాష్ట్రాలలో చేకూరిన అదనపు బలం వల్ల బి.జె.పి. – మిత్రపక్షాలు 296 స్థానాలు సాధించుకోగలిగాయి. వాజపేయి పట్ల ఉన్న విశ్వాసం, కార్గిల్ పోరులో గెలుపు, బి.జె.పి. ప్రభుత్వం పతనమయిన తీరు – ఇవన్నీ విజయానికి దోహదం చేశాయి. అలాగే సోనియాగాంధీ నాయకత్వంపై ఉన్న అనుమానాలు కాంగ్రెస్‌కు ఇబ్బందులు కలుగజేశాయి. లోక్‌సభలో కాంగ్రెస్ బలం 28 స్థానాలు తగ్గుతోంది. ఏ రాష్ట్రంలోను కాంగ్రెస్ 20 స్థానాలు సాధించుకోలేకపోయింది. మహారాష్ట్రలో బి.జె.పి. – శివసేన ప్రభుత్వ వ్యతిరేక పవనాలు బలంగా ఉన్నా, కాంగ్రెస్‌లో చీలికవల్ల తగిన లాభం పొందలేకపోయింది.

## అయోమయంలో కాంగ్రెస్

కాంగ్రెస్ ప్రాధాన్యం తగ్గిందనుకోవడానికి మాత్రం వీల్లేదు. ఇప్పటికీ కాంగ్రెస్ పార్టీయే బలమైన ప్రతిపక్షం. ఏ ప్రధాన రాష్ట్రంలోను పెద్ద ఎత్తున సీట్లు రాకపోయినా లోక్‌సభలో 112 స్థానాల వరకు సాధించటమూ సామాన్యమయిన విషయం కాదు. కాంగ్రెస్‌కు సీట్ల సంఖ్య తగ్గినా, ఓట్ల శాతం కొంత మేరకు పెరిగింది. ఉత్తరప్రదేశ్‌లో చాలా కాలం తరవాత కాంగ్రెస్ ఓట్ల శాతం పెంచుకుని 10 సీట్లు సాధించింది. దేశంలో చాలా ప్రాంతాలలో, ముస్లిములు, ఇతర మైనారిటీలు కాంగ్రెస్ వైపు మళ్లీ మొగ్గుచూపుతున్నారు. కర్ణాటకలో బి.జె.పి. – జనతాదళ్ (యు) కూటమిని ఓడించి కాంగ్రెస్ మంచి మెజారిటీతో అధికారం కైవసం చేసుకుంది. మహారాష్ట్రలో బలమైన శరద్‌పవార్ వర్గం చీలిపోయినా కాంగ్రెస్ పతనం కాకుండా తన ఉనికిని కాపాడుకోగలిగింది. వాస్తవానికి కాంగ్రెస్‌లో చీలిక లేకుంటే మహారాష్ట్రలో కాంగ్రెస్‌కు

బహుశ 40 స్థానాలకు పైగా దక్కేవి. అదే జరిగితే బి.జె.పి. కూటమికి లోక్‌సభలో మెజారిటీ వచ్చేదీ కాదు! కాబట్టి లోతుగా చూస్తే ఈ ఎన్నికలో బి.జె.పి. పెద్దగా బలపడలేదు. ఇన్ని అనుకూల పరిస్థితులున్నా బి.జె.పి.కి సంఖ్యాబలం పెరగలేదు. కాబట్టి భారత రాజకీయంలో కాంగ్రెస్ పాత్ర ఏమీ తగ్గదు. సమర్థ నాయకత్వాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా రూపొందించుకుని, మన ఫెడరల్ వ్యవస్థకు అనుగుణంగా ఇతర పార్టీలను కలుపుకుపోగలిగితే భవిష్యత్తులో కాంగ్రెస్ మళ్ళీ ఓ బలమైన శక్తిగా అవతరించగలదు. అయితే ఎంతసేపటికీ కుటుంబపాలన మీద వ్యక్తి ఆరాధన మీద ఆధారపడి, తమ పార్టీ సభ్యులలాగే దేశప్రజలంతా తమ అధినాయకులకు బ్రహ్మరథం పడతారని ఆశిస్తే కాలక్రమేణా కాంగ్రెస్ కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. ఎప్పుడూ లేనంత తక్కువ సంఖ్యలో లోక్‌సభ సీట్లను పొందిన కాంగ్రెస్ పార్టీ ఈ సంక్షోభాన్ని విజ్ఞతతో దేశప్రయోజనాల దృష్టితో ఎదుర్కొంటుందో, లేక గతంలోలాగానే నెహ్రూ కుటుంబ ఆరాధనే తప్ప మరో ఊసులేకుండా ఆత్మహత్యాసదృశ్యంగా ప్రవర్తిస్తుందో వేచి చూడాలి. బలమైన, విజ్ఞతతో కూడిన ప్రజాస్వామ్య బద్ధమైన కాంగ్రెస్ పార్టీ దేశానికి అవసరం. కానీ, కాంగ్రెస్ పార్టీకే నెహ్రూ కుటుంబం ధ్యాస తప్ప దేశం అవసరం లేనట్టు కనిపిస్తోంది. స్వతంత్ర పోరాటంలో దేశరాజకీయ చరిత్రలో అత్యంత కీలకపాత్ర వహించిన కాంగ్రెస్ పార్టీ ఇంతగా అయోమయంలో చిక్కుకోవటం జాతి ప్రయోజనాలకు నష్టకరం.

## విచక్షణతో వేసిన ఓటు

ఈ దేశంలోని సాధారణ ఓటర్లు మరోమారు పార్టీల కళ్ళు తెరిపించే ప్రయత్నం చేశారు. ఢిల్లీ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, గోవాలలో బి.జె.పి.ని కొన్ని నెలల క్రితమే మట్టికరిపించిన ప్రజలు ఈ పార్లమెంట్ ఎన్నికలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బి.జె.పి.కి మద్ధతిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను సమర్థించినా కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వద్దని కూడా ఓటర్లు స్పష్టంగా సంకేతాలు ఇస్తున్నారు. కర్ణాటకలో ముఖ్యమంత్రి జె.హెచ్. పటేల్ తన మంత్రివర్గంలో అత్యధికులతో కలిసి పార్టీ మొత్తాన్ని లోక్‌శక్తితో కలిపి బి.జె.పి.తో పొత్తు పెట్టుకున్నారు. అధికార పక్షం ప్రధాన ప్రతిపక్షంతో కలిసిపోయినా ఈ అనైతిక పొత్తును ప్రజలు నిర్ద్వంద్వంగా వ్యతిరేకించి కాంగ్రెస్‌కు అధికారాన్ని ఇచ్చారు. ముఖ్యమంత్రి పటేల్, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, మాజీ ప్రధాన మంత్రి దేవేగౌడ తమ స్థానాలను నిలబెట్టుకోలేకపోయారు. అలాగే మహారాష్ట్రలో కాంగ్రెస్ చీలినా దుష్పరిపాలన అందించిన శివసేన–బి.జె.పి. కూటమికి

గట్టిగా బుద్ధిచెప్పే ప్రయత్నం చేశారు. ప్రధాన ప్రతిపక్షం నిలువునా రెండు ముక్కలైనా పాలకపక్షానికి మెజారిటీ రాలేదు. తమిళనాడులో జయలలిత – కాంగ్రెస్ కూటమిని ఓడించి బాధ్యతారహితంగా నీతిబాహ్యమైన రాజకీయాన్ని నడిపితే క్షమించబోమని చాటారు. ఒరిస్సాలో మంచి పాలన అందించకుండా ముఠాకలహాలతో మునిగిపోయిన కాంగ్రెస్‌ను మట్టికరిపించారు. పంజాబ్‌లో అకాలీదళ్ అహంకారాన్ని, బంధుప్రీతిని, మత విషయాలలో జోక్యాన్ని నిరసించి గుణపాఠం చెప్పారు. ఉత్తరప్రదేశ్ తన కంచుకోటగా భావించిన బి.జె.పి. కులాల పోరాటంలో మునిగిపోయి, నేరచరితులకు, ఫిరాయింపుదారులకు పదవులిచ్చింది. పరిపాలన కుంటుపడింది. ప్రజలు అతి పెద్ద రాష్ట్రంలో ఆ పార్టీ సంఖ్యాబలాన్ని సగానికి తగ్గించారు. అందునా బి.జె.పి. అల్పసంఖ్యాక వర్గాలకి ధైర్యాన్ని ఇవ్వడంలో విఫలమయింది. ఆ కారణంగా దేశంలో చాలా రాష్ట్రాలలో మైనారిటీలు బి.జె.పి.కి వ్యతిరేకంగా ఎవరు గెలిచే అవకాశం ఉంటే వారికి ఓట్లు వేసి తమ ఆందోళనను, వ్యతిరేకతను వ్యక్తపరిచారు. బీహార్ తన స్వంత సంస్థానం అనుకున్న లాలూయాదవ్ స్వయంగా ఓడిపోవడంతోబాటు కాంగ్రెస్‌తో కలిసి కూడా 20 శాతం స్థానాలు మాత్రమే పొందగలిగారు. ఇలా దేశమంతటా ప్రజల ఆలోచన, విచక్షణ ప్రస్ఫుటంగా కనపడ్డాయి.

## జనాకర్షక పథకాలకు దూరం

ఇవన్నీ ఒక ఎత్తు– ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల తీర్పు ప్రభావం మరో ఎత్తు. 1971 నుండి నేటివరకు మన రాజకీయాలు జనాకర్షక పథకాల చుట్టూ నడిచాయి. ఇందిరాగాంధీ, యం.జి.ఆర్., ఎన్.టి.ఆర్. లాంటి నాయకులు జనాకర్షక పథకాలతో, వాగ్ధానాలతో ప్రజలకు తాయిలం చూపెట్టి ఓట్లు పొందడంలో విజయం సాధించారు. ఎక్కువమంది నిరక్షరాస్యులు, బీదలు ఉన్న దేశంలో జనాకర్షక వాగ్ధానాలు లేకుండా ఎన్నికలలో గెలవడం కష్టమనే భావన పార్టీలో ప్రబలింది. ప్రజలను కాలక్రమేణా చేయిచాచి అర్థించే యాచకులుగా భావించడం మొదలుపెట్టాయి. సామాన్యప్రజలు కూడా ప్రతీదానికి ప్రభుత్వం మీద ఆధారపడటానికి అలవాటు పడ్డారు. ఒకవిధంగా 1999లో ఆంధ్రప్రదేశ్ ప్రజల తీర్పు ఈ ఒరవడికి అడ్డుకట్ట వేసి మన రాజకీయ చరిత్రను తిరగరాసింది. మనరాష్ట్రంలో 1983 నుంచి తెలుగుదేశం పార్టీ జనాకర్షక పథకాలను అమలుచేయటంలో ముందంజవేసింది. కాంగ్రెస్ కొంతమేరకు బాధ్యతతో కూడిన ఆర్థిక విధానాలను ప్రతిపాదించింది. కానీ, రెండు రూపాయలకు కిలో బియ్యం, యాభై రూపాయలకు హార్స్‌పవర్ విద్యుత్తు వగైరా పథకాల ప్రచారం వల్ల

కాంగ్రెస్ పార్టీకి ఎన్నోమార్లు ఎదురుదెబ్బ తగిలింది. మనరాష్ట్రంలో గత నాలుగేళ్ళుగా తెలుగుదేశం ప్రభుత్వం క్రమక్రమంగా గతంలో అనుసరించిన పంథాని మార్చడంలో కొంతమేరకు విజయం సాధించింది. కానీ ఇదే సమయంలో జనాకర్షక వాగ్ధానాలు లేకపోతే విజయం సాధించడం అసాధ్యమని భావించిన కాంగ్రెస్ పార్టీ రైతులకు ఉచిత విద్యుత్తు హమీనిచ్చింది. చాలామంది పరిశీలకులు ఈ వాగ్ధానం ప్రచారం ఎన్నికలమీదే విశేషంగా ఉంటుందని తెలుగుదేశం పార్టీ కూడా ఇలాంటి వాగ్ధానాలు చేయకపోతే గెలుపు కష్టం అవుతుందని భావించారు. కానీ ఓటర్లు తమ విజ్ఞతను ప్రదర్శించి దేశరాజకీయ చరిత్రను మలుపుతిప్పారు. తెలుగుదేశం పార్టీకి తెలంగాణా, రాయలసీమలలోని మెట్టప్రాంతాలలో లభించిన ఓట్లను గమనిస్తే ప్రజలు దేనినీ ఉచితంగా ఆశించటం లేదని, ప్రభుత్వాన్ని చేయిచాచి అర్ధించటం లేదని రుజువయ్యింది. ఇది మన రాజకీయాలలో అసాధారణమైన అనుభవం. బి.జె.పి.తో పొత్తువల్ల చేరిన బలం కొంతమేరకైనా ఫలితాలు సాధించే కృషి జరుగుతుందన్న నమ్మకం తెలుగుదేశానికి విజయాన్ని సాధించిపెట్టాయి. కొన్ని మాసాల క్రితం మధ్యప్రదేశ్‌లో దిగ్విజయ్‌సింగ్ సారథ్యంలో కాంగ్రెస్ సాధించిన విజయం ఇలాంటిదే. అయితే ఆనాడు ఉల్లిపాయలు, ఇతర నిత్యావసర ధరల పెరుగుదల బి.జె.పి.కి వ్యతిరేకంగా పనిచేసింది. అదీకాక ప్రతిపక్షంలో ఉన్న బి.జె.పి. మధ్యప్రదేశ్‌లో ఉచిత విద్యుత్తులాంటి జనాకర్షక పథకాలను ప్రకటించలేదు. ఈ విధంగా ఆలోచిస్తే ఇప్పటి తెలుగుదేశం పార్టీ విజయం దేశ ఆర్థిక వ్యవస్థ భవిష్యత్తుకు శుభసూచకం. 1998 పార్లమెంటు ఎన్నికలలో 18% వరకు ఓట్లు పొందిన బి.జె.పి.తో పెట్టుకున్న పొత్తు తెలుగుదేశం పార్టీకి చాలా మేలు చేకూర్చింది. అందుకే ఎప్పుడూ లేనిది పట్టణప్రాంతాలలో పెద్దయెత్తున తెలుగుదేశం పార్టీ ప్రజల మద్దతు పొందింది. అలాగే బి.జె.పి. పొత్తువల్ల కొంతవరకు మైనారిటీలు దూరమైనా పూర్తిగా వ్యతిరేకం కాలేదు. గత 16 సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీ మైనారిటీల ప్రయోజనాలను రక్షించి, వారికి భద్రత చేకూర్చటం ఇందుకు ప్రధాన కారణమనవచ్చు. తెలుగుదేశానికి ఇదివరకటి కంటే తిరుగులేని అధికారాన్ని మాత్రం ప్రజలివ్వలేదు. శాసనసభలో కాంగ్రెష్ సంఖ్యాబలం 31/2 రెట్లు పెరిగింది. సాక్షాత్తు ముఖ్యమంత్రి సోదరుడ్నే ఓడించి ప్రజలు తాము విచక్షణతో ఓటు వేయగలమని రుజువు చేశారు. పాలకపక్షానికి తగిన సంఖ్యాబలం వల్ల సుస్తిర ప్రభుత్వం సాధ్యమవుతుంది. అలాగే బలమైన ప్రతిపక్షం ఉండటంతో ప్రజాస్వామ్యం బలపడుతుంది. స్వల్పకాలిక జనాకర్షక విధానాలను

ప్రజలు తిరస్కరించటంతో ఆర్థిక సౌష్టవానికి అవకాశం పెరుగుతుంది.

## రానున్నది గడ్డుకాలం

వామపక్షాలు దేశమంతటా జనాకర్షక విధానాలకు, నినాదాలకు పెట్టింది పేరు. ఈ ఎన్నికతో వామపక్షాలు బలహీనమయ్యాయి. కాలం, స్థితిగతులు మారినా పిడివాదాలు వినిపిస్తూ క్రమక్రమంగా ప్రజలకు దూరమయ్యాయి. సబ్సిడీలు, రాయితీల మీద రాద్ధాంతం తప్ప సంపద సృష్టికి మార్గాలు అన్వేషించి ఉపాధి కల్పన చేపట్టలేని పార్టీలు, విధానాలు దీర్ఘకాలం ప్రజలను ఆకర్షించలేవని రుజువయ్యింది. అందుకే బెంగాల్ లాంటి రాష్ట్రాల్లో కూడా వామపక్షాల ఓట్ల శాతం తగ్గింది. చాలా అసెంబ్లీ సెగ్మెంటులలో తృణమూల్ కాంగ్రెస్‌ది పైచేయి అయ్యింది. జ్యోతిబసు రాజకీయాల నుండి విరమిస్తామని ప్రకటించడంతో మన రాజకీయ చరిత్రలో ఓ శకం అంతమయింది. అంతమాత్రం చేత మానవ వాదం ప్రభావం, సాంఘిక న్యాయం కోసం జరిగే పోరాటాలు అంతరిస్తాయనుకుంటే పొరపాటు. ఇప్పుడు కావల్సింది పరిస్తితుల్ని బేరీజు వేసుకుని అన్ని వర్గాలను సమన్వయపరచడం. సంపద పెంచి బడుగుజీవులకు కనీస అవసరాలు విద్య, ఆరోగ్యం, ఉపాధి అందించే విధానాలు. అంతేకాని అటు సబ్సిడీలు, స్వల్పకాలిక జనాకర్షక పథకాలు, ఇటు సామాన్యులకు మౌలిక సౌకర్యాలు అందించలేని రాజ్యాంగబద్ధమైన దోపిడీ, పైన పైన కనిపించే అభివృద్ధి సమస్యలకు పరిష్కారాలు కాజాలవు. రానున్న ఐదేళ్ళూ మన దేశ భవిష్యత్తుకు గడ్డుకాలం. అధికారాన్ని వికేంద్రీకరించి ప్రజల నుండి వసూలు చేసే పన్నులకు వారికి అందే సౌకర్యాలకు మధ్య సంబంధం పెరిగేలా పాలకులు ప్రజలకు జవాబుదారీలా ఉండేలా మౌలిక సంస్కరణలు తేవాలి. అటు బీదరికాన్ని నిర్లక్ష్యం చేసినా, ఇటు సంపద సృష్టించకపోయినా, ఆర్థిక వ్యవస్థ, సమాజం అతలా కుతలమవుతాయి. ఈ సంక్షోభాన్ని అధిగమించే దూరదృష్టి, విజ్ఞత మనకవసరం. అందుకు ప్రజలు తమ పాత్ర నిర్వహించారు. ఇక ఎన్నికయిన వాళ్ళు విలాసాలలో మునిగి తేలతారో, అహంకారంతో ఆత్మస్తుతికి పాల్పడతారో, లేక వినమ్రంగా ప్రజలకు సేవకులుగా ప్రవర్తించి అన్యాయానికి, అవినీతికి మారుపేరైన పాలనను ప్రక్షాళన చేస్తారో భవిష్యత్తు నిర్దేశిస్తుంది. ప్రజలు మౌనంగా వేచి వుండటం కాక పరిజ్ఞానంతో సంఘటితంగా నిలదీస్తేనే ఆశించిన ఫలితాలు వస్తాయి.

* * *

# అధికార పీఠాలను శాసిస్తున్న ఆధునిక పిండారీలు!

*ఏప్రిల్ 12, 1999*

ఆ మధ్యన ఒక ప్రధాన రాష్ట్రంలో ముఖ్యమంత్రిని మార్చారు. కొత్త ముఖ్యమంత్రి పదవిలోకి రాగానే, ఒక నేర సామ్రాజ్య చక్రవర్తిని కనీసం వందమంది టెలిఫోను ద్వారా అభినందించారట – అతని మనిషి ముఖ్యమంత్రి అయినందుకు! టెలిఫోనులోనే అభినందన సందేశాలు ఎందుకిచ్చారు? వ్యక్తిగతంగా కలుసుకుని ఎందుకు చెప్పలేదు? దానికీ ఓ కారణముంది. ఆ నేర చక్రవర్తి మనలాగా మామూలుగా నేల మీద ఇళ్ళల్లో నివసించడు – ఎవరయినా శత్రువులు అర్ధరాత్రో, అపరాత్రో గుట్టుచప్పుడు కాకుండా వచ్చి కాల్చివేస్తారని భయం! అందుకే ఓ విలాసవంతమయిన చిన్న ఓడలో సముద్రంలో, తీరానికి కాస్త దూరంగా నివసిస్తున్నాడు! చుట్టూ అతని ప్రైవేటు సైన్యం రాత్రింబవళ్ళు వేయి కళ్ళతో పహారా కాస్తుంటుంది. అనుమతి లేకుండా సముద్రంలో ఎవరు ఓడకు దగ్గరగా వచ్చినా నిర్దాక్షిణ్యంగా కాల్చివేయటం వాళ్ళపని! సముద్రం మీద నివసిస్తే ఏ మరబోటయినా, మరో పడవ అయినా దగ్గరకి వస్తుంటే కనిపించకుండా ఉండే ప్రశ్నేలేదు. రాత్రిపూట చూడటానికి ఇన్ఫ్రారెడ్ కెమెరాలు, సెర్చిలైట్లు ఉంటాయి. అంటే నీటి అడుగు నుంచి సబ్‌మెరైన్లో వస్తే తప్ప అనుమతి లేకుండా ఆ ఓడ దగ్గరకు ఎవరూ రాలేరు! దేశంలో నేరస్తుల ముఠాలు ఇంకా సబ్ మెరైన్ల స్థాయికి ఎదగలేదు. అంతవరకు అది ప్రజల అదృష్టం! అందువల్ల ఆ నేర సామ్రాజ్యాధిపతి ఆ ఓడలో నుంచి సెల్ ఫోన్ల ద్వారా మాత్రమే అందుబాటులో ఉంటాడు. అలాంటి నేర చక్రవర్తి మనిషే అంతటి ప్రముఖమైన రాష్ట్రంలో నేటి ముఖ్యమంత్రి అని చాలామంది అభిప్రాయం.

## విస్తరిస్తున్న నేర సామ్రాజ్యం

ఇదేమీ పెద్దగా ఆశ్చర్యపడవలసిన విషయం కాదు. మన దేశంలో అన్ని రాష్ట్రాలలో కలిపి 4072 మంది శాసనసభ్యులలో 700 మందికి పైగా నేరచరితులేనని వార్తలు వచ్చాయి. అంటే ప్రతి అరుగురిలో ఒక శాసనసభ్యుడు నేరచరిత్ర గలవాడు. మిగిలిన ఐదుగురిలో కూడా కనీసం ఇద్దరు ముగ్గురు నేరస్తుల అండదండలతో

అధికారంలోకి వచ్చి తమను సమర్ధించిన నేరస్తులకు అభయహస్తం అందించి చట్టానికి వారు అందకుండా రక్షిస్తున్నారు! అలాంటప్పుడు నేరుస్తుల మనుషులు అత్యున్నత స్థానాలకి ఎగబాకటంలో ఆశ్చర్యం లేదు. న్యాయవ్యవస్థ వైఫల్యం పుణ్యమా అని నేరస్తులే ప్రస్తుతం మొరటు న్యాయాన్ని అందిస్తున్నారు. మూడు కోట్లకు పైగా కేసులు అపరిష్కృతంగా ఉండటంతో కోర్టుల మీద ఎవరికీ పెద్దగా విశ్వాసం లేదు. అందువల్ల స్థానిక నేర ముఠాలను ఆశ్రయించి తమకు జరిగిన అన్యాయానికి పరిష్కారం కోరటం చాలా ప్రాంతాలలో ఆనవాయితీ అయిపోయింది. ఆ ముఠా పెద్ద ఎత్తున డబ్బు గుంజి ఇరుపక్షాలను పిలిచి, వారి వాదనలు విని, అక్కడికక్కడ ఫైసలా చేస్తుంది. దానికి ఇరుపక్షాలు అంగీకరించి లోబడి ఉండవలసిందే. ఎవరయినా, తాత్సారం చేస్తే కీళ్ళు విరిచేయటం, మరీ పరిస్థితి చేయిదాటితే ఎదురు తిరిగిన వాడిని చంపివేయటం జరుగుతుంది. అందుకే కోర్టుల తీర్పులను ఖాతరు చేయకుండా తాత్సారం చేయవచ్చుగాని, ఈ నేరస్తుల కోర్టు తీర్పును తక్షణం అమలు పరచవలసిందే! 52 ఏళ్ళ స్వతంత్రం దరిమిలా దేశంలో ఎక్కడ చూసినా కాస్త అటు ఇటూగా ఇదే పరిస్థితి. రైతులు మార్కెట్లో ఏమన్నా అమ్ముకోవాలంటే అక్కడ పెత్తనం చేస్తున్న దాదాలకు డబ్బులిచ్చుకోవాల్సిందే. ఎవరన్నా చిన్న వ్యాపారం పెట్టుకుంటే రౌడీ మామూలు ఇవ్వందే నెగ్గుకురావటం కష్టం. ఇక ఆస్తుల కొనుగోలు విషయంలో చెప్పనక్కరలేదు. కష్టపడి సంపాదించిన సొమ్ముతో భూమి కొంటే అది ఆసామి చేతుల్లోనే సురక్షితంగా ఉంటుందని ఎవరూ చెప్పలేరు. ఓ ఇల్లు కట్టుకుని అద్దెకిస్తే, కిరాయికున్న వ్యక్తి ఖాళీ చేస్తాడో లేడోనని ఆసామికి ఎప్పుడూ గుండె దడే! ఇటీవలి కాలంలో అయితే కాస్తో కూస్తో డబ్బుండటమే పాపం అయింది. బంబాయి నగరంలో ఎవరన్నా మంచి కారు కొనుక్కుంటే, ఆ కారు ఇంటికి చేరేలోగానే ఫోనులో సందేశం వస్తుంది. కొత్తకారు కొనుక్కున్నందుకు అభినందిస్తూనే, వెంటనే తమకు ఎంత డబ్బు ముట్టచెప్పాలో ఆదేశం అందుతుంది. ఆలస్యం చేసినా, పోలీసుల దగ్గరకు వెళ్ళినా చావు తప్పదని హెచ్చరిక అందుతుంది. అలాగే ఒక ప్లాటు కొనుక్కున్నా, తాము తీసిన ఓ సినిమా విజయవంతమయినా నేరముఠాల పాట్లు తప్పవు. పోలీసులు కూడా చాలా సందర్భాలలో అశక్తులు. ఓ పక్కన చట్టాలలో లొసుగులు, న్యాయస్థానాలలో విపరీత పద్ధతులు వారి చేతుల్ని కట్టేస్తున్నాయి. మరోవంక ఉన్న కొద్దిగూండాలే ప్రత్యక్షంగా అధికారం చేతబుచ్చుకుంటుంటే వాళ్ళని, వాళ్ళ మనుషుల్ని ఎలా అదుపుచేయాలో తెలియక తలలు పట్టుకు కూర్చుంటున్నారు. దేశమంతటా

అన్ని రంగాలలోను బలంగా వేళ్ళూనుకున్న అవినీతి జాడ్యం పోలీసులకు కూడా సోకటంతో, చాలా సందర్భాలలో పోలీసు యంత్రాంగంలో అవినీతిపరులకు నేరస్తుల ముఠాలకు మధ్య గాఢమైన సంబంధాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో నేరాలు చేసినందుకు చెరసాలలో ఉండవలసిన వాళ్ళు, హత్యలు చేసినందుకు ఉరిశిక్ష పడవలసిన వాళ్ళు ఘరానా మనుషులుగా చెలామణీ అవుతున్నారు. అంతటితో ఆగక రాజకీయం పేరుతో కొనసాగే దోపిడీ పుణ్యమా అని ఆ గూండాలే సాక్షాత్తూ నాయకులుగా రూపాంతరం చెందుతున్నారు. చాలా ప్రాంతాలలో డబ్బుకోసం కిడ్నాపులు యథేచ్ఛగా సాగిపోతున్నాయి. ఇంట్లో పిల్లల్నో, పెద్దలనో తుపాకీ చూపించి బెదిరించి ఎత్తుకుపోవటం, ఆ తరవాత డబ్బివ్వమని ఇంట్లో వాళ్ళకు సందేశం పంపటం, వాళ్ళు డబ్బిచ్చి తమ కుటుంబ సభ్యులను విడిపించుకుపోవటం – ఇదో పెద్ద వ్యాపారంగా మారిపోయింది. ఎన్నో నేరస్తుల ముఠాలు ఇందులో పాల్గొంటున్నాయి. ఈ కిడ్నాపుల వ్యాపారానికి ఎందరో నాయకుల అండదండలున్నాయని అందరికీ తెలిసిందే. అందుకే పోలీసులు చూసీచూడనట్లు ఊరుకుంటున్నారు. ఎవరన్నా పోలీసు అధికారులు తమ బాధ్యతను ధర్మబద్ధంగా నిర్వహించే ప్రయత్నం చేస్తే అనతికాలంలో వారిని సాగనంపటం తథ్యం. పైవాళ్లకు కోపం తెప్పించకుండా రాజకీయంగా వారికి వ్యతిరేకమయిన వారి మీద మాత్రమే తమ ప్రతాపం చూపటం పోలీసులకు అలవాటయిపోయింది. చట్టాన్ని సమంగా ఉపయోగించకుండా ఏకపక్షంగా కొందరిమీదే ప్రయోగించటంతో సహజంగానే అది రాజకీయ విమర్శలకు, వాదోపవాదాలకు దారితీస్తుంది. ప్రజలకు పోలీసు యంత్రాంగం మీదున్న కాస్తపాటి విశ్వాసం సడలిపోతుంది. తరచు అధికారం చేతులు మారుతూ ఉంటుంది కనుక, మళ్ళీ అధికార పీఠం మీదికి వచ్చిన కొత్త నాయకులు తమ వాళ్ళను రక్షించుకోవటం, అదివరకు పడ్డ 'కష్టాలకు' ప్రతిఫలం వచ్చేలా పూర్తి మద్ధతునివ్వటం, పూర్వం తమను వేధించిన వాళ్ళమీద కక్ష తీర్చుకోవటం, తమ వాళ్ళమీద బలప్రయోగం చేసిన అధికారుల్ని శంకరగిరి మాన్యాలు పట్టించటం, ప్రత్యర్థులను మట్టి కరిపించటం – షరా మామూలే!

## చట్టానికి తిలోదకాలు

ఎక్కడిదాకానో పోనక్కరలేదు. మన రాష్ట్రంలోనే కొన్ని సంఘటనల్ని పరిశీలిస్తే

ప్రధాన పార్టీలు ప్రజాహితాన్ని ఏ విధంగా పాతిపెడుతున్నాయో, నేరప్రవృత్తి ఎలా పాకిపోతోందో తెలుస్తుంది. 1989లో మన రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీని ఓడించి ఏడేళ్ళ తరవాత కాంగ్రెస్ అధికారాన్ని చేజిక్కించుకుంది. అధికారం రాగానే ఆ ప్రభుత్వం చేసిన పనులలో ప్రధానమైనది– కొన్ని వేలమంది నేరస్తుల మీద కేసుల్ని ఎత్తివేయటం! అదేమంటే వాళ్ళంతా తమ మనుషులు! మళ్ళీ ఇటీవల తెలుగుదేశం ప్రభుత్వం కొన్ని వందల కేసుల్ని ఏకపక్షంగా ఎత్తివేసి చట్టానికి, ధర్మానికి తిలోదకాలిచ్చింది. అలా ఎందుకు చేశారని ప్రశ్నిస్తే సమాధానం వీళ్ళంతా తమ మనుషులని! అంటే ఇరుపక్షాలకు కావలసింది నేరస్తులు, గూండాలేగానీ సామాన్యప్రజలు మాత్రం కాదు. పైకి ఎన్ని కల్లబొల్లి కబుర్లు చెప్పినా ఇది కఠోరవాస్తవం. ఒక పార్టీ వాళ్ళు చేసిన దుర్మార్గాలు చూపెట్టి, మరో పార్టీ తన సిగ్గుమాలిన చర్యల్ని సమర్థించుకుంటుంది. చెప్పే మాటలకు, చేసే పనులకు ఏమాత్రం సంబంధం లేకుండా పోయింది. దయ్యాలు వేదాలు వల్లించటం సర్వసాధారణమయిపోయింది. ఇప్పటివరకు అధికారంలో ఉన్న వాళ్ళు లైసెన్సు–పర్మిటు రాజ్యంలో ప్రజల్ని నిరాటంకంగా దోచుకున్నారు. ఏ చిన్న పని కావాలన్నా ప్రభుత్వం దగ్గర చేయిచాపేలా చేసి పౌరుల్ని బానిసలుగా మార్చారు. ప్రజలు వేరే గతిలేక ఈ నయా బంధిపోటులకు డబ్బు సమర్పించుకుని పని చేయించుకోవటానికి అలవాటుపడ్డారు. అధికారం అంటేనే విశృంఖలమైన దోపిడీగా మారిపోయింది. ఇటీవలి కాలంలో ఆర్థిక సంస్కరణల కారణంగా ప్రభుత్వానికి ఉన్న లైసెన్సు–పర్మిటు అధికారం తగ్గి ఈ దోపిడీకి తెరపడుతుందేమోనని చాలామంది ఆశించారు. ఏదో విధంగా ఈ కుహనా నాయకులు తమ దగ్గరే అధికారాన్ని ఉంచుకుని, బ్లాక్‌మెయిల్ చేసి, బెదిరించి పెద్ద ఎత్తున డబ్బు చేసుకుంటున్నారు. నేడు కాకపోతే రేపన్నా ఈ దుర్మార్గం అంతమవుతుందని నమ్మకం లేదు. ఎందుకంటే లైసెన్సు – పర్మిట్ అధికారాలు తగ్గినా, ప్రభుత్వాల దగ్గర ఎప్పటికీ ఉండే బాధ్యతలు శాంతి భద్రతలు, నేర పరిశోధన, పోలీసు యంత్రాంగంపైన ఆధిపత్యం, న్యాయాన్ని అందించడం. ఈ బాధ్యతలను అడ్డుపెట్టుకుని, వాటిని విశృంఖల అధికారాలుగా మలుచుకుని నేరస్తులను రక్షించటం, ప్రజల్ని దోచుకోవటం పెరిగిపోతోంది. 19వ శతాబ్దం ప్రారంభంలో మధ్య భారతంలో పిండారీల పేరుతో దోపిడీ ముఠాలు నానా బీభత్సం చేసి, అరాచకత్వాన్ని సృష్టించి సమాజాన్ని అతలాకుతలం చేశాయి. వాళ్ళ ఆగడాలకు తాళలేక ప్రజలు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ బతికేవారు.

1815వ సంవత్సరానికల్లా రాజపుటానా, మాళ్వ, గుజరాత్, దక్షిణ బీహార్ ప్రాంతాలలో పిండారీల సంఖ్య లక్ష దాటింది. వాళ్ళు మర ఫిరంగులు, తుపాకీలు సంపాదించుకుని ఒక సైన్యంలాగా తయారయ్యారు. కొందరు మరాఠా నాయకులు కూడా వారికి తోడయ్యారు. నిజాం రాజ్యంపైన, ఉత్తర సర్కారులపైన పిండారీలు దండయాత్రలు చేసి దోచుకోవటం మొదలుపెట్టారు. చివరికి అప్పటి గవర్నర్ జనరల్ లార్డ్ హేస్టింగ్స్ పెద్ద ఎత్తున సైన్యాన్ని పంపి 1817 నుంచి 1820 దాకా నాలుగేళ్ళపాటు భీకరయుద్ధం చేశాక పిండారీలను అంతమొందించగలిగారు. మధ్యయుగాల అరాచకత్వాన్ని వలస పాలకులు అలా క్రమక్రమంగా అదుపు చేయగలిగారు. 50 ఏళ్ళ స్వతంత్ర భారతంలో సాధించింది ఏమిటా అని ఆలోచిస్తే, మళ్ళీ మన దేశాన్ని 1820ల నాటి అరాచకత్వంలోకి తీసుకుపోగలిగాం. నవీన పిండారీల చేతుల్లో పెట్టాం! ఆనాడు ఓడినా పిండారీలు ఇప్పుడు గెలిచారు. ఇందుకా మనకు స్వతంత్రం వచ్చింది? ఇదా బాపూజీ కలలుగన్న స్వరాజ్యం? ఇందుకా అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించింది?

* * *

# నేడు అన్యాయాన్ని సహిస్తే రేపు మనకూ జరిగేదదే!

*జూన్ 4, 2001*

**....రెండో ప్రపంచ యుద్ధ కాలంలో ఓ కవి రాసినట్లు, 'ముందుగా నాజీలు యూదులకోసం వచ్చారు. నేను యూదుణ్ణి కాదు, అందుకని పట్టించుకోలేదు. ఆ తరువాత నల్లవాళ్ళ కోసం వచ్చారు, నేను నల్లవాణ్ణి కాదు, అందుకని పట్టించుకోలేదుద. ఆ తరువాత ట్రేడ్ యూనియనిస్టుల కోసం వచ్చారు. నేను ట్రేడ్ యూనియన్లలో లేను, అందుకని పట్టించుకోలేదు, చివరికి నా కోసం వచ్చారు, చుట్టూ చూస్తే నన్ను రక్షించటానికి ఎవరూ మిగలలేదు" ఈ దేశంలో అన్యాయాలను ఎదిరించటంలో ఇప్పటికే మనమంతా ఆలస్యం చేశాం. ఇంకా మిన్నకుంటే నష్టపోయే మనమే..**

జస్టిస్ నానావతి కమిషన్ ముందు ఆనాటి ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పాత్రికేయుడు సంజయ్ సూరి ఈ వారం ఇచ్చిన సాక్ష్యం మన దేశంలో న్యాయాన్ని, సత్యాన్ని ఎంతగా నిర్లక్ష్యం చేస్తున్నామో మరోసారి గుర్తు చేసింది. 1984 అక్టోబర్ 31న ఇద్దరు సిక్కు అంగరక్షకులు ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీని దారుణంగా హత్య చేశారు. 1984 జూన్‌లో ఆపరేషన్ బ్లూస్టార్ పేరుతో ప్రభుత్వం అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయంలోకి సైన్యాన్ని పంపినప్పుడు జరిగిన విధ్వంసం, మారణకాండ సిక్కులను దిగ్భ్రాంతికి గురి చేసింది. ఇందిరాగాంధీ ఆ పనిని సిక్కుల మీద కసితో చేయలేదు. అధికారమే లక్ష్యంగా ఆమె ఆడిన రాజకీయ క్రీడ బెడిసికొట్టటంతో పంజాబ్‌లో సిక్కు ఉగ్రవాదులు ఏకు మేకై కూర్చున్నారు. అకాలీదళ్ ఆట కట్టించటానికి భింద్రన్‌వాలేని ఆనాటి కాంగ్రెస్ పార్టీయే ప్రోత్సహించగా, మత మౌఢ్యాన్ని మనసంతా నింపుకున్న భింద్రన్‌వాలే, అతని అనుచరులు పంజాబ్‌లో కిరాతకంగా నరమేధాన్ని కొనసాగించారు. తాను సృష్టించిన భూతం తనకే ఎసరు పెట్టటంతో గత్యంతరం లేక ఇందిరాగాంధీ ఆపరేషన్ బ్లూస్టార్‌కు అనుమతిచ్చారు. పర్వదినాన సైనిక చర్య చేపట్టటం వల్ల, ముందస్తుగా సరైన సమాచారం లేకపోవటం వల్ల ఎందరో అమాయక పౌరులు ఆ మారణకాండలో ప్రాణాలు కోల్పోయారు. సిక్కులకు అత్యంత పవిత్రమైన స్వర్ణదేవాలయంలో చాలా విధ్వంసం జరిగింది. దాని పర్యవసానంగా ద్వేషాన్ని

నింపుకున్న ఇద్దరు సిక్కు అంగరక్షకులు ఇందిరాగాంధీని తుపాకీ గుళ్ళకు బలి చేశారు.

## క్షమించరాని రాక్షసపర్వం

అదంతా ఒక విషాదఘట్టం కాగా, ఇందిరాగాంధీ మరణించాక దాదాపు 12 గంటలపాటు నిరాటంకంగా సాగిన హత్యాకాండ అత్యంత రాక్షసపర్వం. వేల మంది సిక్కులు ఆ దారుణ హత్యాకాండలో ప్రాణాలు కోల్పోయారు. కేవలం గడ్డం, తలపాగా ఉన్న పాపానికి ఎందరో బలయ్యారు. హిందూవులతో సంస్కృతికంగా, రాజకీయంగా, మతపరంగా శతాబ్దాలుగా సిక్కులు మమైకమయ్యారు. స్వతంత్ర పోరాటంలో, స్వేచ్ఛా భారతంలో సైన్యంలో-సిక్కులు ప్రముఖ పాత్ర వహించారు. అలాంటి సిక్కు మతస్తులపైన ఆ 72 గంటల్లో జరిగిన మారణకాండ వారిని మన జాతీయ జీవన స్రవంతి నుంచి చాలా కాలం దూరం చేసింది. ఓ దశాబ్దం దాటాకగాని పంజాబ్ ఉగ్రవాదం చెర నుంచి బయటపడలేదు. ఈ మొత్తం దురవస్థకు 1984 నవంబరు మొదటి వారంలో ఢిల్లీ నగరంలో జరిగిన హత్యాకాండ కారణమయింది. ఈనాటికీ సిక్కులకు న్యాయం జరగలేదు. ఆనాటి మారణకాండకు బాధ్యులయిన వారికి శిక్షలు పడలేదు. ఇటీవలే ఒకరిద్దరికి-పదహారేళ్ళు గడిచాక శిక్షలు పడ్డాయి. కాని ఎందరో ప్రముఖులుగా చెలామణి అవుతున్న వాళ్ళు, ఎంతో కాలం మంత్రులుగా చెలామణీ అయిన వాళ్ళు ఆ హత్యాకాండను ప్రోత్సహించారని, ఆ ఘాతుకాలను దగ్గరుండి జరిపించారని, శాంతిభద్రతలను కాపాడవలసిన వారే విధ్వంసాన్ని సృష్టించారని తీవ్రమైన ఆరోపణలున్నాయి. ఇందిర హత్యతో ప్రధాన మంత్రి పదవిని చేపట్టిన ఆమె కుమారుడు రాజీవ్ ఆ హత్యాకాండను చాలా చిన్నదిగా చిత్రించి సిక్కుల మనసులను మరింత గాయపరిచారు. "ఓ పెద్ద వృక్షం నేల కూలినప్పుడు భూమి కంపిస్తుంద"ని వ్యాఖ్యానించి అపఖ్యాతిని మూటగట్టుకున్నారు. ఆ హత్యాకాండ నిజానికి హిందువులు, సిక్కుల మధ్య వైషమ్యాల వల్ల జరగలేదు. ఆ దారుణ సంఘటనల వెనక మూడు రకాల ప్రోత్సాహాలున్నాయి. తమ నేతను ఇద్దరు సిక్కులు చంపారు కాబట్టి కనపడ్డ సిక్కునల్లా అంతం చేద్దామని కొందరు మూర్ఖులు, కిరాతకులు హత్యాకాండకు దిగటం మొదటిది. అంతకుమించి-అధినాయకుల ప్రాపకాన్ని పొందటానికి, తమ స్వామి భక్తి చాటటానికి దాన్నే సదవకాశంగా భావించి అల్లరిమూకలను, విధ్వసంకారులను, కిరాయి గూండాలను, హంతకులను రెచ్చగొట్టి-హత్యాకాండ దగ్గరుండి చేయించిన కిరాతక నాయకుల ప్రోద్బలం రెండవది. అన్నింటినీ

మించి–ఇందిర హత్యను ఓరాజకీయ అవకాశంగా మలచుకుని ప్రజల్లో విపరీతమయిన భయాందోళనలను, విద్వేషాన్ని, అభద్రత భావాన్ని రెచ్చగొట్టి– ఎన్నికల్లో ఓట్లు దండుకుందామనే కపటోపాయం మూడవది. ఈ మూడు కారణాల పర్యవసానమే దేశ రాజధాని ఢిల్లీ నడివీధుల్లో వేల మంది అమాయక జీవులను పట్టపగలు పొట్టన పెట్టకోవడం. నేటి కాంగ్రెస్ మేటి నేత కమల్‌నాథ్ స్వయంగా ఆనాడు 4000 మంది కిరాయి గూండాలకు, రౌడీ మూకలకు నాయకత్వం వహించారని, ఢిల్లీలో రాకబ్‌గంజ్ గురుద్వారా మీదికి ఉసిగొల్పారని ఇప్పుడు నానాజీ కమిషన్ ముందు సంజయ్ సూరి తాను ప్రత్యక్షంగా చూసిన సంఘటనలను వివరించారు. ఇన్నేళ్ళకు కూడా ఆ విచారణలు అలా కొనసాగుతూనే ఉన్నాయి. ఆనాటి హత్యాకాండకు బాధ్యులయిన వాళ్ళు తరువాత ఎన్నో ఏళ్ళపాటు వివిధ హోదాలలో మన దేశ పాలన బాధ్యతలను నిర్వహిస్తూనే వచ్చారు. కొందరు నేటికీ మన రాజకీయ చిత్రపటంలో ప్రముఖులుగా వెలుగొందుతూనే ఉన్నారు. చట్టాన్ని, ధర్మాన్ని, న్యాయాన్ని ఇంతగా నిర్లక్ష్యం చేయటం నాగరికతకే కళంకం.

ఎప్పుడో 30 సంవత్సరాల క్రితం యుద్ధ సమయంలో తమ శత్రుదేశం వియత్నాంలో మైలే గ్రామంలో అమాయక పౌరుల మీద జరిపిన మారణకాండ నేటికీ అమెరికన్ సమాజాన్ని కలవరపరుస్తోంది. ఆ దారుణంలో తాను కూడా పాల్గొన్నానని ఇటీవలే సెనెటర్ బాబ్ కెర్రీ ప్రకటించటంతో అమెరికా సమాజంలో గాయాన్ని మళ్ళీ కెలికినట్లయింది. సత్యం అంటే ఆ సమాజాలు ఇచ్చే గౌరవం అలాంటిది. ఎన్ని తప్పులు చేసిన వాళ్ళయినా న్యాయస్థానం ముందు అబద్ధమాడటానికి సాహసించరు. 1974లో వాటర్‌గేట్ ఉదంతంలో అభిశంసనకు గురై రాజీనామా చేసిన నిక్సన్ ఎంతోకాలంపాటు తన దగ్గరే ఉన్న సంభాషణల టేపులను ధ్వంసం చేసే సాహసం చేయలేదు. ఆ టేపులు లేకపోతే తన మీద సాక్ష్యమే లేదు. అవి ఉన్నాయని ప్రపంచానికి తెలియకముందే వాటిని నాశనం చేయటం చిటికెలో పని. అయినా సాక్ష్యాలను నాశనం చేసే ఆలోచనే ఆయనకు రాలేదు. ఆ టేపులు కోర్టు ముందు సాక్ష్యంగా రాకూడదని వాదించారే గాని, వాటిని నాశనం చేయాలని ప్రయత్నించలేదు. చివరికి సుప్రీం కోర్టు ఆ టేపులను సాక్ష్యంగా ప్రవేశపెట్టాలని ఆదేశించగానే నిక్సన్ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. ఏదో ఒక వంక పెట్టి కోర్టులలో కేసుల్ని పొడిగించి టేపుల్లో ఉన్న సంభాషణలు తనవి కాదని బుకాయించే

ప్రయత్నం చేయలేదు. సత్యానికి, న్యాయానికి ఆ సమాజాలిచ్చే గౌరవం అలాంటిది! ఇది కేవలం రాజకీయానికి మాత్రమే చెందిన అంశం కాదు. కాస్తంత కష్టం కలుగుతుందనుకోగానే అబద్ధాన్ని అలవోకగా ఆడటం మనందరికీ చాలా సులభంగా అబ్బింది. 'వైవాహికమునందు, వారిజాక్షులందు, ప్రాణ, విత్త, మానభంగమందు బొంకవచ్చు' అనేది మన నానుడి. వేయి అబద్ధాలాడయినా ఒక్క పెళ్ళి చేస్తే పుణ్యమని మన నమ్మకం! ఇదే మన ప్రజాజీవనాన్ని కలుషితం చేస్తోంది. ఎంతటి నేరానికి పాల్పడినా పట్టుబడితే "పోనీలే పాపం"అని వదిలేయటం మనకలవాటు. అదే బాగా బీదవాడు, దళితుడు చిన్న తప్పు చేసి దొరికితే చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని చావబాదటం, అత్యాచారాలు చేయటం సర్వసామాన్యం. తమ భేషజాన్ని, అహంకారాన్ని, అంతస్తుల్ని, దర్పాన్ని కాపాడుకోవటానికి, బీదలను బానిసత్వంలో ఉంచటానికి అలాంటి దారుణ హింస ఓ మార్గం. అలానే ఇంట్లో భార్య మీద నిష్కారణంగా చేయి చేసుకుని చీటికీమాటికీ చిత్రహింసలు పెట్టేవారున్నారు. ఇలాంటి దౌర్జన్యం ఒకవైపు కొనసాగిస్తూనే మరోవైపు నేరం చేసిన వాణ్ణి, సమాజానికి హాని చేసిన వాణ్ణి ఉదారంగా క్షమించే విచిత్ర సంస్కృతి మనది! అంతేగాని సమాజానికి ద్రోహం చేసిన వాళ్ళకు, ఇతరులకు హాని తలపెట్టిన వాళ్ళకు శిక్ష పడాలని, దుర్మార్గులకు శిక్ష లేకపోతే సామాన్యులకు రక్షణ ఉండదని మనకు తట్టదు. కొన్నేళ్ళ క్రితం మా పొరుగింట్లో ఓ ఉన్నతాధికారి కుటుంబం నివాసముండేవారు. సచ్ఛీలతకు, సంస్కారానికి ఆ కుటుంబం మారుపేరు. వారికి కాలేజీకి వెళ్ళే అమ్మాయి ఉండేది. ఎవడో ఆకతాయి కుర్రాడు ప్రేమించానంటూ ఆ అమ్మాయి వెంటపడి వేధించటం మొదలుపెట్టాడు. తనకిష్టం లేదని ఆ అమ్మాయి ఎంతగా వారించినా అతడి ఎబ్బెట్టు చేష్టలు ఆగలేదు. చివరికి ఓనాడు ఆ కుర్రాడు తనతో వచ్చెయ్యమని ఆ అమ్మాయిని రోడ్డు మీద బలవంతం చేయబోయాడు. ఆ అమ్మాయి తిరస్కరించేసరికి దారుణంగా ఆమెను కత్తితో పొడిచి చంపేశాడు. ఆ కుటుంబానికి అది భరించరాని విషాదం. అయినా ఆ దంపతులు ప్రవర్తించిన తీరు సంస్కారానికి, స్థిత ప్రజ్ఞతకు ప్రతీక. విషాదాన్ని గుండెల్లోనే దాచుకుని ఎంతో సంయమనంతో ఆ తల్లిదండ్రులు ప్రవర్తించారు. తీరా పోలీసు కేసు విషయం వచ్చేసరికి ఆ తండ్రి "పోనీలెండి జరిగిందేదో జరిగిపోయింది. పోయిన అమ్మాయి తిరిగిరాదు కదా. మళ్ళీ ఆ దుర్మార్గుడుకి శిక్ష ఎందుకు" అన్నారు! మిత్రులు నచ్చచెప్పగా విని కేసు పెట్టటం, హత్య చేసిన ఆ కుర్రాడికి చాలా ఏళ్ళ తరువాత శిక్ష పడటం వేరే కథ. కాని చాలా

విషాద సమయంలో కూడా, జరగరానిది జరిగినపుడు కూడా, కన్నకూతుర్ని చంపినవాణ్ణి సైతం శిక్ష లేకుండా వదిలేద్దామనే మనస్తత్వం మన విచిత్ర సంప్రదాయంలో భాగం. అది వ్యక్తుల ఔన్నత్యానికి, ఉదాత్తతకు చిహ్నం కావచ్చు కాని దారుణ నేరాలు చేసిన వాళ్ళకు తగిన శిక్షలు పడకపోతే సమాజం నష్టపోతుంది. నేరస్తులు పెట్రేగిపోయి అమాయకుల్ని హింసిస్తారు. అదే నేరస్తులు అధికారంలో ఉంటే అసలు సమాజమే భ్రష్టుపట్టిపోతుంది. చట్టబద్ధపాలన నశిస్తుంది. అందుకే న్యాయం, నేరానికి శిక్ష–ఈ రెండూ నాగరిక సమాజంలో ప్రధాన అంతర్భాగాలు.

## నాగరికతకే అపచారం

మన వ్యవస్థలో నేరానికి శిక్ష అసాధారణమయిపోయింది. ఎంత ఘాతుకానికి ఒడిగట్టిన వాళ్ళయినా సరే ఎలాగోలా శిక్ష తప్పించుకోవచ్చనే నమ్మకం బలపడింది. పోనుపోనూ నేరస్తులే అధికారంలోకి రావడం జరుగుతోంది. అధికారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమార్జన చేయటం, ఆ దొంగ సంపాదనను ఖర్చు చేసి, ఓట్లు కొనుగోలు చేసి అధికారాన్ని నిలుపుకోవటం ఒక విషవలయంగా నిలిచిపోయింది. అందులో భాగమే 1984లో ఢిల్లీ నగరంలో నాయకుల అండతో జరిగిన సిక్కుల ఊచకోత. ఆ హత్యాకాండలో పాల్గొన్న నేరానికి ఉరిశిక్షలు పడవలసిన వాళ్ళు. జీవనపర్యంతం కటకటాల ఊచలు లెక్కించవలసిన వాళ్ళు–నేటికి మేటి నాయకులుగా చెలామణి అవుతున్నారు. ఇది నాగరికతకు, మానవహక్కులకు, ప్రజాస్వామ్యానికి తీరని అపచారం. ఆ అన్యాయం ఎక్కడో ఢిల్లీలో ఉన్న సిక్కులకు జరిగింది కదా, మనకేమని మిన్నకుంటే రేపు ఆ పరిస్థితి ఎవరికయినా దాపురించవచ్చు. 1989లో కోస్తా ఆంధ్రాలో కులం పేరుతో జరిగిన విధ్వంసం అలాంటిదే. 1992లో బంగారప్ప ముఖ్యమంత్రిగా ఉండగా కర్ణాటకలో ప్రభుత్వ ప్రోద్బలంతో తమిళులకు వ్యతిరేకంగా జరిగిన హింసాకాండ కూడా ఆ కోవకే చెందినది. దేశంలో ఎన్నో ప్రాంతాలలో దళితులకు వ్యతిరేకంగా తరచు జరిగే అమానుష కృత్యాలన్నీ అలాంటివే. చాలా రాష్ట్రాలలో మతం పేరుతో జరిగే మారణ హోమాలు కూడా ఈ కోవకు చెందినవే. తాత్కాలిక రాజకీయ ప్రయోజనం కోసం విద్వేషాలు ఉన్మాదాలు రెచ్చగొట్టి హింసకు, నేరాలకు పాల్పడటం కన్నా అనాగరికమైన, కిరాతకమయిన చర్య మరొకటి లేదు. అలాంటి సంఘ ద్రోహులను పరాన్న భుక్కులని తీవ్రంగా శిక్షించకపోతే మన జాతి పతనం కావటం తథ్యం. ఓ మనిషి చేసిన దుష్కృత్యాలకు అతడు బాధ్యత వహించి శిక్షననుభవించాలి. దుర్మార్గుల మీద జాలిపటం, కసాయి వాళ్ళు మీద కరుణ చూపటం

మంచితనం కాదు, అజ్ఞానం, పిరికితనం. చెడుకు శిక్ష పడ్డప్పుడే మంచి మనగలుగుతుంది. నేరం చేసినవాడు 'మన వాడనో', బాధితుడు 'మన'వాడనో, బాధితుడు 'మన'వాడు కాదనో ఉపేక్షిస్తే రేపు మనదాకా వస్తే రక్షణ ఉండదు. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో ఓ కవి రాసినట్టు, "ముందుగా నాజీలు యూదుల కోసం వచ్చారు. నేను యూదుణ్ణి కాదు. అందుకని పట్టించుకోలేదు. ఆ తరువాత నల్లవాళ్ళ కోసం వచ్చారు. నేను నల్లవాణ్ణి కాదు, అందుకని పట్టించుకోలేదు. ఆ తరువాత ట్రేడ్ యూనియనిస్టుల కోసం వచ్చారు. నేను ట్రేడ్ యూనియన్లలో లేను. అందుకని పట్టించుకోలేదు. చివరికి నా కోసం వచ్చారు. చుట్టూ చూస్తే నన్ను రక్షించటానికి ఎవరూ మిగలలేదు" ఈ దేశంలో అన్యాయాలను ఎదిరించటంలో ఇప్పటికే మన మంతా ఆలస్యం చేశాం. ఇంకా మిన్నకుంటే నష్టపోయేది మనమే.

* * *

# నేరమే అధికారమై ప్రజల్ని వేధిస్తున్న వైనం

*సెప్టెంబర్ 6, 1999*

సమయానుకూలంగా శ్రీరంగ నీతులు వల్లించటం, అవసరార్థం దుష్కృత్యాలకు పాల్పడటం పార్టీలకు అలవాటయిపోయింది. మన రాష్ట్రంలో శాసనసభకు, పార్లమెంటుకు జరుగుతున్న ఎన్నికలలో ప్రధాన పార్టీల అభ్యర్థుల జాబితాలను, వారి చరిత్రను పరిశీలిస్తే దయ్యాలు ఎలా వేదాలను వల్లిస్తున్నాయో మనకు అర్థమవుతుంది. ప్రతిసారీ వేదికలమీద సూక్తులు వల్లిస్తున్నది. బీదల అభ్యున్నతి, ప్రజల సంక్షేమం, సమాజ భవిష్యత్తు నిజాయితీతో కూడిన సమర్థ పాలన తమ లక్ష్యాలను రాజకీయ నాయకులు ఉపన్యాసాలిస్తున్నారు. గొర్రె కసాయివాణ్ణి నమ్మినట్టుగా, మనం వాళ్ళ మాటల్ని నమ్ముతున్నాం. తీరా చూస్తే హంతకులు, దోపిడీదార్లు, రౌడీలు, అక్రమార్జపరులు పార్టీల అభ్యర్థులుగా మనముందు ప్రత్యక్షమవుతున్నారు. ఈ ఎన్నికలలో 70 మందికి పైగా నేరచరితులు అభ్యర్థులుగా నిలబడుతున్నారు. వారిలో దాదాపు 60 మంది ప్రధాన పార్టీలకు చెందినవారే! తాము ఏం చేసినా చెల్లుతుందన్న అహంకారం, ఎన్నికలలో గెలిచి అధికారం కైవసం చేసుకోవటం కోసం నరమేధం జరిగినా తప్పులేదనే రాక్షస సంస్కృతి మన రాజకీయాలను, దేశాన్ని పతనావస్థకు చేరుస్తున్నాయి. ఒకప్పుడు రాయలసీమలోని ముఠాకక్షల వల్ల హింసా రాజకీయం పెట్రేగిపోతున్నదని, అది ఆప్రాంతానికి మాత్రమే పరిమితమని భావించేవాళ్ళం. ఇప్పుడు కోస్తా ఆంధ్రకు, హైదరాబాద్ నగర పరిసరాలకూ హత్యా రాజకీయాలు, బాంబుల సంస్కృతి విస్తరించాయి. నరసరావుపేటలో బాంబుల పేలుళ్ళ వల్ల నలుగురి మృతి, కర్నూలు జిల్లాలో మందుపాతర్లను కనిపెట్టడం, హైదరాబాద్‌లో పెరుగుతున్న నేర రాజకీయాల ప్రభావం మన కళ్ళకు భవిష్యత్తును చూపెడుతున్నాయి. పౌర సమాజం ఇప్పుడు జాగ్రత్తలు తీసుకోకపోతే అనతికాలంలోనే రాజకీయం అంటేనే నేరస్తులకు, దోపిడీదార్లకు, హంతకులకు, గూండాలకు ఆవాసంగా మారిపోయే ప్రమాదముంది.

**ఓటు వేస్తున్న పాపానికి...**

ఇదేదో ఒక పార్టీకి మాత్రమే పరిమితయిందని భావిస్తే పొరపాటు. నేర

రాజకీయానికి పార్టీల రంగు పులమటం అవివేకం. అన్ని ప్రధాన పార్టీలూ నేరచరితులకు నిర్లజ్జగా పెద్దపీట వేస్తున్నాయి. ఒక పేరుమోసిన హంతకుడు, నేరస్తుడు పార్టీలో చేరితే ప్రధాన పార్టీలన్నీ అట్టహాసంగా ఆహ్వానం పలుకుతున్నాయి. అలాగే ఒక నేరగాడు పార్టీ మారితే ఆదరించి అక్కున చేర్చుకుంటున్నాయి. ఈ నేరచరితులనే సమాజానికి ఆదర్శంగా చూపెడుతున్నాయి. ఎన్నికల్లో దౌర్జన్యం చేసి గెలవగానే ఈ పార్టీల ప్రభుత్వాలే నేరస్తులపైన కేసుల్ని రద్దు చేస్తున్నాయి. 1989లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే నాలుగు వేల కేసుల్ని రద్దు చేసిందని ఫిర్యాదులున్నాయి. 1994లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం ఐదువందలమందిమీద కేసుల్ని ఉపసంహరించుకున్నట్లు ఆధారాలున్నాయి. అంటే రెండు పార్టీలు రాజ్యాధికారాన్ని తమ సొంత ఆస్తిగా భావిస్తున్నాయి.తమకిష్టమయినవాళ్ళు, తమ అనుయాయులు హత్యలు చేసినా, అత్యాచారాలకు పాల్పడినా, దోపిడీలు చేసి కొల్లగొట్టినా వాళ్ళ మీద కేసులు లేకుండా చేయటం కోసమే ప్రజలు అధికారం కట్టబెట్టారని పార్టీలు భావిస్తున్నాయి. ఒకసారి నేరస్తుడు ఎన్నికయ్యాక చేసే ఆర్భాటం అంతులేనిది. నేరస్తుడి నుంచి ప్రజలకు రక్షణ కల్పించేది పోయి, ఆ నేరస్తుడికే రక్షణ పేరుతో సాయుధ పోలీసులనిస్తోంది ప్రభుత్వం! ఎన్నో సందర్భాల్లో ఆ పోలీసులనే ఉపయోగించి హత్యలకు పాల్పడ్డ ఉదంతాలున్నాయి. అంటే మనం పన్నుల రూపంలో కట్టే డబ్బుతో మనల్ని పీక్కుతినడానికి, రాచి రంపాన పెట్టడానికి ఏర్పాటు చేస్తున్నారు! ఇక గెలవగానే అది వరకు నేరస్తులను నిలదీసిన పోలీసు అధికారులను బదిలీ చేయించటం, హంతకుల అడుగులకు మడుగులొత్తే పిరికివాళ్ళను, అవినీతిపరులను తమ ప్రాంతాల్లో వేయించుకోవడం అధికారంలో ఉన్న వాళ్ళు చేసే మొదటి పని. అలాంటి గులాముల అండతో యథేచ్ఛగా తమ నేర సామ్రాజ్యాన్ని విస్తరించుకుని, తమ ప్రాబల్యాన్ని పెంచుకోవచ్చు ప్రభుత్వ పనులు ఏం జరిగినా ఆ టెండర్లలో, కాంట్రాక్టులలో ఈ నేరచరితులకు విధిగా వాటా ఉండాలి. న్యాయంగా పోటీలో ఎవరన్నా కాంట్రాక్టు పొందినా, తమ నియోజకవర్గంలోనో, తమ ప్రాబల్యం ఉన్న ఇతర ప్రాంతాలలోనో పని చేయాలంటే తమకు కోట్లు గుమ్మరించి తమ ఆశీస్సులు పొందాల్సిందే. లేదంటే ఆ పని జరగటం అసాధ్యం. ఆ కాంట్రాక్టరు బతికి బట్టకట్టడు. అనతి కాలంలోలనే ఆ గూండాయే మంత్రికావటం తథ్యం. ఆ తరువాత సిగ్గుమాలిన 'నాయకులు' ఆ నేరస్తుణ్ణి యువతారానికే ఆదర్శంగా వర్ణిస్తారు.

పేరుమోసిన గూండాలు నాయకులయితే, వాళ్ళతోపాటు వాళ్ళ అనుయాయులు కూడా కోట్లకు పడగలెత్తటం ఖాయం. కాలక్రమేణా నిన్నటి గూండా రేపటి గౌరవప్రదమైన 'నాయకుడు'గా రూపాంతరం చెందటంతో తాను స్వయంగా నేరాలకు పాల్పడకుండా ఒక నేర సామ్రాజ్యానికి అధికపతిగా వ్యవహరిస్తున్నాడు. మళ్ళీ కొత్త గూండాలు రాజకీయ రంగంలోకి ప్రవేశించి చరిత్రను పునావృతం చేస్తున్నారు. ఈ నేర రాజకీయంలో మరో లక్షణమేమంటే గూండాలు 'రాబిన్ హుడ్'లలాగా నటించటం, కీర్తి పొందటం తమ వెంట ఒక ముఠా ఉండాలంటే వాళ్ళతో సఖ్యంగా మెలగాలి. వాళ్ళు తమ కోసం ప్రాణాలకు తెగించాలంటే వాళ్ళ కోసం కొంత కోసం తెగించాలి. కులాన్నో, మతాన్నో, ముఠానో తాము ప్రేమించినట్లుగా నటించి వాళ్ళ విశ్వాసాన్ని చూరగొనాలి. ఆమాయక జనం ఎలాగూ కుల మతాల విభేదాలతో, ముఠా తగాదాలతో ఆదమరచి ఉన్నారు కాబట్టి నేర చరిత్రను మరచిపోయి ఈ నేర రాజకీయులు తమ కోసమే పుట్టారని భ్రమించటం సహజం. ముఠాల పేరుతో జరిగే నరమేధంలో చివరికి బలయ్యేది సామాన్య ప్రజలు. ఇలా నేర రాజకీయం మూడు పువ్వులు, ఆరుకాయలుగా విస్తరిస్తోంది. ఎన్నికలంటే ఏదో రెండు పార్టీల మధ్య యుద్ధంగానో, అదేదో రణరంగంగానో మనలో చాలా మందిమి భ్రమపడుతున్నాం. నిజానికి ఎన్నికలలో జరిగే పోరాటం పార్టీల మధ్య అభ్యర్థుల మధ్య కాదు. ప్రధాన పార్టీలన్నీ కలిసి ప్రజలమీద పోరాడుతున్నాయి. ఈ పోరాటంలో ఏ పార్టీ గెలిచినా ప్రజలు ఓడిపోతున్నారు. ఎన్నికలంటే ఒక కైపుగా, ఉన్మాదంగా, గుర్రపు పందేలలాగా, క్రికెట్ ఆటలాగా భావించుకోవడంతో మనం కూడా ఈ భయంకర రాజకీయ క్రీడలో నిమగ్నమయిపోతున్నాం. వాస్తవానికి ఎన్నికలలో జరిగే తతంగమంతా దోపిడీ కోసమేనని విస్మరిస్తున్నాం. లేగదూళ్ళను ఎవరు తినాలి అని పెద్ద పులులు భీకర యుద్ధం చేస్తుంటే ఆ లేగదూడలు ఆదమరచి ఆ యుద్ధాని చోద్యంలాగా చూడటం ఎంత ప్రమాదకరమో మనకు తెలుసు. కాని అదే మన విషయంలో జరుగుతుంటే, అదేదో చోద్యం లాగా, మనం ప్రేక్షకులమయిపోయి ఆనందిస్తున్నాం. ఈలలు వేస్తున్నాం, చప్పట్లు కొడుతున్నాం, ఇప్పుడు గెలిచి తరువాత తీరిగ్గా దుష్పరిపాలనలతో మనల్ని దోచుకునేవాళ్ళకు బ్రహ్మరథం పడుతున్నాం! అందుకే లోపభూయిష్ట వ్యవస్థలో ఎన్నికల వల్ల మంచి ఫలితాలు వస్తాయనే ఆశ అడుగంటింది. ఎవరు గెలిచినా ఉద్ధరించేది లేదని తెలాక ప్రజలు చేసేది కేవలం ప్రేక్షకులుగా కొంత వినోదాన్ని పొందటం మాత్రమే. ఈ విష వలయం నుంచి

బయటపడటం వ్యవస్థ భవిష్యత్తుకు, ప్రజల సంక్షేమానికి ముఖ్యావసరం. చట్టం, రాజకీయ వ్యవస్థ ప్రజలకు వ్యతిరేకంగా ఉన్నాయని, ఇవి ఇలా కొనసాగినంత కాలం నేర రాజకీయం వర్ధిల్లటం, అమాయక ప్రజలు బలిపశువులు కావడం తథ్యమని తెలుసుకోవాలి.

## న్యాయవ్యవస్థ వైఫల్యం

నేర రాజకీయానికి పార్టీలు, రాజకీయులదే ప్రధాన బాధ్యత. అందుకు సందేహం లేదు. కాని దీనికి దోహదం చేసే అసలు కారణాలను అన్వేషించి విరుగుడు చర్యలు చేపట్టడం కూడా అవసరం. మన న్యాయవ్యవస్థ వైఫల్యం నేర రాజకీయాలకు విపరీతమైన ఊతాన్నిస్తోంది. మన దేశంలో న్యాయస్థానాలలో నూటికి 94 మంది నేరస్తులు శిక్షలు తప్పించుకోగా, ఆరుగురు ముద్దాయిలకు మాత్రమే శిక్షలు పడుతున్నాయి. అ పడే శిక్ష కూడా చాలా స్వల్పం. హత్యానేరం రుజువయ్యాక మన దేశంలో మహాపడితే 'యావజ్జీవ' శిక్ష- అంటే 14 సంవత్సరాల ఖైదు! ఆ జైలు శిక్ష దాదాపు అన్ని కేసలలో 10 సంవత్సరాలు దాటదు! కొన్ని కేసులలో అయిదేళ్ళ లోగానే ఏదో వంకతో బయటపడటం కద్దు. ముందుగా విడుదల కావడం కూడా పూర్తిగా ప్రభుత్వం చేతుల్లో ఉండటంతో రాజకీయ నాయకులు పైరవీలు చేసి ఎలాగోలా తమ అనుయాయుల్ని విడుదల చేయించటం ఆనవాయితీ. మన కోర్టులలో అత్యధిక కేసులలో జరిగేది న్యాయ నిర్ణయం కాదు, జాప్యం ద్వారా న్యాయానికి సంకెళ్ళు వేయటం అందువల్లనే పౌరులెవరూ ఏ ఆపద వచ్చినా, ఏ తగాదా వచ్చినా కోర్టులనాశ్రయించే సాహసం చేయలేకపోతున్నారు. ఎవరైనా అప్పు తీర్చకపోయినా, అద్దెకున్న ఇల్లు ఖాళీ చేయకపోయినా, సొంత స్థలాన్ని బలవంతంగా మరొకరు ఆక్రమించుకున్నా, కోర్టుల ద్వారా పరిష్కారం కావాలంటే ఓ జీవిత కాలం సరిపోదు. ఇలాంటి పరిస్థితులలో సత్వరం న్యాయం దొరకాలంటే స్థానికంగా తగాదాలు తీర్చే గూండాలను ఆశ్రయించటం తప్పనిసరి అయింది. ఓ పదివేలో, పాతికవేలో తీసుకుని తక్షణం కండబలంతో బండ న్యాయాన్ని అందించటం ఈ దాదాల పని. ఇలా మన డబ్బుతో బలపడుతూ, అవతవాడిని బెదిరించో, కాళ్ళు విరిచో, కీళ్ళు ఊడదీసో ఆటవిక 'న్యాయాన్ని అందించటం చాలా మందికి వృత్తిగా మారిపోయింది. ఒకవంక కోర్టుల బలహీనతలు వాళ్లకు ఉపాధి కల్పించి వాళ్ళ సంపదను పెంచుతుండగా, మరో వంక వాళ్ళు చేసే నేరాలకు అదే కోర్టులలో శిక్ష పడటం అసాధ్యమవుతున్నది! ఆ విధంగా నేర సామ్రాజ్యాలు ఎదుగుతున్నాయి.

పెట్టుబడి లేని ఉపాధిగా, రిస్కు లేని వ్యాపారంగా, విపరీతమైన ధనార్జన చేసే అవకాశంగా ఉండటంతో ఇలాంటి నేర వృత్తికి అదుపు లేకుండా పోయింది. అనతి కాలంలోనే ఇలా బలపడ్డ నేరస్తులు రాజకీయ వేత్తలుగా రంగప్రవేశం చేస్తున్నారు. ఇందుకు న్యాయమూర్తులను నిందిస్తే ప్రయోజనం లేదు. ఎప్పుడో వలస కాలంలో చేసిన చట్టాలను ఇప్పటి అవసరాలకు అనుగుణంగా మార్చుకోకుండా అలాగే కొనసాగించాం. పార్టీల నుంచి దీనికి పరిష్కారాలు రావు. ప్రతి పార్టీలోని అధిక సంఖ్యాకులు నేర రాజకీయాల జోలికి పోకపోయినా, వాళ్ళు నేరస్తులను అదుపు చేసే స్థితిలో లేరు. అనువుగాని పరిస్థితుల్లో బలవంతులయిన విరోధులతో తలపడలేక పార్టీలలోని మంచి వాళ్ళంతా మిన్నకుంటున్నారు. అందుకే ఈ జటిల సమస్యని పరిష్కరిచాలంటే ప్రజల ఉద్యమం కావాలి. ఆలోచనాపరులు కేవలం విమర్శలకు, డ్రాయింగు రూముల్లో చర్చలకు పరిమితం కాకుండా విషయాన్ని సమగ్రంగా అర్థం చేసుకోవాలి. చిత్తశుద్ధితో, అవగాహనతో, ఒడుపుగా సమస్య స్వరూపాన్ని ప్రజల ముందు పెట్టాలి. అప్పుడే ముళ్లకంప మీద పడ్డ బట్టలాంటి ఈ సంక్లిష్ట సమస్యను పరిష్కరించగలం. కోర్టులలో కేసులను ఎదుర్కొంటున్నవారు, రౌడీషీటర్లు, హిస్టరీ షీటర్లు గతంలో శిక్షలు పడ్డవాళ్ళు ప్రజా జీవనంలో ప్రవేశించకుండా, రాజకీయ నాయకులుగా రూపాంతరం చెందకుండా నిఘా వేయాలి.

## స్థానిక ఎన్నికలకయినా...

ప్రస్తుతం పార్టీలు నేరస్తులను నిలబెడుతూ, ప్రత్యర్థులకు నేర చరిత్ర ఉన్నప్పుడు తాము కూడా ఆ మార్గాన్ని ఎంచుకోక తప్పటం లేదని సంజాయిషీ ఇస్తున్నాయి. అలాగే ఎన్నికల చట్టం బలహీనంగా ఉండటంతో కేవలం కోర్టులలో పెద్ద నేరాలకు శిక్ష పడ్డ వాళ్ళను మాత్రమే ఆపగలమని నమ్మబలుకుతున్నాయి. అంటే అమాయక ప్రజల కంటే నేరారోపణలు ఎదుర్కొంటున్న వాళ్ళే తమకు ప్రియమైన వాళ్ళని చాటుకుంటున్నాయి. ప్రజా ప్రాతినిధ్య చట్టాన్ని సవరించే వరకు నేరస్తులను పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేయకుండా నిరోధించలేం. అది పార్లమెంటు చేతిలో ఉంది. ఎంతో కాలంగా దీనిపై చర్చ సాగుతున్నా, ఇటీవలనే ఎన్నికల సంఘం, న్యాయ సంఘం చట్టంలో సవరణల్ని ప్రతిపాదిస్తూ కేంద్ర ప్రభుత్వానికి, పార్లమెంటుకు నివేదికలు సమర్పించినా ఫలితం శూన్యం. అయితే మన రాష్ట్రంలో పార్టీలకు చిత్తశుద్ధి ఉంటే స్థానిక ప్రభుత్వాల ఎన్నికలలో నేరస్తుల

ప్రవేశాన్ని నిరోధిస్తూ చట్టాన్ని చేయటం చిటికెలో పని. ఆరోచనాపరులు తాత్సారం మాని ఇందుకు పూనుకోవాలి. లక్ష మాటలకన్నా నిజాయితీతో కూడిన ఓ చిన్న చర్య బలమైనది. సెప్టెంబరు 18న ఎన్నికలు పూర్తయ్యాక శాసనసభ సమావేశం జరుగుతుంది. మార్చి అంతంలో సమావేశమయిన అసెంబ్లీ విధిగా ఆరు నెలలలోగా సమావేశం కావాలి. దాన్ని లాంఛన ప్రాయంగా జరపకుండా, ఎన్నికల ఫలితాలు తేలేలోగానే స్థానిక ప్రభుత్వాల (పంచాయతీలు, మున్సిపాల్టీలు) ఎన్నికలలో నేరస్తులను నిరోధిస్తూ చట్టాన్ని తేవాలి. అందుకు పూర్తి అధికారం శాసనసభకు ఉంది. అలాంటి చట్ట సవరణల ముసాయిదాను తయారు చేసి పార్టీలకు, శాసనసభ్యులకు అందించటానికి లోక్‌సత్తా లాంటి ప్రజా ఉద్యమాలు సిద్ధంగా ఉన్నాయి. ఇది ప్రధాన పార్టీల నిజాయితీకి పెనుసవాలు. అన్ని పార్టీలు ముందుకు వచ్చి వచ్చే సంవత్సరంలో జరగబోయే స్థానిక ఎన్నికలలో నేరస్తుల ప్రాబల్యాన్ని నిషేధించే చట్టాన్ని చేపట్టి తమ చిత్తశుద్ధిని రుజువు చేసుకోవాలి. అది మాత్రమే ఈ శాసనసభ రాష్ట్ర ప్రజలకిచ్చే సముచిత వీడ్కోలు కానుక అవుతుంది.

* * *

# ప్రజాస్వామ్య ప్రస్థానంలో మేలుమలుపు

*మే 6, 2002*

ఈ నెల 2న సుప్రీం కోర్టు ఓ చారిత్రకమైన తీర్పునిచ్చింది. ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థుల నేరచరిత్ర, వారి ఆస్తులు, అప్పులు, విద్యార్హతలు తెలుసుకునే హక్కు ప్రజలకు ఉందని సర్వోన్నత న్యాయస్థానం విస్పష్టంగా తేల్చిచెప్పింది. ఈ వివరాలను సేకరించి ప్రజల ముందు పెట్టే బాధ్యతను ఎన్నికల సంఘానికి అప్పగించింది. భారత ప్రజాస్వామ్య పరిణామంలో ఇదో ముందడుగు. ఈ కేసు పూర్వాపరాలు పరిశీలిస్తే మనమెన్నో పాఠాలు నేర్చుకోవచ్చు.

## ఎన్నికల నిఘా ప్రభావం

1999 లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల సందర్భాన 'లోక్‌సత్తా' ఎన్నికల నిఘా ఉద్యమాన్ని చేపట్టింది. ఆ ఉద్యమంలో భాగంగా తొలిసారిగా అభ్యర్థుల నేరచరిత్రను నిర్ధారించడానికి నిర్దిష్టమైన ప్రాతిపదికలను రూపొందించింది. గతంలో కోర్టులో శిక్ష పడినా, ప్రాథమిక విచారణ తరువాత నేరారోపణ జరిగి న్యాయస్థానంలో విచారణ నడుస్తున్నా, రౌడీషీటరుగా లేదా హిస్టరీ షీటరుగా ఏ పోలీసు స్టేషన్‌లోనైనా నమోదైనా, అవినీతి కారణంగా ఉద్యోగం కోల్పోయినా, అక్రమార్జన చేసినట్లు దాఖలాలున్నా ఆ అభ్యర్థిని నేర చరితుడుగా పరిగణించడం సబబేనని 'లోక్‌సత్తా' భావించింది. నిష్ణాతులైన న్యాయకోవిదులు, పరిపాలనాదక్షులు, ప్రజాస్వామ్య ఉద్యమకారులు, పాత్రికేయులు ఈ ప్రమాణాలను రూపొందించారు. ఈ ప్రాతిపదికపైన దేశ చరిత్రలోనే తొలిసారిగా ప్రజల భాగస్వామ్యంతో అభ్యర్థులలో నేరచరితుల వడపోత కార్యక్రమాన్ని 'లోక్‌సత్తా' చేపట్టింది. ప్రజలలో విస్తృత ప్రచారాన్ని కల్పించడంతో పాటు పార్టీలకు ముందుగానే కార్యక్రమ వివరాలను అందించడం జరిగింది. అయినా పార్టీలు ఖాతరు చేయకుండా అలవాటు ప్రకారం నేరచరితులను అభ్యర్థులుగా నిలిపాయి. దానితో వారి వివరాల సేకరణకు లోక్‌సత్తా బృహత్ యత్నమే చేసింది. అందుకు రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం ఏమాత్రం సహకరించలేదు. విచారణలో ఉన్న కేసుల వివరాలను కూడా అందించడానికి పోలీసు శాఖ నిరాకరించింది. కొద్దిమంది చిత్తశుద్ధిగల అధికారులు రహస్యంగా సహకరించారు. పాత్రికేయులు, సామాన్య ప్రజలు ఇచ్చిన సమాచారాన్ని ఆధారంగా చేసుకుని, వాస్తవాలను బేరీజువేసి 'లోక్‌సత్తా'

45 మంది అభ్యర్థుల నేరచరిత్రను ప్రకటించింది. ఆ ప్రకటనకు భిన్న వర్గాలు వివిధ రకాలుగా స్పందించాయి. ఓ ప్రధాన పార్టీ 'లోక్‌సత్తా ఏమైనా కోర్టా?" అని ప్రశ్నించింది. మరో ప్రధాన పార్టీ "అసలు ఆ జాబితాకు విశ్వసనీయత లేద"ని కొట్టిపారేసే ప్రయత్నం చేసింది. ప్రజాస్వామ్యంలో సత్యానికి, ప్రజాభిప్రాయానికి చాలా విలువ ఉంది. ఆ జాబితా రూపొందించడానికి జరిగిన ప్రయత్నాన్ని ప్రస్తుతిస్తూ అన్ని వర్గాల ప్రజలు, పత్రికల నుంచి విశేషమైన స్పందన లభించింది. నేరచరిత్ర వివరాలను ఆధారాలు సహా ప్రకటించడంతో బలమైన అభ్యర్థులు కూడా అవి వాస్తవాలు కాదని బుకాయించలేకపోయారు. ఆనాడు ఒకే ఒక సహేతుకమైన విమర్శ వినవచ్చింది. అదేమిటంటే మరో 10–15 మంది అభ్యర్థులు నేరచరితులైనా వారి పేర్లు ప్రకటించలేదని దానికి ముందునుంచీ 'లోక్‌సత్తా' స్పష్టమైన సమాధానం చెబుతూ వచ్చింది. నిర్దిష్టమైన ఆధారాలుండి, నిర్దేశించిన "ప్రమాణాల ప్రకారం నేరచరితులుగా తేలినవారి జాబితాను మాత్రమే లోక్‌సత్తా ప్రకటించింది. జాబితాలో ఉన్నవారు కొందరు ఆ తరువాత కోర్టు తీర్పులో నిర్దోషులుగా తేలవచ్చు. లేదా నేరం చేసినట్లు రుజువు కాలేదని వారిని విడుదల చేయవచ్చు. కేవలం – వారి నేరచరిత్రకు ఆధారాలున్నాయని ప్రజా ఉద్యమాలు చెప్పగలవు కానీ, వారు నేరం చేసినట్లు రుజువైందని చెప్పలేవు. జాబితాలో లేనివారిలో కొందరికి నేరచరిత్ర ఉన్నా, ఆ ఆధారాలు దొరకని కారణంగా వారి పేర్లను ప్రకటించలేకపోవచ్చు. ఆధారాలతో వివరాలనందజేస్తే, అవి వాస్తవమని తేలితే, వారిని నేరచరితులుగా ప్రకటించవచ్చు. ఆ బాధ్యత ఆరోపణలు చేసే వ్యక్తులది, పార్టీలది. ఈ ప్రయత్నంలోని నిష్పాక్షికత, చిత్తశుద్ధి ప్రజలకు స్పష్టంగా తెలిశాయి. రాష్ట్రంలో ప్రజల నుంచి నేరమయ రాజకీయానికి పెద్దయెత్తున వ్యతిరేకత ఎదురైంది. దేశవ్యాప్తంగా ఎన్నికల నిఘా ఉద్యమానికి విస్తృత ప్రచారం లభించింది. ఆ నేపథ్యంలో కొందరు మిత్రులు ప్రజాస్వామ్య సంస్కరణల సంఘం అనే పేరుతో ఢిల్లీ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. నేరచరితుల వివరాలను తెలుసుకునే హక్కు ప్రజలకుందని, వాటిని సేకరించి ప్రజల ముందు పెట్టే బాధ్యత ఎన్నికల సంఘానిదని, ఆ విధంగా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని ఆ దరఖాస్తులో వేడుకున్నారు. అందుకు ఆధారంగా ప్రధానంగా 'లోక్‌సత్తా' ఎన్నికల నిఘా ఉద్యమంలో విడుదల చేసిన నేరచరితుల జాబితాను, అందుకు అనుసరించిన ప్రమాణాలను పద్ధతులను కోర్టులో సాక్ష్యంగా అందజేశారు. ఆ వాదనలు విన్నాక ఢిల్లీ హైకోర్టు 2000 నవంబరు 2న.. అభ్యర్థుల నేరచరిత్రను,

వారి వ్యక్తిగత, కుటుంబ ఆస్తిపాస్తుల వివరాలను, వారి అర్హతల సమాచారాన్ని సేకరించి ప్రజల ముందు ఉంచాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశిస్తూ తీర్పునిచ్చింది. ఆ తీర్పుపైన కేంద్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో అప్పీలు చేసింది. కాంగ్రెస్ పార్టీ లాంటి ప్రధాన రాజకీయ పక్షాలు కేంద్ర ప్రభుత్వానికి వంత పలికాయి. అభ్యర్థుల వివరాలను ప్రజల ముందు పెడితే వారి వ్యక్తిగత హక్కులకు భంగం కలుగుతుందని వారంతా వాదించారు. సుప్రీం కోర్టు వారి వాదనలను కొట్టిపారేసింది. చివరికి మే 2న చారిత్రాత్మకమైన తీర్పు వెలువడింది.

## తొడేళ్ల మధ్య పోరాటం

ఈ ఉదంతం మొత్తాన్ని పరిశీలిస్తే నాలుగు పాఠాలు మనకు తెలిసివస్తాయి. మొదటిది – మన సమాజంలో అంతులేని నిస్పృహ కానవస్తోంది. పరిస్థితులను మార్చే ప్రయత్నం చేయక, ఎంతసేపటికి విమర్శలతో, గుండెలు బాదుకోవడంతో కాలం గడిపేస్తున్నాం. అలాకాక, నిర్దిష్ట లక్ష్యాలతో, నిష్పాక్షికతతో, స్పష్టమైన పద్ధతులతో, పాదర్శకంగా పౌరసమాజం ఓపిగ్గా కృషిచేస్తే ఫలితాలు వచ్చితీరతాయి. సుప్రీంకోర్టు తీర్పు కేవలం 'లోక్‌సత్తా' ఉద్యమం చేసిన ప్రయత్నం వల్ల, కొందరు మిత్రులు దాన్ని ఆసరాగా చేసుకుని కోర్టులో కేసు నడపడం వల్ల సాధ్యమైంది. మహాత్మాగాంధీ చెప్పినట్లుగా **"కొద్దిమంది పౌరులు అంతులేని ఆర్తితో, మొక్కవోని ధైర్యంతో, చిత్తశుద్ధితో ప్రయత్నం చేస్తే ప్రపంచాన్ని మార్చగలరు".** నిరాశ వల్ల,నిస్పృహ వల్ల మనం సమస్యలో భాగమవుతాయి. కాని, పరిష్కారాన్ని సాధించలేం. ఎన్నికల నిఘావల్ల, నేరచరితుల జాబితాలను బయట పెట్టడం వల్ల ఆంధ్రప్రదేశ్ రాజకీయంలో కొంతమేరకు నేరచరితుల ప్రభావం తగ్గింది. ఇప్పటికే రాజకీయంలో బలపడి, తమ నేరచరిత్రను చెరిపేసుకుని, నాయకులుగా స్థిరపడిన వారిని నిర్మూలించడం ఈ ప్రయత్నం వల్ల సాధ్యం కాలేదు. కాని నేరచరితులు కొత్తగా రాజకీయంలో ప్రవేశించడాన్ని నిరోధించగలిగాం. అలాంటి వ్యక్తులను అక్కున చేర్చుకుని, పార్టీ సభ్యత్వాన్నిచ్చి ఎన్నికలలో పోటీకి నిలబెట్టాలన్న కోరిక ఉన్నా ప్రజలలో చులకనైపోతామనే భయంతోనూ, బలమైన పౌరసమాజ ప్రతిఘటిస్తుందన్న స్పృహతోనూ నేరస్తులను కొత్తగా రాజకీయంలోకి తీసుకోవడాన్ని ప్రధాన పార్టీలు నిలిపివేశాయి. ఆ విధంగా నేర రాజకీయం కొంతమేరకు తగ్గుముఖం పట్టింది. ఇది పౌరసమాజం సాధించిన ఘన విజయం. అలాగే సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పు కేవలం పౌరుల ప్రయత్నాల వల్ల సాధ్యమైందే కానీ రాజకీయ నాయకుల సంకల్పం

వల్ల కాదు. ఈ ఉదంతం నుంచి నేర్చుకోవలసిన రెండో గుణపాఠం రాజకీయ పార్టీల, ప్రభుత్వాల తీరుకు సంబంధించినది. ప్రస్తుతం పార్లమెంటు ఉభయసభలలో అధికార కూటమి, ప్రతిపక్షాలు హోరాహోరీగా పోరాడుతున్నాయి. గుజరాత్ సంఘటనలపై రెండు వర్గాలు సిగపట్లు పట్టుకుంటున్నాయి. 'త్వంశుంఠ' అంటే 'త్వంశుంఠ' అని పరస్పర దూషణలకు పాల్పడుతున్నాయి. విచిత్రమేమంటే అభ్యర్థుల వివరాలను ప్రజల ముందు పెట్టడాన్ని కేంద్ర ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ నిర్లజ్జగా, బహిరంగంగా వ్యతిరేకించాయి. అంటే పార్టీ మధ్య పోరాటం కేవలం ప్రజలను దోచుకునే అధికారం ఎవరికుండాలనే పరిమితమైన అంశాన్ని గురించి మాత్రమే. మనం ఆ విషయాన్ని గమనించక అమాయకంగా మోసపోతున్నాం. పార్టీల మధ్య పోరాటం మేకపిల్లను తినే హక్కు కోసం తోడేళ్ల మధ్య జరిగే పోరాటం లాంటిది. ప్రజా సంక్షేమం, ప్రజాస్వామ్యం విలువలు, స్వచ్ఛమైన ఎన్నికల ఆవశ్యకత ప్రధాన రాజకీయ పక్షాలకు పట్టడం లేదు. ఆ విషయాన్ని అర్థం చేసుకోలేక ఎందరో అమాయక పౌరులు పార్టీల పేరుతో జరుగుతున్న అధికార యజ్ఞంలో బలిపశువులవుతున్నారు. ఎందరో సామాన్యులు పార్టీలలో సాధారణ సభ్యులుగా ఉంటూ పల్లకీలు మోయడానికి సిద్ధమవుతున్నారు. ఏదో ఒక రకంగా ఎన్నికలలో విజయం సాధించడం కోసం, గెలిచాక అధికారాన్ని అడ్డదారి తొక్కి అయినా నిలుపుకోవడం కోసం, ఎన్నికలలో రాజకీయాల్లో పెట్టుబడులు పెట్టి అంతకు పదింతలు రాబట్టుకోవడానికి మాత్రమే ప్రధాన రాజకీయ పార్టీలు ఉన్నాయి. అంతేకాని ప్రజలకు సేవ చేసేందుకు మాత్రం కాదు.

మనం నేర్చుకోవలసిన మూడో పాఠం మన ప్రజాస్వామ్యంలో రాజ్యాంగ బద్ధమైన సంస్థల పాత్రను గురించి చట్టసభలు, ప్రభుత్వం, న్యాయవ్యవస్థ ఈ మూడూ ప్రజల సేవ కోసం ఉన్నాయి. మూడింటికి నిర్దిష్టమైన పాత్ర ఉంది. చట్టసభ పని చట్టాలను రూపొందించి ఆమోదించడం, ప్రభుత్వ చర్యలపైన నిఘా వేయడం. ప్రభుత్వం పని చట్టాలను నిష్పాక్షికంగా అమలు చేయడం. కొత్త చట్టాలను ప్రతిపాదించడం, పాలన యంత్రాంగంతో సమర్థంగా, నిజాయితీగా పనిచేయించడం, విధానాలు రూపొందించడం. న్యాయ వ్యవస్థ పని తగాదాలను పరిష్కరించడం, రాజ్యాంగానికి, చట్టాలకు భాష్యం చెప్పడం. న్యాయ నిర్ణయం చేయడం రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా చట్టాలను తయారుచేయడంలో చట్టసభ సఫలీకృతం కానట్లయితే, ప్రజా సంక్షేమం దృష్ట్యా రాజ్యాంగానికి లోబడి విధానాలను రూపొందించి అమలు చేయడం ప్రభుత్వం బాధ్యత. చట్టసభ, ప్రభుత్వం రెండూ ప్రజాస్వామ్యాన్ని

పరిరక్షించడంలో విఫలమైతే ఏర్పడే ఖాళీని భర్తీ చేయడానికి న్యాయస్థానాలు జోక్యం చేసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం దేశంలో జరుగుతన్నది అదే. ఎవరిపని వారు చేస్తే న్యాయస్థానం జోక్యం అవసరమయ్యేదే కాదు. ఈ మాటనే సుప్రీంకోర్టు మే 2 తీర్పులో విస్పష్టంగా చెప్పింది. తాత్కాలికంగా ఒకరి వైఫల్యాన్ని మరొకరు సరిదిద్దవచ్చు. అది శాశ్వత పరిష్కారం కాదు. రాజ్యాంగబద్ధమైన ప్రతి సంస్థ, వ్యవస్థ తన బాధ్యతను తాను నిర్వర్తించేలా ప్రజల నుండి నిరంతర నిఘా, ఒత్తిడి ఉండాలి. లేకపోతే ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించలేం. స్వేచ్ఛను కాపాడుకోలేం.

## ఇల్లు అలకగానే పండుగ కాదు

ఇక నాలుగో పాఠం... ఇదో చిన్న మెట్టు మాత్రమే. సుప్రీం కోర్టు తీర్పుతోనే రాజకీయంలో నేరచరితుల ప్రభావం అంతరిస్తుందని, ఎన్నికలు స్వేచ్ఛగా జరుగుతాయని, పాలన స్వచ్ఛంగా ఉంటుందని భావిస్తే పొరపాటు. ఈ తీర్పును ఎన్నికల సంఘం సమర్థంగా అమలు చేయాలి. పార్టీలు పూర్తిగా సహకరించాలి. సమాచారం ఓటర్లకు పూర్తిగా అందాలి. పత్రికలు దానికి బహుళ ప్రచారాన్నివ్వాలి. ఓటర్లు విజ్ఞతతో తీర్పునిచ్చి నేరచరితుల్ని నిలబెడితే ఓటమి తప్పదన్న భయాన్ని పార్టీలలో కలిగించాలి. నేరచరితుల్ని నిషేధిస్తూ మరింత బలమైన చట్టం రావాలి. న్యాయ సంఘం, ఎన్నికల సంఘం, లోక్‌సత్తా ఉద్యమం, రాజ్యాంగ సమీక్ష సంఘం నిర్దిష్టమైన ప్రతిపాదనలను ఇందుకోసం రూపొందించాయి. ఈ చట్టం ఒక్కటే చాలదు. ఎన్నికలలో అక్రమార్జనకు, అధిక వ్యయానికి తెరపడాలి. అందుకు నిర్ధిష్ట చట్టం కావాలి. ఈ అంశంపైన లోక్‌సత్తా ఉద్యమం సవివరమైన ప్రతిపాదనలను, నమూనాను రూపొందించి అన్ని పార్టీలకు, రాజ్యాంగ సంస్థలకు పంపింది. వాటినుండి ప్రతిస్పందన లేదు. ఒక్క ఎన్నికల తీరు మారడానికే ఇన్ని మార్పులు కావాలి. అంతకుమించి రాజ్య వ్యవస్థలోని లోపాలను సవరించాలంటే మరెన్నో నిర్ధిష్ట పరిష్కారాలు కావాలి. ఇదో సుదూర ప్రయాణం. దీర్ఘకాలిక లక్ష్యాన్ని విస్మరించి తాత్కాలిక విజయాలకు సంబరపడితే ఫలితాలు సాధించలేం. లక్ష్యం ఎంత పెద్దదైనా ఆ మార్గంలో ప్రతి చిన్న మజిలీకి విలువ ఉంటుంది. మే 2న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఈ సుదూర ప్రయాణంలో ఓ మంచి మజిలీ. భారత ప్రజాస్వామ్య పరిణామక్రమంలో ఓ ఆహ్వానించదగ్గ సోపానం. మన రాజ్య వ్యవస్థ నైతిక పునరుజ్జీవనంలో ఓ గర్వించదగ్గ ఘట్టం.

* * *

# 'ఫిరాయింపుల చట్టం'తో ప్రజాస్వామ్య ఖననం!

*జూలై 5, 1999*

పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టంలో మార్పులు ప్రతిపాదిస్తామని కాంగ్రెస్ పార్టీ ఇటీవల ప్రకటించింది. లోపభూయిష్టమైన ఈ చట్టాన్ని 1985లో రాజీవ్‌గాంధీ ప్రభుత్వం తెచ్చింది. అప్పుడు లోక్‌సభలో 80 శాతం స్థానాలు, రాజ్యసభలో మూడింట రెండు వంతుల స్థానాలు కాంగ్రెసు పార్టీవే. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమాత్రం ప్రమాదం ఏర్పడకూడదని, అదే సమయంలో అవసరమైతే వివిధ రాష్ట్రాలలో కాంగ్రెసేతర ప్రభుత్వాలను పడగొట్టడానికి చట్టబద్ధమైన అవకాశం ఉండాలని ఆలోచించి ఆనాడు రాజ్యాంగంలో 52వ సవరణను చేసి, పదవ షెడ్యూల్‌లో చేర్చారు. అదే పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టంగా ప్రచారమైంది. నిజానికి దాన్ని 'పార్టీ ఫిరాయింపుల ప్రోత్సాహక చట్టం' అని పిలవడం సబబు!

## ఒకరు చేస్తే శిక్ష - కలిసి చేస్తే సత్కారం

పార్టీల మీద, ప్రభుత్వాల మనుగడ మీద, చట్టసభలలో ఓటింగుపైన, బహిరంగ చర్చలపైన 52వ రాజ్యాంగ సవరణ విశేష ప్రభావాన్ని చూపింది. ప్రజల తీర్పును మన్నించాలని, ప్రజలు తమపై ఉంచిన విశ్వాసాన్ని ఎన్నికైన చట్టసభ సభ్యులు వమ్ము చేయరాదని, పార్టీలనుంచి ఫిరాయింపులను నిరోధించాలని ఈ చట్టం ప్రకటించిన లక్ష్యాలు. వాస్తవానికి ఈ చట్టం ఫిరాయింపులను ఆపలేకపోయింది. 1985లో ఈ చట్టం వచ్చిననాటి నుంచి నేటివరకు వందల సందర్భాలలో పార్టీ ఫిరాయింపులు జరిగాయి. 1985 రాజ్యాంగ సవరణలో ప్రత్యేకత ఏమిటంటే ఒంటరిగా పార్టీలు మారితే సభ్యత్వం రద్దవుతుంది. అదే మూడోవంతు సభ్యులను ఏదో ఒక విధంగా కూడగట్టుకుని పార్టీ ఫిరాయిస్తే అది చట్టబద్ధమవుతుంది. ఒకరకంగా ఇది "ఒకడు మరో మనిషిని చంపితే ఆ హత్యకు శిక్షపడుతుంది. అదే నలుగురు కలిసి హత్య చేస్తే అందుకు బహుమానం ఇస్తాం" అని చెప్పటమే! ఇలాంటి అసంబద్ధ చట్టం వల్ల పార్టీలలో "చీలిక" సృష్టించడం, ప్రోత్సహించడం, రాజ్యాంగబద్ధ కుట్రలను, తిరుగుబాట్లను అత్యంత రహస్యంగా, పకడ్బందీగా చేపట్టడం ,ప్రభుత్వాలను

మూడో కంటికి తెలియకుండా రాత్రికిరాత్రి దింపడం, ప్రజల తీర్పుతో సంబంధం లేకుండా చట్టసభ సభ్యుల్ని కొనటం, అలా అమ్ముడుపోయిన వాళ్లు, కొన్నవాళ్లు గద్దెనెక్కి ప్రజాధనాన్ని దోచుకోవడం – ఇవన్నీ మన రాజకీయంలో అంతర్భాగమయ్యాయి. అసలు ఎన్నికలే లోపభూయిష్టంగా ఉండి అక్రమార్జనపరుల్ని, గూండాలను గద్దెల మీదికెక్కిస్తుంటే, ప్రజల తీర్పునకు విలువ కూడా లేకుండా పార్టీ పిరాయింపులు రాజకీయాన్ని బేరసారాలతో కూడిన ఒక నీతిబాహ్యమైన, సిగ్గులేని క్రీడగా మార్చేశాయి. ప్రస్తుతం రాజకీయమంటే ఏదో ఒక రకంగా చట్టసభలో సంఖ్యాబలాన్ని కూడగట్టుకోవడం, దాన్ని కాపాడుకోవడం తప్ప మరొకటి కాదు. 1984 ఆగస్టులో ఎన్‌టిఆర్ ప్రభుత్వాన్ని ఆకస్మికంగా గద్దె దింపడం, దానిపైన ప్రజల తీవ్ర నిరసన వ్యక్తం అయిన కారణాన వేరే గతిలేక మళ్లీ ఆ ప్రభుత్వానికే పట్టం కట్టడం మనందరికీ తెలుసు. అదే సంవత్సరం కాశ్మీరులో ఫరూక్ అబ్దుల్లా ప్రభుత్వాన్ని ఫిరాయింపుల ద్వారా తొలగించడం నేటి కాశ్మీర్ సంక్షోభానికి ప్రధాన కారణమైంది. అంతకుమునుపే, 1979లో కేంద్రంలో జనతా ప్రభుత్వాన్ని పార్టీ ఫిరాయింపుల ద్వారా గద్దె దింపడం, చివరికి మధ్యంతర ఎన్నికలు రావటం విదితమే. 1985లో 52వ సవరణ చేపట్టినప్పుడు, ఇలాంటి ఫిరాయింపులు ఇక జరగవని చాలామంది ఆశించారు. వాస్తవానికి ఫిరాయింపులు ఏమాత్రం ఆగలేదు.

1991–92 కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం తన మనుగడ కోసం వివిధ పార్లమెంటరీ పార్టీలను చీల్చింది. అందులో తెలుగుదేశం ఒకటి. అలాగే జార్ఖండ్ ముక్తిమోర్చా లాంటి పార్టీలకు చెందిన సభ్యులెందరినో కొన్నారు. ఇప్పటికీ ఆ కేసు కోర్టుల్లో అంతం లేకుండా అలాగే కొనసాగుతోంది. అంతటితో ఆగక సుప్రీం కోర్టు ఒక విచిత్రమైన తీర్పునిచ్చింది. డబ్బుకు అమ్ముడుపోయిన చట్టసభ సభ్యుడు అవినీతికి పాల్పడ్డట్టు కాదట! ఎందుకంటే సభలో అతడు వేసే ఓటును గురించి ప్రశ్నించే హక్కు ఎవరికీ లేదట! డబ్బు తీసుకుని ఓటు వేసినట్లు సాక్ష్యం ఉన్నా అది అతడి హక్కట! కాని డబ్బిచ్చి ప్రలోభ పెట్టినవాడు మాత్రం నేరస్తుడట! ఇదీ ప్రస్తుతం మన దీనస్థితి. పార్టీ ఫిరాయింపుల చరిత్రలో ఓ గొప్ప మలుపు ప్రస్తుత ఉత్తరప్రదేశ్ శాసనసభలో జరిగిన సంఘటనలు. అక్కడ సభ్యులు కాంగ్రెస్ పార్టీ నుండి ఫిరాయించి లోక్‌తాంత్రిక్ కాంగ్రెస్‌ను నెలకొల్పి బిజెపి ప్రభుత్వంలో చేరారు. అలా పార్టీ ఫిరాయించిన ప్రతి సభ్యుడు మంత్రి అయ్యాడు! బహుజన సమాజ్ పార్టీకి చెందిన 54 మంది సభ్యులలో 12 మంది ఫిరాయించి, అందరూ మంత్రులయ్యారు. అక్కడి

శాసనసభ స్పీకరు కేసరినాథ్ త్రిపాఠి కొత్త గణితాన్ని సృష్టించారు. 54లో మూడోవంతు అంటే కనీసం 18 కావాలి. లోపభూయిష్టమైన ప్రస్తుత చట్టం ప్రకారం కూడా 54 మందిలో 12 మంది పార్టీని ఫిరాయిస్తేవాళ్ల సభ్యత్వం రద్దు కావాలి. దాన్ని విచారించి సభ్యత్వం రద్దయినట్లు ప్రకటించవలసింది స్పీకరు. కాని ఉత్తరప్రదేశ్ స్పీకర్ 54 మందిలో 12 మంది ఫిర్యాయించినా దాన్ని 'కొనసాగుతున్న చీలిక'గా భావించవచ్చునని, 18 అయ్యేదాకా వాళ్లని ఫిరాయింపునకు పూర్తి అవకాశమివ్వాలని అతిహేయమైన తీర్పునిచ్చి కొత్త గణితాన్ని సృష్టించారు! సరే, ఇలా పార్టీలు ఫిరాయించినవాళ్లకు పెద్దపీట వేసి మంత్రి పదవులిచ్చి అసలు పార్టీలో వారికి పదవుల్వీలేదన్న అక్కసు ప్రస్తుతం ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంలోని సంక్షోభానికి కారణం అయింది. అది వేరే కథ.

52వ సవరణ పార్టీ ఫిరాయింపులను ఆపలేకపోగా, మరో ఉపద్రవాన్ని తెచ్చిపెట్టింది. ఈ చట్టంలో ఓ సభ్యుడు ఎలాంటి అంశంపైన అయినా సరే తన మనసుకు నచ్చినట్లుగా ఓటు వేసే అవకాశం లేదు. ప్రభుత్వ మనుగడతో సంబంధం లేకపోయినా, ఆ సభ్యుడికి ధర్మాధర్మ విచక్షణావకాశం లేదు. అంటే చట్టసభ సభ్యుల్ని గొర్రెల మందలలాగా చేసింది 52వ సవరణ. ఇక ఆ సభ్యులు ఉన్నా లేకపోయినా సరే ఎంతటి విపరీత నిర్ణయం తీసుకున్నా, దాన్ని చట్టసభ సభ్యులు విధిగా ఆమోదించి సభలో సమర్థించవలసిందే! లేదంటే వాళ్ల సభ్యత్వం రద్దవుతుంది. ఈ కారణంగానే రాజీవ్‌గాంధీ అనాలోచితంగా, ముస్లిం మత ఛాందసులను తృప్తిపరచడానికి ప్రవేశపెట్టిన "ముస్లిం మహిళల పోషణ బిల్లు"ను ఆ పార్టీకి చెందిన పార్లమెంటు సభ్యులు సమర్థించవలసి వచ్చింది. ఆ దారుణమైన బిల్లుపై వ్యక్తమైన నిరసనను చల్లార్చడానికి, హిందూ ఛాందసులను తృప్తిపరచడానికి ప్రభుత్వం అయోధ్యలో శిలాన్యాసాన్ని చేపట్టవలసి వచ్చింది. ఎంతోకాలంగా నిద్రాణంగా ఉన్న మందిర్ మసీదు వివాదం వెలుగులోకి వచ్చి దేశానికి, సమాజానికి అపార నష్టాన్ని కలగజేసింది. కాంగ్రెస్ ఎంపీలకే ఓటింగులో స్వేచ్ఛ ఉంటే ఆనాటి ముస్లిం మహిళల బిల్లు సభలో వీగిపోయేది! సుప్రీం కోర్టు జడ్జి రామస్వామిపై అభిశంసన తీర్మానంపైన ఓటింగు విషయంలో కాంగ్రెస్ పార్టీ విప్ జారీ చేయడం బహుశా మన పార్లమెంటరీ చరిత్రలో అత్యంత విషాదకర పరిణామం. ఓ న్యాయమూర్తిని అభిశంసించే తరుణంలో పార్లమెంటు ఓ న్యాయస్థానంలాగా వ్యవహరించాలి. సాక్ష్యాల్ని పరిశీలించి, వాస్తవాలను నిర్ధారించి ప్రతి సభ్యుడు నిజాయితీగా నిర్ణయం తీసుకోవాలి. అప్పుడే రాజ్యాంగాన్ని

పార్లమెంటు పరిరక్షించినట్లవుతుంది. అలాకాక, కాంగ్రెస్ సభ్యులందరూ ఓటింగ్‌లో పాల్గొనరాదని విప్ జారీచేయడంతో ఆనాటి అభిశంసన వీగిపోయింది! ఆ ఒక్క అనాలోచితమైన నీతి బాహ్యమైన చర్యవల్ల రాజ్యాంగ సంస్థల జవాబుదారీతనం అసాధ్యమైపోయింది! ఇలా లోతుగా పరిశీలిస్తే తేలేదేమంటే, 52వ రాజ్యాంగ సవరణ వల్ల ఒకవంక పార్టీ ఫిరాయింపులు, ప్రజాస్వామ్య ఖననాలు యథేచ్ఛగా జరిగిపోతుండగా, మరోవంక సభ్యుల స్వేచ్ఛకు సంకెళ్లు పడి వారు పార్టీ నాయకత్వం చేతిలో బానిసలుగా మారిపోయారు. ఇప్పటికే పార్టీలు నిరంకుశంగా, అప్రజాస్వామికంగా వ్యవహరించడంతో, 52వ సవరణ మన ప్రజాస్వామ్యాన్ని మరింత అప్రతిష్టపాలు చేసింది.

## సమూల సంస్కరణలకు నడుం కట్టాలి

ఏ విధంగా పరిశీలించినా పార్టీ ఫిరాయింపులను ఆపటానికి అదే సమయంలో చట్టసభలలో భావ ప్రకటన స్వేచ్ఛగా ఉండేలా చట్టంలో మౌలిక సవరణలు తేవాలి. ఒంటరిగానైనా, గుంపుగానైనా పార్టీలు మారడాన్ని నిషేధించాలి. ఎంతమంది అయినా సరే ప్రభుత్వ మనుగడ విషయంలో పార్టీకి వ్యతిరేకంగా ఓటువేస్తే, వాళ్ల సభ్యత్వం తక్షణం రద్దుకావాలి. ఆ రద్దుచేసే అధికారం స్పీకరుకు కాక, ఎన్నికల సంఘానికి ఇవ్వాలి. నిజంగానే మౌలికమైన అంశాలలో విభేదాలవల్ల పార్టీలలో చీలిక వస్తే, అప్పుడు పార్టీ నాయకత్వాన్ని వ్యతిరేకించినవారికి రక్షణ ఏమిటి? అందుకు పకడ్బందీగా చట్టాన్ని చేయాలి. అకస్మాత్తుగా గవర్నరు దగ్గరకో, రాష్ట్రపతి దగ్గరకో పోయి పార్టీలో చీలిక వచ్చిందంటే దాన్ని ఎట్టి పరిస్థితిలోనూ ఆమోదించరాదు. ఓ పార్టీలో చీలిక వస్తే, అది కనీసం నెల రోజుల బహిరంగ నోటీసుతో రావాలి. ఆ పార్టీ సర్వసభ సమావేశం, పార్టీ నిబంధనల మేరకు, నెలరోజుల బహిరంగ నోటీసు తర్వాత జరగాలి. ఆ సభలో ఎన్నికల సంఘం ప్రతినిధులు పరిశీలకులుగా పాల్గొనాలి. అక్కడ కనీసం మూడోవంతు సభ్యులు విధానాల కారణంగా పార్టీ చీలికను ప్రతిపాదించాలి. నాయకత్వ మార్పును ఆశిస్తే, ఆవిషయాన్ని అక్కడ ఎన్నిక ద్వారా తేలాలికాని, చట్టబద్ధంగా చీలిక కారణం కారాదు. అంటే నాయకత్వం మార్పు కోసం వచ్చే చీలికను నిషేధించాలి. బలమైన కారణాల వల్ల బహిరంగంగా చీలిక వస్తే, ముందుగా ఎన్నికల సంఘం దాన్ని గుర్తించాలి. ఆ పిదప స్పీకరుకు బహిరంగంగా కనీసం మరో నెల ముందు నోటీసు ఇచ్చి ఆ పార్టీలో చీలిక సభ్యులు

విప్‌కు వ్యతిరేకంగా ఓటు చేయవచ్చు. కాని అలా ఓటు వేసే సభ్యులకు ఆ సభ పదవీకాలం మొత్తంలో మంత్రి పదవులు మరే ఇతర పదవులు పొందే హక్కు ఉండరాదు. ఇలా పకడ్బందీగా చట్టాన్ని చేస్తే, అటు పార్టీలలోప్రజాస్వామ్యం నిలబడుతుంది. ఇటు డబ్బు కోసం, పదవి కోసం ఫిరాయింపులను నిషేధించవచ్చు. అదే సమయంలో పార్టీ విప్‌ను ప్రభుత్వ మనుగడను నిర్దేశించే అంశాలకు మాత్రమే పరిమితం చేయాలి. అంటే ఓ ప్రభుత్వంపై అవిశ్వాస, ఓ విశ్వాస తీర్మానం, బడ్జెట్‌పై లేదా ఆర్థిక బిల్లుపై ఓటింగ్‌కు మాత్రమే విప్‌ను పరిమితం చేయాలి. ఈ అంశాలపై అప్పుడే రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వం పతనమవుతుంది. మిగిలిన అన్ని అంశాలలోనూ సభ్యులకు తమ అభీష్టానుసారం ఓటు వేసే హక్కుండాలి. కొందరు సభ్యులు ఓ ప్రభుత్వ పార్టీ ప్రతిపాదనను కాదంటే, వారిని వాదనతో, వాస్తవాలను బహిరంగ చర్చలో ఒప్పించాలి తప్ప, బెదిరింపులతో, నియంతృత్వంతో, పిచ్చుకమీద బ్రహ్మాస్త్రంతో కాదు. ఇప్పటికే పార్టీ ఫిరాయింపుల వల్ల ఒకవంక, చట్టసభ సభ్యుల బానిసత్వం మరోవంక మన ప్రజాస్వామ్యానికి భరించరాని కీడు జరిగింది. ఇప్పటికైనా అన్ని పార్టీలు కళ్లు తెరిచి, సవివరణమైన సంస్కరణల కోసం నడుం కట్టాలి.

* * *

# అభ్యర్థుల ఎంపిక పార్టీల సొంత వ్యవహారం కాదు

*జులై 26 ,1999*

ఎన్నికల సంఘం పదో శాసనసభకు, పదమూడో లోక్‌సభకు ఎన్నికల తేదీలను ప్రకటించడంతో రాజకీయం వేడెక్కింది. పార్టీల తరఫున ఎన్నికలలో పోటీచేసే అవకాశం కోసం తర్జన, భర్జనలు, మల్లగుల్లాలు మొదలయ్యాయి. కులం, ప్రాంతం, ముఠా వగైరా కారణాలపై ఎక్కువ సీట్లు పొందడానికి బలసమీకరణ ప్రారంభమైంది. ప్రజాస్వామ్య రాజకీయంలో ఇవన్నీ సహజం. రాజ్యాంగాన్ని, చట్టాన్ని చూసినా, ఎన్నికల ప్రక్రియను పరిశీలించినా, ఎన్నికలలో ఏ పౌరుడైనా పోటీచేయవచ్చుని, ఒకసారి బరిలోకి దిగాక అభ్యర్థులందరూ సమానమేననే భావం కలుగుతుంది. వాస్తవానికి ఎన్నిక జరిగేది పార్టీల మధ్య మాత్రమే. అసలైన పోటీ అంతా ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్యే ఉంటుంది. మిగిలిన వారిగురించి జనానికి తెలిసే అవకాశమూ లేదు, ప్రజలు వాళ్ల గురించి పట్టించుకోనూ లేరు. ఇది ప్రపంచంలో అన్ని దేశాలలోనూ వాస్తవం. ఆధునిక ప్రసార సాధనాలు విరివిగా ఉన్న అమెరికాలాంటి దేశాలలోనూ, బాగా పరిణతి చెందిన బ్రిటన్ లాంటి ప్రజాస్వామ్య దేశాలలోనూ కూడా ప్రధాన పార్టీల బయట రాజకీయం చేయడం ద్వారా ప్రజల దృష్టిని ఆకట్టుకోవడం, ఓట్లు పొందటం, ఎన్నికలలో పోటీకి పార్టీలు సీట్లిచ్చే వారిమీద ఆధారపడి ఉంటుంది. పార్టీలు నిజంగా సమర్థులకు, నిజాయితీపరులకు సీట్లిస్తే, ఎవరు గెలిచినా ప్రజలకు మంచిదే. అలాకాక పార్టీలు మంచి ప్రమాణాలను, నిజాయితీని, సామర్థ్యాన్ని, నడవడికను, చిత్తశుద్ధిని తుంగలోకి తొక్కి అవినీతికి, కండబలానికి పెద్దపీట వేస్తే ఎవరు గెలిచినా నష్టపోయేది ప్రజలే. అంటే ఎన్నికకు ముందే సీట్ల పంపిణీ ద్వారా పార్టీలు మన భవిష్యత్తును నిర్దేశిస్తున్నాయి. ఎన్నికలలో పోటీకి తగిన అభ్యర్థులను ఎంపిక చేసి ప్రజల ముందు పెట్టడం రాజకీయ పార్టీల అతి ప్రధానమైన విధి. అసలు రాజకీయం అంటేనే అధికారం కోసం పోరాటం. తాము ఆశించే లక్ష్యాల కోసం పదవిని, అధికారాన్ని ఆశించి ఒక పార్టీ పనిచేస్తుంది. పదవిని ఆశించకపోయినా, ఎన్నికలలో పోటీచేయకపోయినా అది రాజకీయా పార్టీ కాదు. అలాంటప్పుడు పదవులను పంపిణీ చేయడంలో, ఎన్నికలలో పోటీకి అభ్యర్థుల

ఎంపికలో పార్టీలు వివిధ దేశాలలోనూ, మన దేశంలోనూ ఎలా వ్యవహరిస్తున్నాయో పరిశీలిద్దాం.

## బ్రిటన్‌లో తీరుతెన్నులు

బ్రిటన్‌లో మూడు ప్రధాన పార్టీలున్నాయి – లేబర్, కన్జర్వేటివ్, లిబరల్ డెమోక్రాటిక్ పార్టీలు. కన్జర్వేటివ్ పార్టీలో అభ్యర్థులు కాగోరేవారు చాలాముందుగానే పార్టీ కేంద్ర కార్యాలయానికి తమ వివరాలతో దరఖాస్తు చేస్తారు. వారి అర్హతలను పరిశీలించి ఆ పార్టీ ఒక జాబితా తయారు చేస్తుంది. ఆపైన వారికి ఒక పరీక్షలాంటిది నిర్వహిస్తారు. దానిలో విజయం సాధించినవారు అప్పుడు ఖాళీగా ఉన్న సీట్ల కోసం నియోజకవర్గ కమిటీకి దరఖాస్తు పెట్టుకుంటారు. నియోజకవర్గం స్థాయిలో పార్టీ సభ్యులు ఎన్నుకున్న కమిటీ అభ్యర్థులందరినీ ఇంటర్వ్యూకు పిలుస్తుంది. విడివిడిగా ఆ కమిటీ అభ్యర్థులతో మాట్లాడి, వారి అభిప్రాయాలను అర్హతలను పరిశీలిస్తుంది. ఇంటర్వ్యూకు వచ్చిన అభ్యర్థులలో తమకు ఎవరు నచ్చారో ఓటుద్వారా నిర్ణయించి ఆ వ్యక్తికి ఆ సీటును ఖరారు చేస్తుంది. ఈ కమిటీ నిర్ణయం నచ్చకపోతే నియోజకవర్గంలో పార్టీ సభ్యులందరూ ఓటింగు ద్వారా ఎవరు తమ పార్టీ అభ్యర్థో నిర్ణయిస్తారు. నియోజకవర్గ కమిటీ లేదా పార్టీ సభ్యులు చేసిన నిర్ణయాన్ని పార్టీ కేంద్ర కమిటీ లాంఛనప్రాయంగా ఆమోదించి, అభ్యర్థిని ఖరారు చేస్తుంది. అలాగే లేబర్‌పార్టీలో కూడా నియోజకవర్గ కమిటీ ఓటింగు ద్వారా అభ్యర్థిని ఖరారు చేస్తే, ఆ నిర్ణయాన్ని పార్టీ కేంద్ర కమిటీ లాంఛనప్రాయంగా ఆమోదిస్తుంది. చాలా అసాధారణ పరిస్థితుల్లో, చరిత్రలో అరుదుగా మాత్రమే కేంద్ర కమిటీ స్థానిక నిర్ణయాన్ని వ్యతిరేకించింది. కొద్ది సందర్భాలలో కమ్యూనిస్టు పార్టీకి చెందినవారిని స్థానిక కమిటీ లేబరు పార్టీ అభ్యర్థిగా ఎంపిక చేసినప్పుడు ఈ విధంగా కేంద్ర కమిటీ ఆ పేర్లను తిరస్కరించి, వేరే అభ్యర్థిని ఎంపిక చేయవలసిందిగా నియోజకవర్గ కమిటీని కోరింది. లిబరల్ డెమోక్రాటిక్ పార్టీలో సీట్లు కోరేవారు ప్రాంతాలవారీగా (ఇంగ్లండ్, వేల్స్, స్కాట్లండ్) కమిటీలకు దరఖాస్తు చేసుకుంటారు. వారి దరఖాస్తులు, అర్హతలు పరిశీలించాక ఆ ప్రాంతంలో అభ్యర్థులందరినీ పిలిపించి వారిని ఇంటర్వ్యూ చేసి, ఎంపికైన వారి జాబితాలను ప్రాంతాలవారీగా తయారు చేస్తారు. అలా జాబితాలో నమోదైనవారు ఖాళీగా ఉన్న సీట్ల కోసం దరఖాస్తు పెట్టుకుంటారు. నియోజకవర్గంలో ఎన్నికైన పార్టీ కమిటీ వారిని పరిశీలించి అభ్యర్థులు ఎక్కువ మంది ఉంటే, వారి

అర్హతలను బట్టి చిన్న జాబితా తయారు చేస్తుంది. వారిలో ఒకరిని ఆ పార్టీ సభ్యులంతా ఓటింగు ద్వారా ఎన్నుకుంటారు. ఆ నిర్ణయం పార్టీకి శిరోధార్యం. బ్రిటన్ విధానాన్ని పరిశీలిస్తే అభ్యర్థుల ఎంపికలో కొన్ని విషయాలు స్పష్టమవుతాయి. మొదట – ఆ పార్టీ స్థానిక కమిటీ లేదా సభ్యుల నిర్ణయం తుది నిర్ణయం. అభ్యర్థుల ఎంపిక విధిగా స్థానికంగానే జరుగుతుందిగానీ, నియోజకవర్గం బయట జరగదు. పార్టీ అభ్యర్థిత్వాన్ని ఆశించేవారందరికీ సమాన అవకాశం ఉంటుంది. వారు చేయవలసిందల్లా తమ అర్హతలను, శక్తి సామర్థ్యాలను నిరూపించుకోవడం, తమ భావాలను, నాయకత్వ లక్షణాలను వ్యక్తం చేయడం. ఏ అధినాయకుడి కాళ్లూ పట్టుకోవాల్సిన అవసరం లేదు. బలప్రదర్శన మాటేలేదు. వాళ్లకు ఎంత డబ్బుందన్న విషయమే చర్చకు రాదు. కండబలం ఊసేలేదు. పక్షపాతాలు, పైవాళ్ల అండ అక్కడ పనికిరావు. ఇదీ బ్రిటన్‌లో పార్టీలు నిర్వహించే తీరు, అభ్యర్థులను ఎంపిక చేసే పద్ధతి.

ఒక్క బ్రిటనులోనే కాదు, అంతోయింతో పరిణితి చెంది పేరొందిన ప్రతి ప్రజాస్వామ్య దేశంలోనూ అభ్యర్థుల ఎంపిక ఇలాగే జరుగుతుంది. ఉదాహరణకు జర్మనీలో పార్టీ నియోజకవర్గ కమిటీ రహస్య బ్యాలెట్ ద్వారా తమ అభ్యర్థిని ఎంపిక చేస్తుంది. దామాషా పద్ధతిలో ఎన్నికయ్యే అభ్యర్థుల జాబితాను రాష్ట్రాల వారీగా (లాండర్లు) రాష్ట్రస్థాయిలో ఎన్నికైన పార్టీ కమిటీ రహస్య ఓటింగ్ ద్వారా ఖరారు చేస్తుంది. జాబితాలో వరుసలో ఏ స్థానంలో ఉండాలో కూడా ఓటింగు ద్వారా, ప్రజాస్వామ్య బద్ధంగా నిర్ణయిస్తారు. అలాగే నార్వే, స్వీడన్, బెల్జియం, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, కెనడా – ఇలా దాదాపు అన్ని ప్రజాస్వామ్య దేశాలలోనూ పార్టీ అభ్యర్థుల ఎంపిక స్థానికంగా, పార్టీ సభ్యుల ఓటింగు ద్వారాగానీ, లేదా ఆ పార్టీలో స్థానికంగా ఎన్నికైన కమిటీ నిర్ణయం ప్రకారం గానీ జరుగుతుంది. పార్టీ సభ్యులెవరైనా అధిష్టానవర్గాల ప్రసక్తి లేకుండా పార్టీ సీటు కోరవచ్చు. తమ ప్రతిభను ప్రదర్శించుకుని ఎంపికై ఆ పార్టీ తరఫున ఎన్నికలలో పోటీచేయవచ్చు.

## అమెరికాలో ప్రైమరీ ఎన్నికలు

అమెరికాలో పార్టీ ప్రజాస్వామ్యం అత్యంత ఉచ్ఛస్థితికి చేరుకుంది. 1913 వరకు అక్కడ పార్టీలలో నాయకత్వానికి చాలా పలుకుబడి, అధికారం ఉండేవి. ఆ తరువాత అన్ని పదవులకు పార్టీ అభ్యర్థిని నిర్ణయించడానికి ప్రత్యక్షంగా ప్రైమరీ

ఎన్నికలు నిర్వహించి, అందులో ఆ పార్టీ సభ్యుల రహస్య ఓటింగు ద్వారా తమ పార్టీ అభ్యర్థిని ఎంపిక చేయడం ప్రారంభమైంది. చాలా రాష్ట్రాలలో ఈ ప్రైమరీ ఎన్నికలకు చట్టబద్ధమైన గుర్తింపు ఉంది. అదేదో పార్టీ స్వంత వ్యవహారంగా కాక, బహిరంగంగా, చట్టం నిర్దేశించిన రీతిలో, ఎన్నికల అధికారుల పర్యవేక్షణలో జరుగుతుంది. అలాగే అమెరికా అధ్యక్ష పదవికి తుది ఎన్నిక ఎంత ముఖ్యమో, రెండు ప్రధాన పార్టీల తరఫున అభ్యర్థిగా ఎంపిక కావడానికి జరిగే ప్రైమరీ ఎన్నికలు అంతకన్నా ముఖ్యం. ఆ దేశంలో ఉన్న 50 రాష్ట్రాలలోనూ, 46 రాష్ట్రాలో పార్టీ సభ్యులు చట్టబద్ధంగా రహస్య ఓటింగు ద్వారా, ప్రత్యక్షంగా తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేస్తారు. కొన్ని రాష్ట్రాలలో ఏ పౌరుడైనా ఈ ప్రైమరీ ఎన్నికలలో ఓటు వేయవచ్చు. 4 రాష్ట్రాలలో ఆ పార్టీ సభ్యులు ఎన్నుకున్న కమిటీలు 'పార్టీ కాకస్'లని నిర్వహించి, అధ్యక్ష పదవికి తమపార్టీ తరఫున ఎవరు అభ్యర్థి కావాలో నిర్ణయిస్తాయి. చివరికి దేశవ్యాప్తంగా ఆ పార్టీ జాతీయ సమావేశం అట్టహాసంగా, ప్రపంచమంతా చూస్తుండగా, టివి కెమెరాల ఎదురుగా జరుగుతుంది. అప్పటికే ప్రైమరీ ఎన్నికలలో గెలుపు నిర్ణయం అయితే, ఆ ఎన్నికలలో మెజారిటీ పొందిన అభ్యర్థిని లాంఛనంగా ఎంపికచేసి అసలు ఎన్నికకు సన్నద్ధమవుతారు. అలాకాక ప్రైమరీ ఎన్నికలలో ఏ అభ్యర్థికీ స్పష్టమైన మెజారిటీ రాకపోతే, అప్పుడు జాతీయ సమావేశంలో ఒకరికి మెజారిటీ వచ్చేవరకూ ఎన్నిసార్లయినా ఓటింగు జరుగుతుంది. అలా అత్యంత ప్రజాస్వామ్యబద్ధంగా ప్రైమరీ ఎన్నికల ద్వారా అభ్యర్థులను అన్ని స్థాయిలలోనూ ఖరారు చేస్తారు. ఇలా పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యానికి పకడ్బందీ చట్టం ఉండటమే కాక, అధ్యక్ష పదవికి జరిగే ప్రైమరీ ఎన్నికల ఖర్చును కూడా చాలా మేరకు ప్రభుత్వమే భరిస్తుంది.

అందుకే అమెరికాలో నూతన నాయకత్వం ఎదగటం సులభం. ఉదాహరణకు 1975లో జార్జియా గవర్నరుగా ఉన్న జిమ్మీకార్టర్‌ను గురించి ఆ దేశంలోని మిగతా రాష్ట్రాలలో 2 శాతం ప్రజలకు మాత్రమే తెలుసు. అయినా నిక్సన్ అభిశంసన, రాజీనామా నేపథ్యంలో అమెరికా ప్రజలకు కొత్త నాయకత్వం కావాలనే కోరిక ప్రబలం కావడంతో, కార్టర్ తన పార్టీ అభ్యర్థిగా ప్రైమరీ ఎన్నికలలో గెలిచి, 1976 అధ్యక్ష ఎన్నికలో అప్పటి అధ్యక్షుడు ఫోర్డ్‌ను ఓడించి దేశాధ్యక్షుడయ్యారు! 1991లో బిల్‌క్లింటన్ ఒక చిన్న రాష్ట్రమైన అర్కన్సాస్ గవర్నరు. అందునా అర్కన్సాస్ అమెరికాలో చాలా బీద రాష్ట్రం. అయినా తన నాయకత్వ పటిమను చూపి తన పార్టీ అభ్యర్థిగా

ఎంపికయ్యే అవకాశం ప్రైమరీ ఎన్నికలలో ఆయనకు లభించింది. ఆ తరువాత తుది ఎన్నికలో అప్పటి అధ్యక్షుడు జార్జిబుష్‌ను ఓడించి అమెరికా అధ్యక్షుడయ్యాడు క్లింటన్. 1991లో ఇరాక్ యుద్ధం తరువాత జార్జిబుష్‌కు ప్రజలలో మద్దతు 90 శాతం దాటి రికార్డు స్థాయిలో ఉంది! కానీ సంవత్సరంన్నర కాలంలోనే ఆయన అధ్యక్ష పదవిని పోగొట్టుకున్నారు. ! పార్టీలలో ప్రజాస్వామ్యం ఉండబట్టే, అభ్యర్థుల ఎంపిక స్థానికంగా పార్టీ సభ్యుల చేతిలో ఉండబట్టే ఎన్నో సందర్భాలలో ఆ పార్టీ అగ్రనాయకత్వాన్ని వ్యతిరేకించేవారు కూడా పార్టీ అభ్యర్థులుగా ఎంపికై, ఆయా దేశాల రాజకీయాల్లో ప్రధానపాత్ర వహిస్తున్నారు. ఉదాహరణకు విన్‌స్టన్ చర్చిల్‌కు తన పార్టీ అధినాయకత్వంతో ఎప్పుడూ పోరాటమే. అయినా స్థానిక పార్టీ మళ్లీ మళ్లీ అయన్నే అభ్యర్థిగా నియమించి పార్లమెంటు ఎన్నికలలో గెలిపించింది. రెండో ప్రపంచ యుద్ధంలో ప్రపంచంలో నాజీ వ్యతిరేక శక్తులన్నిటికీ అద్భుతమైన నాయకత్వాన్నిచ్చి బ్రిటన్ – అమెరికా – రష్యాల కూటమి విజయానికి చర్చిల్ ప్రధాన కారకులయ్యారు. అందుకే పలువురు ఆయనను ప్రపంచంలోనే ఈ శతాబ్దపు మహా నాయకునిగా నేటికీ కీర్తిస్తున్నారు. పార్టీల అధినాయకులకే అవకాశం ఉంటే చర్చిల్‌ను ఏనాడో రాజకీయ సమాధి చేసి ఉండేవారు. అదీ ప్రజాస్వామ్య దేశాలలో పార్టీలలో అభ్యర్థుల ఎంపిక తీరు. అందుకే ఆ దేశాలలో ప్రజాస్వామ్యానికి విశ్వసనీయత ఉంది. ఆ కారణంగానే మంచి నాయకత్వం మళ్లీమళ్లీ అక్కడ ఎదుగుతోంది. అందువల్లనే నిజాయితీకి, సామర్థ్యానికి అక్కడ పట్టం కట్టగలుగుతున్నారు. పార్టీ సభ్యులు, స్థానికంగా ఎన్నికైన కమిటీలు అంతిమ నిర్ణయం చేయగలగటం వల్లనే అవినీతికి, అసమర్థతకు బంధుప్రీతికి అక్కడ అడ్డుకట్ట వేయగలుగుతున్నారు. పార్టీ అభ్యర్థుల ఎంపికలో ప్రజాస్వామ్యం పాటించడం వలన ఆ దేశాలలో ప్రజాస్వామ్యం వర్ధిల్లడమేకాక మంచి పాలన, దేశాభివృద్ధి సాధ్యమవుతున్నాయి.

## జేబు సంస్థలుగా మారిన పార్టీలు

మన దేశంలో పార్టీలు అధినాయకుల జేబు సంస్థలుగా మారిపోయాయి. ఎన్నికలలో పార్టీ అభ్యర్థుల ఎంపిక పూర్తిగా 'అధిష్టాన వర్గాల' చేతుల్లోకి పోయింది. ఆ పార్టీల అగ్రనాయకులు కూడా అప్రజాస్వామికంగా గద్దెనెక్కడమే తప్ప, అందులో ఎక్కడా ప్రజాస్వామ్యం, పార్టీ సభ్యుల ఓటింగు మచ్చుకు కూడా కానరావు. చివరికి పార్టీలలో నిర్ణయాలన్నీ అక్రమాధికారాన్ని పొందిన ఒక చిన్న బృందం (కోటరీ)

చేతుల్లో ఉంటాయి. పూర్వకాలం రాచరికంలో లాగా అగ్రనాయకుల కనుసన్నలలో మెలిగేవారికే అన్నింటా అగ్రతాంబూలం. మిగిలిన వారికి పార్టీలలో స్థానం లేదు. పార్టీ సీట్లిచ్చే ప్రసక్తే లేదు. నిరర్థకులను, అక్రమ సంపాదనచేసి కోట్లు ఆర్జించిన వారిని, అవినీతిపరులను, పచ్చి గూండాలను, నేరస్తులను అకస్మాత్తుగా పార్టీ అభ్యర్థులుగా నిర్ణయించడం నాయకత్వానికి అతి సులువు. అదేమంటే "గెలిచే అవకాశం ఉన్న వాళ్లకే పార్టీ టిక్కెట్లు" అని ప్రకటిస్తారు. ఇలా 'దొందూ దొందే' కావడంతో, ఎన్నికలలో ఎవరు గెలిచినా నిరంతరం ఓడేది ప్రజలు మాత్రమే. ఒక రకంగా చూస్తే ఎన్నికలు జరగకమునుపే ప్రధాన పార్టీలు తమ అభ్యర్థులను నిర్ణయించే పద్ధతి ద్వారా ఆ ఎన్నికలలో రిగ్గింగుకు పాల్పడినట్లే! ఒకసారి అనర్హులను, అసమర్థులను, అవినీతిపరులను పార్టీల అభ్యర్థులుగా చేసి మన నెత్తినెక్కించాక ప్రజలు చేయగలిగింది ఏమీలేదు. అందుకే మన దేశంలో ఎన్నికలు ఎన్నిసార్లు జరిగినా ఫలితం మాత్రం ప్రజలకు అన్యాయం. ప్రజా ధనం దోపిడీ, ప్రజాస్వామ్యానికి పరాభవం మాత్రమే. ఈ పరిస్థితులలో 'నిజంగా ప్రజాస్వామ్యం, మంచిపాలనను కాంక్షించే వారు చేయవలసింది ఎన్నికలలో, పార్టీల అభ్యర్థుల ఎంపికలో, ఆ పార్టీ అంతర్గత నిర్వహణలో మౌలిక సంస్కరణల కోసం పోరాడి వ్యవస్థను ప్రక్షాళన చేయటం. అంతవరకు మన దేశంలో నేడు విస్తరిస్తున్న అవినీతి అంతం కాదు. నేర రాజకీయం అదుపులోకి రాదు. పాలన సంక్షోభం సమసిపోదు.

* * *

# హింసా రాజకీయాన్ని దునుమాడే వ్యూహమేది?

*జూలై 24, 2000*

రాష్ట్ర ప్రభుత్వం మరోసారి రాయలసీమలో ముఠాలను అణచివేస్తామని, ఫ్యాక్షనిస్టుల భరతం పడతామని ప్రకటించింది. ఇలా గుర్తొచ్చినప్పుడల్లా ఉలిక్కిపడి హడావుడిగా నాలుగు ప్రకటనలు చేయడం, మూడు సమావేశాలు నిర్వహించడం, రెండు నిర్ణయాలు తీసుకోవడం, ఒక కంటితుడుపు చర్య చేపట్టడం, ఆ తరువాత అలవాటు ప్రకారం నిద్రపోవడం ఆనవాయితీ అయిపోయింది. శాంతి భద్రతలను కాపాడటం, సమాజంలో చట్టబద్ధ పాలనను నెలకొల్పడం ఏదో తోచిన క్షణాన మీటనొక్కితే లైటు వెలగడం వంటిది కాదు. దీర్ఘకాలిక నిర్ణయాలు తీసుకోవడంలో స్థిరచిత్తం, అమలు విషయంలో చిత్తశుద్ధి, రాజకీయంగా బెడిసికొట్టినా తట్టుకునే చేవ, స్వపర భేదాలను విస్మరించే నిజాయితీ ఉండాలి. ఇవన్నీ కొరవడటంతో శుష్క వాగ్దానాలు, శూన్యహస్తాలతో మన నేతలు విచిత్ర విన్యాసాలు చేస్తున్నారు. ముఠా నాయకులు బలవంతంగా డబ్బు వసూళ్లు చేసినా, అడ్డువచ్చిన వాళ్లను దారుణంగా హత్యచేసినా, అమాయకుల కాళ్లు, చేతులు విరగ్గొట్టినా, ప్రభుత్వ టెండర్లలో, రైల్వే కాంట్రాక్టులలో జోక్యం చేసుకుని తుపాకులతో నిర్ణయాలు చేసినా, వందల కొలది లైసెన్సులు లేని, పన్నులు కట్టనా వాహనాలు నడిపినా, తగాదాలలో జోక్యం చేసుకుని ప్రైవేటు తీర్పులతో కోట్లు గడించినా ప్రభుత్వం ఏమీ చేయలేకపోతోంది. పైపెచ్చు ప్రభుత్వ యంత్రాంగం ఫ్యాక్షనిస్టులకు, హింసాత్మక ముఠాలకు దాసోహమంటోంది. ప్రధాన రాజకీయ పార్టీలు నేరగాళ్ల కొమ్ముగాస్తున్నాయి.

## పౌరుడికి కరువైన న్యాయం

అధికారుల నియామకాలలోగానీ, బదిలీలలోగానీ చిత్తశుద్ధి కొరవడింది. తస్మదీయులమీద అస్త్రం ఎక్కుపెడితే సంతోషించే అధికారపక్షం, అస్మదీయుల మీద అధికారుల కల్లుపడగానే బదిలీ వేటు వేసి చట్టబద్ధ పాలనకు గండికొడుతోంది. కడప జిల్లాలో నాడు ఉమేష్‌చంద్ర ఫ్యాక్షనిజాన్ని అణచివేయడానికి గట్టి ప్రయత్నం చేశారని అందరూ అంగీకరిస్తారు. ప్రతిపక్షాల మీద చర్యలు తీసుకున్నప్పుడు చప్పట్లు కొట్టిన ప్రభుత్వ నేతలు, అదే అధికారి స్వపక్షం మీద దాడి ప్రారంభించిన మరుక్షణం

సాగనంపారు. కర్నూలు జిల్లాలో నిజాయితీగా, ధైర్యంగా పనిచేసే పోలీసు అధికారులనెందరినో క్షణాలమీద బదిలీ చేశారు. ఏ అధికారి బదిలీ అయినా ఆ నాయకులకు ఆదేశానుసారం జరగవలసిందే! అలాంటప్పుడు ఈ హింసా సంస్కృతిని అడ్డుకునేదెలా? కంచే చేనుమేస్తే, ఇక ఆ చేనుకు రక్షణ ఏమిటి? అందుకే హింసా సంస్కృతి తగ్గకపోగా రాష్ట్రంలో ఇతర ప్రాంతాలకు విస్తరించింది. కోస్తా ఆంధ్రలో ప్రకాశం, గుంటూరు, కృష్ణాలకు కొంతమేర తూర్పు గోదావరి జిల్లాకు ఈ నేర ముఠాలు, హింసా రాజకీయం వ్యాపించాయి. హైదరాబాద్ నగరంలో, చుట్టుపక్కల ప్రాంతాలలో చాలా ఆస్తి వ్యవహారాలను వ్యాపార సంబంధమైన లావాదేవీలను నిర్ణయించేది ఈ ముఠాలే! అలా కోట్లు ఆర్జించినవాళ్లకే పూలమాలలు వేసి అక్కున చేర్చుకుంటున్నారు. పార్టీల 'నాయకులు' పోలీసులకు కూడా కొంత డబ్బు ఎరవేసి, వాళ్లను తమ బంట్లుగా చేసుకుని మరీ ఫ్యాక్షనిజం నడుపుతున్నారు. రాజకీయానికి, ఫ్యాక్షన్లకు విడదీయరానంత ప్రగాఢ సంబంధాలు ఏర్పడ్డాయి. దాంతో నిన్నటివరకు బేడీలు వేసి, కూపీలు లాగి, ప్రశ్నించి, లాఠీదెబ్బలు రుచిచూపించిన పోలీసు అధికారి, ఆ ఫ్యాక్షనిస్టు కాస్తా రాజకీయ నాయకుడిగా రూపాంతరం చెందగానే సలాము చేస్తున్నాడు. ప్రభుత్వ యంత్రాంగం కోరలు పీకిన పామైపోతోంది. ఎందరో అమాయక పౌరులు, నిజాయితీపరులు కూడా మన కోర్టుల నిర్వాకం పుణ్యమా అని మామూలు పద్ధతుల ద్వారా న్యాయం వస్తుందనే నమ్మకం కోల్పోయారు. ఓ ఇంట్లో అద్దెకున్నవాళ్లను ఒప్పందం ముగిశాక పంపించేయాలన్నా, స్థలం ఆక్రమణకు గురికాకుండా కాపాడుకోవాలన్నా ఓ ఫ్యాక్టరీని నడుపుకోవాలన్నా, ఓ కాంట్రాక్టు ప్రకారం పని చేసుకోవాలన్నా, ఓ వ్యాపారం సరిగ్గా జరగాలన్నా చట్టబద్ధంగా రక్షణ లేకుండా పోయింది. న్యాయవ్యవస్థ నత్తనడక వల్ల, బడితె ఉన్నవాడిదే బర్రెగా అయిపోయింది. దాంతో రక్షణ కోసం, న్యాయం కోసం ఫ్యాక్షనిస్టులు ఆశ్రయించడం తప్పనిసరి అయిపోయింది. అందునాఆ ముఠా నాయకులకు రాజకీయ ప్రవేశం దొరికితే ప్రభుత్వాన్ని అండగా పెట్టుకొని చిటికెలో ఏ పనైనా సాధించగలుగుతున్నారు. చట్టబద్ధమైన పని చేయటానికి వెనుకంజ వేసే పోలీసు యంత్రాంగం, ప్రభుత్వ సిబ్బంది ఈ నేర రాజకీయ ముఠాల ఆదేశాలను క్షణాల మీద అమలు చేస్తున్నారు. దాంతో మాఫియా నాయకులకున్న పలుకుబడి ప్రభుత్వంలో హింసకు పాల్పడకుండా మామూలు రాజకీయ చేసేవాళ్లకు లేకుండా పోయింది. అదివరకు నేర ముఠాల చరిత్ర లేని రాజకీయవేత్తలు కూడా అవకాశం చిక్కగానే పోలీసులను, ప్రభుత్వ

యంత్రాంగాన్ని ప్రైవేటు సైన్యంగా మార్చుకుంటున్నారు. కొందరు ఉన్నతాధికారులు, వాళ్ల బంధువులు సైతం ఆస్తి తగాదాలలో, సివిల్ కేసులలో జోక్యం చేసుకొని కోట్లు ఆర్జిస్తున్నారు. మన రాష్ట్రంలో, దేశంలో చాలా ప్రాంతాలలో నిజంగా రక్షణ కావాలన్నా ఓ పని జరగాలన్నా నాలుగే మార్గాలున్నాయి. అయితే రాజకీయాధికారం ఉండాలి. లేదా బాగా డబ్బుండాలి. కాకపోతే నేర ముఠాల అండ ఉండాలి. అతికొద్ది కేసులలో ప్రజలలో పేరు ప్రతిష్టలు, నైతికమైన పలుకుబడి రక్షణనివ్వవచ్చు. వీటికి దూరమైన ఏ పౌరుడైనా, ఏ క్షణాన్నయినా తన ఆస్తి, ప్రాణం, మాన – ఏదైనా కోల్పోవచ్చు. చట్టబద్ధంగా న్యాయం జరుగుతుందని, పోలీసు యంత్రాంగం రక్షణనిస్తుందని హామీ ఏమీ లేదు. నేర రాజకీయం, హింసా సంస్కృతి, అవినీతి, మాఫియారీతి నేర సామ్రాజ్యాలు, ఎన్నికల అక్రమాలు, కులం పేరుతో ముఠాలు, ప్రైవేటు సైన్యాల ద్వారా తగాదాల పరిష్కారాలు, అధికారుల బదిలీలు, ప్రభుత్వ సిబ్బందిని సొంత సేవకులుగా వినియోగించుకోవడం, ప్రభుత్వ పనులపైన పూర్తి ఆధిపత్యం, నాటు తుపాకులు, బాంబులు – ఇవన్నీ కలగాపులగమైపోయాయి. నేరగాళ్లు, ముఠా నాయకులు కొందరు మరింత చాకచక్యంగా వ్యవహరించి తమ కులానికో, తమ నియోజకవరంలోనో తిరుగులేని ప్రాబల్యాన్ని సాధిస్తున్నారు. పదికోట్లు దొంగ సంపాదన చేసినవాడు ఒక కోటి రూపాయలను ఖర్చుపెట్టి మరింత పలుకుబడిని, అధికారాన్ని సాధించడం సులభం. గూండాల అండతో ఎన్నికైనవారు భయపెట్టి సిబ్బందితో పనులు చేయించి ప్రజలలో గొప్ప నాయకుడిగా చలామణీ కావడం తేలిక. చివరికి ఎవరు నిజమైన హీరోలో, ఎవరు విలన్లో అర్థంకాని తికమక పరిస్థితి ఏర్పడింది. దీన్ని ప్రక్షాళన చేయడం అవసరం అని అందరికీ తెలుసు. కాని అదేదో కేవలం ఫ్యాక్షనిస్టులకు పోలీసు రక్షణ తొలగించినంత మాత్రాన, తుపాకీ లైసెన్సులను రద్దు చేసినంత మాత్రాన పరిష్కారమయ్యేది కాదు. ముఠా నాయకుల రక్షణకు, రాజకీయాల రక్షణకు వినియోగించిన పోలీసు సిబ్బంది కొందరు వాళ్ల బంట్లుగా మారిన మాట వాస్తవం. కొన్ని సందర్భాలలో ఆ ముఠా మనుషులుగా పనిచేసి వాళ్లు వసూలు చేసిన డబ్బు పంచుకోవడం, వాళ్ల తరఫున హత్యలు చేయడం జరుగుతున్నాయి. అందువల్ల పోలీసుల ప్రతిష్ట మరింత దిగజారుతోంది. అసలు ప్రజల రక్షణకు, నేర పరిశోధనకు ఉపయోగపడవలసిన సిబ్బందిని నేరగాళ్ల రక్షణకు మళ్లించవలసి వస్తోంది. కాబట్టి ఈ పోలీసు రక్షణ సౌకర్యాన్ని తీసివేయటం అవసరం. ఇవి కేవలం కంటితుతుడుపు చర్యలు మాత్రమే. ఈ మాత్రానికే గొప్ప ఫలితాలు

సాధించినట్లు భావిస్తే అది కేవలం ఆత్మవంచన,ఫ్యాక్షనిజాన్ని, నేర రాజకీయాన్ని, హింసా సంస్కృతిని, కండబలంతో అందించే బండన్యాయాన్ని – అన్నింటినీ కలిపి చూడాలి. సమగ్రంగా వ్యూహాన్ని అమలు చేయాలి. అందుకు నాలుగు రకాల మౌలిక చర్యలు అవసరం. మొదటిది – సమర్థులు, నిజాయితీపరులైన అధికారులను ఎంపికచేసి, వారికి తగిన అధికారాలను, సిబ్బందిని ఇచ్చి, వెన్నుతట్టి ప్రోత్సహించడం, ఎంత రాజకీయ ఒత్తిడి వచ్చినా మూడు నుంచి ఐదేళ్లపాటు తొలగించకుండా కచ్చితమైన ఏర్పాట్లు చేయడం, స్వ, పరభేధం లేకుండా ఎవరికైనా అణచివేసే అధికారాన్నివ్వడం, ఇది చెప్పడం చాలా తేలిక, కానీ చేయటం చాలా కష్టం. కాని ఎప్పుడో ఒకప్పుడు ఇందుకు పూనుకోకపోతే నేర రాజకీయం, ముఠా కలహాలు, హింసాసంస్కృతి మన వ్యవస్థను కబళించివేస్తాయి. అధికారంలో ఉన్నవాళ్లకు కూడా ఒకనాడు ఆపద తప్పదు. అందుకే ఆసల్యం కాకముందే నిజాయితీగా, చట్టబద్ధంగా నిస్పాక్షికంగా కఠిన చర్యలు తీసుకోవడం అవసరం. రెండోది నేరగాళ్లను, ముఠా నాయకులను ఎన్నికలకు దూరంగా ఉంచడం. 'త్వంశుంఠ' అంటే 'త్వంశుంఠ' అని తిట్టుకుంటూ ప్రతిపార్టీ ఇతరుల మీద బుదచల్లటం వల్ల ప్రయోజనం లేదు. అందరిలో లోపాలున్నాయి. ప్రధాన పార్టీలలో గూండాల మీద ఆధారపడని వాల్లుగానీ, నేర రాజకీయాలను నిస్సిగ్గుగా ప్రోత్సహించని వాల్లుగానీ, తాత్కాలికంగా పబ్బం గడుపుకోని వాళ్లుగానీ లేరు. కాబట్టి ఆత్మస్తుతి, పరనింద మాని, ఇకనైనా పరిస్థితిని మార్చటానికి నడుంకట్టాలి. నాలుగు సీట్లు పోయినా ఫరవాలేదు. మేం మాత్రం మా పద్ధతి మార్చుకుంటున్నాం అని ప్రజలకు ప్రత్యక్షంగా రుజువు చేయగలగాలి. అందుకు రాబోయే స్థానిక ఎన్నికలే నాంది కావాలి. ఇప్పటికే స్థానిక ఎన్నికలలో నేర రాజకీయాలను నిరోధించడానికి లోక్‌సత్తా ఓ నమూనా చట్టాన్ని రూపొందించింది. అదేవిధంగా పకడ్బందీ చట్టాన్ని చేసి కఠినంగా అమలు చేయాలి. చట్టం ఉన్నా లేకపోయినా ప్రధాన పార్టీలు పిల్లిమెడలో గంట కట్టడానకి ముందుకు రావాలి. రాష్ట్రంలో తెలుగుదేశం, కాంగ్రెస్ రెండూ గూండాలకు, నేరగాళ్లకు ఆశ్రయమిస్తున్న మాట కఠోర వాస్తవం. ఇప్పటికైనా ఈ రెండు పార్టీలు కనీసం ఈ విషయంలో ముందుకొచ్చి నేరగాళ్లను దూరంగా ఉంచాలి. అందులో చొరవ తీసుకోవాల్సిన బాధ్యత అధికార పార్టీపైనే ఎక్కువగా ఉంది. మూడోది నేర పరిశోధనలో రాజకీయ జోక్యం లేకుండా కట్టుదిట్టం చేయాలి. చట్టప్రకారం పోలీసు అధికారులకు నేర పరిశోధనలో స్వేచ్ఛ ఉంది. కాని మాయలపకీరు ప్రాణం ఎక్కడో దూరానున్న చిలకలో

ఉన్నట్లు పోలీసు అధికారుల నియామకాలు, బదిలీలు, ప్రమోషన్లు – అన్నీ ప్రభుత్వంలోని నాయకుల చేతుల్లో ఉన్నాయి. దాంతో నిజాయితీగా నేర పరిశోధన చేసే ఏ అధికారి అయినా ఎన్నో ఇబ్బందులను, ఒడిదుడుకులను ఎదుర్కోవలసి వస్తోంది. ఇష్టం వచ్చినట్లు బదిలీలు చేయకుండా గట్టి ఏర్పాట్లతో పాటు చట్టపరంగా నేర పరిశోదనను వేరుచేసి ఆ సిబ్బందిని రాజకీయాల బారినుంచి కాపాడటం అవసరం. చట్టం ఎన్నికైన వాళ్ల చేతుల్లో కీలుబొమ్మ కారాదు. మనం ఎన్నుకున్న వాళ్లు మన సేవకులు మాత్రమే. వాళ్లు కూడా చట్టానికి బద్ధులే. ముఖ్యమంత్రి, మంత్రులు నేరం చేసినా అరెస్టు చేసే స్వతంత్ర ప్రతిపత్తి, నేర పరిశోధన అధికారాలు పోలీసులకుండాలి. ఎందరో ప్రముఖుల పిల్లలు 18 సంవత్సరాలు నిండకుండానే కార్లు నడుపుతున్నారు. దాన్ని నిరోధించే సాహసం పోలీసులకు లేదు. ఎందరో పలుకుబడి గలవాళ్లు తప్పుచేసి  చట్టానికి తాము అతీతమన్నట్లుగా అహంకారం చూపటం నిత్యకృత్యమైంది. వీళ్లే మళ్లీ చీటికిమాటికి పోలీసుల అసమర్థతను నిందిస్తారు. ఇది మారాలంటే నేర పరిశోధన విభాగాన్ని శాశ్వతంగా వేరుచేసి దానికి చట్టబద్ధంగా స్వతంత్ర ప్రతిపత్తినివ్వాలి. అన్ని పెద్ద నేరాల మీద విచారణ అధికారం ఈ శాఖ చేతుల్లో ఉండాలి. రాజకీయం వీళ్లను శాసించకుండా సంస్థాగత ఏర్పాట్లు ఉండాలి. నిజానికి కొన్ని నేరాలను జాతీయ స్థాయి నేర పరిశోధక సంస్థ పరిధిలోకి తేవాలనే ప్రతిపాదన సబబైనది. అమెరికాలో ఎఫ్.బి.ఐ. చాలా సమర్థవంతంగా వ్యవహరించి పెద్ద నేరాలను అరికట్టింది. కొందరు మాఫియా నాయకులు హత్యా నేరాలకు పట్టుబడకపోయినా నల్లడబ్బు చలామణీ చేస్తున్నందుకు పట్టుబడి దీర్ఘకాలం జైళ్లకు వెళ్లవలసి వచ్చింది. కాని హ్రస్వదృష్టితో, నేరాల పరిశోధన తమ చేతుల్లోంచి పోతే నేర రాజకీయం అదుపులోకి వస్తుందనే భయంతో, స్థానిక నాయకుల అవినీతికి కళ్లెం పడుతుందనే బెదురుతో ఈ ప్రతిపాదనను రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయి.

## ప్రజా సంక్షేమమే ప్రాతిపదిక

ఇక చివరిది కనీసం ఆస్తి తగాదాలు, నేరాల విషయంలో త్వరితగతిన న్యాయం అందేలా న్యాయవ్యవస్థలో మార్పులు జరగాలి. సకాలంలో న్యాయం అందటం నాగరికతకు చిహ్నం. అసలు న్యాయాన్నే అందించలేకపోతే రాజ్యవ్యవస్థకు, ప్రభుత్వానికి మనగలిగే హక్కులేదు. జాతీయ స్థాయిలో పెద్ద మార్పులు కావాలి. అందుకోసం ఆగకుండా కనీసం స్థానికంగా న్యాయం త్వరగా అందేలా గ్రామ

న్యాయాలయాలను పట్టణాలలో త్వరితగతిన వివాదాలు తీర్చడం కోసం తగిన న్యాయస్థానాలను ఏర్పాటు చేయాలి. అందుకు రాష్ట్రంలోనే చట్టాలు చేసే అవకాశం ఉంది. ఇందులో న్యాయవాదుల్ని కూడా కలుపుకొని స్థానికంగా సకాలంలో న్యాయం అందడానికి సంస్థాగత ఏర్పాట్లు చేయాలి. మూడు నెలలు మించని నిర్దిష్ట కాలపరిమితి, స్పష్టమైన అధికారాలు, జిల్లా కోర్టుకు అప్పీలు చేసుకునే అవకాశం, గౌరవ న్యాయమూర్తుల నియామకం, సులభ విచారణా పద్ధతులు, అవసరమైన చోట్ల కఠిన శిక్షలు, స్థలానికి వెళ్లి సాక్ష్యాలు సేకరించి విచారణ చేసే సంప్రదాయం – ఇవన్నీ ఈ స్థానిక న్యాయాలయాల్లో అంతర్భాగం కావాలి. ఇలాంటి గ్రామ న్యాయాలయ చట్టాన్ని సదుద్దేశంతో 1995లో రాష్ట్ర శాసనసభ ఆమోదించింది. కాని చిత్తశుద్ధి లేని ప్రభుత్వం రాష్ట్రపతి ఆమోదం కోసం పంపిన ఆ చట్టాన్ని వెనక్కు తీసుకుంది. న్యాయకోవిదుల సలహా ప్రకారం ఆ బిల్లులో మార్పులు చేయవచ్చు. మరింత సమర్థమైన చట్టాన్ని తయారు చేయవచ్చు. తాత్సారం లేకుండా అలాంటి చట్టం గురించి ఆలోచించి వెంటనే అమలు పరచడం అవసరం. ప్రతి సమస్యను మఖలో పుట్టి పుబ్బలో పోయేదిగా భావించడం, తాత్కాలికంగా హడావుడి చేయడం, అప్పటికి నమ్మబలకడం, ప్రచారాన్నే ఫలితంగా భావించడం రాజకీయ చాతుర్యంగా చలామణీ అవుతోంది. నిజమైన చాతుర్యం దీర్ఘకాలిక ఫలితాలు సాధించడంలోను, ప్రజా సంక్షేమాన్ని చూడటంలోనూ ఉంది. అందుకు కావలసింది నిజాయితీతో, చేవగల చర్యలను చేపట్టడం.

* * *

# ముళ్లబాటే అయినా ముందడుగే!

*మార్చి 29, 2004*

వ్యవస్థలో మార్పులకోసం పోరాడేవారికి బలమైన శత్రువులు తప్పకుండా ఏర్పడుతుంటారు. ఎందుకంటే ఆ మార్పుల వల్ల తమకు కలిగే నష్టమేమిటో వాటిని వ్యతిరేకించే వారికి తెలుసు. అందుకే వారు సర్వశక్తుల్నీ ఒడ్డి వ్యవస్థలో సంస్కరణలు రాకుండా అడ్డుకుంటారు. అలాగే, సంస్కరణోద్యమాలకు కోట్లమంది సామాన్యుల నుంచి మద్దతు లభిస్తుంది. కానీ ఆ మార్పుల వల్ల నిర్దిష్టంగా ఒనగూడే ప్రయోజనమేమిటో వారికి తెలియదు. తెలిసినా రోజువారీ సమస్యలకు, ఉద్యమాల వల్ల వచ్చే సంస్కరణలకు మధ్య ఉండే సంబంధం వారికి స్పష్టంగా బోధపడదు. ఒక వేళ బోధపడినా వారిగొంతు బలహీనమయినది. కాబట్టి సంస్కరణోద్యమాలకు లభించే మద్దతు చాలా అస్పష్టంగా, పేలవంగా ఉన్నట్లు కనిపిస్తుంది. మార్పులకు సమయం ఆసన్నమయ్యేదాకా పరిస్థితి జటిలంగానే ఉన్నట్లు అనిపిస్తుంది.

## పరిణామక్రమంలో మరింత పరిణతి

నిర్దిష్టమైన నేరచరిత ఉన్నట్లు స్పష్టమైన ఆధారాలుండి, రాజకీయాల్లో ఎన్నికలలో కీలకపాత్రను ఆశిస్తున్న కొందరి పేర్లను 'లోక్‌సత్తా' వెలువరించింది. ఆ ప్రక్రియ చాలా దుమారాన్ని లేపింది. కోట్లమంది సామాన్య ప్రజలు హర్షించారు. తాము ప్రకటించలేని భావాలకు, తమ వ్యథకు మాటల రూపాన్నిస్తోందని ఎంతోమంది సామాన్యులు స్పందించారు. రాజకీయ పార్టీలు మింగలేక, కక్కలేక 'కర్ర విరగకుండా, పాము చావకుండా' అన్న రీతిలో స్పందించాయి. ప్రజల నుంచి స్పందన ఉందని, వ్యవస్థలో మార్పులు రావాలని వారు ఎంతో ఆరాటపడుతున్నారని పార్టీలకు, నేతలకు తెలుసు. కానీ ఎన్నికల బరిలో దిగాక ఎలాగైనా సరే గెలుపు సాధించటం అవసరం. కాబట్టి ఆ గెలుపుకోసం ఎన్ని అడ్డదారులయినా తొక్కవలసిందే. అందుకే తాము చేస్తోంది తప్పని తెలిసినా, ఒకరిమీద మరొకరు నెపాన్ని నెడుతూ, గురివింద గింజ సామెతని గుర్తుచేసేలా వ్యాఖ్యలు చేస్తున్నారు. నేర రాజకీయాలు అంతమైతే నష్టపోయేవారు హింసా రాజకీయాలకు, నేరాలకు పాల్పడే రాజకీయ నాయకులే.. కాబట్టి వారి నుంచి 'లోక్‌సత్తా' ప్రయత్నానికి గట్టి ప్రతిఘటన ఎదురు కావటం సహజమే...! సామాన్య ప్రజల హర్షామోదాలు, పార్టీల డొంక తిరుగుడు వ్యాఖ్యలు,

నష్టపోయేవారి తీవ్ర వ్యతిరేకత– ఇవన్నీ ఈ ఉదంతంలో ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి.

మంచి మార్పును కాంక్షించే ప్రతి ఉద్యమానికి మొదట ఎదురయ్యేది మౌనం. పట్టించుకోకుండా ఉండటం వల్ల ఇక ఉద్యమం ఎదగదు, ప్రజల మనసుల్లో నాటుకోదు. అందుచేత, ఉద్యమాన్ని నిర్లక్ష్యం చేయటం తొలిదశల్లో సహజంగా జరుగుతుంది. కేవలం ఉద్యమాన్ని దెబ్బతీయాలనే కాక, లక్ష్యాలు, పద్ధతులు అర్థంకాక కొందరు, ఆ ఉద్యమకారుల నిబద్ధత, గత చరిత్ర తెలియక కొందరు. పుంఖానుపుంఖాలుగా పుట్టుకొస్తున్న ఎన్నో సంస్థలు, ఉద్యమాలు మఖలో పుట్టి పుబ్బలో అంతరించటం అనుభవమైన కొందరు– ఇలా వివిధ కారణాల వల్ల ఉద్యమాలను తొలిదశలో పట్టించుకోరు. ఉద్యమ లక్ష్యాలను, అది నడిచే తీరును నిర్లక్ష్యం చెయ్యలేనప్పుడు రెండో దశలో ఎదురయ్యేది తిరస్కారం.. అవమానం "పెద్ద మహాత్మాగాంధీలు పుట్టుకొచ్చారండీ!" ఇక వీళ్లు దేశాన్ని ఉద్ధరిస్తారట! అని ఆటపట్టించి ఉద్యమాలను తొలినాళ్లలోనే బలహీనపరచటం జరుగుతుంది. పదుగురిలో పరువుపోతుందేమోనన్న బిడియంతో చాలామంది ఆ ఉద్యమాల జోలికే పోరు. అయినా ఆ ఉద్యమం నిలదొక్కుకొని ప్రజలను ఆకర్షిస్తే, సమాజాన్ని ప్రభావితం చేస్తుంటే, ఇక నిర్లక్ష్యం చేయటం సాధ్యం కాకపోతే, మూడవ దశలో ఎదురయ్యేది తీవ్ర ప్రతిఘటన ఉద్యమం వల్ల నష్టపోయేవారికి బలం, డబ్బు, చాకచక్యం. తమకు ముంచుకొచ్చే ప్రమాదం పట్ల స్పష్టమైన అవగాహన ఉంటాయి. అందువల్ల కొన్ని వర్గాల నుంచి ఆ ఉద్యమాలకు వ్యతిరేకత వచ్చి తీరుతుంది. ఉద్యమం ప్రభావం ఎంత ఎక్కువగా ఉంటే, వ్యతిరేకత అంత తీవ్రంగా వ్యక్తమవుతుంది. ఉద్యమం వల్ల ఏ ప్రమాదమూ లేదంటే వ్యతిరేకత ఉండదు. అయినా ఉద్యమం బాగా వేళ్లూనుకుంటే, దాని వెనక ఉన్న భావాలలో, సిద్ధాంతాలలో పస ఉంటే, అది ప్రతిపాదించే లక్ష్యాలలో వాస్తవికత, చిత్తశుద్ధి ఉంటే, నాలుగవ దశ మొదలవుతుంది. ఆ దశలో అర్ధమనస్కంగానైనా ఉద్యమాన్ని దాని లక్ష్యాలను అన్ని వర్గాలూ ఆమోదిస్తాయి. అయితే ఆ సమర్థన అన్ని సందర్భాలలోను గుండె లోతుల్లో నుంచి రాదు. ఇక ప్రతిఘటన వ్యర్థం కాబట్టి, ఉద్యమ విజయం తథ్యం కాబట్టి, ప్రజలలో స్పందన బాగా ఉంది కాబట్టి రాజీపడటం నాలుగవ దశలో కనిపిస్తుంది. ఇక తుది దశలో ఉద్యమానికి పూర్తి ఆమోదం లభిస్తుంది.

ప్రస్తుతం లోక్‌సత్తా ఉద్యమం మొదటి రెండు దశలను దాటింది. వివిధ

రూపాయలలో మూడు, నాలుగు, అయిదు దశలను మనం చూస్తున్నాం. ఉద్యమంలో కొన్ని పార్శ్వాలు మూడో దశలో ఉంటే, మరికొన్ని ఐదో దశలో ఉంటాయి. ఉదాహరణకు ఎన్నికల నిధులపై 'లోక్‌సత్తా' మూడేళ్ల క్రితమే చేసిన ప్రతిపాదనలను అన్ని రాజకీయ పార్టీలూ మనస్ఫూర్తిగా ఆమోదించాయి. ఏడాదికిపైగా పార్లమెంటులో ఓ సంఘం ఆ ప్రతిపాదనలను క్షుణ్ణంగా అధ్యయనం చేసింది. చివరకు 2003 సెప్టెంబరులో పార్లమెంటు ఉభయసభలలో ఆ ప్రతిపాదనలను చట్టరూపంలో అన్ని పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించాయి. ఎక్కడా ఎలాంటి ప్రతిఘటన లేకుండా ఇది సాధ్యమైంది. నేటివరకూ ఎన్నికల నిధులను, పార్టీ నిర్వహణ కోసం వనరులను సమీకరించటంలో ఎన్ని ఒడుదొడుకులున్నాయో పార్టీలకు పూర్తిగా తెలుసు. గతంలో ఏ రకమైన లెక్కలు లేకుండా భయపెట్టో, అధికారాన్ని వినియోగించో ఆశపెట్టో నిధులను వసూలు చేసేవారు. మారుతున్న సమాజంలో గత కాలపు పద్ధతుల ద్వారా అక్రమ నిధులను సేకరించటం రాజకీయాలను సంక్షోభంలోకి నెట్టింది. ఆర్థిక సరళీకరణ తరవాత పారిశ్రామికవేత్తల నుంచి బలవంతపు వసూళ్లు కష్టమవుతున్నాయి. ప్రభుత్వం అండ,పార్టీల మద్దతు లేకుండానే పరిశ్రమలు తమ కాళ్లమీద తాము నిలదొక్కుకొనే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ నిర్ణయాలతో సంబంధమున్న అంశాలలో డబ్బు వసూలు చేద్దామంటే, తెహల్కా టేపుల తరువాత ఏ పుట్టలో ఏ పాముందోనన్న భయం రాజకీయ నాయకులను పీడిస్తోంది. నిజంగా రాజకీయాలను నడపటానికి డబ్బు అవసరమైనప్పుడు దాన్ని దొడ్డిదారిన వసూలు చేసి ఇబ్బందులపాలయ్యేకన్నా చక్కని రాజమార్గాన్నే అనుసరించటం ఉత్తమమని పార్టీలకు నచ్చచెప్పటం సాధ్యమైంది. దాంతో అన్ని పార్టీలు కలిసొచ్చి ఓ మంచి చట్టాన్ని చేశాయి. అంటే ఈ అంశంలో ప్రజాస్వామ్య సంస్కరణల ఉద్యమం ఐదవ దశకు చేరింది.

అలాగే ఓటర్ల జాబితాల అవకతవకల్ని సరిదిద్దటం కొన్ని పార్టీలకు, కొందరు రాజకీయ నేతలకు కొంత ఇబ్బందిని కలిగించినా, అర్ధమనస్కంగా దాన్ని అంగీకరించక తప్పలేదు. స్థానిక ప్రభుత్వాల సాధికారత కోసం జనాభిప్రాయాన్ని కూడగట్టినప్పుడు కూడా అధికార కేంద్రీకరణకు అలవాటుపడ్డ ప్రధాన పార్టీలు కాస్త ఇబ్బందిపడుతూనే సూత్రప్రాయంగానైనా అందుకు అంగీకారాన్ని తెలపాల్సి వచ్చింది. అంటే ఈ అంశాల విషయంలో ఉద్యమం నాలుగవ దశలో ఉంది. కాని నేరగ్రస్త రాజకీయాలు, ఎన్నికలలో అక్రమాలు వంటి అంశాల ప్రస్తావన వచ్చినప్పుడు ఉద్యమం ఇంకా మూడో దశలోనే, అంటే తీవ్ర ప్రతిఘటన ఎదురయ్యే దశలోనే ఉంది.

ఈ ప్రతిఘటన ఊహించనిదేమీ కాదు. కొన్ని పార్టీలను, కొందరు రాజకీయ నాయకులను తీవ్ర సంకటంలో పడేసే చర్యలను చేపట్టినప్పుడు పలువురి ఆగ్రహానికి గురికాక తప్పదు. అలాంటప్పుడు తెలిసి, తెలిసీ తేనెతుట్టని కదపటం ఎందుకు? ఎందుకంటే నీతి వాక్యాలు చెబితే ప్రజలకు, పార్టీలకు చెవికెక్కదు. వ్యవస్థలో మార్పు రాదు. అన్ని వర్గాల ప్రజలు, జనమాధ్యమాలు విస్మరించలేని, నిర్లక్ష్యం చేయలేని రీతిలో కొన్ని అంశాలను ప్రజల ముందుకు తెస్తే, అప్పుడు వాటిపై చర్చ సర్వత్రా సాధ్యమవుతుంది. రాజకీయాల్లో ఉన్న నేరచరితుల వివరాలను ప్రకటించినంత మాత్రాన నేరగ్రస్త రాజకీయాలు అంతం కావని మనందరికీ తెలుసు. అయితే మన రాజకీయాలు ఇంతగా ఎందుకు దిగజారాయో తెలుసుకోవటం, వ్యవస్థను ప్రక్షాళన చేసే మార్గాలపై బహిరంగ చర్చ పెద్దయెత్తున జరగటం అత్యంత కీలకం. ఆ చర్చను ప్రజల ముందుకు తేవటమే ఉద్యమ లక్ష్యం. సందేహాస్పద చరిత్ర ఉన్న కొందరిని పార్టీలు అభ్యర్థులుగా ఎంపిక చేయనంత మాత్రాన దేశమంతా బాగుపడుతుందన్న భ్రమలు కానీ, అందరినీ అభ్యర్థులుగా నిలబెట్టినంత మాత్రాన ప్రజాస్వామ్యం నాశనమవుతుందన్న భయాలు కానీ మనకు లేవు. కానీ ఎన్నికల్లో నామినేషన్లకు ముందు, సీట్ల కేటాయింపులో పార్టీల నాయకత్వాలు తలమునకలుగా ఉన్న సమయంలో ఈ విషయం ప్రజల ముందుకు బలంగా వస్తే పరిష్కారాలను గురించి చర్చ సాధ్యమవుతుంది.

## సమాజానికి మేలుకొలుపు

నేరచరితుల వివరాలను రూపొందించటంలో కేవలం రుజువు చేయగల తొమ్మిది ప్రమాణాల మీద ఆధారపడటం జరిగింది. కోర్టులో శిక్ష, న్యాయస్థానంలో నేరారోపణ జరగటం  రౌడీషీటు లేదా హిస్టరీ షీటును పెట్టడం, ఏ కారణం చూపకుండానే తమ పార్టీ వారిపై నున్న కేసులను ప్రభుత్వం ఉపసంహరించుకోవటం, బలప్రయోగంతో భూమి ఆక్రమణకు, లేదా తగాదాల పరిష్కారాలకు పాల్పడటం, హింసాత్మక విధానాలతో కాంట్రాక్టులు, టెండర్ల ఖరారులో జోక్యం చేసుకోవటం. అర్బన్ బ్యాంకులు, చిట్‌ఫండ్‌ల వంటి వాటి పతనంలో పాత్ర, లేదా పెద్దఎత్తున వారికి బకాయిలు పడటం  ప్రభుత్వోద్యోగంలో, ఉంటే శాఖాపరమయిన శిక్షలు పడటం, ఏదైనా విచారణ సంఘం దోషిగా నిర్ణయించటం– ఇవీ 'లోక్‌సత్తా' పరిగణనలోకి తీసుకున్న ప్రాతిపదికలు. వీటితోపాటు సుప్రీంకోర్టు తీర్పునుసరించి

గతంలో నేర విచారణ జరిగితే న్యాయస్థానంలో తుది తీర్పులిచ్చిన వైనాన్ని కేవలం తీవ్ర నేరాల కేసుల విషయంలో బయటపెట్టడం జరిగింది. చట్టబద్ధంగాకానీ, ధర్మబద్ధంగా కానీ ఈ ప్రమాణాలను ఎవరూ వేలెత్తి చూపలేరు. మరి సమస్య ఎక్కడుంది? నిజంగా కొందరు అమాయకుల మీద రాజకీయ ద్వేషంతో అక్రమ కేసులు బనాయించే అవకాశం మన వ్యవస్థలో లేకపోలేదు. అయితే అక్కడ లోపం నేర పరిశోధనను రాజకీయపరంగా అదుపాజ్ఞలలో పెట్టడంలో ఉంది. కానీ, కేవలం పార్టీల అభ్యర్థులు కావటానికి ఉవ్విళ్లూరుతున్నవారి వివరాలను బయటపెట్టి, వారి వివరాలను తెలుసుకోవటానికి ప్రజలకున్న ప్రాథమిక హక్కును రక్షించడంలో లేదు. అలాగే నేరాలు చేసినా తీవ్ర అభియోగాలున్నా కొంతమంది ఈ ప్రమాణాలకు చిక్కకపోవచ్చు. అక్కడ లోపం చట్టాలది, లేదా నేర పరిశోధనను శాసిస్తున్న పక్షపాత రాజకీయాలదే తప్ప నిర్దిష్ట ప్రమాణాల మేరకు చిత్తశుద్ధితో వాస్తవాలను బట్టబయలు చేస్తున్న నిష్పాక్షిక ప్రజా ఉద్యమాలది కాదు.

మన రాజకీయాలు కుళ్లిపోతున్నాయని అందరూ వాపోతున్నారు. ఆ రాజకీయాలను ప్రక్షాళన చేయాలంటే, దేశం మారాలంటే– నిర్భయంగా, నిష్పాక్షికంగా, రాగద్వేషాలకు అతీతంగా వ్యవస్థ నిజస్వరూపాన్ని బహిర్గతం చేయటం, ప్రజలలో ఆలోచన రేకెత్తించటం, సంస్కరణలను సాధించటం అవసరం. అందుకు తేనెతుట్టెను కదిలించాలి. నిద్రాణమయిన సమాజాన్ని మేలుకొలపాలి. మన వ్యవస్థ మార్పునకు సన్నద్ధంగా ఉంది. అందుకే ప్రజాస్వామ్య సంస్కరణ ఉద్యమం మూడో దశను అధిగమించి, అందరూ ఆమోదించే దశకు త్వరితగతిన చేరుకుంటోంది. మధ్యలో వచ్చే ఆటుపోటులను పట్టించుకోకుండా తదేక లక్ష్యంతో, ద్వేష రహితం కావలసిన సంస్కరణలను త్వరితగతిన సాధించేందుకు నిర్విరామ కృషి చేయటం మనందరి కర్తవ్యం.

* * *

# ఎన్నికల వాగ్దానాల్లో 'ఉచితం' అనుచితమే

*ఆగస్టు 23,1999*

ఎన్నికలనగానే ఓట్లు దండుకోవడం కోసం సాధ్యాసాధ్యాలు ఆలోచించకుండా జనాకర్షకమైన వాగ్దానాలు గుప్పించడం పార్టీలకు ఆనవాయితీ అయిపోయింది. జనాకర్షక పథకాలలో గత 20 సంవత్సరాల నుండి ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉంది. తెలుగుదేశం ప్రభుత్వం రెండు రూపాయలకే కిలో బియ్యం, రూ. 50కే హార్స్‌పవర్ విద్యుత్తు పథకాలను ప్రవేశపెట్టింది. తెలుగుదేశం 'స్ఫూర్తితో' అంతక్రితమే కాంగ్రెస్ రూ.1.90 పైసలకే కిలో బియ్యం పథకాన్ని అప్పటికప్పుడు వండి వార్చింది. వేల కోట్ల రూపాయల ప్రజాధనం వాటికి ఖర్చయిందేకానీ బీదల పరిస్థితి బాగుపడలేదు. రైతులకు విద్యుత్ రాయితీలు అందాయిగాని విద్యుత్ బోర్డు దివాళా తీసింది. అవినీతి మరింత పెరిగింది. సకాలంలో అదనపు విద్యుత్తు కేంద్రాల కోసం పెట్టుబడులు పెట్టలేకపోవడంతో విద్యుత్తు కొరత విపరీతంగా ఏర్పడింది. చివరికి అదే రైతులు నష్టపోతున్నారు. మిగిలిన వినియోగదారులపైన భారం పెరిగిపోయింది. పరిశ్రమలకు చీటికి మాటికి సరఫరా నిలిపవేయడంతో రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన నిలిచిపోయింది. ఉపాధి కల్పన ఆగిపోయింది. ఎక్కువ ఆదాయం వచ్చే పరిశ్రమలలో విద్యుత్ వినియోగం తగ్గటంతో విద్యుత్ బోర్డు నష్టాల ఊబిలో ఇరుక్కుపోయింది. హార్స్‌పవర్‌కు ఇంత అని రేటు పెట్టడంతో విద్యుత్తు విపరీతంగా వృథా అయింది. అలాగని వ్యవసాయ రంగం చెప్పుకోదగ్గ అభివృద్ధిని సాధించలేదు. అనాలోచితమైన పథకాల వల్ల రాష్ట్రం, ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. అలాగే రెండు రూపాయలకే కిలో బియ్యం పథకాన్ని మొదట్లో చిత్తశుద్ధితో అమలు చేశారు. కానీ పెరిగిన కొనుగోలు ధరలతో ఖజానా ఖాళీ అయిందే తప్ప బీదల బతుకులు బాగుపడలేదు. పైగా బియ్యంలో ఆదా చేసిన డబ్బు చాలా మేరకు సారాయికి ఖర్చయింది! 1989లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఈ విషయాలన్నీ పరిశీలించి ధైర్యంగా కొన్ని మార్పులు చేపట్టింది. రాష్ట్ర, ఆర్థిక సౌష్టవం కోసం కొంతమేరకు ప్రయత్నం చేసింది. కానీ మళ్లీ 1994లో తెలుగుదేశం పార్టీ కిలో రెండు రూపాయల బియ్యం, 50 రూపాయలకే హార్స్‌వర్ విద్యుత్తు, సంపూర్ణ మద్య నిషేధం పథకాలను ప్రకటించి, అత్యధిక మెజారిటీతో అధికారం చేపట్టింది. గత నాలుగున్నర ఏళ్లలో

జరిగిందల్లా వాగ్దానాల అమలుకు ప్రయత్నించి చతికిలబడిపోవడం, ఆ తరువాత నెమ్మదిగా కొంతమేరకు ఆ విధానాలను సవరించుకోవడం. గత పదిహేనేళ్లలో ఇలా 'రెండడుగులు ముందుకు, నాలుగడుగులు వెనక్కు' తీరున అడుసు తొక్కటం, కాలు కడగటంతో సరిపోయింది ! నేతల దుడుకుతనం వల్ల, స్వల్పకాలిక రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర భవిష్యత్తును తాకట్టు పెట్టడం వల్ల దేశంలో అతిబీద, వెనుకబడ్డ రాష్ట్రాల సరసన ఆంధ్రప్రదేశ్ చేరింది. ఇదీ మన పార్టీలు, ప్రభుత్వాల ఘనకార్యం!

## ముందుచూపుతో సంస్కరణలు

1991లో కేంద్ర ప్రభుత్వం దివాలా తీసినప్పుడు అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ ఆర్థిక పరిస్థితిని సరిదిద్దటం కోసం కొన్ని గట్టి ప్రయత్నాలు చేసింది. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను ఖండించిన అన్ని పార్టీలు – బిజెపి, వామపక్షాలతో సహా – తాము అధికారంలో ఉన్నప్పుడు అవే విధానాలను అనుసరించాయి. ప్రతిపక్షంలో ఉండగా బాధ్యతారహితంగా మాట్లాడినా, పైకి జనానికి కల్లబొల్లి కబుర్లు చెప్పినా, ఆచరణలోకి వచ్చేసరికి కొంత సంయమనంతో, బాధ్యతతో వ్యవహరించడం అవసరం అనే అభిప్రాయం అన్ని పార్టీలలో ఇటీవల కలిగింది. ప్రభుత్వాలు ఇంకా ఎన్నో ఆర్థిక, పాలన, సంస్కరణలు చేపట్టవలసిన అవసరం ఉంది. ప్రతి పౌరుడి మీదా ప్రభుత్వాలు సంవత్సరానికి 4500 రూపాయలు ఖర్చు చేస్తున్నాయి. అందులో నూటికి ఎనభై పాళ్లు మనకి ఏ రకంగానూ అందటం లేదు. పైగా ప్రతి చిన్న పనిలో అవినీతి, ఆలస్యం, అసమర్థత, అడుగడుగునా అవమానం! మనల్ని మభ్యపెట్టి గద్దెనెక్కిన ప్రభుత్వాలు పెద్ద ఎత్తున ఈ దోపిడీని కొనసాగిస్తున్నాయి. మనమంతా నిరంతరం మోసపోతున్నాం. ప్రజల కనీస అవసరాలు తీరటం లేదు. కోట్లాది మంది పసిబిడ్డలు దుర్భర బానిసత్వంలో మగ్గుతున్నారు. అక్షర జ్ఞానం అందక, పౌష్టికాహారం లేక, ఉపాధి దొరకక కనీసం మరుగుదొడ్ల వసతిలేక, తాగే నీరు అందక, విద్యుత్ సదుపాయంలేక కోట్లాది ప్రజలు ఆటవిక యుగంలో జీవిస్తున్నారు. అయినా అధికారం చేపడితే కోట్లు దోచుకోవచ్చన్న దురాశతో గూండాలు, అవినీతిపరులు పార్టీల సీట్ల కోసం ఎగబడి నిర్లజ్జగా సిగపట్లు పట్టుకుంటున్నారు!

## అనాలోచిత హామీలు

ఈ పరిస్థితులలో మళ్లీ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రైతులకు ఉచితంగా

విద్యుత్తును ఇస్తామని వాగ్దానం చేస్తోంది. ఇంతటితో ఆగక తాము అధికారంలోకి వచ్చే వరకు విద్యుత్ ఛార్జీలు కట్టవద్దని, తాము బకాయిలను మాఫీ చేస్తామని ప్రకటించింది. ఇప్పటి వరకు బాధ్యతాయుత విధానాలను చేపడుతోందనుకునే కాంగ్రెస్ ఇలా జాతి ప్రయోజనాలను పణంగా పెట్టడం మన దురదృష్టం. 1994లో తెలుగుదేశం పార్టీ అసాధ్యమైన వాగ్దానాలు చేసి, పబ్బం గడిచాక మళ్లీ శ్వేతపత్రాలు సమర్పించి వెనుకడుగు వేసింది. ఎన్నికలలో కాంగ్రెస్‌కు ఓట్లు వేస్తే రెండు రూపాయల బియ్యం ఆగిపోతుందని 1996లో చంద్రబాబు నాయుడు ప్రచారం చేసి, ఎన్నికలు కాగానే బియ్యం ధర పెంచారు. అదేమంటే ఆర్థిక పరిస్థితి బాగోలేదన్న వాస్తవాన్ని మెల్లగా బయట పెట్టారు. పుట్టిన ప్రతి ఆడ శిశువుకి రూ.5000/- మంజూరు చేసే పథకాన్ని 1998 ఎన్నికలలో ప్రకటించి, ఆ తరువాత అమలు చేయలేదు. ఇలా ఎన్నికలలో ఆపద్ధర్మం పేరుతో ఏదో ఒక విధంగా బుకాయించి తరువాత మాట తప్పడం, ప్రజల్ని వంచించడం లేదా వ్యక్తిగత అధికారం కోసం ప్రజా సంక్షేమాన్ని బలి పెట్టడం 'రాజకీయ చతురత'గా మారిపోయింది! ప్రజలకు తాము సేవకులం మాత్రమేనని నాయకులు విస్మరించారు. ఈ నేతలెవరూ వాళ్ల జేబుల్లో డబ్బు ఖర్చు పెట్టడం లేదని, వాళ్లు ఖర్చు చేసే ప్రతి పైసా మనం పన్నుల రూపంలో ఇచ్చిన డబ్బేనని లేదా మన బిడ్డల భవిష్యత్తును తాకట్టుగా పెట్టి తెచ్చిన అప్పులేనని ప్రజలకు తెలియడం అత్యవసరం. నేటి విద్యుత్ రంగాన్ని పరిశీలించిన వారందరికీ రైతులకు ఉచిత విద్యుత్తు ఎంత అసాధ్యమో, రాష్ట్ర భవిష్యత్తుకు ఎంత ప్రమాదకరమో తెలుసు. మన రాష్ట్రంలో దాదాపు 40 శాతం వరకు విద్యుత్తు వ్యవసాయరంగంలో వినియోగిస్తున్నారు. 15 శాతంలోపు వ్యవసాయ విద్యుత్తు వినియోగించే తమిళనాడులో ఉచితంగా విద్యుత్తునిస్తున్నారు. అక్కడ మనకంటే పరిశ్రమలలో విద్యుత్తు వాడకం చాలా ఎక్కువగా ఉండటంతో ఆ విద్యుత్ బోర్డుకు సబ్సిడీనిస్తోంది. మన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆర్థికంగా దివాలా పరిస్థితిలో ఉంది. ఉద్యోగులకు నెల జీతాలు సరిగ్గా అందటమే కష్టమై, దినదిన గండం నూరేళ్లాయుష్షుగా ఉంది. అందునా వర్షాలు బాగా పడి, జలాశయాలు నిండి, తక్కువ ఖరీదుతో వచ్చే జల విద్యుత్తు ఉత్పత్తి అయ్యేటప్పుడు వ్యవసాయానికి విద్యుత్తు అవసరం ఉండదు. ఎండలు మండి, పంటలు ఎండి, జలాశయాలు అడుగంటి, జల విద్యుత్కేంద్రాలు ఆగిపోయినప్పుడే పంటలకు విద్యుత్తు అవసరం జాస్తి. అలాగని వరదల కాలంలో అదనంగా ఉత్పత్తి చేసి, గోడౌన్లలో దాచి అవసరం అయినప్పుడు వాడుకొనే పదార్థం

కాదు విద్యుత్తు. ఎప్పుడు ఉత్పత్తి చేస్తే ఆ క్షణమే విద్యుత్తును వినియోగించాలి. అలాంటప్పుడు ఉచిత విద్యుత్తు ఆలోచన అత్యంత ప్రమాదకరం. తెలుగుదేశం అదివరలో జనాన్ని మభ్యపెట్టినప్పుడు ఆ పని తామెందుకు చేయగూడదని కాంగ్రెస్ పార్టీ భావించవచ్చు. అదివరలో జనాకర్షక వాగ్దానాల వల్ల ఓడిన తాము ఈసారి అదే బాటను అనుసరించి ప్రత్యర్థుల్ని మట్టి కరిపించాలన్న కసి ఉండవచ్చు. విమర్శిస్తే, 'నీవు నేర్పిన విద్యయే నీరజాక్ష' అని వాదించవచ్చు. కాని పార్టీల అధికార క్రీడకన్నా రాష్ట్ర ప్రయోజనాలు ముఖ్యం. విద్యుత్ రంగంలో అసలు సమస్య ఏ రేటున ప్రైవేటు ప్రాజెక్టుల నుంచి కొనుగోలు చేస్తున్నారనే అంశం. నేటి పరిస్థితులలో విద్యుతుత్పత్తి ప్రైవేటీకరణ తప్పదు. మన రాష్ట్రంలో అదనంగా మరో 2500-3000 మెగావాట్లకు మించి ప్రైవేటు రంగం నుంచి కొనుగోలు చేసే అవకాశం లేదు. పారిశ్రామికాభివృద్ధి వేగంగా జరిగితే మరికొంత ఎక్కువ కొనుగోలు చేయవచ్చు. కాని మన దగ్గర 5000 మెగావాట్లకు మించి ప్రైవేటు ప్రాజెక్టులు ఉన్నాయి. అలాంటప్పుడు విద్యుత్ బోర్డు అతి తక్కువ ఖరీదుకు నిర్మించే ప్రాజెక్టుల నుంచి కొనుగోలు చేస్తేనే ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది. వెయ్యి మెగావాట్ల ప్రాజెక్టు నుంచి విద్యుత్తును ఒక యూనిట్‌కు 25 పైసలు చొప్పున ఎక్కువ ధరకు కొంటే ప్రతి సంవత్సరం రూ. 200 కోట్లు అదనంగా చెల్లించాల్సి వస్తుంది ! ఒక పావలా ఎక్కువ చెల్లిస్తే మన నష్టం అంత పెద్దది ! విశాఖపట్నంలో కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎన్.టి.పి.సి.తో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఒప్పందం కుదుర్చుకుంది. వెయ్యి మెగావాట్ల ఈ ప్రాజెక్టుకన్న పక్కనే వస్తున్న ప్రైవేటు ప్రాజెక్టు ఖరీదు దాదాపు రూ.700 కోట్లు అధికం ! అలాంటప్పుడు అతి తక్కువ ఖరీదుకు ఎవరు ప్రాజెక్టులు కడతారో, ఎవరి వద్ద నుంచి చౌకగా విద్యుత్తు వస్తుందో, వారిదగ్గరే కొనటం ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అత్యవసరం. అలాకాక ఏదో వంకలు పెట్టి ఎక్కువ ఖర్చు చూపే ప్రాజెక్టులను ప్రోత్సహిస్తే, ఆ మేరకు చౌకగా వచ్చే ప్రాజెక్టులను వెనకబెడితే రాష్ట్రం తీవ్రంగా నష్టపోతుంది. వేల కోట్ల రూపాయల విలువల చేసే ప్రాజెక్టులలో మనం తీసుకునే నిర్ణయాలు వేగంగానూ, నిజాయితీగానూ, ప్రజలకు లాభం చేకూర్చేవిగానూ ఉండాలి. అలాగే ప్రాజెక్టులన్నీ ఒకటి రెండు చోట్ల కేంద్రీకరించడం కాక, మన అవసరాలకు అనుగుణంగా ఉండాలి. లేకపోతే విద్యుత్ సరఫరా లైన్లకు బోలెడంత అదనపు ఖర్చవుతుంది. ఆ పైన సరఫరాలో కొంత వృథా అవుతుంది.

## ప్రజా శ్రేయమే ప్రామాణికం కావాలి

రాష్ట్రంలోగాని, దేశంలోగాని ఇతర రాష్ట్రాలలో గాని ఈ ప్రాజెక్టుల పట్ల సరైన అవగాహనగాని, లోతైన చర్చలుగాని లేవు. ప్రతిపార్టీ ప్రతిపక్షంలో ఉండగా ప్రాజెక్టులను గుడ్డిగా వ్యతిరేకించడం, అధికారంలో ఉండగా అడ్డదిడ్డమైన నిర్ణయాలు తీసుకోవడం పరిపాటి అయింది. అలాకాక ఏయే ప్రాజెక్టుల వల్ల ఎంతమేరకు లాభం వస్తుందో, వేటివల్ల ఖజానాపై అదనపు భారం పడుతుందో సవివరంగా సమీక్షించాలి. అదీ బహిరంగంగా జరగాలి. అందునా విద్యుత్ రంగం సంస్కరణలలో భాగంగా రాష్ట్ర విద్యుత్ నియంత్రణ సంఘం (ఎస్.ఇ.ఆర్.సి) ఏర్పాటైంది. చట్టబద్ధంగా ఏర్పడిన ఆ సంఘం పని విద్యుత్ రేట్లు తగ్గించి, వినియోగదారులకు లాభం చేకూరేలా చూడటం, విద్యుత్ రంగంలో పోటీని పెంచడం, అన్ని పార్టీలు, ప్రజాహిత సంస్థలు, చట్టబద్ధమైన సంస్థలు, ప్రభుత్వ యంత్రాంగం కలిసి ఈ అంశాలపైన చర్చను చేపట్టి, విద్యుత్ కొనుగోలు రేట్లు తగ్గేలా చూడాలి. రాజకీయ పార్టీలు, ప్రజలు నిరంతరంగా పరిశీలించవలసింది, నిర్ధారించవలసింది, ఏ నిర్ణయాలు తీసుకుంటే ఎంత మేరకు ప్రజలకు లాభనష్టాలున్నాయని, అంతేగాని ఒకరిని మించి మరొకరు జనాన్ని మోసం చేయడానికి పోటీలు పడితే జరిగేది దోపిడీ, పెరిగేవి లంచాలు, నష్టపోయేది మన బిడ్డలు, వారి భవిష్యత్తు. ముందు మనం కళ్లు తెరిస్తేగానీ, పార్టీలు, ప్రభుత్వాలు బాధ్యతనెరిగి, నిజాయితీతో ప్రవర్తించవు.

* * *

# ప్రజా సేవకులా?
# జనం నెత్తినెక్కే నాయకులా?

*డిశంబర్ 29, 1997*

తలసరి ఆదాయం రీత్యా ప్రపంచంలోనే అత్యంత సంపన్నమైన దేశంలో స్వీడన్ ఒకటి. అలాంటి దేశంలో 10 సంవత్సరాల క్రితం ఒక కేబినెట్ మంత్రి రాజీనామా చేశారు. పత్రికల వాళ్లు ఆయన రాజీనామాకు కారణం అడిగారు. "నా ఇల్లు రాజధాని నగరమైన స్టాక్‌హోమ్ నుంచి దాదాపు 100 కిలోమీటర్ల దూరంలో ఉంది. ప్రతిరోజు కారు నడుపుకుంటూ వెళ్లడానికి లేదా రైలులో వెళ్లడానికి రానుపోను 3 గంటలపైన పడుతున్నది. చాలా అలసిపోతున్నాను. స్టాక్‌హోమ్‌లో ఇల్లు తీసుకోవటానికి తగ్గ స్తోమత లేదు. మంత్రిగా నాకు వచ్చే జీతం చాలటం లేదు. అందువల్ల నా ఆర్థిక పరిస్థితి మెరుగుపరుచుకోవటానికి, కుటుంబంతో కాస్త సమయం గడపటానికి వీలుగా రాజీనామా చేశాను." ఇదీ అత్యంత సంపన్నమైన దేశంలో ఒక కేబినెట్ మంత్రి తన రాజీనామాకు చెప్పిన కారణం! మరి మన దేశంలో పరిస్థితి చూడండి. శాసనసభ్యుడికి, మంత్రికి వచ్చే జీతం నెలకు రూ.2750/- ఆ పైన కొన్ని భత్యాలు, అలవెన్సులు ఉన్నాయి. కాని వారు ఎన్నికల కోసం పెట్టే ఖర్చు కనీసం పాతిక, ముప్పై లక్షలుంటుంది. అదే పార్లమెంటు ఎన్నికలలో అభ్యర్థి గట్టి పోటీనివ్వాలంటే ఖర్చు దాదాపు ఒక కోటిరూపాయల వరకు ఉంటుంది. వారికి వచ్చే జీత భత్యాలూ అంతంతమాత్రమే.

## పదవితో వ్యాపారం

రాజకీయంలో ఉన్నవారికి అసలు వృత్తి, వ్యాపారం, వేరే ఆదాయం ఏమైనా ఉన్నాయేమో పరిశీలించండి. నూటికి తొంభై మందికి రాజకీయమే ఒక వృత్తి! అదే ఒక వ్యాపారం! ఒకసారి రాజకీయంలోకి వచ్చాక – మధ్యలో తప్పుకున్న ఒకరిద్దర్ని మినహాయిస్తే – మిగిలిన అందరికీ చనిపోయేదాకా, లేదా జవసత్వాలుడిగిపోయేదాకా శాశ్వత వృత్తి రాజకీయమే! అందుకు ఏ పెట్టుబడి అక్కరలేదు. దేశం గురించి అవగాహన అక్కరలేదు. విషయపరిజ్ఞానం అంతకంటే అవసరం లేదు. పాలన సామర్థ్యం మాటే లేదు. ఏదో విధంగా డబ్బిచ్చో కాళ్లు పట్టుకునో, కులం బలం

చూపించో, గూండాల అండతోనో టిక్కెట్ దక్కించుకోవటం మొదటి అంకం. ఆ తరువాత అన్ని రకాల అక్రమాలకు పాల్పడి ఎలాగో సీటు గెలవటం రెండో అంకం. ప్రయత్నఫలంగానో, గాలివాటంగానో సీటు గెలిస్తే అసలు భాగోతం ప్రారంభం అవుతుంది. ఆనాటి నుంచి రాజభోగాలు, పైరవీలు, అట్టహాసాలు, భుజకీర్తులు, వంది మాగధులు... ఇవన్నీ సర్వసామాన్యం. గెలిచిన దగ్గర్నుంచి ఎలాగోలా మంత్రి పదవి సంపాదించాలని తహతహ. పెట్టిన పెట్టుబడికి పది రెట్లు ఆర్జించాలి. మళ్లీ రాజకీయంలో నిలదొక్కుకోవటానికి వీలుగా "అస్మదీయుల్ని" చేరదీయాలి. తమకు అడ్డొచ్చే శత్రువుల్ని నిర్మూలించాలి. మళ్లీ మళ్లీ గెలిచినా, ఓడినా ప్రతి ఎన్నికలో పాల్గొనాలి. చచ్చేదాకా రాజకీయం వృత్తిగా, వ్యసనంగా కొనసాగాలి. పొరపాటున మరణిస్తే లేదా వృద్ధాప్యం వల్ల విరమిస్తే, తన భార్యో, కొడుకో, కూతురో మళ్లీ పదవిని పొందాలి. ఏ రకమైన – బయటికి కనిపించే ఆదాయమూ లేకపోయినా, కోట్లకి పడగలెత్తాలి. ఒకసారి పదవి రాగానే ఎందుకూ కొరగాని ప్రభుద్ధుడు అపారజ్ఞానసంపన్నుడైపోతాడు! తన ఆలికి అన్నం పెట్టడం దేశ సేవ కోసమేనని ఫోజులిస్తాడు ! గాంధీ నామ జపం చేస్తూ ప్రభుత్వ బంగళాల కోసం పరితపిస్తాడు. ప్రజాశ్రేయాన్ని కాంక్షిస్తున్నానంటూ తన నివాస గృహానికి కోట్లు ఖర్చు పెట్టిస్తాడు! పదవిని అడ్డం పెట్టుకొని కోట్లు గడిస్తాడు! పదవిలోనే మరణించాలని ప్రార్థనలు చేస్తాడు! తన తరువాత దేశం గొడ్డుపోతుందేమోనని తన సంతానాన్ని ప్రజల నెత్తిన రుద్ది మరీ పోతాడు! ఇదీ మన "సేవ" చేసే "నాయకుల" వరస! ఈ పరిస్థితుల్లో అధికారానికి జనహితంతో సంబంధమే లేదు. ప్రజల పేరుతో కొందరు ప్రబుద్ధులు ఆడంబరాలకు, దేశం వనరులు కొల్లగొట్టటానికి, వ్యక్తిగతంగా అధికారం వినియోగించుకోవటమే ఎన్నికల ఫలితం! అందుకే ఈ దేశంలో పదవి కోల్పోవటం గొప్ప త్యాగం! ఆ స్వీడన్ మంత్రిగారు చెప్పిన కారణాలు వివరించి ఎవరన్నా – ఈ దేశంలో మంత్రి పదవి నుంచి రాజీనామా చేస్తే, ఆయనకి పిచ్చి పట్టిందని అనుకుంటాం. పూర్వం మధ్యయుగాలలో భూస్వాములు ఎలా కర్రపెత్తనం చేసేవారో, అలాగే నేటి నాయకులకు – రాజకీయం పేరుతో అన్నిట్లోనూ వేలుపెట్టి పాలనను, ప్రజాస్వామ్యాన్ని భ్రష్టుపట్టించటం జన్మ హక్కయిపోయింది.

## పదవిలో ఉండటం త్యాగం

ప్రపంచంలో మంచి ప్రజాస్వామ్య దేశాలన్నింటిలోనూ సమర్థులను నాయకత్వ లక్షణాలున్న వారిని రాజకీయంలోకి ఆకర్షించాలని నిరంతరం ప్రయత్నం

జరుగుతుంటుంది. అమెరికాలో ఎవరినైనా కేబినెట్ పదవిలో చేర్చుకోవాలంటే అధ్యక్షుడు వారిని బతిమలాడి ఒప్పించాల్సి ఉంటుంది. అధికారం చేపడితే వారు ప్రస్తుతం ఆర్జిస్తున్న సంపాదన ఆగిపోతుంది. ప్రభుత్వం ఇచ్చే జీతం బొటాబొటిగా సరిపోతుంది. పని తీవ్రంగా ఉండి, విశ్రాంతి ఉండదు. పత్రికలు, టీవీ నిరంతరం తామేం చేస్తున్నామో తెలుసుకుంటాయి. కాబట్టి కుటుంబానికి ఏకాంతం ఉండదు. బోలెడంత మానసిక ఆందోళన! అందుకే ఒక పట్టాన వారు పదవులను చేపట్టరు. చేపట్టినా చాలా మంది కొద్ది సంవత్సరాలు చేశాక తప్పుకుంటారు. మళ్లీ ప్రైవేటు వ్యక్తిగా హాయిగా స్వతంత్ర జీవనం చేయాలని ఉవ్విళ్లూరుతారు. అందుకే ఆ దేశాలలో పదవిలో ఉండటం త్యాగం ! అటువంటి నేపథ్యంలో అప్పటి పరిస్థితుల పట్ల కలిగిన వేదనతోనో, మార్పు కావాలన్న ఆరాటంతోనో, నిర్దిష్ట లక్ష్యాలను సాధించాలన్న తపనతోనో కొద్దిమంది సమర్థులు రాజకీయంలోకి ప్రవేశిస్తారు. తామనుకున్నది సాధించాక వెంటనే విరమించుకుంటారు. ఒకప్పటి బ్రిటిష్ ప్రధానమంత్రి మేక్ మిల్లన్ అనారోగ్య కారణంగా ఆసుపత్రి పాలయ్యారు. ఆసుపత్రిలో ఉండగానే ఒక గంట తదేకంగా ఆలోచించి, ప్రధాని పదవిలోని చికాకు వల్ల తనకు ఆందోళన పెరుగుతోందని, మనసుకు ఉల్లాసం లేదని అనిపించి, వెంటనే ఎవరికీ చెప్పకుండా ఎలిజబెత్ మహారాణికి తన రాజీనామా లేఖ పంపించారు. అంతే, వెంటనే ఆయన పదవి పోవటం, తక్షణమే కొత్త ప్రధానమంత్రిని ఎన్నుకోవటం జరిగిపోయాయి. కొత్త ప్రధాని నియామకం జరిగాక కొన్ని గంటలలో హాస్పిటల్‌లో తన మంచం పక్కన సహాయకుణ్ని పిలవడానికి అమర్చిన కాలింగ్‌బెల్ కూడా తీసేశారట! ఆయనే తరువాత ఆ విషయాన్ని వివరించారు. కొద్ది మాసాల క్రితం బ్రిటిష్ పార్లమెంటరీ ఎన్నికలలో కన్జర్వేటివ్ పార్టీ ఓడిపోయింది. ఎన్నికల ఫలితాలు రాత్రి 10 గంటలకల్లా తెలిసిపోయాయి. మర్నాడు ఉదయం 10 గంటలకల్లా అప్పటి ప్రధాని జాన్‌మేజర్ తన అధికార నివాసం అయిన 10, డౌనింగ్ స్ట్రీట్ ఇంటిని ఖాళీ చేసి తన స్వంత ఇంటికి వెళ్లిపోయాడు. ఉదయం 11 గంటలకల్లా నూతన ప్రధాని టోనీ బ్లెయిర్ ఆ యింట్లోకి సతీసమేతంగా ప్రవేశించాడు. 24 గంటలలో అంతా కలలాగా జరిగిపోయింది. ఏడు సంవత్సరాలు ప్రధానిగా చేశాను కదా, ఇప్పటికీ ప్రతిపక్ష నాయకుణ్ని కదా, కొంతకాలం ప్రభుత్వ గృహంలో ఉంటానని ఆయన అనలేదు. పోనీ, కొంతకాలం ఏదో ఒక ప్రభుత్వ నివాసంలో ఉండండని ఆయన్ని ఎవ్వరూ బతిమాలలేదు! అదీ నిజమైన ప్రజాస్వామ్య సంస్కృతి అంటే.

## స్వంత కారులో ప్రధాని ప్రచారం!

హెరాల్డ్ విల్సన్ బ్రిటిష్ ప్రధానిగా ఉండగా ఎన్నికల ప్రచారానికి స్వంతకారులో వెళ్లేవారు. అప్పటికింకా ఐరిష్ తీవ్రవాద సమస్య అంత జటిలం కాకపోవడంతో ప్రధానమంత్రికి కొద్దిపాటి భద్రతే ఉండేది. తన స్వంతకారును భార్య నడుపుతుండగా, ప్రధానమంత్రి ముందుసీట్లో కూర్చొని తరువాతి సమావేశంలో తానివ్వవలసిన ప్రసంగాన్ని తయారు చేసుకొనేవారు. అలాగే ఇంతకుముందు చెప్పుకున్న స్వీడన్ దేశంలోనే అప్పటి ప్రధానమంత్రి ఒలాఫ్‌పామె తన సతీమణితో రాజధాని స్టాక్‌హోమ్‌లో సినిమా చూసి, తన ఇంటికి నడిచి వెళుతుండగా ఎవరో దుర్మార్గుడు కాల్చి చంపేశాడు. మన దేశంలో ఒక మామూలు శాసనసభ్యుడైనా అలా సామాన్యుడిలగా ప్రవర్తించటం ఊహించగలమా? ఎన్నికైన ప్రతివాడికి ముందూ వెనకా తుపాకులతో పోలీసులు! అధికార గణాలకు అనుకూలురైన గూండాలకు కూడా – ప్రజల ఖర్చుతో – రక్షణ పేరుతో తుపాకులతో పోలీసులు! ప్రభుత్వంలో ఉన్నవాళ్లలో అధిక సంఖ్యాకులకు అణువణువునా అహంభావం! ప్రజలతో మాట్లాడేటప్పుడు ‘ఎవడితో మాట్లాడుతున్నావో తెలుసా” అనే మనఃప్రవృత్తి! అంతులేని అక్రమ సంపాదన. అడిగిందే తడవుగా రాజభోగాలు, అడుగడుగునా అధికార దుర్వినియోగం. బాధ్యత లేని అధికారం! మరి అటువంటి రాజకీయం నుంచో, ప్రభుత్వోద్యోగం నుంచో తప్పుకోవాలని ఎందుకనిపిస్తుంది? అందుకే ప్రపంచంలో అన్ని ప్రధాన దేశాలలోనూ దేశాధినేతలు 40వ వడిలో, లేదా 50వ వడిలో ఉంటే, మన దేశంలో 75 సంవత్సరాలకు తక్కువైనవారంతా రాజకీయంలో బాల కుమారులే! కాటికి కాళ్లు చాపుకున్న వాళ్లకు దేశ భవిష్యత్తు పట్ల మమకారం ఎలా ఉంటుంది? గతమే తప్ప భవిష్యత్తు లేనివాల్లు కోట్లాది యువతకు ఎలా మార్గం చూపగలరు?

## విద్యార్థులు క్రియాశీలురు కావాలి

లోపభూయిష్టమైన మన ప్రజాస్వామ్యంలో ఎన్నికలు జరుగుతున్నది ప్రజాసంక్షేమాన్ని పెంచటానికి కాదు, పౌరులకు స్వయం నిర్ణయాధికారమివ్వటానికి కాదు. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దటానికి కాదు. జనం నెత్తిమీద కూర్చుని ఎవడు పెత్తనం చేయాలా అని మాత్రమే ఇక్కడ ఎన్నికలు నిర్ణయిస్తున్నాయి. ఏ రాయితో పళ్లూడగొట్టుకోవాలా అని మాత్రమే ప్రజలు తీర్పునిస్తారు. మనకు కావలసింది సామాన్యుణ్ని బానిసగా చేసి నాయకులు అందలాలెక్కే ఎన్నికల ప్రక్రియ కాదు.

పౌరుణ్ని ప్రభువుగా చేసి నాయకులు సేవకులుగా ప్రవర్తించే ఎన్నికల ప్రక్రియ. దాన్ని సాధించుకోవాలంటే ఆలోచనాపరులంతా నిర్వేదంతో ఇంట్లో తలపట్టుకుని కూర్చోరాదు. బయటికి వచ్చి ఓటును వినియోగించుకోవాలి. ఎవరూ నచ్చకపోతే నిష్కర్షగా ఓటును చెల్లకుండా చేసి నిరసన ప్రకటించాలి. విద్యావంతుల నిరసన, ఆలోచనాపరుల భాగస్వామ్యం మన ప్రజాస్వామ్య ప్రక్షాళనకు నాంది అవుతుంది.

* * *

# నిజమైన జనస్వామ్యంలో వ్యక్తులకన్నా సంస్థలు మిన్న

*నవంబర్10,1997*

స్వతంత్ర భారతంలో ఎన్నికల సంఘం తీరుతెన్నులు పరిశీలించినవారికి రాజ్యాంగ సంస్థల ప్రాముఖ్యం బోధపడుతుంది. 1950 నుండి ఎందరో మాన్యులు ప్రధాన ఎన్నికల కమిషనర్లుగా నియమితులయ్యారు. కాని ప్రజల దృష్టిలో స్వతంత్ర ప్రతిపత్తిగల బలమైన సంస్థగా ఎన్నికల సంఘం ఇటీవలివరకు నిలదొక్కుకోలేకపోయింది. దాని పనితీరు కూడా ఒక ప్రభుత్వ శాఖలా ఉందన్న అభిప్రాయం ప్రజలలో ఏర్పడింది. దాంతో ప్రజల మద్దతు లేక ఎన్నికల సంఘం ప్రభుత్వంలో అంతర్భాగం వలే అధికారంలో ఉన్నవారి అడుగులకు మడుగులొత్తే సంస్థ వలే కనిపించింది. ఆ పరిస్థితి గత దశాబ్దంగా మారడం ప్రారంభమైంది.

## ఎన్నికల సంఘం - ఒక ఉదాహరణ

80లలో పేరిశాస్త్రి ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా ఉండగా గర్వాల్ పార్లమెంటు నియోజకవర్గంలో ఉప ఎన్నిక జరిగింది. హెచ్.ఎన్. బహుగుణ ఆ ఎన్నికలలో కాంగ్రెసేతర పక్షాల మద్దతుతో పోటీచేశారు. అధికారపక్షం తన అంగబలాన్ని, అర్థబలాన్ని, పలుకుబడిని ఉపయోగించి ఆ ఎన్నికలో భారీగా రిగ్గింగ్‌కు, దొంగ ఓట్లకు, ఇతర అక్రమాలకు పాల్పడింది. ఎన్నికల సంఘం ఆరోపణలను, సాక్ష్యాధారాలను పరిశీలించి ఉప ఎన్నికను రద్దుచేసి మళ్లీ నిర్వహించింది. దేశమంతా నిజం తెలిసి గొడవ జరగడంతో, తరువాత న్యాయంగా జరిగిన ఉప ఎన్నికలో అధికార పార్టీకి ఇష్టం లేకపోయిన బహుగుణ పెద్ద మెజారిటీతో పార్లమెంటుకు ఎన్నికయ్యారు. ఆ తర్వాత కొన్నాళ్లకు చంద్రశేఖర్ ప్రభుత్వం అప్పటి కాంగ్రెస్ అధ్యక్షులు రాజీవ్ గాంధీ సిఫారసుపై టి.ఎన్. శేషన్‌ను ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా నియమించింది. శేషన్ సమర్థుడని, నిజాయితీపరుడని, స్వంత వ్యక్తిత్వం, ఆత్మవిశ్వాసం ఉన్న వ్యక్తి అని అధికార రంగాలలో పేరుంది. ఆయన అప్పటికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలలో వివిధ పదవులు నిర్వహించారు. ఇందిరాగాంధీ దారుణ హత్య నేపథ్యంలో, రాజీవ్ గాంధీ ప్రభుత్వంలో ప్రధాని రక్షణ ఏర్పాటు చూసే కార్యదర్శిగా

శేషన్ పనిచేశారు. ఆ తరువాత రక్షణ శాఖ కార్యదర్శిగా, ఆ పిమ్మట దేశంలో అత్యున్నత ఉద్యోగమైన కేంద్ర క్యాబినెట్ కార్యదర్శిగా, వి.పి. సింగ్ ప్రభుత్వంలో ప్రణాళికా సంఘం సభ్య కార్యదర్శిగా పనిచేశారు. పలు పదవులు నిర్వహించిన ఆయన సామర్థ్యం గూర్చి అందరికీ తెలిసినా, ప్రభుత్వాలను, ప్రధానమంత్రులను శేషన్ ఎదిరించిన దాఖలాలు గాని, స్వతంత్రంగా వ్యవహరించిన సంఘటనలుగాని కనిపించవు. అంటే, సమర్థుడైన వ్యక్తి కూడా మామూలు అధికార చట్రంలో ఉన్నప్పుడు స్వతంత్రంగా చేయగలిగేది చాలా తక్కువన్న మాట. ప్రభుత్వాధికారిగా ప్రభుత్వాలకు, అధినేతలకు విధేయుడుగా ఉండటం తప్పనిసరి కాబట్టి ఆయన ప్రతిభ మరుగున పడింది. ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా నియమించాక కూడా కొంత కాలం శేషన్‌ను పెద్దగా ఎవరూ పట్టించుకోలేదు. నిజానికి 1991 పార్లమెంటు ఎన్నికల సమయంలో ఆయన చేసిన కొన్ని నిర్ణయాలు పక్షపాతంగా ఉన్నాయని విమర్శలు వచ్చాయి. పంజాబులో అసెంబ్లీ ఎన్నికలను రద్దు చేయడం కూడా వివాదం సృష్టించింది. శేషన్ నియామకానికి కారణమైన రాజీవ్‌గాంధీ దారుణ హత్యకు గురై రంగం నుంచి నిష్క్రమించడం, రాజ్యాంగ సంస్థలకు ప్రభుత్వాధికారులకుండే పరిమితులు లేవన్న అవగాహన, దేశంలో రాజకీయాలంటే మధ్యతరగతి వారిలో, సాధారణ పౌరులలో పెరుగుతున్న అసహ్యం ఎన్నికల సంఘానికి విశేష ప్రాధాన్యాని చేకూర్చాయి. దాంతో శేషన్ విశ్వరూపం ప్రదర్శించి దేశంలో అన్ని వర్గాలలో మంచి పేరు తెచ్చుకోవడమే కాకుండా, కొంతకాలం దాదాపు అన్ని పార్టీలను గడగడలాడించారు. మారుమూల గ్రామాల్లో కూడా శేషన్ పేరు మారుమోగింది. ప్రభుత్వ యంత్రాంగం ధైర్యం తెచ్చుకొని ఎన్నికలు రాగానే స్వతంత్రంగా వ్యవహరించడం ప్రారంభించింది. ఆ తరువాత శేషన్ నిష్క్రమించినా ఎన్నికల సంఘం ప్రాధాన్యం తగ్గలేదు. ఆరేడేళ్ల కాలంలో ఎన్నికల సంఘం కొన్ని విజయాలు సాధించింది. దేశంలో మొదటిసారిగా స్వతంత్రంగా నిర్భీతితో వ్యవహరించే రాజ్యాంగ సంస్థల ప్రాధాన్యం జనసామాన్యం దృష్టికి వచ్చింది. రాజ్యాంగ సంస్థలు ప్రభుత్వాలతో వ్యవహరించేటప్పుడు భీరువులుగా, కర్రవిరగకుండా పాము చావకుండా వ్యవహరించనక్కర్లేదని రుజువైంది. దేశంలో ఎన్నికల నిర్వహణ గురించి పార్టీలలో ప్రజాస్వామ్యం గురించి విస్తృత చర్చ జరిగింది. ఉన్న పరిమితులలో కొంతమేరకైనా నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడం సాధ్యమేనని అర్థమైంది. అంతమాత్రాన ఎన్నికలలో అక్రమాలు తొలగిపోయాయనుకుంటే పొరపాటే. నేటికీ

డబ్బు, సారాయి, ఇతర ప్రలోభాలు బలమైన పాత్ర వహిస్తున్నాయి. పార్టీలు దుర్మార్గుల్ని, లంచగొండుల్ని, దోపిడీదారుల్ని, కొన్ని సందర్భాలలో చివరికి హంతకులను కూడా అభ్యర్థులుగా నిలబెట్టడం మానలేదు. పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యం నిజానికి ఏమీ పెరగలేదు. ఓటర్ల గుర్తింపు కారుడుల ఏర్పాటు సాధ్యం కాలేదు. చట్ట సభల వాసి ఏమాత్రం పెరగలేదు. 1996లో ఎన్నికైన పార్లమెంటుకాని, 1991–97 మధ్య ఎన్నికైన శాసనసభలుకాని, అంతకుముందున్న చట్టసభలకన్నా మెరుగైనవని చెప్పటం అవాస్తవమదుతుంది. కాని, ఈ లోపాలు ఎన్నికల సంఘానివి కాదు. అందుకు శేషనో, ఆయన సహచరులో, నేడున్న ఎన్నికల కమిషనర్లో బాధ్యులు కాదు. వ్యవస్థలోని లోపాలు ఏ ఒక్క వ్యక్తో, సంస్థో పూనుకుంటే తొలగిపోయేవి కాదు. మౌలిక సంస్కరణల ద్వారా రాజ్యవ్యవస్థలో పెను మార్పులు వస్తేగాని ఎన్నికల సంఘం వంటి వారి కృషి సత్ఫలితాలనివ్వదు. మంచి ఫలితాల్ని సాధించినకొద్దీ అవి బలమైన స్వతంత్ర రాజ్యాంగ సంస్థలకు ప్రోదిచేస్తాయి. వాటి ఆవశ్యకతను గుర్తింపజేస్తాయి.

## సభ్యుల సంఖ్యపై నిరర్థక వివాదం

ఎన్నికల సంఘంలో శేషన్ కాలంలోనే చెలరేగిన ఒక పెద్ద వివాదం ఎన్నో పాఠాలు నేర్పుతుంది. శేషన్ కఠినంగా, నిర్భయంగా, ఏ అడ్డులేకుండా వ్యవహరిస్తున్నారనే భావం అధికారంలో ఉన్న పెద్దలకు, చాలా రాజకీయపక్షాలకు కలిగింది. ఆయనను కట్టడి చేద్దామన్న సంకల్పంతో మరో ఇద్దరు ఎన్నికల కమిషనర్ల పదవులను సృష్టించి, ఆ స్థానాలలో ప్రస్తుతం ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా ఉన్న గిల్‌ను ప్రస్తుత కమిషనర్ కృష్ణమూర్తిని నియమించారు. అప్పుడు దేశమంతా దుమారం చెలరేగింది. శేషన్‌కు సంకెళ్లు వేస్తున్నారని చాలా మంది విమర్శించారు. పత్రికలలో పుంఖానుపుంఖాలుగా వ్యాసాలు, సంపాదకీయాలు వెలువడ్డాయి. దాదాపు అన్నింటి భావం ఒక్కటే – ఆ ఇద్దర్నీ అదనంగా నియమించడం దురుద్దేశంతో కూడుకున్న పని. అది తప్పు' అని శేషన్ భీష్మించి ఆ ఇద్దరినీ ఉత్సవ విగ్రహాలుగా కూర్చోబెట్టారు. ఎన్నికల సంఘం కార్యాలయంలో ఏం జరుగుతుందోనని రోజువారిగా ఎంతో ఉత్కంఠ కానవచ్చింది. ఒక సస్పెన్సు సినిమా చూస్తున్నంత వేడి, ఉత్సాహం, ఆందోళన పత్రికలలో, ప్రజలలో పుట్టాయి. చివరికి వివాదం కోర్టులకెక్కింది. తుది తీర్పు వచ్చేదాకా సుప్రీం కోర్టు శేషన్‌కు పూర్తి అధికారాన్నిచ్చింది. గిల్ ఢిల్లీ వదిలి తన పొలంలో స్థిరపడ్డారు. ఎట్టకేలకు సుప్రీం కోర్టు ముగ్గురికీ నిర్ణయాధికారం ఉండాలని,

ఏకాభిప్రాయం లేనిచోట మెజారిటీ నిర్ణయం శిరోధార్యమని, పాలనా సంబంధమైన అంశాలలో మాత్రం ప్రధాన ఎన్నికల కమిషనర్‌దే పైచేయి అని నిర్ణయం చేసింది. చాలామంది హతాశులై బాధపడ్డారు. ఇక ఈ దెబ్బతో సంఘం బలహీనపడిందని వాపోయారు. తదనంతర సంఘటనలు ఆ భయాలు నిరాధారమని రుజువు చేశాయి. ఈ మొత్తం ఉదంతం నుండి కొన్ని విషయాలను ఆకళింపు చేసుకోవచ్చు. ప్రజారంగంలో చర్చలు, పలు సందర్భాల్లో విషయ పరిజ్ఞానాన్ని, సరైన అవగాహనను పెంచడానికి దోహదం చేయడం లేదు. నిజాయితీగా, నిష్పాక్షికంగా చర్చలు జరుగుతున్నాయిగాని, వాటిలో దూరదృష్టి, మౌలిక ప్రజాస్వామ్య సూత్రాల పట్ల అవగాహన కొరవడుతున్నది. ప్రజాస్వామ్య సమాజంలో ఒకరికి బదులు ముగ్గురు సమిష్టిగా నిర్ణయాలు చేస్తే నష్టం అని వాదించడం విచిత్రం. నిరంకుశ పాలనకన్నా సమష్టి నిర్ణయాలు బాగుంటాయనే విశ్వాసం ప్రజాస్వామ్యానికి మూలం. చర్చ జరగవలసింది ఎంతమందిని ఎన్నికల సంఘం సభ్యులుగా నియమించాలని కాదు. వాళ్లను ఎలా నియమించారని. శేషన్‌ను చంద్రశేఖర్ ప్రభుత్వం ఏకపక్షంగా నియమించినట్లే, మిగిలిన ఇద్దరు కమిషర్లను నరసింహారావు ప్రభుత్వం ఏకపక్షంగా నియమించింది. ఇటీవల దేవెగౌడ ప్రభుత్వం కూడా అలాగే ఏకపక్షంగా గిల్‌ను ప్రధాన ఎన్నికల కమిషనర్‌గాను, మరొక కమిషనర్‌ను కొత్తగా నియమించింది. ఈ నియామకాలన్నింటిలో మంచివాళ్లే రావటం మన అదృష్టం. కాని నియమించబడినవారి బాగోగులు ఇప్పుడు అప్రస్తుతం. వాళ్లను నియమించే తీరు ప్రజాస్వామ్యబద్ధంగా, ఆ సంస్థల గౌరవ ప్రతిపత్తిని, విశ్వసనీయతను పెంచేదిగా ఉందా లేదా అన్నదే ప్రధానమైన అంశం. ప్రధానమంత్రో, ముఖ్యమంత్రో విశృంఖలంగా, నిర్నిబంధంగా, ఏ జవాబుదారితనం లేకుండా, ప్రజలకు ఏమీ తెలియకుండా, స్వంత విషయంలాగా రాజ్యాంగ సంస్థల నియామకాలు జరపడం ఏ రకంగానూ సమర్థనీయం కాదు. పరిస్థితుల ప్రాబల్యం వల్లనో, కాకతాళీయంగానో అలాంటి నియామకాల వల్ల కూడా కొందరు మంచివాళ్లు ఆ పదవులనలంకరించవచ్చు. వారు కొంతవరకు స్వతంత్రంగా తమ బాధ్యతల్ని నిర్వహించి ఉన్నంతలో ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టవచ్చు. కాని అధికారంలో ఉన్నవారు ఇచ్ఛానుసారం నియామకాలు జరిగినంతకాలం రాజ్యాంగ సంస్థలు గ్రహణం పట్టిన చంద్రుడిలా వెలవెలపోతాయి. ప్రజాస్వామ్యంలో పరిష్కారాల్ని వెతకవలసింది వ్యక్తులలో కాదు, సంస్థాగత నిర్మాణంలో, వ్యవస్థలో మాత్రమే. వ్యక్తులే పరిష్కారంగా భాసిల్లేది రాజరికంలో, లేదా నియంతృత్వంలో

మాత్రమే. నిజమైన ప్రజాస్వామ్యంలో అధికారంలో ఉన్న వ్యక్తులకన్నా, ప్రజాస్వామ్య ప్రక్రియ, రాజ్యసంస్థలు, వ్యవస్థాగత ఏర్పాట్లు చాలా ముఖ్యం. ఎన్నికల సంఘం విషయంలోనే చూస్తే శేషన్‌ను బలహీనపరచి పక్షపాతంగా, నీరసంగా వ్యవహరించేలా చేయడం కోసం నియమితులయ్యారన్న ఎన్నికల కమిషనర్లు ఇద్దరు తరువాత శేషన్‌తో దీటుగా పనిచేశారు. మంచిపేరు తెచ్చుకున్నారు. ఇటీవల జరిపిన ఎన్నికలు నేరమయ రాజకీయాన్ని అదుపుచేయాలన్నవారి ప్రయత్నం ఆ విషయాల్ని రుజువు చేస్తున్నాయి. అయినప్పటికీ వివరించినట్లు ఎన్నికల సంఘం ఒక్కటే తన చర్యలవల్ల, ఆదేశాల వల్ల నేరమయ రాజకీయాన్ని ఆపలేదు. ఆపలేకపోతే ఆ లోపం ఎన్నికల సంఘానిదీ కాదు. లోపభూయిష్టమైన వ్యవస్థలో కంబళి భోజన న్యాయం వర్ధిల్లుతుంది. కంబళిలో భోజనం చేస్తూ అన్నంలో వెంట్రుకలున్నాయని ఎంత వాపోయినా ప్రయోజనం శూన్యం. ఏతావాతా తేలేదేమంటే, రాజ్యాంగ వ్యవస్థల సృష్టిలోగాని, వాటి నియామకాలలోగాని సరైన పద్ధతుల్ని పాటిస్తేనే వాటివల్ల ప్రయోజనాల్ని పొందగలుగుతాం. వాటికి తగిన భద్రతను, గౌరవాన్ని, గుర్తింపునీ ఇవ్వడం ఒక అంశం. వాటిలో నియామకాలను విస్తృత ప్రాతిపదికపైన పారదర్శకంగా అందరూ హర్షించే విధంగా జరపడం మరో అంశం. ఆ విధంగా రాజ్యాంగ సంస్థల్ని బలోపేతం చేయాలి. ఈ రెండు విషయాల్ని తాత్కాలికంగా అధికార పీఠాలనధిష్ఠించిన నేతల వ్యక్తిగత ఇష్టాయిష్టాలకు వదిలేస్తే జాతి తీవ్ర ప్రమాదాలనెదుర్కొంటుంది. నేడు కావలసింది సంస్థాగతమైన ఏర్పాట్లుగాని, నవీన రాచరికం కాదు.

## నియామకాలలో నిష్పాక్షికత ముఖ్యం

జాతీయ స్థాయిలో రాష్ట్రాలలో ఇతర రాజ్యాంగ నియామకాల పద్ధతి చూస్తే ఈ విషయం బోధపడుతుంది. కీలక ప్రభుత్వాధికారులను నియమించే పబ్లిక్ సర్వీసు కమిషన్ల నియామకాలు ఒక ఉదాహరణ. సర్వీస్ కమిషన్ సభ్యులకు కూడా పదవీ భద్రత, రాజ్యాంగస్థాయి ఉన్నాయి. కేంద్ర స్థాయిలో అడపాదడపా కొన్ని విమర్శలు వచ్చినా, మొత్తంమీద యు.పి.ఎస్.సి.లో నియామకాలు బాగానే ఉన్నాయని పెద్దలు చెబుతారు. అందువల్లనే జాతీయస్థాయిలో ఉద్యోగాలకు జరిగే పోటీ పరీక్షలలో అభ్యర్థుల ఎంపికలో పెద్దగా అవకతవకలు జరగడం లేదు. పలు రాష్ట్రాలలో మాత్రం పరిస్థితి దయనీయంగా ఉంది. ఏ రకంగానూ అర్హతలేనివారిని, పార్టీల వాళ్లను కొన్ని సందర్భాలలో చెడునడత ఉన్నవారిని, చివరికి పాఠశాల స్థాయి దాటని వారిని

నియమించిన సంఘటనలనేకం. పార్టీల సభ్యత్వానికి, చట్టసభలకు కనీసం రాజీనామా కూడా చేయకుండానే పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో నియమించడం జరుగుతున్నది. ఉద్యోగాల వేలం పెట్టారని, అభ్యర్థుల ఎంపికలో పెద్దయెత్తున డబ్బు చేతులు మారుతోందని, స్థాయిని బట్టి ఉద్యోగాలు లక్షల రూపాయల రేట్లు పలుకుతున్నాయని వివిధ రాష్ట్రాలలో తీవ్ర ఆరోపణలున్నాయి. ఇలా లంచమిచ్చి ఉద్యోగంలో ప్రవేశించినవాడు నిష్పాక్షికంగా, నిజాయితీగా, జనరంజకంగా పనిచేస్తాడని ఆశించడం అమాయకత్వం అవుతుంది. ఎన్నోచోట్ల సర్వీసు కమిషన్ సభ్యులుగా అప్పుడు అధికారంలో ఉన్న పెద్దలకు ఇష్టమైన వారిని, 'అస్మదీయులను' నియమించడం, మళ్లీ వారు ఉద్యోగాలలో ఎంపిక చేసినప్పుడు అధికారంలో ఉన్నవారికి చెందినవారినో, డబ్బిచ్చినవారినో, తమ తమ కుల, మత, ప్రాంతాలను బట్టి ఆ వర్గానికి చెందినవారినో నియమించడం, ఆ విషయాలు పత్రికలలో, చట్టసభల్లో చర్చాంశాలు కావటం, వాదోపవాదాలు చెలరేగటం తెలిసిన విషయమే. 'అతనికంటే ఘనుడు ఆచంట మల్లన్న' అన్నట్లు ఎవరు అధికారంలో ఉన్నా ఇలా అధికారాన్ని దుర్వినియోగం చేసి ప్రజాప్రయోజనాల్ని హరించడం ఆనవాయితీ అయింది. ప్రజల పేరుతో పబ్బం గడుపుకునే ఈ అధికార గణాలకు అడ్డుకట్ట వేయందే సామాన్యుడికి న్యాయం జరగదు. వ్యవస్థ విశ్వసనీయత పెరగదు. అందుకు కావలసింది బలమైన రాజ్యాంగ సంస్థలు. వాటిలో నిజాయితీపరుల నిష్పాక్షిక నియామకం.

* * *

# పార్టీలకు ప్రాణ సంకటం, ప్రజలకు వినోదం మళ్లీ ఎన్నికలు

*డిశంబర్ 8, 1997*

మళ్లీ లోక్‌సభ ఎన్నికలొచ్చేశాయి. ఎన్నికలు త్వరలోనే మళ్లీ వస్తాయని రాజకీయ పరిశీలకులకు 1996 లోక్‌సభ ఎన్నికల నాటి నుంచే తెలుసు. ఢిల్లీ రాజకీయ ప్రహసనాన్ని తిలకించినవారికి అసలు రాజకీయాలూ, ఎన్నికలంటే విసుగు పుట్టవచ్చు కాస్త ఆలోచిస్తే అంతగా బాధపడవలసింది, విసుగు చెందవలసింది ఏమీ లేదనిపిస్తుంది. పాకిస్తాన్‌లో గత రెండు మాసాల సంక్షోభంతో పోలిస్తే ఎన్నో లోపాలున్నప్పటికీ, మరెన్నో వైవిధ్యాలున్నప్పటికీ, విస్తీర్ణంలో, జనాభాలో ఎన్నో రెట్లు పెద్దదైనప్పటికీ, భారతదేశంలో కనీసం ప్రభుత్వ పతనం, మళ్లీ ప్రభుత్వాల ఏర్పాటు ఒక పద్ధతి ప్రకారం, బలప్రయోగాలు అంతగా లేకుండా, కత్తులు, కఠారులతో పనిలేకుండా, అన్నింటినీ మించి సైనిక దళాలతో ఏమాత్రం సంబంధం లేకుండా జరుగుతోంది. కాని మనదేశంలో ప్రజాస్వామ్యం లోపరహితమని మాత్రం భావించలేం.

## ఎవర్‌గ్రీన్ హీరోలు వారసత్వ వీరులు

ఇకముందు పార్టీల టికెట్ల పంపిణీలు, ఒక పార్టీ నుంచి మరో పార్టీకి ఎన్నికల ముందు కప్పగంతులు జాగ్రత్తగా పరిశీలిస్తే ఎన్నికల బండారం బయటపడుతుంది. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే పార్లమెంటు ఎన్నికలు నయం. చాలామందికి నిజానికి ఈ ఎన్నికల పట్ల ఆసక్తి లేదు. రాష్ట్రాలలో అధికారంలో ఉన్న పార్టీ నాయకులైతే వీలైనంతవరకు ఆ ఎన్నికలలో పాల్గనకుండా తప్పించుకోవటానికి ప్రయత్నిస్తారు. పదవులు లేని వాళ్లకు, అధికారంలో లేని పార్టీలవారికి మాత్రమే ఈ ఎన్నికలలో పాల్గోనాలని ఉత్సాహం ఉంటుంది. ఏ పదవీ లేనప్పుడు మళ్లీ ఎన్నికలొస్తే పార్టీ టికెట్టు సంపాదిస్తే, అదివరకు రాజకీయంలో కూడబెట్టిన డబ్బు పెట్టుబడిగా పెడితే, అదృష్టం కలసి వస్తే, ఏదైనా రాజకీయ ప్రభంజనం వీస్తే గెలిచి యం.పి. కావచ్చు. ఒకసారి చక్రం తిప్పవచ్చు. కాలం కలిసొస్తే ఢిల్లీలో అధికారం నెరపవచ్చు. పెట్టిన పెట్టుబడికి ఎన్నో రెట్లు లాభాలార్జించవచ్చు. మళ్లీ తమ తమ రాష్ట్రాలలో ఎన్నికలొస్తే

పదవుల కోసం ప్రయత్నం చేయవచ్చు. ఇదంతా ఒక శాశ్వత వృత్తిగా, ఒక జూదంగా, ఒక పెట్టుబడిగా తయారైంది. రాజకీయాల్లో ఉన్నవాళ్లను అసలు మీ వృత్తి ఏమిటి? మీ ఆదాయం ఎంత? మీ ఖర్చు ఎంత? ఆదాయం పన్ను ఎంత కట్టారు? – అని అడిగి చూడండి. సమాధానాలు ఎంత గందరగోళంగా, తికమకగా, అస్పష్టంగా ఉంటాయో తెలుస్తుంది. వీరిలో చాలామందికి నెలసరి ఖర్చు కనీసం లక్ష రూపాయలుంటుంది. కొంతమంది ప్రతినెలా రెండు లక్షల పైచిలుకు ఖర్చుపెడతారు. ముఠా రాజకీయాలకు నెలవైన ప్రాంతాలలోని రాజకీయ నాయకులు ఒకసారి రాష్ట్ర రాజధానికి వెళ్లాలంటే ముందు వెనక జీపులు, మంది, మార్బలం, తుపాకులు, నాటుబాంబులు – ఇవన్నీ కావాలి. తమ చుట్టూ ఉండే బాంబుల మనుషులకు విడిది, భోజనాలు, ఇతర సౌకర్యాలు కావాలి. ఇవన్నీ కలిసి, ప్రతి ప్రయాణానికి అధమపక్షం ముప్పై నలభైవేల రూపాయలు ఖర్చువుతాయి. మరి వీరికి ఈ డబ్బు ఎక్కడ నుంచి వస్తోంది? వారు చట్టసభలలో ఉన్నా వచ్చే జీతం సంవత్సరం అంతా కలిపినా ముప్పై నలభై వేలు దాటదే! ఇలా ఎన్నో ఉదాహరణలు మనం చెప్పుకోవచ్చు. ఇలా లోపాలెన్ని ఉన్నా మళ్లీ ఎన్నికలు రావటం మంచిదే. దీనివల్ల ఏదో రాజకీయం ప్రక్షాళన అవుతుందన్న భ్రమ ఎవరికీ లేదుగాని, ఎన్నికలన్నవి ఎంత లోపభూయిష్టంగా ఉన్నా, ప్రజాస్వామ్యంలో ప్రజల సార్వభౌమత్వాన్ని చాటి చెప్పే అవకాశమిది. “పౌరులుగా మేము మా జీవితం మీద మాకున్న అధికారంలో కొంత భాగాన్ని కొంత కాలంపాటు కావాలని మీకిస్తున్నాం. అంతిమ నిర్ణయం మాత్రం మాదే. మా సేవకులుగా జాగ్రత్తగా పనిచేయండి” అని ప్రజలు చాటిచెప్పే ప్రక్రియ ఎన్నికలు. ఏళ్ల తరబడి దాస్యానికి, అవమానానికి, వేదనకి, దుష్పరిపాలనకి గురైన ప్రజలు కనీసం ఒకరోజు తాము ఆసాములమని గుర్తించి ప్రవర్తించే అవకాశాన్ని ఎన్నికలిస్తాయి. రాజకీయ అస్థిరత్వం గురించి చాలామంది బాధపడుతున్నారు. కాని రాజకీయ స్థిరత్వం ఉన్నా, అస్థిరత్వం ప్రబలి మళ్లీ మళ్లీ ప్రభుత్వాలు మారినా, ఎన్నికలు త్వరగా వచ్చినా – ప్రజలకు మాత్రం తేడా ఏమీ లేదు. ఎన్నోసార్లు జాతీయ స్థాయిలోను, రాష్ట్రాలలోను స్థిర ప్రభుత్వాలు ఏర్పాటయ్యాయి. ప్రజలు గట్టి మద్దతునిచ్చి కొన్ని పార్టీలకు అధికారం అందించారు. అప్పుడు ప్రజలకి ఒరిగిందేమీ లేదు. చివరికి వారికి అందింది అవమానం, అవినీతి, అసమర్థత, అక్రమాలు, అన్యాయాలు మాత్రమే. నిన్నటిదాకా నమస్కారాలు పెట్టి ఆషాడభూతిలాగా నటించినవాడు, ఓట్లు పొంది పదవిలోకి వచ్చిన మరుక్షణం ప్రజల సేవకుడన్న సంగతి మరచి, ప్రజల నెత్తికెక్కి కూర్చుంటున్నాడు. అధికారాన్ని

ప్రజల కోసం కాక, తన స్వంత ఆస్తిలాగా వాడుకుంటున్నాడు. ఎన్నికలలో గెలుపు ఎవరిదైనా ప్రజలకు మిగిలేది చేదు అనుభవమే.అస్థిరత్వం, రాజకీయ సంక్షోభం – ఇవన్నీ కొందరు పెద్దలకు, పదవులలో ఉన్నవాళ్లకు, వాళ్లమీద ఏదో విధంగా ఆధారపడ్డవాళ్లకు ఇబ్బంది కలిగించే విషయాలు, పత్రికలకి అమితమైన ఆసక్తి కలిగించే అంశాలు, పతాక శీర్షికలలో తాటికాయంత అక్షరాలతో కనిపించే వార్తలు, జనజీవనానికి ఏ విధంగాను సంబంధించని అంశాలివి రాజకీయం వారి రాజకీయానిదే, ప్రజలకు రోజువారీగా అందే దుష్టపరిపాలన, వారు ఎదుర్కొనే ఇబ్బందులు, అనుభవించే కష్టాలు వారివే. జనజీవనానికి ఏమాత్రం సంబంధం లేని రాజకీయం ప్రజలను నిరంతరం వెక్కిరిస్తోంది. ఎన్నికల వల్ల ఈ పరిస్థితి ఎందుకు మారటం లేదు. ఈ ప్రశ్నకి సమాధానం వెదకాల్సి ఉంది. గత ఎన్నికలలో ఎలాంటివారు పోటీ చేశారో, ఇప్పుడు కూడా అలాంటివారే పార్టీ అభ్యర్థులవుతారు. అప్పుడు ఎన్నికలలో ఏం అవకతవకలు జరిగాయో ఇప్పుడూ అవే జరుగుతాయి. దేశంలో ఎక్కడైనా చూడండి. చట్టసభల ఎన్నికలలో పార్టీల అభ్యర్థులు కావటానికి ఆనాడే ఏ అర్హతలు ఉన్నాయో, ఇప్పుడూ అవే ఉంటాయి. అప్పటిలాగే వయసు మళ్ళినవారి ప్రాబల్యం ఉంటుంది. చాలాకాలంగా రాజకీయాల్లో ఉన్నవాళ్లు కాబట్టి వాళ్లే మళ్లీ నాయకులు కావాలి. వీరంతా ఎవర్‌గ్రీన్ హీరోలు. వీరున్నంత కాలం మరొకరికి పార్టీలు స్థానమివ్వవు. అన్ని స్థాయిలలోను వీరికే ప్రాబల్యం ఉండడం వల్ల, పార్టీల తరఫున అభ్యర్థులను నిర్ణయించటం కూడా వీరి చేతుల్లోనే ఉంది. గనుక, పదవులలో ఉండగానే చనిపోయే జన్మహక్కు వీరికుంది. గనుక, ఎన్నిసార్లు ఎన్నికలు వచ్చినా, ఎన్ని మంత్రి పదవులు వచ్చినా అధికారం మాత్రం వారిదే! అందువల్లనే దేశంలో ఉన్నతాధికారం పొందినవారిలో అధిక సంఖ్యాకుల వయస్సు 80 సంవత్సరాలకి కాస్త అటు ఇటుగా ఉంటోంది. 50–60 సంవత్సరాల వారు బాలకుమారుల లాగా కనిపిస్తారు. ఇటీవల ఒకానొక ప్రధాన పార్టీలో 50 సంవత్సరాల బాలకుమారుడొకరు కొంచెం గట్టిగా అసమ్మతి స్వర్గం వినిపించి నాయకత్వం కోసం పోటీ చేశాడు. " అతడు మరీ కుర్రాడు! అంత తొందరగా అధికారం కావాలని కోరటం అత్యాశ, తప్పు" అని పెద్దలందరి వాదన. ప్రపంచంలో అన్ని ప్రధాన దేశాలలో నాయకుల వయస్సు 40లలో లేదా 50లలో ఉండవచ్చుగాక! కాని సుదీర్ఘమైన 5000 సంవత్సరాల చరిత్ర ఉన్న భారతదేశంలో మాత్రం ఈ దేశ చరిత్రతో పోలిన వయోభారం లేకపోతే పదవులకి అర్హత లేదు! పోనీ ఒకవేళ వీరు కాలం చేశాక మరొకరు మంచివారు వయసు, ఆరోగ్యం ఉన్నవారు వస్తారా

అంటే, మళ్ళీ వారి వారి వారసులే అభ్యర్థులు. దేశంలో చట్టసభలకు ప్రధాన పార్టీల తరఫున పోటీ చేసి గెలుపొందే అవకాశాలున్నవారిని పరిశీలించండి. దేశంలో రాష్ట్ర శాసనసభలో దాదాపు 4100 స్థానాలున్నాయి. పార్లమెంటుకి 542 స్థానాలున్నాయి. వీటన్నింటిలో దాదాపు 60 శాతం మేరకు ప్రధాన అభ్యర్థులు ఈ విధంగా సంప్రదాయం వల్ల, వారసత్వం వల్ల వచ్చినవారే. వారసత్వం ఎంతగా వెర్రితలలు వేసిందంటే, చివరికి "స్వాతంత్ర్య సమరయోధుల సంతాన సంఘం" పేరుతో జాతీయస్థాయిలో ఒక సంస్థ వెలిసింది. దానిలో చాలామంది ప్రముఖుల సంతానం ఉన్నారు. మళ్లీ వారిలో చాలామంది వారసత్వం కారణంగా ఇప్పటికే పదవులు పొంది జాతీయస్థాయిలలోనూ, రాష్ట్రాలలోనూ అధికారం పొందినవారు. ప్రస్తుతం కూడా అనుభవిస్తున్నవారు ఉన్నారు. లేకితనానికి, అప్రజాస్వామ్యానికి వారసత్వం కారణంగా అప్రయోజకులను అందలాలెక్కించడానికి ఇంతకంటే వేరే ఉదాహరణలక్కరలేదు. మిగిలిన 40 శాతం మాత్రమే కుటుంబంతోనూ, వంశపారంపర్యంతోనూ సంబంధంలేకుండా సీట్లు పొందే అభ్యర్థులు ఈ మిగిలిన 40 శాతం మంది మంచివాళ్ళు, సమర్థులు, దేశభక్తులు వస్తారు అనుకుంటే పప్పులో కాలువేసినట్లే. మిగిలిన వాళ్ళల్లో ప్రధాన పార్టీల టిక్కెట్లు పొందే అవకాశం చాలావరకు డబ్బు బాగా గడించినవారికే ఉంటుంది. డబ్బు గడించటంలో తప్పులేదు. నిజానికి సంపద సృష్టించటం జాతికి అత్యవసరం. నిజమైన సంపద ప్రజల అవసరాలను తీర్చటానికి ఉపయోగపడుతుంది. దురదృష్టవశాన ప్రస్తుతం రాజకీయంలో న్యాయంగా డబ్బు సంపాదించినవారికి అవకాశం లేదు. కోట్లు ఖర్చుపెట్టాలి కాబట్టి అదంతా దొంగఖర్చే కాబట్టి, చట్టప్రకారం చూపెట్టే ఖర్చు కాదు కాబట్టి, అక్రమంగా సంపాదించిన దొంగడబ్బు, పన్నులెగ్గొట్టిన నల్లధనం రాజ్యమేలుతుంది. అందుకే రాజకీయంలో అక్రమసంపాదనదే ప్రముఖ స్థానం. అదివరకు పదవిలో ఉండి, దొంగసారా వ్యాపారం చేసో, పైరవీలు చేసో, లంచాలు తినో కోట్లు సంపాదిస్తే, మళ్లీ ఎన్నికలలో సీటు– అదృష్టం కలిసొస్తే పదవి ఖాయం. ఒకవేళ తాత్కాలికంగా ఓడినా, మళ్లీ తరువాత ఎన్నికలు రాకపోవు. నేడు ఓడినవారు టికెట్ పొంది డబ్బు ఖర్చుపెడితే రేపు గెలవకపోడు. అలాగే స్మగ్లింగ్ చేసో, జనాన్ని మోసం చేసో, ప్రభుత్వ ధనాన్ని ఏదో ఒక రూపంలో అపహరించో, కోట్లు వెనకేస్తే టికెట్ గ్యారంటీ. కొద్దిమంది న్యాయంగా సంపాదించినా ఎంతో కొంత నల్లడబ్బు ఉంది కాబట్టి ఆ డబ్బుని రాజకీయంలో పెట్టుబడి పెడితే హోదా, పలుకుబడి, పదవి వస్తుందని ఎన్నికల బరిలో దిగుతున్నారు. సహజంగానే ఎన్నికలలో గెలిస్తే

లైసెన్స్‌లు, కాంట్రాక్టులు, అధికారులతో పనులు ఇవన్నీ సులభంగా సాధించవచ్చు. అలాగే పలుకుబడి కారణంగా ప్రభుత్వంలో పనులు చకచకా, తక్కువ లంచాలతో జరుగుతాయి. ఫైళ్ళు వేగంగా కదులుతాయి. ఇలా వారసత్వం తరువాత స్థానం ప్రధాన పార్టీ అభ్యర్థులలో డబ్బున్నవారిదే– అందునా ఎక్కువగా అక్రమార్జన ఉన్నవారిదే. ఇటీవలకాలంలో కండబలం, గూండాల అండ ఉన్నవారు స్వైరవిహారం చేస్తున్నారు. తొండముదిరి ఊసరవెల్లి అయినట్లు, గొంగళిపురుగు సీతాకోకచిలుక అయినట్లు, నేటి రౌడీ రేపటి నేతగా రూపాంతరం చెందుతున్నాడు. స్థానిక ఎన్నికలలోనూ, శాసనసభలలోనూ వీరి ప్రభావం మరీ ఎక్కువ. అయితే కాలక్రమేణా వారు పార్లమెంటుకు కూడా ఎగబాకుతున్నారు. అసెంబ్లీ ఎన్నికలలో పోటీచేసే ప్రధాన పార్టీల అభ్యర్థులలో దేశం మొత్తంలో నూటికి ఇరవై మందికి నేరచరిత్ర ఉన్నట్లు అంచనా. సాక్షాత్తూ 11వ లోక్‌సభలో 35–40 మంది నేరచరిత్ర కలవారు ఉన్నారు. వారిలో కొందరు మంత్రులయ్యారు. ఒకాయన హత్యలకు పాల్పడ్డ ఆరోపణలు, సాక్ష్యాలు ఉండగా ఏకంగా ఈ దేశంలో శాంతిభద్రతలు కాపాడే హోంశాఖలోనే మంత్రయ్యాడు. వీరు కాక తర్వాతి స్థానం, ప్రజాజీవితంతో సంబంధం లేకుండా క్రీడలలోనూ, సినిమాలలోనూ పేరు తెచ్చుకుని సంపాదించినవారిది. వారికి రాజకీయాలు, పరిపాలన గురించి ఏమీ తెలియకపోవచ్చు. ఆసక్తి అసలే లేకపోవచ్చు. పదవి అంటే ఉండే వ్యామోహం వల్ల, తమ గ్లామర్ ఆసరా చేసుకుని పదవి సంపాదించాలని ఉబలాటపడటం సహజం! మరి ఆ పదవిలో ఏంచేస్తారు? అది వచ్చాక చూసుకోవచ్చు. పదవుల్లో ఉండి దీర్ఘకాలం రాజకీయంలో ఉన్నవారు ఊడపొడిచిందేమిటి గనక? పాపం ఈ తారలు చాలామంది డబ్బు పోగొట్టుకుని ఒళ్ళు హూనం చేసుకుని, చట్టసభలలోకి ప్రవేశించటం, తీరా వచ్చాక వాళ్ళ రంగులకలలు చెదిరిపోవటం, ఈ హడావుడిలో గందరగోళంలో, పదవుల వేటలో, కుట్రలు, కుతంత్రాలలో ఏం చేయాలో పాలుపోక, చాలావరకు అలంకారప్రాయంగా మిగిలిపోవటం, కొంతకాలం గడిచాక మోజుతగ్గి నిష్క్రమించటం, కొండొకచో అవమానభారంతో వెనుదిరగటం– ఇవన్నీ చూస్తున్నాం. చిత్తశుద్ధి, దేశభక్తి, ధీశక్తి, సామర్థ్యం ఉన్నవాళ్ళు రాజకీయాలలో లేకపోలేదు. అలాంటివారు చాలామంది సిద్ధాంతాలకు నిబద్ధమైన చిన్నపార్టీలకు అంకితమైపోయారు, లేదా పెద్ద పార్టీలలో చిక్కుకుని, ఏంచేయాలో తోచక, ఈ సొరచేపల రాజకీయ సముద్రంలో ఆటుపోట్లు తట్టుకోలేక చాలామంది మునిగిపోతున్నారు. లేదా వారి పాత్ర నామమాత్రమైపోతున్నది. అప్పుడప్పుడు అలంకారం కోసం వారిని ముందు

నిలబెట్టడం తప్ప అంతకుమించి వారికి నిజమైన పాత్ర ఉండదు. వారి అవస్థను చూసి జనం జాలిపడి, "పాపం! మంచివాడు రాజకీయంలో ఉన్నాడు, అయినా నిజాయితీపరుడే" అని నిట్టూరుస్తూ ఉంటారు. వారేమో ఈ మంచిమాట కోసం చకోరపక్షుల్లాగా ఎదురుచూస్తూ చదరంగంలో పావులుగా మిగిలిపోతారు.

## ఎన్నికల సమయంలోనే జనం మాటకు విలువ

ఇదీ నేడు ఎన్నికలలో అభ్యర్థుల తతంగం. ఇలాంటి ప్రక్రియ వల్ల కూడా ఏవో మంచి ఫలితాలే వస్తాయని మంత్ర తంత్రాలను, అద్భుతాలని నమ్మే అమాయకులు ఆశించవచ్చు. వాస్తవ దృష్టితో చూస్తే 12వ లోక్‌సభ కూడా పార్టీల బలాబలాలలో గాని, సభ్యుల గుణగణాలలోగాని 11వ లోక్‌సభకు భిన్నంగా ఉండదు. విచిత్రం ఏమిటంటే ఇంతా చేస్తే రేపు గెలిచే సభ్యులలో ఎవరో ఒకరు ప్రధానమంత్రి అవుతారన్న నమ్మకమూ లేదు. ఆ అవకాశం కొద్దికాలమయినాసరే రాజ్యసభ సభ్యులకో, కాబోయే రాజ్యసభ సభ్యులకో దక్కవచ్చు. వచ్చే అయిదారేళ్లలో రేపు జరిగే ఎన్నికలు కాక, మరొక రెండు మూడుసార్లు పార్లమెంటు ఎన్నికలు అనివార్యంగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎవరు గెలుస్తారో, ఎవరు ఓటమిని చవిజూస్తారో జాతికి అంత ముఖ్యం కాదు. ఆటగాళ్ల మార్పుతో తృప్తిపడకుండా ఆట నియమాలను మార్చి, పరిస్థితిని సరిదిద్దే ప్రక్రియలకు, సంస్కరణలను సాధించటానికి రాజకీయ అస్థిరత్వం, ఎన్నికలు ఒక రకంగా మంచి అవకాశం. ఎన్నికలకు ఎన్నికలకు మధ్య జరిగే రాజకీయ జూదంలో ప్రజలు పావులు. నేటి రాజకీయం నేతలకు చెలగాటం కాగా, ప్రజలకు ప్రాణ సంకటం. ఎన్నికలలో పాత్రలు తారుమారై కనీసం తాత్కాలికంగా ప్రజలు ప్రభువులుగా కనిపిస్తారు. నాయకులకు ప్రాణసంకటమైన ఎన్నికలు ప్రజలకు కనీసం కొంత వినోదాన్నిస్తాయి. అయితే మళ్ళీ మళ్లీ త్వరత్వరగా ఎన్నికలు వస్తే డబ్బు, కండబలం పెట్టుబడిగా, వారసత్వం సంపదగా రాజకీయ జూదం ఆడే వాళ్లకు కాస్తంత గుండె దడ పెరుగుతుంది. ఎంత ఖర్చు పెట్టినా, ఎన్ని వేషాలు వేసినా పదవి ఎంతకాలం ఉంటుందో, ఎప్పుడు మళ్ళీ ప్రజల ముందుకు రావాలో అనే భయం వారికి ఉంటుంది. అప్పుడు నిజమైన రాజకీయ ప్రక్షాళనకు, సమూల పాలనా సంస్కరణలకు ముహూర్తం ఆసన్నమవుతుంది. ఆ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవటం పౌరులుగా మన కర్తవ్యం.

* * *

# ప్రజాస్వామ్యంలో సుపరిపాలనే కీలకం

*మే 3, 1999*

అందరూ ఊహించినట్లుగానే 12వ లోక్‌సభకు అర్ధాంతరంగానే తెరపడింది. 13వ లోక్‌సభను ఎన్నుకోవటం కోసం మధ్యంతర ఎన్నికలు వచ్చిపడ్డాయి. బి.జె.పి. – మిత్రపక్షాలు సంకీర్ణ ప్రభుత్వం ఒక్క ఓటు తేడాతో ఏప్రిల్ 17న విశ్వాస పరీక్షలో ఓటమికి గురికాగానే మధ్యంతర ఎన్నికలు ఖాయమని తేలిపోయింది. ఆ మాటకొస్తే, 12వ లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలవడగానే ఆ సభ పూర్తికాలం మనజాలదని స్పష్టమయ్యింది. మధ్యంతర ఎన్నికలెప్పుడు వస్తాయనే విషయంలో భిన్నాభిప్రాయాలే తప్ప, అవి రావడం ఖాయమని అందరూ నిర్ధారణకు వచ్చేశారు. అందునా ఆదినుంచి బి.జె.పి. సంకీర్ణ ప్రభుత్వానికి హంసపాదులు ఎదురుకావటం, ప్రతివారం ఓ కొత్త సంక్షోభం ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టడం గమనించాక 1999 చివరిలోగాని, 2000 ప్రథమార్ధంలోగాని వివిధ రాష్ట్రాల శాసనసభల ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక మళ్ళీ ఎన్నికలు తప్పవని తేలిపోయింది.

## మనసులో మధ్యంతరం
## పైకిమాత్రం ప్రత్యామ్నాయం

కొద్ది మాసాల క్రితం మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఢిల్లీ రాష్ట్రాల శాసనసభల ఎన్నికలలో గెలుపొందగానే కాంగ్రెస్ పార్టీ మధ్యంతర ఎన్నికలకు పథకం సిద్ధం చేసుకుంది. ఏప్రిల్ 17న విశ్వాస పరీక్షలో బి.జె.పి. ప్రభుత్వం ఓడిపోగానే నిజానికి సోనియా గాంధీ కోరుకున్నది మధ్యంతర ఎన్నికలను ఆ విషయం ముందుగానే బయటకు పొక్కితే ఎన్నికలను వ్యతిరేకిస్తున్న పార్లమెంటు సభ్యులు చేజారిపోతారేమోనన్న భయంలో ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏర్పాటుకు అన్యమనస్కంగానే నడుంకట్టారు. మైనారిటీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని, మిగిలిన పార్టీలన్నీ బయటి నుంచి మద్దతునివ్వాలని ఎప్పుడయితే కాంగ్రెస్ పార్టీ ఏకపక్షంగా నిర్ణయించిందో, అప్పుడే ప్రభుత్వం ఏర్పాటు అసాధ్యమని, ఒకవేళ ఏర్పడినా ఆ ప్రభుత్వం కొద్ది వారాలకు మించి మనుగడ సాగించలేదని స్పష్టమయింది. జ్యోతిబసు నేతృత్వంలో తృతీయ ఫ్రంట్ ప్రభుత్వంలో చేరే ప్రశ్నగాని, ఆ ప్రభుత్వానికి మద్దతిచ్చే ప్రశ్నగాని ఉత్పన్నం కావని స్పష్టం చేయటంతో కాంగ్రెస్

అంతర్యం పూర్తిగా బయటపడింది. ఇంత మాత్రానికే కాంగ్రెస్ పార్టీ సోనియా గాంధీ అధ్యక్షతన ప్రత్యామ్నాయ ప్రభుత్వ ఏర్పాటుకు ఎందుకు ప్రయత్నించినట్టు? తరచి చూస్తే అందులో గొప్ప రహస్యం ఏమీ లేదు. అన్నాడి.ఎం.కె. అధినేత జయలలితకు కావలసింది బి.జె.పి.కి ప్రత్యామ్నాయ ప్రభుత్వ కేంద్రంలో వెంటనే ఏర్పాటు కావటం. లేకపోతే, అటు కేంద్రంలో, ఇటు తమిళనాడు రాష్ట్రంలో తాను వ్యతిరేకించే ప్రభుత్వాలు తన మీద వచ్చిన అవినీతి ఆరోపణల విషయంలో, కోర్టులలో విచారణలో ఉన్న వివిధ కేసులలో ఇరుకున పెట్టే ప్రమాదముంది. కోర్టులలో కేసులు త్వరగా తేలితే జైలు శిక్షపడే ప్రమాదమూ ఉంది. అంతకుమించి, ఒకసారి శిక్షపడ్డాక ఆరు సంవత్సరాలపాటు ఎన్నికలలో పోటీకి అర్హత ఉండదు కాబట్టి, దీర్ఘకాలం రాజకీయ సన్యాసం పుచ్చుకోవాలి. జయలలితను తృప్తి పరచాలంటే ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏర్పాటుకావాలి. ఆమెను సంతోషపెట్టటం కేవలం లోక్‌సభలో 19 ఓట్ల కోసం మాత్రమే కాదు రేపు రాబోయే ఎన్నికలలో ఆమెతో పొత్తు పెట్టుకుంటే తమిళనాడులో గెలుపు సునాయాసం అన్న నమ్మకం కూడా అందుకు కారణం. ప్రభుత్వం ఏర్పాటు కోసం కాంగ్రెస్ పార్టీ ప్రయత్నించటం వెనుక మరో రెండు కారణాలున్నాయి. ఒకసారి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి విశ్వాస పరీక్షలో నెగ్గాక అదనుచూసి మధ్యంతర ఎన్నికలకు సిద్ధపడితే, అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మాత్రమే సుస్థిర ప్రభుత్వాన్ని అందించగలదనే విశ్వాసాన్ని ప్రజలలో కలిగించవచ్చు అంతకుమించి, ఒకసారి సోనియా గాంధీని ప్రధానమంత్రిగా ప్రజలు చూశాక, ఇటలీ దేశస్తురాలుగా పుట్టిన ఓ తెల్లజాతి వనిత కొన్నివేల కిలోమీటర్ల దూరంలో 100 కోట్ల జనాభా ఉన్న భారతదేశానికి ప్రధానమంత్రి కావటం సబబా అన్న ప్రశ్న కొత్తగా తలెత్తే ప్రమాదం ఉండదు. ఇంత పెద్ద దేశాన్ని రాచరికంలో లాగా వంశపారంపర్యంగా పరిపాలించటం నిజంగా ప్రజాస్వామ్యబద్ధమా అనే ప్రశ్న తలెత్తకూడదని సోనియా గాంధీ ఆకాంక్ష – అందుకే కొద్ది వారాల పాటయినా ఎన్నికల ముందు ప్రధానమంత్రి పదవి అందుకోవాలని ఆమె కోరుకున్నారు.

స్థిరత్వం విషయానికొస్తే, ఎన్ని విభేదాలున్నా 12వ లోక్‌సభలో బి.జె.పి సారధ్యంలోని ప్రభుత్వమే ఉన్నంతలో నిర్దిష్ట విధానాలని అమలు చేసే అవకాశం ఉంది. బి.జె.పి. కూటమిలో అన్నాడి.ఎం.కె. తోస హా అత్యధిక పార్టీలు ఎన్నికల ముందే ఆ పార్టీతో పొత్తుపెట్టుకున్నాయి. వాజ్‌పేయి నాయకత్వం విషయంలో ఎవరికీ ఎలాంటి విభేదాలులేవు ఆయననే కాబోయే ప్రధానికిగా నిర్ద్వంద్వంగా ప్రకటించి ఎన్నికలలో ఆ కూటమి ఓట్లను కోరింది. ఆర్థిక విధానాలలోను ఏ

పొరపొచ్చాలు లేవు. ఉన్న తగాదాలన్నీ పదవుల పంపకాలను గురించి, అధికారంలో వాటాలను గురించి, కొన్ని సందర్భాలలో ఆ అధికారాన్ని దుర్వినియోగపరచి ప్రత్యర్థులను ఇబ్బంది పెట్టటాన్ని గురించి మాత్రమే! అదే కాంగ్రెస్ నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పాటయితే సయోధ్య అసాధ్యమయ్యేది. కాంగ్రెస్,దానికి మద్దతిచ్చే పక్షాలు – అన్నీ గత లోక్‌సభ ఎన్నికలలో ఒక దానితో మరొకటి పోటీకి తలపడ్డాయి. రాజకీయంగా వివిధ రాష్ట్రాలలో కాంగ్రెస్‌కు, ఇతర పక్షాలకు మధ్య తీవ్రమైన పోటీ ఉంది. ఢిల్లీలో సయోధ్య కావాలనుకుంటున్న మార్క్సిస్టు పార్టీకి బెంగాల్‌లో, కేరళలో కాంగ్రెస్ అంటే చుక్కెదురు. అలాగే ములాయంతో ఉత్తరప్రదేశ్‌లో తంటాలు తప్పవు. బీహార్‌లో తమిళనాడులో ఇప్పటిలో ఒంటరి పోరాటం అసాధ్యం అనే నిర్ణయానికి కాంగ్రెస్ వచ్చింది. కాబట్టి లాలూయాదవ్‌తో, జయలలితతో మాత్రమే ఆయా రాష్ట్రాలలో సయోధ్య సాధ్యం. అంతకుమించి, ఒక్క బి.జె.పి. వ్యతిరేకతను మినహాయిస్తే దాదాపు ఏ అంశంలోను కాంగ్రెస్ విధానాలకు, ఇతర పార్టీల విధానాలకు పొంతనలేదు. పి.వి. నరసింహారావు, మన్‌మోహన్‌సింగ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఉదార ఆర్థిక విధానాలకు శ్రీకారం చుట్టింది. విదేశీ వాణిజ్యంలో స్వేచ్ఛా విపణికి కాంగ్రెస్ ప్రధాన్యాన్నిచ్చి ప్రపంచ వాణిజ్య సంస్థ ఒప్పందానికి అన్ని దేశాలతోపాటు అంగీకారం తెలిపింది. ఒకప్పుడు లైసెన్స్ – పర్మిట్ రాజ్యవ్యవస్థను పెంచి పోషించిన కాంగ్రెస్, దాన్ని కొంత మేరకు సంస్కరించటానికి నడుంకట్టి నూతన ఆర్థికవిధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ విధానాలన్నంటికివామపక్షాలు పూర్తి వ్యతిరేకం. ఆనాటి నుంచి ఈనాటి వరకూ ఈ పక్షాలు కాంగ్రెస్ ఆర్థిక విధానాలను విమర్శిస్తూనే ఉన్నాయి. అలాంటప్పుడు 139 లోక్‌సభ స్థానాలున్న కాంగ్రెస్ పార్టీ, మరో 133 మంది బయటి నుంచి మద్దతిస్తే, తన విధానాలను ఏ రకంగా అమలు చేయగలుగుతుంది? కాబట్టి – కాంగ్రెస్, అదివరకటి తృతీయ ఫ్రంట్‌లో భాగస్వామ్య పక్షాలు సహజీవనం చేయటం, సుస్థిర ప్రభుత్వాన్నివటం, నిర్దిష్ట విధానాలు రూపొందించటం కల్ల ఉమ్మడి శత్రువుని ఎదుర్కోవటంలో, పదవీచ్యుతుణ్ణి చేయటంలో ప్రదర్శించే ఉత్సాహం, సహజంగానే పదవుల పందారంలో, విధానాల రూపకల్పనలో చల్లారిపోతుంది. అందులో వింత లేదు.

ఇటీవలి రాజకీయ సంక్షోభం విషయంలో అన్ని పార్టీల వారు ఒక్క అంశంపైన మాత్రం ఏకాభిప్రాయాన్ని వెలిబుచ్చుతున్నారు. కేంద్రంలో రాజకీయ అస్థిరత్వం దేశ ప్రయోజనాలకు హానికరం అని ఈ వాదనలో వాస్తవం ఏ మేరకు ఉందో పరిశీలిద్దాం. మంచి పరిపాలన కావాలంటే ఆయారాంలు, గయారాంలు

ఉండరాదని, సుస్థిర ప్రభుత్వాలు అవసరమని అందరికీ తెలుసు. అరాచకవాదులు తప్ప మరెవ్వరూ దాన్ని కాదనలేరు. ప్రభుత్వాలు కలకాలం మన గలిగి, సుస్థిరంగా ఉన్నంత మాత్రన మంచి పరిపాలన వస్తుందా అనేది మన ముందున్న ప్రశ్న. 1946 నించి దేశ చరిత్రనే చూస్తే, 53 సంవత్సరాల పాలనలో 46 సంవత్సరాల పాటు ఒకే పార్టీ.. కాంగ్రెస్.. ఏకచ్ఛత్రాధిపత్యంగా రాజ్యం చేసింది. కేంద్రంలోనే కాకుండా దాదాపు అన్ని రాష్ట్రాలలోను అత్యధిక కాలం కాంగ్రెస్ పాలించింది. కేంద్రంలో ఆ 46 సంవత్సరాల కాలంలో అయిదుగురు మాత్రమే ప్రధానమంత్రులుగా ఉన్నారు. అందులో ముగ్గురు ఒకే కుటుంబానికి చెందిన వారు. 40 ఏళ్ళపాటు యథేచ్ఛగా పెద్ద మెజారిటితో (1969–71 కాలంలో తప్ప) రాజ్యం చేశారు. ప్రపంచ ప్రజాస్వామ్య దేశాలలో ఎక్కడా కానరానంత స్థిరత్వం మనదేశంలో స్వతంత్రానంతరం ఉంది. అంతటి సుస్థిర ప్రభుత్వాలు, ఏకపార్టీ పాలన, ఏక కుటుంబ పాలన కొనసాగినా దేశంలో సామాన్య ప్రజలకేం ఒరిగింది. నేటికీ దేశంలో 60 శాతం ప్రజలకు అక్షరజ్ఞానం లేదు. 30 శాతం దుర్భర దారిద్ర్యంలో మగ్గుతున్నారు. 1950 లో ప్రపంచంలో 2 శాతం ఉత్పత్తిని భారతదేశంలో సాధిస్తుండగా, అది ఇప్పుడు ఒక్క శాతానికి పడిపోయింది. ప్రపంచ వాణిజ్యంలో ఆనాడు భారత్ వాటా 2 శాతం ఉండగా, అది ప్రస్తుతం 0.5 శాతానికి పడిపోయింది. దేశంలో వివిధ ప్రాంతాలలో – కాశ్మీర్ పంజాబ్, ఈశాన్య భారతం – దశాబ్దాల పర్యంతం తీవ్రసంక్షోభం నెలకొని దేశాన్ని అతలాకుతలం చేసింది. మత కలహాలు, కుల పోరాటాలు జాతిని నిర్వీర్యం చేశాయి. దుష్పరిపాలన, అవినీతి, రోజువారీ లంచగొండితనం స్వైరవిహారం చేస్తున్నాయి. సుస్థిరపాలన వల్ల మనం సాధించేదేమిటి – శ్మశాన స్తబ్దత, మిగతా ప్రపంచంతో పోలిస్తే నిరంతర తిరోగమనం తప్ప? జన జీవనాన్ని సుగమం చేయలేని ప్రభుత్వాలు ఎంతకాలం ఉంటే ఎవరికి కావాలి? ప్రపంచంతో పోటీకి దేశాన్ని తయారు చేయలేని రాజ్యవ్యవస్థ ఎంత సుస్థిరంగా ఉంటే మాత్రం ఏం ప్రయోజనం? దుష్పరిపాలనను పెంచి పోషించే నాయకులు ఎంతకాలం అవిఘ్నంగా పరిపాలిస్తే దేశానికి అంత ప్రమాదం. ఉగాండా నియంత, నరహంతుకుడు, నరరూపరాక్షసుడు ఈదీ అమీన్ కూడా 14 సంవత్సరాల పాటు నిరాటంకంగా అధికారం వెలగబెట్టాడు! మన దేశ ప్రజలు సుస్థిరత పేరుతో రాక్షస రాజ్యాన్ని, దుష్పరిపాలనను, నిరంకుశత్వాన్ని, అవినీతిని కోరుకోవటంలేదు. ప్రజలకు కావలసింది మౌలికమైన ప్రజాస్వామ్య సంస్కరణల్ని

సాధించి, దుష్పరిపాలనను అంతమొందించే ప్రభుత్వాలు. నిజాయితీతో మనుగడ సాగించి జనజీవనాన్ని స్పృశించి మన బిడ్డల భవిష్యత్తుని బాగు చేయగల ప్రభుత్వాలు. దేశంలో స్వచ్ఛను, శాంతిని, సంపదను పెంచి ప్రజల జీవితాలను సుఖమయం చేయగల ప్రభుత్వాలు.

## స్థిరత్వమా? శ్మశాన స్తబ్దతా?

రేపటి ఎన్నికలలో జరిగే పోరాటం ఒక్క సుస్థిరత్వం కోసమే. అయితేఅందులో ఎవరు గెలిచినా దేశ ప్రజలు ఓడిపోయినట్లే ప్రజలు నిజంగా విజయం సాధించాలంటే అందుకు కావలసింది మంచి పరిపాలన, మన పాలన, జన జీవనాన్ని ప్రభావితం చేసే ప్రజాస్వామ్యం పాలన – అందుకు కావలసిన సమూల సంస్కరణలు. అవి సాధించుకునేదాకా ప్రభుత్వాలు సుస్థిరంగా ఉన్నా, అస్థిరంగా ఉన్నా తేడా లేదు. ఆ మాటకొస్తే కాస్తో కూస్తో అస్థిరత్వం ఉండటం మార్పులకు అవసరం. ప్రజలకు విషయ పరిజ్ఞానాన్ని, అందించటానికి ఎన్నికలను మించిన చిట్కా మరొకటి లేదు. మధ్య తరగతి పౌరులు రాజకీయ అస్థిరత్వం వచ్చేదాకా దేశ దరిద్రావస్థను గమనించలేరు. అనిశ్చిత పరిస్థితి మధ్య తరగతి వారిని, మేధావులను మేల్కొల్పగలిగితే, అందుకు మనం చెల్లించే మూల్యం స్వల్పమనే చెప్పుకోవచ్చు. ప్రభుత్వాలు స్థిరంగా ఉండి, అవినీతి దుష్పరిపాలన నిర్విఘ్నంగా కొనసాగి, ఎన్నికలలో తాము పెట్టిన పెట్టుబడికి పదిరెట్లు లాభాలు వస్తున్నంత కాలం రాజకీయవాదులు మంచి మార్పుల కోసం ప్రయత్నించరు. మళ్ళీ మళ్ళీ ఎన్నికలు జరిగి, ఎన్నికలలో ఎంత ఖర్చు పెట్టినా ఫలం దక్కదనే భయం పెరిగినప్పుడూ ఈ దోపిడీని ఆపడానికి పార్టీలు, రాజకీయ నాయకులు స్థిపడతారు. అందుకే మళ్ళీ మళ్ళీ ఎన్నికలంటే ప్రజలు బెదరనక్కరలేదు. అందుకయ్యే రూ. 1000 కోట్లు. ఈ దేశంలో ప్రభుత్వాలు ఒక్కరోజు పెట్టే ఖర్చుకన్నా తక్కువే. ఈ ప్రభుత్వ ఖర్చువల్ల మనమేం బాముకుంటున్నాంగనుక? ఏం సౌఖ్యాలు అనుభవిస్తున్నాం గనుక? కాబట్టి ఈ కొద్దిపాటి ఖర్చుకు అస్థిరత్వం వల్ల తాత్కాలికంగా కలిగే మానసిక క్లేశానికి వెరవనక్కరలేదు. శ్మశాన స్తబ్దతకన్నా, ప్రజలని ఉత్తేజపరచి జాతికి జవజీవాలు అందించి, దుష్పరిపాలనను అంతమొందించే రాజ్యవ్యవస్థ సమూల ప్రక్షాళన మిన్న. అది సాధించటానికి కొంతకాలం అస్థిరత్వం మళ్ళీ మళ్ళీ ఎన్నికలు తప్పవు.

* * *

# ఎన్నికల వ్యవస్థ ప్రక్షాళనతో నిజమైన ప్రజాస్వామ్యం

*జనవరి 22, 2000*

ఎన్నికల సంఘం ఏర్పడి గతవారంతో 50 సంవత్సరాలు పూర్తయ్యాయి. రాజ్యాంగ నిర్మాతలు ముందుచూపుతో నిష్పాక్షిక ఎన్నికల నిర్వహణ కోసం సమర్థ యంత్రాంగం అవసరమని భావించి, స్వతంత్ర ప్రతిపత్తిగల రాజ్యాంగ సంస్థగా ఎన్నికల సంఘం నియామకానికి ఏర్పాటు చేశారు. ఇది మన ప్రజాస్వామ్యానికి, ఎన్నికల నిర్వహణకు ఆలంబనగా నిలిచింది. ప్రజాభిప్రాయం ప్రకారం ప్రభుత్వాలు, చట్టసభలు ఏర్పాటు కావడం ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన ఘట్టం. అందుకు అవసరమయ్యే ప్రక్రియ వయోజన ఓటుహక్కు ద్వారా జరిగే ఎన్నికలు. ఆ ఎన్నికల నిర్వహణకు సరైన నిబంధనలు, నిష్పాక్షకంగా అమలు చేయడానికి సరైన యంత్రాంగం లేకపోతే అధికారంలో ఎవరుంటే వాళ్లే గెలిచినట్లు ప్రకటించుకోవచ్చు. పేరుకు ఎన్నికల సంఘం ఉన్నా దానికి స్వయం ప్రతిపత్తి లేకపోతే ఆ ఎన్నికలు బూటకంగానే జరుగుతాయి.

## తుమ్మితే ఊడే ముక్కు

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత స్వతంత్ర దేశాలుగా ఆవిర్భవించిన చాలా సమాజాలలో ఎన్నికల నిర్వహణలో లొసుగులుండటం వల్ల, ఎన్నికల యంత్రాంగం రాజకీయ నాయకుల చేతుల్లో తొత్తుగా మారటం వల్ల అనతికాలంలోనే ఆ దేశాలు నియంతృత్వానికి బానిసలయ్యాయి. అందుకే లాంఛనంగా ఎన్నికలు జరిగినా ఆ దేశాలలో ప్రజాస్వామ్యం తుమ్మితే ఊడే ముక్కులాగా తయారైంది. ఉదాహరణకు జాంబియా, అర్జెంటీనాల్లో తొలుత ఎన్నికలున్నా, కాలక్రమేణా నియంతృత్వాలు ఆవిర్భవించాయి. శ్వేత జాతీయుల ఆధిపత్యంలోని దక్షిణాఫ్రికా, రొడీషియాలలో స్వేచ్ఛ, ఓటుహక్కు కేవలం తెల్లవాళ్లకు మాత్రమే పరిమితమయ్యాయి. మెక్సికోలాంటి దేశాలలో పేరుకు ఎన్నికలు జరిగినా, వాస్తవానికి దశాబ్దాల పర్యంతం అధికార పార్టీ భారీ రిగ్గింగుకు పాల్పడుతుంటే ఎదిరించే వారేలేరు. అందుకే మెక్సికోలో ఇటీవలి వరకు 70 సంవత్సరాల పాటు ఒకే పార్టీ ఎదురులేకుండా అధికారంలో మనగలిగింది. పాకిస్తాన్‌లో సగం కాలం సైనిక నియంతృత్వం రాజ్యం చేసింది.

పేరుకు ఎన్నికలు జరిగినప్పుడు కూడా, చాలా సందర్భాలలో అవి ప్రహసనంగా మారాయి. ఉదాహరణకు 1977లో ఎమర్జెన్సీ నేపథ్యంలో జరిగిన ఆరో లోక్‌సభ ఎన్నికలలో మన దేశంలో అధికార పార్టీ అయిన కాంగ్రెస్ చిత్తుగా ఓడిపోయింది. చివరకి అపారమైన అధికారం ఉన్న ఇందిరాగాంధీ, ఎమర్జెన్సీ కాలంలో చక్రం తిప్పిన ఆమె కుమారుడు సంజయ్‌గాంధీ కూడా ఆ ఎన్నికలలో ఓడిపోయారు. ఎన్నికల సంఘానికి స్వయం ప్రతిపత్తి ఉండటంతో ఇది సాధ్యమైంది. అదే సమయంలో పాకిస్థాన్‌లో భుట్టో ప్రధానిగా ఉండగా ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికలలో అధికార పార్టీ భారీ రిగ్గింగుకు పాల్పడింది. ప్రభుత్వం బ్యాలెట్ పత్రాల ముద్రణలోనూ, పోలింగులోనూ, ఓట్ల లెక్కింపులోనూ పెద్ద ఎత్తున అవకతవకలకు పాల్పడింది. భుట్టో ఆధ్వర్యంలోని పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ ఇలా అక్రమంగా గెలిచినా ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమై దేశవ్యాప్త ఉద్యమానికి దారితీసింది. అది భుట్టో పదవీచ్యుతికి, సైనిక తిరుగుబాటుకు బాటలువేసి జనరల్ జియా ఉల్ హక్ నియంతగా అధికారంలోకి వచ్చారు. వెంటనే భుట్టో మీద హత్యా నేరం ఆరోపించి, చివరకు ఆయన్ను ఉరి తీశారు! అలాగే కొన్నేళ్ల క్రితం బంగ్లాదేశ్ ఎన్నికలలో ప్రభుత్వ ప్రమేయంతో భారీ రిగ్గింగు జరిగి ప్రజాస్వామ్యం ప్రహసనంగా మారింది. దాంతో అన్ని ప్రధాన రాజకీయ పక్షాలు ఆ ఎన్నికల ఫలితాలను తిరస్కరించి ఆందోళనకు దిగాయి. చివరికి ఎన్నికల ఫలితాలను రద్దుచేసి మళ్లీ ఎన్నికలు జరిపించాల్సి వచ్చింది. అంతటితో ఆగక, ఎన్నికలలో అధికార దుర్వినియోగాన్ని శాశ్వతంగా నివారించడం కోసం రాజ్యాంగాన్నే మార్చారు. ప్రతి ఎన్నికలకు మూడు నెలల ముందు ప్రభుత్వం రాజీనామా చేయటం, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పాటై దేశవ్యాప్తంగా ఎన్నికలు నిర్వహించడం ఆ రాజ్యాంగ సవరణలో ప్రధానమైన అంశాలు. అలాగే టర్కీ, పిలిప్పీన్స్‌లలో ఎన్నికల్లో అవకతవకల వల్ల, ఎన్నికల ఫలితాలను గౌరవించకపోవడం వల్ల ప్రజాస్వామ్యం ఆటుపోట్లకు గురయింది. అల్జీరియా, బర్మాలలో గెలిచిన పార్టీలకు అధికారం కట్టబెట్టకుండా నియంతృత్వాన్ని కొనసాగించారు. అల్జీరియాలో ఎట్టకేలకు మళ్లీ ఎన్నికలు జరిగి కొత్త ప్రభుత్వం ఏర్పాటు కాగా, బర్మాలో అత్యధిక మెజారిటీతో గెలిచిన ఆంగ్‌సాన్ సూకీని, ఆమె అనుయాయులను నిర్బంధంలో ఉంచారు. ఇప్పటికీ ఆమె అసమాన సాహసంతో ప్రజాస్వామ్య స్థాపన కోసం పోరాటం కొనసాగిస్తున్నారు. కాంబోడియాలో ప్రతి ఎన్నికల్లోనూ పాలక పక్షం భారీ ఎత్తున రిగ్గింగుకు పాల్పడుతోందన్న తీవ్ర

ఆరోపణలున్నాయి. ప్రతిపక్షాలవారిని భయపెట్టడం, అధికారాన్ని దుర్వినియోగపరచడం హున్‌సేన్ ప్రభుత్వానికి ఆనవాయితీ అయింది. ఒకప్పటి సోవియట్ యూనియన్, తూర్పు ఐరోపాలోని కమ్యూనిస్టు దేశాల మాట చెప్పనక్కరలేదు. దశాబ్దం క్రితం నియంతృత్వాలను కూలదోసి ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పే వరకూ ఆ దేశాలలో ఐదేళ్ళకోసారి ఫార్సుగా ఎన్నికలు జరగడం, అధికార కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థి మాత్రమే ఆ ఎన్నికలలో పాల్గొనడం, ఆ అభ్యర్థికి 99.9 శాతం ఓట్లు పడటం – ఇదీ తంతు. చైనాలో ఇప్పటికీ అదే పరిస్థితి కొనసాగుతోంది.

ఈ నేపథ్యంలో భారత్‌లో గత 50 సంవత్సరాలుగా ఎన్నికల సంఘం సాధించిన విజయాలు గర్వించదగ్గవి. క్రమం తప్పకుండా ఎన్నికలు జరపడం, ఆ ఎన్నికలు మొత్తం మీద నిష్పాక్షికంగా జరగడం, అన్ని పార్టీలు, అన్ని వర్గాల ప్రజలు ఎన్నికల ఫలితాలను ఆమోదించడం, శాంతియుతంగా అధికార మార్పిడి మన ప్రజాస్వామ్య వ్యవస్థ బలానికి సంకేతాలు. అందులో ప్రధానపాత్ర వహిస్తోంది నిష్పాక్షిక రాజ్యాంగ సంస్థగా బలపడిన ఎన్నికల సంఘం. ప్రపంచంలో స్వేచ్ఛకు, ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలుస్తున్న అమెరికాలో కూడా జాతీయ స్థాయిలో బలమైన ఎన్నికల సంఘం లేనిలోటు ఇటీవలి అధ్యక్ష ఎన్నికలలో కొట్టొచ్చినట్లు కనిపించింది. దేశవ్యాప్తంగా సమాన ప్రమాణాలతో ఎన్నిక నిర్వహించే యంత్రాంగం లేకపోవడంతో అమెరికాలో ప్రతి రాష్ట్రం, ప్రతి కౌంటీ ఎక్కడికక్కడ సొంత బాణీలో ఎన్నికలు జరుపుకొంటున్నాయి. దాంతో ఓటింగు యంత్రాలలో, బ్యాలెట్ పత్రాల ముద్రణలో ఓట్ల లెక్కింపులో గంగదరగోళం చోటుచుసుకుంది. ఈసారి కేవలం కొన్ని వందల ఓట్లతో సాక్షాత్తు అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నిక ఫలితాలు తారుమారయ్యే పరిస్థితి ఉత్పన్నం కావడంతో అయిదు వారాలపాటు ఎంతో ఉత్కంఠ, ఆందోళన చోటుచేసుకున్నాయి. చివరకు సుప్రీం కోర్టు ఇచ్చిన వివాదాస్పదమైన తీర్పుతో బుష్ జూనియర్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ప్రకటించారు. దేశవ్యాప్తంగా ఎన్నికల నిర్వహణకు బలమైన ఓ రాజ్యాంగ సంస్థ ఉండటం ఎంత అవసరమో ఇటీవల ఆమెరికా అనుభవం రుజువుచేస్తోంది. భారత్‌లో ఎన్నికల సంఘం మొత్తం మీద నిష్పాక్షికంగా, స్వతంత్రంగా వ్యవహరిస్తూ వస్తోంది. పోలింగుకు ముందు జరిగే బ్యాలెట్ పత్రాల ముద్రణలోగాని, వాటి పంపిణీలోగాని, పోలింగు తర్వాత బ్యాలెట్లను భద్రపరచడంతోలగాని, ఓట్ల లెక్కింపుగాని మొత్తం మీద సమర్థంగా, నిజాయితీగా జరుగుతున్నాయి. ఎన్నికల

సంఘం ప్రభుత్వాల ఒత్తిడులకు తలొగ్గకుండా నిర్భయంగా తన బాధ్యతలను నిర్వహిస్తోంది. హేమవతీ నందన్ బహుగుణ పోటీ చేసిన లోక్‌సభ ఎన్నికలో ప్రభుత్వ పక్షం భారీ ఎత్తున రిగ్గింగుకు పాల్పడ్డప్పుడు ఆనాటి ప్రధాన ఎన్నికల కమిషనర్ నిర్భయంగా మొత్తం ఎన్నికను రద్దుచేసి మళ్లీ పోలింగుకు ఆదేశం ఇవ్వగలిగారు. టిఎన్. శేషన్ ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా నియమితులయ్యాక ఎన్నికల సంఘానికి మరింత గుర్తింపు, ప్రజల మద్దతు లభించాయి. ఎన్నికల సంఘం ఒక ప్రభుత్వ శాఖ కాదని, రాజ్యాంగ సంస్థ అని, స్వతంత్రంగా, నిర్భయంగా వ్యవహరించే అవకాశం దానికి ఉందని శేషన్ రుజువు చేసి ప్రజల ప్రశంసలు పొందారు. ఆయన కాలంలోనే పోలింగులో అక్రమాలు అరికట్టడానికి, ఎన్నికల ప్రచారంలో ప్రవర్తన నియమావళిని తు.చ. తప్పకుండా అనుసరించడానికి, ఓటర్ల గుర్తింపుకార్డులను అమలు చేయడానికి, పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యం అమలుకు గట్టి ప్రయత్నాలు జరిగాయి. శేషన్‌ను ఎలాగోలా అదుపు చేయాలని ఆనాటి అధికారపక్షం మరో ఇద్దరు ఎన్నికల కమిషనర్లను నియమించింది. అలా నియమితులైన ఈనాటి ప్రధాన ఎన్నికల కమిషనర్ యం.యస్. గిల్, కొంతకాలం క్రితం పదవీ విరమణ చేసిన జివిజి కృష్ణమూర్తి – ఇద్దరూ రాజ్యాంగబద్ధంగా, నిష్పాక్షికంగా వ్యవహరించి ఎన్నికల సంఘం ప్రతిష్ఠను నిలబెట్టారు. శేషన్ పదవీ విరమణ తరువాత గిల్ ఆధ్వర్యంలో కూడా ఎన్నికల నిర్వహణ మెరుగు పరచడానికి తమ పరిధి మేరకు ప్రయత్నం చేస్తున్నారు. కొంతకాలం తాత్సారం చేసినా ఓటర్ల గుర్తింపుకార్డులను విధిగా అమలు చేసే ప్రయత్నాన్ని ఎన్నికల సంఘం కొనసాగిస్తోంది. కొద్దినెలల క్రితం జరిగిన హర్యానా అసెంబ్లీ ఎన్నికలలో కమిషన్ మొదటిసారిగా ఓటరు గుర్తింపు కార్డులు విధిగా ఉండాలనే నిబంధనను విజయవంతంగా అమలు చేసింది. ఇక మీదట ఏ ఎన్నికలలోనూ ఏదో ఒక గుర్తింపు కార్డు లేనిదే ఓటు వేయనీయబోమని ఎన్నికల సంఘం స్పష్టం చేస్తున్నది. ఇది ఎన్నికలను ప్రక్షాళన చేసే అతి ప్రధానమైన చర్య. అలాగే రాజకీయంలో నేరచరితుల ప్రవేశాన్ని అరికట్టడానికి ఎన్నికల సంఘం కొన్ని ప్రతిపాదనలు చేసింది. తన అధికారాల మేరకు శిక్షపడ్డ నేరస్తుల పోటీని నిషేధిస్తూ ఉత్తర్వులు జారీచేసి చట్టం అమలును పటిష్ఠపరిచింది. పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యం కావాలనే వాదనను బలంగా వినిపిస్తోంది. మహిళలకు చట్టసభలలో ప్రాతినిధ్యానికి ఆచరణ సాధ్యం, ప్రజాస్వామ్య బద్ధం అయిన నమూనా చట్టాన్ని లోక్‌సత్తా ఆధ్వర్యంలో రూపొందించగా – దానికి ఎన్నికల సంఘం మద్దతు ప్రకటించి, అలాంటి చట్టం తీసుకురావాలని ఒత్తిడి తెస్తోంది. ఇవన్నీ మంచి పరిణామాలు.

## కఠోరమైన వాస్తవాలు

అంత మాత్రాన ఎన్నికలు సజావుగా జరుగుతున్నాయనుకోవడం ఆత్మవంచన. లోక్‌సత్తా దేశంలో మొదటిసారిగా నిర్వహించిన ఓటర్ల జాబితాల సర్వేలలో దారుణమైన నిజాలు బయటపడుతున్నాయి. ఓటర్ల నమోదులో జరుగుతున్న అవకతకవల వల్ల పట్టణ ప్రాంతాలలో 40 శాతం పైగా ఓటర్ల జాబితాలు తప్పుల తడకలని తేలింది. గ్రామ ప్రాంతాలలో ఈ లోపాలు 15 శాతం వరకు ఉన్నాయి. అలాగే ఎన్నికలు జరిగాక, ఓట్లు వేసినట్లు నమోదైన వారిని ఆరా తీస్తే నగరాలలో దాదాపు 22 శాతం దొంగ ఓట్లని రుజువవుతోంది. ఇవన్నీ ఓటర్ల నమోదులోని లోపాలవల్ల, ఓటు వేయడానికి గుర్తింపు కార్డులు అవసరం లేకపోవడం వల్ల జరుగుతున్నాయి. ఇటీవల అమెరికా ఎన్నికల్లో పోలైన మొత్తం ఓట్లు పదికోట్లలో కేవలం 500 ఓట్లు తేడా వల్ల ఫలితాలు తారుమారయ్యాయి. అంటే రెండు లక్షల ఓట్లలో ఒకే ఓటు తేడా! మరి మనదేశంలో దాదాపు 25 శాతం ఓటర్ల జాబితాలలో తప్పులుండి, 22 శాతం వరకు దొంగ ఓట్లు నమోదవుతుంటే ఇక ఈ ఎన్నికలు ఎంత లోపభూయిష్టంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. ఈ అక్రమాలను అరికట్టాలంటే వెంటనే ఓటర్ల నమోదు పద్ధతిని మార్చి అందరికీ అందుబాటులో అనువుగా ఉండేలా ప్రతి పోస్టాఫీసులోనూ ఓటర్ల జాబితాను పరిశీలించే అవకాశాలివ్వాలి. వాటిలోనే ఓటర్ల నమోదు, జాబితాలో మార్పులు, చేర్పులు, తొలగింపులు జరిగేలా ఏర్పాట్లు చేయాలి. ప్రస్తుతం చదువు, పరిజ్ఞానం పలుకుబడి ఉన్న వాళ్లకు కూడా ఓటర్ల జాబితాను పరిశీలించే అవకాశంగానీ, పేర్లు నమోదు చేసుకునే అవకాశంగానీ లేవు. ఈ మార్పులను కేవలం నిబంధనల సవరణ ద్వారా ఎన్నికల సంఘం వెంటనే చేపట్టవచ్చు. ఇందుకు ఏ చట్టం అక్కరలేదు. చట్టంలోనూ చాలా మార్పులు తేవాలి. ఎన్నికల సంఘం నియామకాలు నిష్పాక్షికంగా జరిగే ఏర్పాటు ఉండాలి. ఎన్నికల సంఘం రాజ్యాంగ సంస్థ అయినా చట్టపరిధిలోనే పనిచేయగలదు. నేర చరితుల ప్రవేశాన్ని నిషేధించే అవకాశం ఎన్నికల సంఘానికి లేదు. అందుకు పకడ్బందీగా చట్టాన్ని చేయాలి. అంతకుమించి ఎన్నికలలో అక్రమంగా పెట్టే అపారమైన ఖర్చును అదుపు చేయాలంటే అందుకు సమూలమైన సంస్కరణలు చట్టరూపంలో రావాలి. రాజకీయ పార్టీలు సొంత ఆస్తులుగా చెలామణీ అవుతున్నాయి. పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యం లేకుండా రాజకీయంలో నిజాయితీ, ప్రభుత్వంలో మంచి పాలన సాధ్యం కావు. అందుకు కూడా పటిష్టమైన చట్టం కావాలి. ప్రస్తుతం అమలులో ఉన్న ఎన్నిక

పద్ధతిలో ఎన్నో లోపాలున్నాయి. అన్ని వర్గాల ప్రజలకు సరైన ప్రాతినిధ్యం కావాలంటే దామాషా పద్ధతిన ఓ పార్టీకి వచ్చిన ఓట్లను బట్టి ఆ పార్టీ తరఫున ప్రతినిధులు ఎన్నికయ్యే పద్ధతి అవసరం. అలాగే ఎన్నికైన వాళ్లు అర్ధరాత్రి కుట్రలతో ప్రభుత్వాలను మార్చటం, ప్రతిరోజూ పైరవీలకు పాల్పడి పాలనను భ్రష్టు పట్టించడం ఆగాలంటే స్థానిక, రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలలో ప్రభుత్వ నేతలను ప్రత్యక్షంగా ఎన్నుకునే వీలు కల్పించి, చట్టసభను ప్రభుత్వం నుంచి వేరు చేయాలి. ఎన్నికల తీరులో ఈ మౌలికమైన మార్పులు కావాలంటే రాజ్యాంగంలో సవరణలు అవసరం. ఈ మార్పులన్నీ తెచ్చేదాకా ఎన్నికల ప్రక్షాళన పూర్తికాదు. అంతవరకు భారత ప్రజాస్వామ్యం నేతి బీరకాయలో నెయ్యిలాగా ఉంటుంది.

* * *

# రాజకీయ ప్రక్షాళన కోరి మరో మహోద్యమం!

*ఏప్రిల్ 16, 2005*

రెండో ప్రపంచ యుద్ధం తరవాత విముక్తి పొంది, దాదాపు ఆరు దశాబ్దాలుగా అవిచ్ఛిన్నంగా పటుతర ప్రజాస్వామ్యంలో పరిఢవిల్లుతున్న అతికొద్ది దేశాల్లో భారత్ ఒకటి. అత్యవసర పరిస్థితి కారణంగా స్వల్ప అవరోధం ఏర్పడినప్పటికీ మన పయనం ఆగలేదు. మన రాజకీయ ప్రక్రియలలో ఈ సవాలుకు ప్రజాస్వామిక రీతిలో సమాధానమిచ్చింది. అవకాశం లభించగానే తమ సార్వభౌమాధికారాన్ని, స్వేచ్ఛాకాముకతను ప్రజలు తిరుగులేని విధంగా చాటి చెప్పారు. పోటాపోటీగా జరిగే ఎన్నికలు, రాజకీయ స్వాతంత్ర్యం, శాంతియుత, నాగరిక పద్ధతిలో అధికార బదిలీ, ఎన్నికైన ప్రభుత్వాలకు సక్రమంగా అధికారం సంక్రమించడం- క్రియాశీల ప్రజాస్వామ్యంలో అవిభాజ్యమైన అంశాలివి. ఈ అన్ని విషయాల్లో భారత్‌ది గౌరవప్రదమైన, గర్వకారణమైన స్థాయే. సుస్థిరత, చెప్పుకోదగ్గ ఆర్థికవృద్ధి సాధించడంలోను, భిన్నత్వంలో ఏకత్వ భావనను ప్రోదిచేయడంలోను మన రాజకీయ ప్రక్రియ తోడ్పడింది. అయితే, మన రాజకీయాల్లో కొన్ని చెడుగులు కూడా ఉన్నాయి. అవి నీతి, బంధుప్రీతి, ఆశ్రితపక్షపాతం, రాజకీయాలు నేరమయం కావడం, నేతల అధికార దుర్వినియోగం, చట్టవిరుద్ధంగా వ్యవహరించడం, సంకుచిత ధోరణి-ఇవన్నీ మన రాజకీయాల్లో అంతర్భాగాలైపోయాయి. శక్తిసామర్థ్యాలు ఎంతో ఉన్నా, ఒక జాతిగా మనం ఆ మేరకు ఎదగలేకపోయామని మనకందరికీ తెలుసు. ఈ వైఫల్యాలకు మన రాజకీయ నాయకులే కారణమంటూ నిందారోపణలు మోపడానికి మనమెప్పుడూ సిద్ధంగానే ఉంటాం. స్థాయి మరచి నోటికొచ్చినట్లు మాట్లాడటం వల్ల మన కోపావేశాలు తాత్కాలికంగా చల్లారుతాయేమోకానీ, అసలు సమస్యలు పరిష్కారం కావు.

## వ్యవస్థలోనే లోపం

రాజకీయవాదులు మిగతా సమాజానికి భిన్నమైనవారు కాదు. మన పాలన వ్యవస్థలోని సివిల్ సర్వెంట్లు, జడ్జీలు తదితరులు ఇంతకన్నా గొప్పగా వ్యవహరించిందేమీలేదు. సంక్లిష్టమైన వాతావరణంలో సమగ్రత కోసం అనేక ఒత్తిళ్లకు

తలొగ్గవలసి ఉంటుంది. కనుక రాజకీయవాదులను తీవ్రస్థాయిలో విమర్శించవలసిన పనిలేదని వాదించే అవకాశం ఉంది. ఇతర ప్రభుత్వ సంస్థల వైఫల్యం అంతకన్నా గర్హనీయమైంది. రాజకీయవాదులు విషవలయంలో చిక్కుకొన్నవారే తప్ప విలన్లు కాదు. వారు ఇతరులను మించిన నేరగాళ్లేమీకాదు. అయినప్పటికీ పరిస్థితుల్ని మార్చాల్సిన ప్రాథమిక బాధ్యత వారిమీదే ఉంది. మార్పు పట్ల ప్రజల ఆశాభావం ప్రతి ఎన్నికలోనూ వ్యక్తమవుతోంది. మరింత మెరుగుదల సాధించాలన్న ఆకాంక్షకే ప్రతి తీర్పు అద్దం పడుతోంది. యధాప్రజా, తథా ప్రభుత్వం అని కొందరు వాదిస్తుంటారు. ఎక్కడైనా, ఏవైనా పొరపాట్లు జరిగితే ప్రజలనే నిందిస్తుంటారు. కానీ, మన దేశంలోని కోట్లమంది సాధారణ ప్రజానీకం తన మనోగతమేమిటో ఎన్నోసార్లు మూకుమ్మడిగా వెల్లడించింది. వారు మూడు దశాబ్దాలుగా ప్రతి ఎన్నికల్లోనూ సగానికి పైగా ప్రతినిధులను తిరిగి ఎన్నుకోవడం లేదు. పటిష్టమైన ప్రభుత్వాలు, గట్టి నాయకులు, శక్తిమంతులైన అభ్యర్థులు సైతం ఎప్పటికప్పుడు ప్రజాబలం ముందు పరాజితులుకాక తప్పడం లేదు. అయినా ప్రతిసారీ ఆటగాళ్లు మారుతున్నారు తప్ప ఆట నియమాలు మాత్రం మారడం లేదు. ఎన్నికల్లో ఎవరు గెలిచినా, ఎప్పుడూ ప్రజలే ఓడిపోయే పరిస్థితి వచ్చేసింది. సమస్యలకు పరిష్కారం చూపాల్సిన రాజకీయ ప్రక్రియ స్వయంగా సమస్యగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో–మురికి రాజకీయాలంటూ విమర్శలు గుప్పించడం, ఏ తప్పు జరిగినా పార్టీలను, రాజకీయవాదులనే తప్పు పట్టడం సులువు. కానీ, అంతా సక్రమంగా, నియమాలకు అనుగుణంగా భారత్‌లో రాజకీయాలు నడపటమన్నది ఖరీదైన వ్యవహారం. ప్రమాద భూయిష్టం, పేరు–ఫలితం రాని వ్యాపకం అని గ్రహించడానికి పెద్దగా కష్టపడనక్కరలేదు. పిల్లలు రాజకీయాల్లోకి వస్తామంటే మనలో చాలామంది వద్దనేది అందుకే. ఎన్నో ప్రతికూలతలను ఎదుర్కొంటూ కూడా రాజకీయాల ద్వారా ప్రజల బాగుకోసం పాటుపడేవారిని విమర్శించే విషయంలో మనం మరల ఒకటికి రెండుసార్లు ఆలోచించడం మన రాజకీయ నాయకులు నీతి నిజాయితీలతో ప్రజలకు సేవ చేస్తున్నారని ఎవరూ అనరు. కానీ వారిని కేవలం విమర్శించటం వల్ల మనమూ సమస్యలో భాగంగా మారుతున్నాం తప్ప పరిష్కారానికి తోడ్పడటం లేదు.

మనం మూడు ప్రశ్నలు వేసి, వాటికి వాస్తవిక సమాధానాలను కనుక్కోవలసిన అవసరం ఉంది. మొదటిది–నీతి నిజాయితీలు, ప్రతిభాపాటవాలు, అంకిత భావం కలిగిన మన ఉత్తమ పౌరులు సక్రమ పద్ధతి ద్వారా ప్రజాప్రతినిధిగా ఎన్నికయ్యే

పరిస్థితులు మనకిక్కడ ఉన్నాయా? దీనికి జవాబు చెప్పడానికి మనం పెద్దగా ఆలోచించనక్కరలేదు. మన దేశంలోని అత్యంత సంపన్నమైన, అత్యధిక అక్షరాస్యత కలిగిన నియోజకవర్గం నుంచి లోక్‌సభకు డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎన్నిక కాలేకపోవడమే– పరిస్థితి అలా లేదనడానికి నిదర్శనం. నీతి నిజాయితీలు, హుందాతనం కలిగిన వ్యక్తి అధికార పీఠాన్ని అధిష్టిస్తే, నీతిమంతమైన పద్ధతులను అనుసరిస్తూ ఆ వ్యక్తి దీర్ఘకాలం పాటు పదవిలో కొనసాగగలరా అన్నది రెండో ప్రశ్న. గౌరవనీయులైన ఎంతోమంది నాయకులు ఎలాంటి దయనీయ పరిస్థితులను ఎదుర్కొన్నారో చూస్తే పదవిలో కొనసాగడమో, నిజాయితీగా ఉండటమో ఏదో ఒకటి మాత్రమే సాధ్యమని స్పష్టమవుతోంది. కేరళలో ఎ.కె.ఆంటోనీని గద్దెదింపడం ఇందుకు తాజా ఉదాహరణ. నీతిమంతుడు, హుందాతనంగల రాజకీయ నాయకుడు ఒక వేళ పదవిలో కొనసాగగలిగినా– ఆయన విస్తృత స్థాయిలో స్థిరంగా, దృఢంగా ప్రజాప్రయోజనాల కోసం పాటుపడగలరా– అనేది మూడో ప్రశ్న. అలాంటి నాయకత్వాలు కలిగిన అనేక ప్రభుత్వాలు చూస్తే– ఆ సర్కారులు చక్కని పనితీరును కనపరచలేదని స్పష్టమవుతుంది.

ఈ మూడు ప్రశ్నలకూ సంతృప్తికరమైన సమాధానాలు లభించనప్పుడు, రాజకీయ నాయకులు మెరుగైన పనితీరు కనపరచగలరని మనం ఎలా ఆశించగలం? రాజకీయ నాయకులందరూ, చెడ్డవారు కాదని ఇంగితజ్ఞానం ఉన్నవారెవరికీ వేరే చెప్పనక్కరలేదు. నిజానికి వారిలో మర్యాదస్తులు, సమర్థులు, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా రాజకీయాల్లోకి వచ్చినవారూ ఉన్నారు. వారు బాగా పనిచేయలేకపోతున్నారంటే– మన రాజకీయ వ్యవస్థలోనే ఎక్కడో ఏదో లోపం ఉన్నట్లే వ్యక్తుల్ని నిందించడంలో అర్థం లేదు. ప్రజాస్వామ్యం కోసం కొంత మూల్యం చెల్లించుకోవలసి ఉంటుందని, అది మనల్ని దిగజారుస్తుందని పదేపదే వినిపించే వాదనల్లో పసలేదు. ప్రజాస్వామ్యం, క్రమశిక్షణ పరస్పరం విరుద్ధమైనవి...... కోరుకుంటున్న వాటిలో చాలావరకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు ప్రజాస్వామ్యాలకి అనుగుణమైనవే. ఏ విధంగా చూసినా, మనం హక్కులను అనుభవిస్తున్నాం. స్వేచ్ఛా సమాజంలో గరిష్టస్థాయిలో ప్రజా శ్రేయాన్నే ఆకాంక్షిస్తున్నాం. మరి సమస్యేమిటి? దానికి పరిష్కారం ఉందా? బ్రిటిష్ పాలన వారసత్వాన్ని కొనసాగిస్తూ మనం ఎన్నికలకు సంబంధించి ఫస్ట్ పాస్ట్ ద పోస్ట్ (ఎఫ్.పి.టి.పి.) వ్యవస్థను ఎంచుకున్నాం. ఈ వ్యవస్థ ప్రకారం విజయానికి కొలమానం

మెజారిటీయే. బ్రిటన్‌ను, ఒకప్పటి దాని వలస రాజ్యాలను మినహాయిస్తే– దీర్ఘకాలంగా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను అనుభవిస్తున్న ఏ సుస్థిర ప్రజాస్వామిక దేశంలోనూ ఎఫ్.పి.టి.పి. వ్యవస్థ లేదు. బ్రిటిష్ వలస రాజ్యాల్లోనే– న్యూజిలాండ్ దామాషా ప్రాతినిధ్య (పి.ఆర్.) పద్ధతికి మారితే, అధునాతన ప్రత్యామ్నాయ ఓటింగ్ వ్యవస్థను ఆస్ట్రేలియా అనుసరిస్తోంది. అత్యంత ఆశ్చర్యకరమైన విషయమేమంటే– బ్రిటన్‌లో సైతం స్కాట్లాండ్, వేల్స్ ఉత్తర ఐర్లాండ్ ప్రాంతీయ పార్లమెంటులను దామాషా ప్రాతినిధ్య పద్ధతుల్లోనే ఎన్నుకొంటున్నారు. బ్రిటన్‌లో హైస్ ఆఫ్ కామన్స్‌కు మాత్రమే ఎఫ్.పి.టి.పి. పద్ధతిలో ఎన్నిక జరుగుతోంది. అయినా సరే, ఎఫ్.పి.టి.పి.యే సార్వత్రిక ఎన్నికల వ్యవస్థ అని మనం భావిస్తుంటాం.

విస్తృతస్థాయిలో నిరక్షరాస్యత, పేదరికంతో కూడుకొన్న సువిశాల, విభిన్న ప్రజాస్వామిక దేశానికి ఎఫ్.పి.టి.పి. తగిన వ్యవస్థ కానేకాదు. మన వ్యవస్థలో– ఒక నియోజకవర్గంలో అభ్యర్థి విజయాన్ని మెజారిటీ నిర్ణయిస్తుంది కనుక, మెజారిటీ సాధించి పెట్టే ఓట్ల కోసం విపరీతమైన పోటీ ఉంటుంది. ఓట్లను కొనడానికి, ఓటర్లకు ఏవో ఆశలు చూపి తమ వైపుకు తిప్పుకోవడానికి, కిరాయి రౌడీలను నియమించుకోవడానికి పెద్ద ఎత్తున డబ్బును వ్యయం చేయడం మామూలైపోయింది. భారీగా డబ్బు ఖర్చుపెట్టినంత మాత్రాన గెలుస్తారన్న గ్యారంటీ ఉండదు. కానీ తక్కువగా ఖర్చుపెడితే మాత్రం ఓటమి ఖాయం. ఈ పరిస్థితి అవినీతికి, అధికార దుర్వినియోగానికి దారి తీస్తోంది. అధికారుల బదిలీలు, నియామకాలు, కాంట్రాక్టుల ఖరారు నేరపరిశోధనలో జోక్యం వంటి విషయాల్లో అధికారాన్ని ఎక్కువగా చలాయించుకోవడం జరుగుతోంది. గెలిచేది ఎవరైనా సత్పరిపాలన మాత్రం అసాధ్యమైపోయింది.

## దామాషా పద్ధతే మేలు

పరిస్థితి ఇలా ఉండటంతో నిజాయితీపరులు, సమర్థులైనవారు రాజకీయాలకు దూరంగా ఉండిపోతున్నారు. రాజకీయాల్లో చేరితే అణచివేతకు గురవుతున్నారు. ధనబలం, కండబలం, కుల బలం, కుటుంబ బలం కలిగిన అభ్యర్థులవైపే పార్టీలు మొగ్గుచూపుతున్నాయి. అక్కడక్కడ వెదకినట్లు మైనారిటీలను పక్కనపెట్టి స్థానికంగా కేంద్రీకృతంగా ఉండే కులాలవారికి అవసరాన్ని మించి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఓడిపోయిన అభ్యర్థులకు పడే ఓట్లకు విలువే లేదు. 30–35 శాతంలోపు పడే

ఓట్లను సీట్లుగా తర్జుమా చేసే సదుపాయం ఎఫ్.పి.టి.పి. పద్ధతిలో లేకపోవడంతో జాతీయ పార్టీలు నానాటికీ కుంచించుకుపోతున్నాయి. మనదేశంలోని ఆరు అతిపెద్ద రాష్ట్రాల పరిస్థితే తీసుకొంటే– వాటిలో ఒక దానిలో కాంగ్రెస్ ప్రధాన పాత్ర పోషిస్తుండగా, బిజెపి ఏ రాష్ట్రంలోనూ కీలక స్థాయిలో లేదు. విజయాన్ని పునర్నిర్వచించడంలోనూ, ప్రజల మద్దతు ప్రాతిపదికగా న్యాయబద్ధ ప్రాతినిధ్యం కల్పించడంలోనూ దీనికి సమాధానం ఉంది. అలాంటి దామాషా ప్రాతినిధ్య పద్ధతిలో ఒక పార్టీ ఏ రాష్ట్రంలోనైనా తన ఓట్ల వాటాకు అనుగుణంగా సీట్లు పొందగలుగుతుంది. హుందాతనంగల, మర్యాదస్తులైన అభ్యర్థులను సభ్యులు ప్రజాస్వామ్యబద్ధంగా ఎంపిక చేయగలుగుతారు. పార్టీ జాబితా ఎన్నికకు ప్రాతిపదికగా ఉంటుంది. ఓట్లలో 10 శాతం వాటాను ప్రాతినిధ్యానికి అర్హతగా నిర్ణయిస్తే సబబుగానే ఉంటుంది. కులాల ఆధారంగా పార్టీలు కుంపట్లు పెట్టకుండా దానివల్ల నిరోధించినట్లవుతుంది. కానీ దామాషా ప్రాతినిధ్య పద్ధతిలో ఒక పెద్ద సమస్య ఉంది. ఇప్పుడు అనేక రాష్ట్రాల్లో సుస్థిర, ఏకపార్టీ ప్రభుత్వాలు ఉన్నాయి. దామాషా ప్రాతినిధ్య పద్ధతిలో మాత్రం మెజారిటీ సిట్లను ఏ ఒక్కపార్టీ గెలుచుకునే పరిస్థితి ఉండదు. మరి సుస్థిరత సాధించేదెలా? ముఖ్యమంత్రిని పార్టీ అధిష్టానవర్గం కానీ, ఎమ్మెల్యేలు కానీ ఎన్నుకొనే పద్ధతి బదులు ప్రత్యక్ష ఎన్నిక ద్వారా రాష్ట్రాధినేతను ఎన్నుకొంటే సరిపోతుంది. దానివల్ల ఆ నాయకుడికి స్పష్టమైన ప్రజామద్దతు, పూర్తికాలం పదవిలో కొనసాగే విషయంలో గట్టి హామీ లభిస్తాయి. ఎమ్మెల్యేల ఒత్తిడికి తలొగ్గకుండా స్వతంత్రంగా తన క్యాబినెట్‌ను ఎంపిక చేసుకోగలుగుతాడు. సమర్థమైన పరిపాలనను అందివ్వగలుగుతాడు. అనేక రాష్ట్రాల్లో ఉనికి లేకుండా పోయిన జాతీయ పార్టీలు, ఆ రాష్ట్రాల్లో తిరిగి ప్రాబల్యం పొందడానికి దామాషా ప్రాతినిధ్య పద్ధతి దోహదపడుతుంది. రాష్ట్రాల్లో ప్రత్యక్ష ఎన్నికల వల్ల ప్రాంతీయ పార్టీలు సుస్థిర ప్రభుత్వాలను ఏర్పరచి, తమ హామీలను నెరవేర్చుకోవడానికి వీలుకలుగుతుంది. ఈ విధమైన ఏర్పాటు అన్ని పార్టీలకూ మంచిది. మనందరికీ మంచిది. దీనివల్ల రాజకీయాధికారంతోపాటు నీతినియమాలూ మనగలుగుతాయి. ప్రభుత్వాలు ప్రజోపయోగ పనులు చేయగలుగుతాయి.

ఇలాంటి రాజకీయ సంస్కరణను మనం ఎలా సాధించగలం? ప్రజాస్వామ్యంలో ప్రజలదే అంతిమ అధికారం. రాజకీయ ప్రక్రియ ముందుకు కదలలేని పరిస్థితి

ఏర్పడినప్పుడు ప్రజలే పగ్గాలు చేబూనవలసి ఉంటుంది. అందుకోసమే 'ఓట్ ఇండియా' ఉద్యమం. రాజకీయ సంస్కరణల కోసం అనేక సంస్కరణ బృందాలు కలిసికట్టుగా నిర్వహిస్తున్న జాతీయ ఉద్యమమిది. రాజకీయ సంస్కరణల కోసం ప్రజలను సమీకరించేందుకు ఉపకరించే వేదిక ఇది. మన రాజకీయాల్లో చాలా లసుగులు, లోటుపాట్లు ఉన్నాయని చాలాకాలంగా మనమంతా తీవ్రంగా విమర్శిస్తున్నాం. కానీ కార్యాచరణకు పూనుకోలేకపోతున్నాం. ఒంటరితనం, దిశానిర్దేశం లేకపోవడం, తీవ్ర నిస్సహాయత మనల్ని కట్టిపడేస్తున్నాయి. ఈ పదాలకు సమాధానమే 'ఓట్ ఇండియా' ఉద్యమం. అంతా మనచేతుల్లోనే అంటే పౌరుల చేతుల్లోనే ఉంది. రాజకీయాల స్వరూప స్వభావాలను మనం మాత్రమే మార్చగలం. పౌరులను సమీకరిస్తే ఏదైనా సాధించవచ్చునని జనాగ్రహ వంటి విశిష్ట బృందాలు నిరూపించాయి. దేశవ్యాప్తంగా ప్రజలను సమీకరించి, జాతీయ స్థాయిలో మార్పునకు తెరచాపలెత్తాల్సిన సమయమిది. పరిపాలన, న్యాయవ్యవస్థ, స్థానిక ప్రభుత్వాల విషయంలో కూడా సంస్కరణలు అవసరం. జవాబుదారీతనాన్ని పెంపొందించడం ఆవశ్యకం. కానీ ఈ ప్రక్రియ అంతటికీ ఆయువుపట్టు రాజకీయ సంస్కరణలే. కోల్పోయిన ప్రజారాజ్యాన్ని మనం తిరిగి సాధించాల్సిన అవసరం ఉంది. మన ఆర్థిక వ్యవస్థ పటిష్టంగా ఉంది. మన యువత ఆత్మవిశ్వాసంతో ఉంది. మన ప్రజలు మెరుగైన పరిపాలనను కోరుకుంటున్నారు. కార్యాచరణకు ఉపక్రమించాల్సిన సమయమిదే.

* * *

# దామాషా పద్ధతే మేలు : రాజ్యసభ ఎన్నికలు

*ఏప్రిల్ 28, 2003*

రాజ్యసభ ఎన్నికలలో మార్పులను తలపెడుతూ ఇటీవల పార్లమెంటులో ఓ బిల్లు ప్రవేశపెట్టారు. దీనికి సంబంధించి గతంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో దాదాపు ఏకాభిప్రాయం కుదిరింది. రాజ్యసభ సభ్యత్వానికి పోటీపడే అభ్యర్థి ఆ రాష్ట్రంలో ఓటరు కానక్కరలేదని, దేశంలో ఏ ప్రాంతానికి చెందిన ఓటరైనా మరో రాష్ట్రం నుండి పోటీ చేయవచ్చని ఆ బిల్లులో ప్రతిపాదించారు. రాజ్యసభ ఎన్నికలలో శాసనసభ్యులు బహిరంగంగా ఓటువేసే విధానం ఉండాలని కోరారు. ఏప్రిల్ ఎనిమిదిన రాజ్యసభ ఈ బిల్లుకు ఆమోదం తెలిపింది. లోక్‌సభ ఆమోదం పొంది, రాష్ట్రపతి సంతకం చేస్తే చట్టమవుతుంది. ఈ బిల్లు సమాఖ్య వ్యవస్థను దెబ్బతీస్తుందని కొందరు విమర్శకులు వాదిస్తున్నారు. మనది రాష్ట్రాల సమాఖ్య. రాజ్యసభ రాష్ట్రాల సభ. ఫెడరల్ రాజ్యాంగం అమలులో ఉన్న అనేక దేశాలలో ఎగువ సభ జాతీయ స్థాయిలో రాష్ట్రాల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తోంది.

## నివాస నిబంధనలు

మన దేశంలో ఎగువ సభలో రాష్ట్రాల ప్రాతినిధ్యం జనాభాను బట్టి ఉంది. తక్కువ జనాభా ఉన్న నాగాలాండ్, సిక్కింలాంటి రాష్ట్రాలకు ఒక రాజ్యసభ సభ్యుడు ఉండగా, అతి ఎక్కువ జనాభా ఉన్న ఉత్తరప్రదేశ్‌కు 34 మంది సభ్యులున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు 18 మంది సభ్యులను కేటాయించారు. మన దేశంలో కూడా రాజ్యసభ అమెరికన్ సెనేట్‌లాగా శాశ్వత సభ. రాజ్యసభ సభ్యులు ఆరేళ్ళపాటు పదవిలో ఉంటారు. ప్రతి రెండేళ్లకు మూడోవంతు సభ్యుల పదవీకాలం పూర్తవుతుంది. రాజ్యసభను రద్దు చేయడం సాధ్యం కాదు. రాజ్యసభ రాష్ట్రాల సభ కాబట్టి ఓ రాష్ట్రం నుంచి ఎన్నికయ్యే సభ్యుడు ఆ రాష్ట్రంలో ఓటరుగా నమోదై ఉండాలని, అంటే ఆ రాష్ట్రంలో సాధారణ నివాసం ఏర్పరచుకొని ఉండాలని ప్రజా ప్రాతినిధ్య చట్టంలో ఓ నిబంధన పెట్టారు. ఇప్పుడు ఆ నిబంధనను తొలగించడం వల్ల పార్టీల నాయకత్వాలు తమకిష్టం వచ్చిన వాళ్లను బయటి రాష్ట్రాల నుండి ఎన్నికల్లో నిలబెట్టి రాజ్యసభకు పంపే అవకాశం ఉందని విమర్శకుల వాదన. ఇతర ప్రాంతాలకు చెందిన పౌరులు ఆ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించడం మొదలైతే, రాజ్యసభలో వారు ఆ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడలేరని, ఆ విధంగా ఈ మార్పు సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తుందని

కొందరి భయం. అధికార అభ్యర్థిగా నిలబడ్డవారికి మద్దతుగా ఆ పార్టీ శాసనసభ్యులందరూ ఓటు వేస్తారు. ఇదే రీతిలో శాసనసభలో తగినంత బలం ఉన్న పార్టీ తరపున నిలబడ్డ అభ్యర్థులు నెగ్గడం ఖాయం. అలాంటప్పుడు రాజ్యసభకు ఎన్నిక కావాలనుకునే వ్యక్తులు ఆ రాష్ట్ర వాసులుగానే ఉండాలన్నది ప్రస్తుత బిల్లును వ్యతిరేకించే వారి వాదన. ఈ బిల్లును ప్రధాన రాజకీయ పక్షాలైన బిజెపి, కాంగ్రెస్, మరికొన్ని ఇతర పార్టీలు సమర్థిస్తున్నాయి. అందువల్లే అధికార పక్షానికి మెజారిటీలేని రాజ్యసభలో కూడా ఈ బిల్లు సునాయాసంగా ఆమోదం పొందింది. పార్లమెంటులో సమర్థులు, అనుభవజ్ఞులు ఉండటం అవసరమని, అలాంటివారిని రాజ్యసభ ద్వారా పార్లమెంటుకు పంపడానికి, మంత్రివర్గంలో చేర్చుకోవడానికి ఈ వెసులుబాటు అవసరమని బిల్లును సమర్థించే వారి వాదన. లోక్‌సభ ఎన్నికలలో విధిగా సమర్థులు, ప్రతిభావంతులు, అనుభవజ్ఞులు గెలుస్తారని చెప్పలేం. నిజానికి ఓ పార్టీకి ఆ రాష్ట్రంలో ఉన్న బలం, స్థానిక కులాల సమీకరణలు, అభ్యర్థి పెట్టే ఖర్చు, వీటన్నింటి ప్రభావం ఎన్నికల మీద విశేషంగా ఉంటుంది. అలాంటప్పుడు మంచిపేరు ప్రతిష్ఠలున్నవారు కూడా ఓ నియోజకవర్గంలో కులం బలమో, ధనబలమో లేకపోతే ఎన్నిక కాలేరు. అలాంటి వారిని రాజ్యసభకు పోటీకి దింపాలంటే వారి సొంతరాష్ట్రంలో ఆ పార్టీకి, తగిన సంఖ్యలో శాసనసభ్యుల మద్దతు ఉండకపోవచ్చు. అందుకే సొంత రాష్ట్రం నుంచే ఎన్నిక కావాలన్న నిబంధనలను పాటించినట్లు కనిపించడానికి చాలా మంది ప్రముఖులు ప్రస్తుతం నానా తంటాలు పడుతున్నారు. ఓ రాష్ట్రంలో ఏ పరిచయమూ లేకపోయినా, ఆ రాష్ట్రంలో నివాసమున్నట్లుగా ధృవీకరణ పత్రాలు సృష్టించవలసి వస్తోంది. కొన్ని సందర్భాల్లోనైతే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇంట్లోనే నివాసమున్నట్లుగా పత్రాలను దాఖలు చేస్తున్నారు. గడిచిన అయిదేళ్లలో ఇలా 20 మంది సభ్యులు వేరే రాష్ట్రాల నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఈ పరిస్థితుల్లో నివాస నియమాన్ని తొలగించడమే మంచిదన్నది బిల్లును సమర్థించే వారి అభిప్రాయం. పార్టీలు పెద్ద సంఖ్యలో బయటివాళ్లను మరో రాష్ట్రానికి తీసుకొచ్చి గెలిపించుకుంటాయని, ఆ విధంగా అసలు రాష్ట్రాలకు రాజ్యసభలో బొత్తిగా ప్రాతినిధ్యం లేకుండా పోతుందని కొందరు వ్యక్తం చేసే భయాలను బిల్లును సమర్థించేవారు కొట్టిపారేస్తున్నారు. నివాస నియమాలను మార్చినా, అవసరం మేరకు కొందరు ప్రముఖులను, సీనియర్ నాయకులను మాత్రమే వేరే రాష్ట్రాలలో పోటీకి దింపుతారని, ఆ మాత్రం వెసులుబాటు పార్టీలకు ఉండటం అవసరమని వారి వాదన. మరీ శృతిమించి బయటివాళ్లను పెద్ద సంఖ్యలో ఓ రాష్ట్రానికి తెచ్చి పోటీలో దింపితే, రాష్ట్రం నుంచి రాజకీయంగా

ప్రతిఘటనే ఎదురుకావడం ఖాయమని, కాబట్టి ఈ నిబంధనల సడలింపు వల్ల రాష్ట్రాల ప్రాతినిధ్యానికి ఏమీ భంగం కలగదని వారి విశ్వాసం.

## డబ్బు సంచుల ప్రభావం

రహస్య ఓటింగ్ స్థానే బహిరంగ బ్యాలెట్‌ను ప్రవేశపెట్టడాన్ని కూడా కొందరు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. రహస్య ఓటింగ్ అనేది మౌలిక ప్రజాస్వామ్య సూత్రమని, దాన్ని సడలించడం సమర్థనీయం కాదని విమర్శకుల వాదన. రహస్య ఓటింగ్ వల్ల ఎంతో మంది శాసనసభ్యులు రాజ్యసభ ఎన్నికల్లో తమ ఓటును పెద్ద మొత్తానికి అమ్ముకుంటున్నారు. కొన్ని పార్టీలలో తమ పార్టీ అధికార అభ్యర్థికి ఓటు వేయటానికి కూడా డబ్బు పుచ్చుకుంటున్నారు! దాదాపు పాతికేళ్లుగా రాజ్యసభ ఎన్నికల్లో ఇలా డబ్బు ఖర్చు పెట్టడం ఆనవాయితీగా మారింది. ఉత్తరప్రదేశ్‌లో ఇటీవల ఓ ఆయుధ వ్యాపారి నందా రాజ్యసభ ఎన్నికల బరిలోకి దిగి ఓట్లను కొనటానికి పెద్ద ఎత్తున డబ్బు ఆశ చూపించి, ప్రధాన పార్టీలను ముచ్చెమటలు పోయించారు. ఇలా డబ్బుకు శాసనసభ్యులు అమ్ముడుపోవడాన్ని నిరోధించడం కోసం పార్టీలు రకరకాల ఎత్తుగడలకు దిగాయి. ఎన్నో రాష్ట్రాల్లో రహస్య ఓటింగు నిబంధనలకు ఆచరణలో మంగళం పాడి ఏ శాసనసభ్యుడు ఎవరికి ఓటు వేశారో తెలుసుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితులలో రహస్య ఓటింగ్ అవినీతికి ఊతమిస్తోందని, పార్టీ క్రమశిక్షణను భంగపరుస్తోందని, డబ్బు సంచులకు ప్రాధాన్యం పెరుగుతోందని కాబట్టి బహిరంగ ఓటింగ్ పెట్టడమే సబబని బిల్లును సమర్థించేవారు వాదిస్తున్నారు.

ఈ బిల్లును వ్యతిరేకించేవారు సమర్థించేవారు కూడా మన ఎన్నికల వ్యవస్థలోని అసలైన సంక్షోభాన్ని సమస్యలను విస్మరిస్తున్నారు. లోతుగా పరిశీలిస్తే మన ఎన్నికల వ్యవస్థలో అసలు సమస్యలు, వాటి కారణాలు వేరే ఉన్నాయి. మన ఎన్నికలు పెద్ద వ్యాపారంగా మారిపోయాయి. కోట్ల రూపాయల నల్లడబ్బును అక్రమంగా ఖర్చు పెడితేనే గెలిచే అవకాశాలున్న పరిస్థితి చాలా చోట్ల ఉంది. నిజాయితీపరులు, అసమర్థులైన రాజకీయ నాయకులు ఇంకా ఉన్నారు. క్రమేణా అలాంటివారికి రాజకీయాల్లో నిలదొక్కుకునే అవకాశాలు సన్నగిల్లుతున్నాయి. చాలామంది ఆలోచనాపరులు రాజకీయాలంటే వైముఖ్యం ప్రదర్శిస్తున్నారు. ప్రస్తుతం అమల్లో ఉన్న ఎన్నికల విధానంలో ఓ నియోజకవర్గంలో గణనీయంగా మద్దతు ఉన్నవారే నెగ్గుతున్నారు. సమాజం మొత్తంలో మంచి పేరు ప్రతిష్టలున్న మన్మోహన్ సింగ్ లాంటివారు గెలవటం ఈ ఎన్నికలలో చాలా కష్టం. దేశమంతటా లేదా ఓ రాష్ట్రంలో

గణనీయమైన మద్దతున్న పార్టీలు కూడా, కేవలం స్థానికంగా బలమైన కులాల మద్దతు కూడగట్టడంలో విఫలమైతే ఎన్నికలలో ఓటమిపాలవుతున్నాయి. ఉదాహరణకు సిద్ధాంతాల మీద నిలబడ్డ కమ్యూనిస్టు పార్టీల వంటివాటికి తమ అభ్యర్థులను గెలిపించుకోవడం కష్టమవుతున్నది. ఇలాంటి వ్యవస్థలో కులం బలంతో, అధికార సంబంధాలతో, అక్రమ మార్గాల్లో భారీగా డబ్బు వెనకేసుకున్న కొన్ని కుటుంబాలకు మాత్రమే అధికారం వంశపారంపర్యంగా వస్తుంది. చాలా నియోజకవర్గాలలో ఇలాంటి రాజకీయ జమీందారీలు స్థిరపడిపోతున్నాయి. కులం బలం, డబ్బు, కుటుంబం – ఈ మూడు ప్రభావాల నుంచి రాజకీయాన్ని రక్షించడం అవసరం. అందుకు ప్రస్తుతం ఉన్న ఎన్నికల విధానాన్ని మార్చి దామాషా పద్ధతిని ప్రవేశపెట్టాలి.

## మారుతున్న సంప్రదాయాలు

నియోజకవర్గాలలో బలాన్ని బట్టికాక, మొత్తం ఓ రాష్ట్రంలో ఒక పార్టీకున్న మద్దతును బట్టి, ఓట్ల శాతాన్ని బట్టి సభ్యుల ఎన్నిక జరిగితే ఎన్నికలలో డబ్బు ప్రభావం తగ్గుతుంది. 'ఆధునిక జమీందారీలనూ అంతమొందించవచ్చు. మన ఎన్నికల విధానం బ్రిటిష్ వ్యవస్థ ఆధారంగా తయారైంది. నియోజకవర్గం వారీ ఎన్నికలకు మూలమైన బ్రిటన్‌లోనే కొత్తగా ఏర్పడ్డ ప్రాంతీయ పార్లమెంటులలో దామాషా పద్ధతి ఎన్నికలను ప్రవేశపెట్టారు. యూరోపియన్ పార్లమెంటుకు సభ్యులను నియోజకవర్గాల ద్వారా కాక దామాషా పద్ధతిన ఎన్నుకుంటున్నారు. ఈ మార్పులను పట్టించుకోకుండ – మనం ఇంకా బూజుపట్టిన సంప్రదాయాలను పట్టుకుని వేళ్లాడటం అవివేకం. నిజానికి రాజ్యాంగంలో ఏ మార్పులు చేయకుండానే మన దేశంలో దామాషా పద్ధతిని ప్రవేశపెట్టవచ్చు. 1952, 1957లలో తొలి రెండు సాధారణ ఎన్నికలలో రిజర్వేషన్ల అమలు కోసం మనదేశంలో ద్విసభ్య లేదా త్రిసభ్య నియోజకవర్గాలుండేవి. చట్టంలో సవరణ ద్వారా బహుళ సభ్య నియోజకవర్గాలను ఏర్పాటు చేసి, పార్టీలకు వచ్చిన ఓట్ల శాతాన్నిబట్టి ఆ పార్టీ అభ్యర్థులు ఎన్నికయ్యే ఏర్పాటు చేస్తే సరిపోతుంది. సమర్థులు, నిజాయితీపరులు దిగువ సభకు ఎన్నికయ్యే అవకాశం మృగ్యమైనంతకాలం రాజ్యసభ సభ్యత్వానికి సీట్లు పొందడానికి గిరాకీ పెరుగుతూనే ఉంటుంది. ప్రస్తుతం ప్రవేశపెట్టిన బిల్లు కేవలం పార్టీల నాయకత్వానికి మరింత అధికారాన్నిస్తుంది తప్ప సమస్యను పరిష్కరించలేదు.

* * *

# దామాషా విధానమే సరైన ప్రత్యామ్నాయం

*అక్టోబరు 27, 2003*

ఎన్నికల సంఘం సిఫారసు మేరకు అభ్యర్థుల వ్యయ పరిమితిని పెంచుతూ కేంద్ర ప్రభుత్వం కొద్దిరోజుల క్రితం నిర్ణయం తీసుకుంది. పెద్ద రాష్ట్రాలలో అసెంబ్లీకి పోటీచేసే అభ్యర్థులకు 1997 నుంచి ఇటీవల వరకు ఈ పరిమితి రూ. ఆరు లక్షలుండగా, దీన్ని ప్రస్తుతం రూ. 10 లక్షలకు పెంచారు. లోక్‌సభకు ఈ రాష్ట్రాలలో వ్యయపరిమితి ఇప్పటిదాకా రూ15 లక్షలుండగా, దాన్ని రూ. 25 లక్షలకు పెంచారు. కిందటి నెలలో రాష్ట్రపతి ఆమోదం పొందిన ఎన్నికల నిధుల సంస్కరణలచట్టం వల్ల ఈ పరిమితులను పెంచటం అవసరమయింది. గతంలో ఉన్న లొసుగుల్ని ఈ కొత్తచట్టంలో సవరించారు. గతంలో ఓ అభ్యర్థి గెలుపుకోసం అతని పార్టీ పెట్టిన ఖర్చును గాని, లేదా ఇతరులు చేసిన ఖర్చునుగాని అతని ఎన్నికల వ్యయంలో కలిపేవారు కాదు. దాంతో ఓ అభ్యర్థి తరఫున కోటి రూపాయల ఖర్చయినా, అతడు మాత్రం తన ఖర్చు ఆరు లక్షల రూపాయల లోపేనని ప్రకటించడం సాధ్యమయ్యేది. ఆ విధంగా ఎన్నికల వ్యయపరిమితిని నీరుగార్చారు. ఇప్పుడు పార్టీ చేసిన ఖర్చుకూడా వ్యయపరిమితిలోకి వస్తుంది. నిజంగానే ఎన్నికల ప్రచార ఖర్చు పెరిగినందున ఇప్పుడు ఎన్నికల వ్యయపరిమితులను పెంచటం సబబైన నిర్ణయమే.

## పెరుగుతున్న రాజకీయ వ్యాపారం

అంతమాత్రాన ఎన్నికలలో అధిక వ్యయం సమస్య పరిష్కారం కాదు. పార్టీలు, అభ్యర్థులు ఓ విషవలయంలో చిక్కుకున్నారు. కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి ఎన్నికలలో గెలవటం, అంతకు పదింతలు అక్రమార్జన చేయటం, ఈ విధంగా అవినీతి విశృంఖలంగా పెరిగిపోవటం – ఇవన్నీ మన వ్యవస్థలో అంతర్భాగాలయ్యాయి. ఎన్నికల నిధుల సంస్కరణ – కేవలం ఎన్నికల ప్రచారానికి నిజంగాకావలసిన వనరుల్ని చట్టబద్ధంగా సమీకరించేందుకు ఉపకరిస్తుంది. కానీ ప్రస్తుతం జరుగుతున్నది రాజకీయ వ్యాపారం. ఎన్నికలలో కోట్ల రూపాయలు పెట్టుబడిగా పెట్టి గెలుపు సాధిస్తే, అంతకు పదిరెట్ల రాబడి కావాలి. అధికారుల, ఉద్యోగుల బదిలీల ద్వారాను,

కాంట్రాక్టులు, ప్రభుత్వ పైరవీల ద్వారాను, నేర పరిశోధనలో అక్రమ జోక్యం ద్వారాను ఈ రాబడి వస్తుంది.

ప్రస్తుతం అనుసరిస్తున్న నియోజకవర్గం వారీ ఎన్నికల వ్యవస్థను మనం బ్రిటన్ నుంచి వారసత్వంగా పొందాం. ఇందులో ప్రతి నియోజకవర్గం నుంచి పోటీచేసిన అభ్యర్థుల్లో అత్యధిక ఓట్లు పొందిన ఒక్కరు ఎన్నికకాగా, మిగిలిన వారు ఓడిపోతారు. ఓడిపోయిన పార్టీలకు ఆ నియోజకవర్గంలో ఎన్ని ఓట్లు వచ్చినా, కేవలం పది ఓట్ల తేడాతో గెలుపు చేజారినా, వాటికి విలువ లేదు. ఓ నియోజకవర్గంలో రెండో స్థానంలో ఉన్న పార్టీకి, అభ్యర్థికి ఏ విలువా లేదు. దాంతో పార్టీలు అధికారం సంపాదించటం కోసం ప్రతి నియోజకవర్గంలోను గెలుపు గుర్రాల వేటలో మునిగిపోతున్నాయి. నియోజకవర్గం వారీ ఎన్నిక పద్ధతి ఎన్నో విషపరిణామాలకు దారితీసింది. మొదటగా ఎలాగోలా అక్రమాలు చేసైనా సరే గెలిచే అభ్యర్థుల కోసం పార్టీలు వెంపర్లాడుతున్నాయి. దాంతో నిజాయితీపరులు, సమాజహితులు క్రమంగా రాజకీయాల్లో తెరమరుగవుతున్నారు. రెండవది– అభ్యర్థులు తమ ప్రత్యర్థులను అధిగమించడానికి ఓట్ల కొనుగోలుకు, రిగ్గింగుకు ఇతర అక్రమాలకు పాల్పడుతున్నారు. ఓ రాష్ట్రం మొత్తం మీద ఎన్నికల ఫలితాలను గమనిస్తే అవి – ప్రజాభిప్రాయానికి అనుగుణంగా, ప్రజాస్వామ్య బద్ధంగా వెలువడినట్లు కనిపించవచ్చు. అందుకు కారణం ఓ అభ్యర్థి లేదా పార్టీచేసే అక్రమాలకు దీటుగా వారి ప్రత్యర్థులు చేసే అక్రమాల ప్రభావం కనిపించదు. కాని నియోజకవర్గం స్థాయిలో ప్రధాన పార్టీలన్నీ ఏదో ఒక విధంగా అక్రమంగా ఖర్చు పెట్టి గెలుపు సాధించే అభ్యర్థులు మీదనే ఎక్కువగా ఆధారపడవలసి వస్తోంది. దాంతో నిజాయితీపరులు, చిత్తశుద్ధి గలవారు, జనహితాన్ని పెంపొందించేవారు రాజకీయాలలో పనికిరాకుండా పోతున్నారు. వారిని అభ్యర్థులుగా నిలబెట్టడానికి పార్టీలు కూడా జంకుతున్నాయి. కోట్లు ఖర్చుపెట్టి అక్రమాలకు పాల్పడే ప్రత్యర్థులతో ఢీకొనటం వారికి సాధ్యం కాకపోవటంతో రాజకీయంలో నిజాయితీపరులకు స్థానం లేకుండా పోతోంది. మూడవది నియోజకవర్గంవారీ ఎన్నికల వల్ల కొన్ని ప్రాంతాలలో – ఎక్కువశాతం జనాభాకు చెందిన కొన్ని కులాలకు, వర్గాలకు అధిక ప్రాతినిధ్యం లభిస్తుండగా, ఓ రాష్ట్రం లేదా దేశమంతటా, సమానంగా విస్తరించి ఉన్న కులాలకు, వర్గాలకు ప్రాతినిధ్యం కరువయింది. ఈ విధంగా కొన్ని కులాల ప్రాబల్యం రాజకీయాలలో పెరిగిపోయింది. ఈ ఎన్నికల వ్యవస్థలో ఆ ప్రాబల్యం అలాగే కొనసాగుతూ, అధికార పీఠాలపై కొందరే నిరంతరం తిష్టవేయటం

సంప్రదాయమైపోయింది. ఉదాహరణకు ముస్లిములకు ఈ ఎన్నికల వ్యవస్థలో వారి జనాభాకు తగిన ప్రాతినిధ్యం ఏనాడూ దొరకదు. దాంతో వారిలో రాజకీయ అభద్రతాభావం పేరుకుపోయింది. పాలనలో చోటు దొరక్కపోవటంతో మిగిలిన సమాజానికి దూరం అవుతున్నారు. ముస్లిముల ఓట్లను సామూహికంగా కొల్లగొట్టడానికి ఓటుబ్యాంకు రాజకీయాలు తెరమీదకు రావడంతో వారు కొందరిని తమ విరోధులుగా భావించి సామూహికంగా వ్యూహాత్మకంగా ఓటు వేయటం, దాంతో మతం, రాజకీయం కలగలిసిపోయి మత వైషమ్యాలు పెచ్చుపెరగటం, ఇరు మతాలను రాజకీయ సమీకరణల కోసం వాడుకోవటం– ఇవన్నీ మన ఎన్నికల వ్యవస్థలోని లోపాలవల్ల తలెత్తిన దుష్పరిణామాలు. అలాగే దళితులకు జనాభా నిష్పత్తి ప్రాతిపదికన కొన్ని నియోజకవర్గాలను కేటాయించినా, దానివల్ల నిజమైన సాంఘిక న్యాయం అందలేదు. దళిత అభ్యర్థులకు ఆ నియోజకవర్గాలలో రాజకీయ ప్రాబల్యం లేకపోవటం వల్ల, ఇతర వర్గాల మీద ఆధారపడి మాత్రమే గెలిచే పరిస్థితి ఉన్నందువల్ల – సంఖ్యాపరంగా తగినంత మంది దళితులు ఎన్నికయినా, వాస్తవానికి దళితుల జనాభాకు తగ్గ రాజకీయ పలుకుబడి, అధికారం ఏనాడూ వారి దరిచేరలేదు.

మన ఎన్నికల వ్యవస్థలోని లోపాలవల్ల రాజకీయాల్లో తలెత్తిన ఈ దుష్పరిణామాలను ఎలా ఎదుర్కోగలం? ఓట్ల కొనుగోలును, రాజకీయ జమీందారులను, నేర రాజకీయాన్ని, కొన్ని కులాల ప్రాబల్యాన్ని, అపసవ్య ప్రాతినిధ్యాన్ని ఎలా నిరోధించగలం? మన సమాజంలోని ఎన్నో వైరుధ్యాల కారణంగా, ఇప్పటికీ చాలామంది బీదరికంలోను, అజ్ఞానంలోను మగ్గుతున్న కారణంగా, నియోజకవర్గం వారీ ఎన్నికల పద్ధతి మన సమస్యలను మరింత పెంచి రాజకీయ సంక్షోభానికి దారి తీసింది. కేవలం బ్రిటిష్ ఎన్నికల వ్యవస్థకు మనం అలవాటుపడి ఉన్నకారణంగా దాన్ని అరువుతెచ్చుకుని కొనసాగించామే తప్ప, ఇది మన సమాజ అవసరాలకు ఏరకంగాను సరిపోయేదికాదు. వేరే పద్ధతులలో ఎన్నికల జరపవచ్చునికాని, ఇతర రకాల ప్రాతినిధ్యం సాధ్యమని కాని, – చాలామందికి తెలియదు. వాస్తవమేమంటే, భారత్‌సహా పదిదేశాలలో మాత్రమే ఇలాంటి ఎన్నికల పద్ధతి ఉంది. ప్రస్తుతం ప్రజాస్వామ్య దేశాల్లో 43 ఇతర ఎన్నికల పద్ధతులను అనుసరిస్తున్నాయి! అందులో 36 దేశాలు దామాషా పద్ధతి ఎన్నికల వ్యవస్థను పాటిస్తున్నాయి. అంటే ఆ దేశాల్లో ఓ పార్టీకి వచ్చిన మొత్తం ఓట్ల శాతాన్ని బట్టి, ఆ పార్టీకి చట్టసభలో సభ్యుల సంఖ్య నిర్దారణ అవుతుంది.

నియోజకవర్గం వారీ ఎన్నికకు ఈ దామాషా పద్ధతి మూడు మౌలికమైన విషయాల్లో భిన్నంగా ఉంటుంది. మొదటిది, ఓ పార్టీ ప్రతిష్ఠ ఆ పార్టీ ఎన్నికల ప్రణాళికలను బట్టి ఫలితాలు ఉంటాయి. కాబట్టి పార్టీలు గెలుపుకోసం స్థానికంగా బలమైన ఆధునిక జమీందారిలను ఆశ్రయించనక్కరలేదు. నేరచరితులను అభ్యర్థులుగా ఎంపికచేసి రాజకీయాన్ని భ్రష్టుపట్టించనక్కరలేదు. రెండవది– ఎన్నికలలో విజయం కేవలం ఓ నియోజకవర్గంలో వచ్చిన ఓట్లనుబట్టి ఆధారపడి ఉండదు. అన్ని నియోజకవర్గాలలో పార్టీకి వచ్చిన మొత్తం ఓట్లు ముఖ్యమవుతాయి. కాబట్టి నియోజకవర్గంలో ప్రత్యర్థికంటే ఎక్కువ ఓట్లను సంపాదించటానికి అపరిమితంగా ఖర్చుపెట్టడం, అక్రమాలకు పాల్పడటం అనవసరమవుతాయి. నిజానికి ఓ నియోజకవర్గంలో అలా అక్రమాలు చేస్తే రాష్ట్రమంతటా అందుకు వ్యతిరేకత ఎదురై ఓట్ల శాతం తగ్గే ప్రమాదముంది! అందువల్ల ఆ పార్టీ తీవ్రంగా నష్టపోతుంది. కాబట్టి స్థానికంగా ఓట్ల కొనుగోలు, రిగ్గింగు ఆగిపోతాయి. మూడవది అల్పసంఖ్యాక వర్గాలకు సముచితమైన ప్రాతినిధ్యం లభిస్తుంది. ఓ ప్రాంతంలో ఓ వర్గం ప్రాబల్యం మీద పార్టీ గెలిచే స్థానాలు ఆధారపడవు కాబట్టి – అన్ని ఓట్లకు విలువ ఉంటుంది. జనాభాను బట్టి వారికి ప్రాతినిధ్యం దక్కుతుంది. ఆ విధానాన్ని అనుసరిస్తే మన రాజకీయాల స్వరూపమే పూర్తిగా మారిపోయి, ఎన్నికలలోను, ప్రజాస్వామ్యంలోను చోటుచేసుకుంటున్న అక్రమాలు కృత్రిమ ధోరణులు తొలగిపోతాయి. నిజానికి బ్రిటన్‌లో కూడా ఎన్నికలలో చాలా మార్పులు వచ్చాయి. ఆ దేశంలో యూరోపియన్ పార్లమెంటుకు జరిగే ఎన్నికల్లో, స్కాట్లాండు, వేల్స్ ఉత్తర ఐర్లాండులలో ఇటీవల స్థాపించిన ప్రాంతీయ చట్టసభల ఎన్నికల్లో దామాషా పద్ధతిని పాటిస్తున్నారు. బ్రిటన్ కూడా తిరస్కరించిన ఎన్నికల వ్యవస్థను, ఇతర సాంప్రదాయాలను ఈనాటికీ మనం పట్టుకుని వేళ్ళాడుతున్నాం!

## నిజాయితీకి పెద్దపీట

దామాషా పద్ధతి ఎన్నికల్లో కూడా కొన్ని సమస్యలున్నాయి. మొదటిది– పార్టీ నాయకుల చేతికి అధికారాన్నంతా అప్పగిస్తే అభ్యర్థుల జాబితాల తయారీలో న్యాయం జరగదు. నాయకుల నిరంకుశత్వం రాజకీయానికి శాపమవుతుంది. అలాకాక పార్టీ జాబితాలో అభ్యర్థుల పేర్లు, వరుసక్రమంలో వారి ప్రాథమ్యం– ఈ రెండూ ప్రజాస్వామ్య బద్ధంగా, రహస్య ఓటింగ్ ద్వారా, ఆ పార్టీ సభ్యులు లేదా వారెన్నుకున్న ప్రతినిధులు

నిర్ణయించేలా ఏర్పాట్లు చేయటం అవసరం. పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యం ఉన్నప్పుడే దామాషా పద్ధతి వల్ల సత్ఫలితాలు వస్తాయి. రెండవది– మన సమాజంలో ఉన్న వైవిధ్యాలవల్ల, భిన్నత్వం వల్ల , వైరుధ్యాల వల్ల, దామాషా పద్ధతిలో – ప్రతికులం, వర్గం ఓ స్వంత పార్టీని పెట్టుకుని, సమాజాన్ని, రాజకీయాన్ని కుక్కలు చింపిన విస్తరిలాగా మార్చే ప్రమాదం ఉంది. ఇటీవల రాజకీయాలలో కులం ప్రభావం బాగా పెరిగిన నేపథ్యంలో ఈ సమస్య మరింత జటిలం కాకుండా జాగ్రత్తలు తీసుకోవటం అవసరం. దీనికి విరుగుడుగా... ఓ పెద్ద రాష్ట్రంలో కనీసం 10 శాతం లేదా 15 శాతం ఓట్లు ఓ పార్టీ పొందినప్పుడే ఆ పార్టీకి చట్టసభలో ప్రాతినిధ్యముండేలా ఏర్పాట్లుచేయాలి. రాష్ట్రం మొత్తంలో అంతకంటే తక్కువ ఓట్లు వస్తే ప్రాతినిధ్యం దక్కనప్పుడు, విధిగా పార్టీ కుల, మతాల పేరుతో కాక, కొన్ని సిద్ధాంతాలు, విధానాల పేరుతో ఏర్పాటై, సమాజంలో వివిధ వర్గాలమధ్య సమన్వయం కోసం కృషి చేయాల్సి ఉంటుంది. మూడవది దామాషా పద్ధతిలో ఓ చట్టసభ సభ్యుడికి, నియోజకవర్గ ప్రజలకు మధ్య సంబంధం తెగిపోతుంది. ఈ ఇబ్బంది లేకుండా సగం మంది సభ్యులను నియోజకవర్గాల వారీగా ఎన్నుకోవచ్చు. మిగిలిన సగం మందిని పార్టీల జాబితాల నుంచి దామాషా పద్ధతిన ఎంపికచేయవచ్చు. ఇలా పార్టీ జాబితాల నుంచి ఎన్నికయ్యే అభ్యర్థుల సంఖ్యను నిర్ణయించేటప్పుడు పార్టీకి వచ్చిన ఓట్ల శాతాన్ని బట్టి చట్టసభలో ఆ పార్టీ సభ్యుల సంఖ్య ఉండేలా ఏర్పాటు చేయవచ్చు. దాన్నే దామాషా పద్ధతిననుసరించే మిశ్రమ ఎన్నిక పద్ధతి అంటారు. బొలీవియా, జర్మనీ, ఇటలీ, మెక్సికో, న్యూజిలాండ్, వెనిజువెలా – ఈ ఆరు దేశాలలోను ఇలాంటి ఎన్నికల పద్ధతి ఉంది. ఈ పద్దతిలో ఓటరుకు రెండు ఓట్లుంటాయి. ఒక ఓటును మొత్తంమీద నచ్చిన పార్టీకి వేయవచ్చు. భారత్‌లో కూడా ఇలాంటి ఎన్నికల పద్ధతి సబబుమైనది. మన అసవరాలకు పనికివచ్చేది. మన ఎన్నిక సక్రమంగా, సజావుగా, నిజాయితీగా, అన్ని వర్గాలకు సమాన ప్రాతినిధ్యం నిజాయితీపరులకు పెద్దపీట వేసేలా ఉండాలి. దామాషా పద్ధతిని వెంటనే ప్రవేశపెట్టడం అవసరం. ఇటీవల వచ్చిన ఎన్నికల నిధుల సంస్కరణ మన రాజకీయ ప్రకటనలో కేవలం తొలిమెట్టు మాత్రమే. దామాషా పద్ధతి మన దేశంలో ప్రవేశపెట్టి మన ప్రజాస్వామ్యాన్ని సార్థకం చేయడానికి ఇదే సరైన అవకాశం.

* * *

# మహిళల ప్రాతినిధ్యానికి సబబైన మార్గం

*నవంబర్ 10, 1999*

చట్టసభలలో మహిళలకు మూడోవంతు రిజర్వేషన్లు కల్పించే 81వ రాజ్యాంగ సవరణ బిల్లును 1996లో తయారుచేశారు. దాన్ని పార్లమెంటులో ప్రవేశపెట్టే సమయంలో నానా రభస జరిగింది. చివరికి 1997లో లోక్‌సభలో ప్రవేశపెట్టినా, తరవాత 11వ లోక్‌సభ రద్దవటంతో ఆ బిల్లు చెల్లకుండా పోయింది. మళ్లీ 12వ లోక్‌సభలో దాన్ని ప్రతిపాదించినా, ఆ సభ కూడా రద్దవటంతో మరోసారి వ్యర్థ ప్రయత్నమయింది. ఇప్పుడు మధ్యంతర ఎన్నికలయ్యాక మళ్ళీ మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రస్తావన ముందుకు వస్తోంది. రాష్ట్రపతి ప్రసంగంలో ఈ రిజర్వేన్లను వెంటనే అమలుచేసేలా రాజ్యాంగాన్ని సవరిస్తామని ప్రకటించారు. బి.జె.పి కూటమిలో 29 లోక్‌సభ సీట్లతో ప్రముఖ పాత్ర వహిస్తున్న తెలుగుదేశం పార్టీ కూడా మహిళా రిజర్వేషన్ బిల్లు వెంటనే ఆమోదించేలా ఒత్తిడి తెస్తామని ప్రకటించింది. ఈ నేపథ్యంలో మహిళా ప్రాతినిధ్యానికి అత్యుత్తమ మార్గాలేమిటో విశ్లేషించటం సందర్భోచితం.

## 81వ రాజ్యాంగ సవరణ బిల్లు

1952లో మొదటి లోక్‌సభ ఎన్నిక జరిగినప్పటి నుంచి నేటివరకు మహిళలకు చట్టసభలలో తగిన ప్రాతినిధ్యం లేకుండా పోయింది. ఇప్పటివరకు 1977లో ఎన్నికయిన ఆరో లోక్‌సభలో అతి తక్కువగా కేవలం 19 మంది మహిళలుండగా, ఎనిమిదో లోక్‌సభకు 1984లో అతి ఎక్కువగా 44 మంది ఎన్నికయ్యారు. అలాగే రాజ్యసభలో 29 మందికి మించి (1980లో) మహిళలు ఏనాడూ ఎన్నిక కాలేదు. రాష్ట్ర శాసనసభలో 26 మంది మహిళలుండగా, గతించిన 10వ శాసనసభలో కేవలం 8 మంది ఉన్నారు. మొన్న జరిగిన ఎన్నికలలో అటు లోక్‌సభకు (45 మంది) ఇటు రాష్ట్ర శాసనసభకు (27 మంది) మహిళలు రికార్డు సంఖ్యలో ఎన్నికయ్యారు. అయితే ఈ సంఖ్య కూడా దాదాపు 9 శాతం మాత్రమే. 50 శాతం జనాభా ఉన్న మహిళలకు తగిన ప్రాతినిధ్యం ఉండాలని ఆలోచనాపరులంతా

కోరుకున్నారు. అందునా నేర ప్రవృత్తికి, అవినీతికి పూర్తిగా దాసోహమయిన నేటి పతన రాజకీయ వ్యవస్థలోకి పెద్దఎత్తున మహిళలు ప్రవేశిస్తే అది సంస్కరణలకు దారితీస్తుందని ప్రజాస్వామ్యవాదులందరి విశ్వాసం. ఏ సంస్కరణ చేపట్టినా అనాలోచితంగా కేవలం ఓట్లు దండుకోవటానికి తాత్కాలికంగా రాజకీయ లబ్ధిని పొందటానికి, మాత్రమే మొక్కుబడిగా స్వల్పకాలిక నిర్ణయాలు తీసుకోవటం మన రాజకీయులకు అధికార యంత్రాంగానికి అలవాటయిపోయింది. అదే అనవాయితీ మహిళలకు ప్రాతినిధ్యాన్ని కల్పించే 81వ రాజ్యాంగ సవరణ బిల్లులో కూడా కనిపిస్తోంది. ఈ సవరణ ద్వారా రాజ్యాంగంలో 330ఎ, 332ఎ అధికరణాలను కొత్తగా చేర్చాలని ప్రతిపాదిస్తున్నారు. ఇందులో ప్రధానంగా నాలుగు ప్రతిపాదనలున్నాయి. లోక్‌సభలోను, రాష్ట్ర శాసనసభలోను కనీసం మూడోవంతు సీట్లని మహిళలకు, కేటాయించాలని మొదటి ప్రతిపాదన. అలా మహిళలకు ఏ సీట్లు కేటాయించాలో రొటేషన్ ద్వారా నిర్ణయించాలని రెండో ప్రతిపాదన అంటే ఈసారి మహిళలకు కేటాయించిన సీట్లు వచ్చేసారి స్త్రీ, పురుషులు ఎవరైనా పోటీ చేసే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం మహిళల కోటాకు చెందని సీట్లలో వచ్చేసారి రిజర్వేషన్ జరుగుతుంది. మూడో ప్రతిపాదన ఏమంటే షెడ్యూల్డు కులాలా, షెడ్యూల్డు తెగలకు కేటాయించిన స్థాణాలలో కూడా, మూడో వంతు స్థానాలు రొటేషన్ పద్ధతిలో మహిళలకు కేటాయించాలి. ఇలాంటి మహిళా రిజర్వేషన్లు మూడు లోక్‌సభ స్థానాలు, శాసనసభ స్థానాలు మించని రాష్ట్రాని వర్తించవనేది నాలుగో ప్రతిపాదన. ఈ ప్రతిపాదన సబబైనదా? కాదా? అనే శంక ఎందరినో పీడిస్తున్నది. ప్రస్తుత ప్రతిపాదనలవల్ల ప్రతి ఎన్నికలోను దాదాపు 50 శాతం నియోజకవర్గాలను షెడ్యూల్డు కులాలు (యస్.సి), షెడ్యూల్డు తెగలు (యస్.టి.), మహిళలకు కేటాయించవలసి వస్తుంది. స్వేచ్ఛగా ప్రతినిధులను పౌరులు ఎన్నుకోవటం ప్రజాస్వామ్యానికి ప్రాణం. అలా కాక ఫలానా వర్గాలవారికి మాత్రమే ఎన్నుకోవాలని చట్టపరంగా శాసించటం మౌలిక ప్రజాస్వామ్య సూత్రాలకు, ప్రాతినిధ్య సిద్ధాంతాలకు విరుద్ధం. ఆ కేటాయింపులు కొద్ది శాతానికి పరిమితమయితే ఏదో ఒక విధంగా సరిపెట్టుకోవచ్చు కాని అదే దాదాపు 50 శాతం (అన్ని వర్గాల కేటాయింపులు కలిపి) రిజర్వు చేయటం వల్ల ప్రజాస్వామ్యం పలచనవుతుంది. ప్రపంచంలో మరెక్కడా ఇలాంటి పరిస్థితి లేదు.

ఈ విధంగా నియోజకవర్గాలను కేటాయించటం ద్వారా మహిళలు ఎన్నికయినా, వారు నాయకత్వంలో ఎదగటం కష్టం. పేరుకి మహిళలు వచ్చినా వారు రాజకీయ పలుకుబడి ఉన్న మగవాళ్ల చేతుల్లో కీలుబొమ్మలయ్యే ప్రమాదం ఉంది. రిజర్వేషన్ ద్వారా మాత్రమే వచ్చిన కారణంగా వారికి ఆత్మవిశ్వాసం ఉండదు రాజకీయంగా ఎదగటం, నిలదొక్కుకోవటం, స్వంత పలుకుబడిని పెంచుకోవటం కష్టమవుతుంది. ప్రస్తుతం యస్.సి., యస్.టి వర్గాలవారిని కూడా పేరుకు రిజర్వేషన్ పేరుతో ఎన్నికయివచ్చినా, వాస్తవానికి వారికి రాజకీయంగా సొంత బలం లేకుండా పోయింది. అదే పరిస్థితి మహిళలకు కూడా ఎదురయ్యే అవకాశముంది. ఇంత పెద్దఎత్తున సీట్లను రిజర్వు చేయటంతో, శాశ్వతంగా వాటిని అలా కేటాయించటం సాధ్యం కాదు. సహజంగానే అందుకు తీవ్ర ప్రతిఘటన ఎదురవుతుంది. అందుకే రాజ్యాంగ సవరణ రొటేషన్ పద్ధతిన మహిళలకు రిజర్వుచేసిన సీట్ల కేటాయింపుల్ని ప్రతి ఎన్నికలోను మార్చాలని ప్రతిపాదించారు. అయితే ఇంత పెద్దఎత్తున సీట్లని రోటేషన్ చేస్తూ పోతే గతంలో నిలబడ్డ వారెవరూ ఈసారి పోటీ చేయటం సాధ్యం కాదు. అలాగే ఈసారి పోటీకి దిగినవారు వచ్చేసారి దూరంగా ఉండాల్సి వస్తుంది. ఇదే రొటేషన్ యస్.సి, యస్.టి సీట్లకు కూడా వర్తించాలని ఇప్పటికేఒత్తిడి ఉంది. ఇలా మొత్తం రిజర్వుడు సీట్లని రొటేషన్ పద్ధతితో మారుస్తూ పోతే మొత్త50 శాతం సీట్లలో కేటాయింపులు ప్రతి ఎన్నికలో రొటేషన్‌కు గురవుతాయి. అంటే ప్రతి ఎన్నికలో ప్రతి సీటుకీ సభ్యులు, అభ్యర్థులు విధిగా స్థానభ్రంశం చెందుతారు! ఇది ప్రజాస్వామ్యంలో అత్యంత హాస్యాస్పదమయిన పరిణామం. ఎన్నిక అనేది చివరికి లాటరీలాగా తయారవుతుంది. ఎవరికీ ఏ నియోజకవర్గంలోనూ ప్రజాబలం లేకుండా పోతుంది. ఒకసారి గెలిచాక మళ్లీ వచ్చే ఎన్నికలో పోటీ చేసే అవకాశం లేదని ఖాయంగా తెలిసినప్పుడు ఇక గెలిచినవాళ్లు పేట్రేగిపోయి అవినీతికి, అక్రమాలకు యధేచ్ఛగా, అడ్డూ ఆపు లేకుండా పాల్పడే అవకాశముంది. నిజాయతీగా సేవ చేద్దామనుకునే నాయకులు కూడా నీరసించిపోయే ప్రమాదముంది. ప్రతి ఎన్నికలో అంతా కొత్త వాళ్లు కావడంతో చట్టసభలు పేలవమవుతాయి. రాజకీయ నాయకత్వం కృత్రిమంగా, అసహజంగా తయారవుతుంది. ఎలాగైనా మహిళలకు ప్రాతినిధ్యం కావాలనుకునేవారు చాలామంది వేరే మంచి మార్గాలు వెతకకుండా ఏదో విధంగా ఈ బిల్లు చట్టం

కావాలని వాదిస్తున్నారు. కాని ప్రజాస్వామ్యాన్ని ఇంత మౌలికంగా ప్రభావితం చేసే ఈ అంశంమీద నిర్ణయం తీసుకునేటప్పుడు ఎంతో దూరదృష్టిని, విజ్ఞతని ప్రదర్శించాలి. మహిళా ప్రాతినిధ్యానికి వేఏ ప్రత్యామ్నాయలున్నాయా? జాగ్రత్తగా గమనిస్తే ఎన్నో ఉన్నాయి. 1952, 1957 సంవత్సరంలో జరిగిన సాధారణ ఎన్నికలలో యస్.సి, యస్.టి, వర్గాలవారిని బహుళసభ్య నియోజకవర్గాలలో ఎన్నుకున్నారు. ఇప్పుడు మహిళలను కూడా అలాగే ఎన్నుకోవచ్చని స్త్రీవాద ఉద్యమకారులు మధుకిష్వార్, రైతునాయకులు శరద్‌జోషి లాంటివారు ప్రతిపాదిస్తున్నారు. అలాగే దామాషా ప్రాతినిధ్య పద్ధతిన 50 శాతం సభ్యులను ఎన్నుకుని, ఆ 50 శాతం కేవలం మహిళలు, యస్.సి., యస్.టి., వర్గాలవారికి మాత్రమే కేటాయిస్తే సరిపోతుందన్నది మరో ప్రతిపాదన. అయితే ఇప్పటికే అప్రజాస్వామికంగా, నిరంకుశంగా వ్యవహరించే పార్టీల నాయకత్వాలు మరింతగా విశృంఖలంగా కేవలం తమ సొంత మనుషులకే దామాషా జాబితాలలో చోటు కల్పించి, తమ నాయకత్వాన్ని ఎదిరించేవాళ్లకి చోటు లేకుండా చేసే అవకాశం ఉంది. ప్రస్తుత ఎన్నికలలో ఎన్ని లోపాలున్నా అభ్యర్థి ఎంతో కొంతమేరకు నియోజకవర్గ  ప్రజలకు నచ్చకపోతే ఎన్నిక కావటం సాధ్యం కాదు. దామాషా ఎన్నికలో నాయకులు ఎవరి పేరు పెట్టినా ఓటర్లకు ఆ జాబితాలలో పని ఉండదు.

## పార్టీ సీట్లలో కేటాయింపు

మహిళలకు అత్యంత సహజంగా, శాశ్వత ప్రాతిపదికన, ప్రజాస్వామ్యబద్ధంగా తగిన ప్రాతినిధ్యం కల్పించటానికి అత్యుత్తమ మార్గం చట్టబద్ధంగా పార్టీల జాబితాలలో కేటాయింపులు చేయటం, ప్రధాన పార్టీలు మహిళలకు సీట్లిచ్చినపుడు వారు పురుషులతో సమానంగా గెలుస్తున్నారు. ఇప్పటివరకు ఎన్నికల ఫలితాలను దేశవ్యాప్తంగా చూస్తే నిజానికి పార్టీ అభ్యర్థులలో పురుషులకంటే మహిళలే ఎక్కువ శాతం ఎన్నికవుతున్నారు. ఎన్నికలలో పార్టీలు అభ్యర్థులను ఖరారు చేసేటప్పుడు విధిగా కనీసం మూడోవంతు సీట్లను మహిళలకే కేటాయించాలని చట్టం చేస్తే అత్యుత్తమ ఫలితాలు వస్తాయి. మహిళల జనాభా సగం ఉంది కాబట్టి, మూడో వంతుతో ఆపనక్కరలేదు. మహిళల కేటాయింపు సగం స్థానాలలో ఉండాలని చట్టం చేయవచ్చు. ఓటమికి గురయ్యే స్థానాలను మహిళలకు కేటాయించి, గెలిచే స్థానాలలో

పార్టీలు పురుషులకిస్తారని సందేహం కలగవచ్చు. అందుకు చక్కని పరిష్కారముంది. పార్లమెంటు ఎన్నికకు రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకుని, పోటీ చేసిన ప్రతి రాష్ట్రంలోను ఆ పార్టీ కనీసం మూడోవంతు, లేదా సగం స్థానాలను మహిళలకు కేటాయించాలని చట్టంలో నిర్దేశించాలి. ఏ స్థానం మహిళలకన్నది ఆ పార్టీ సొంత నిర్ణయం దానివల్ల విధిగా మహిళలను పోటీకి నిలబెట్టాల్సి ఉంటుంది. అదే సమయంలో ఆ నియోజకరవ్గంలో రాజకీయ పరిస్థితుల్ని, వివిధ అభ్యర్థుల బలాబలాలను, విజయావకాశాలను బేరీజువేసుకుని తమ అంచనాల మేరకు అభ్యర్థుల్ని నిలబెట్టే స్వేచ్ఛ పార్టీలకుంటుంది. ఆ విధంగా నాయకత్వం సహజంగా ఎదుగుతుంది. గెలిచిన మహిళా అభ్యర్థులకి, ఇతరలకు రోటేషన్ బెడద ఉండదు. తమ నియోజకవర్గంతో బాగా సేవచేసి తమ రాజకీయ బలాన్ని పెంచుకోవచ్చు. అలాగే కేవలం మహిళలన్న కారణంగా మాత్రమే సీటురాలేదు. కాబట్టి పురుషులతో కూడా పోటీ చేసి సీటు తెచ్చుకున్నారు కాబట్టి, చాలాసార్లు ఇతర పార్టీలకు చెందిన పురుష అభ్యర్థులపై గెలిచారు కాబట్టి ఆ మహిళా సభ్యులు నిజమైన నాయకులుగా గుర్తింపుపోంది ఎదుగుతారు. అలాగే శాసనసభకు జిల్లాను యూనిట్‌గా తీసుకుని, ప్రతి జిల్లాలోను ఒక పార్టీ పోటీ చేసిన సీట్లలో విధిగా మూడోవంతు లేదా సగం స్థానాలను మహిళలకే కేటాయించాలని చట్టంలో నిర్దేశించాలి. ఇలా పార్టీలు మహిళలకు ప్రాతినిధ్యం కల్పించకపోతే ఆ పార్టీ గుర్తింపు రద్దయ్యేలా, పార్టీ ఎన్నికల గుర్తు రద్దయ్యేలా చట్టం చేస్తే సరిపోతుంది. పార్టీలకు కూడా మహిళల స్థానాలలో తమ సిద్ధాంతాలనుబట్టి, రాజకీయ పునాదిని బట్టి వివిధ కులాలకు, వర్గాలకు చెందిన మహిళలకు సీట్లను కేటాయించే స్వేచ్ఛ ఉంటుంది. ఆ విధంగా వెనుకబడ్డ తరగతుల వారికి మైనారిటీలకు ప్రాతినిధ్యం కావాలనే ఆశయం నెరవేర్చుకోవటం పార్టీల నేతల చేతుల్లో ఉంటుంది. ఇలా పార్టీల సీట్ల కేటాయింపులో విధిగా మూడో వంతు, లేదా సగం సీట్లు మహిళలకు రిజర్వు చేయాలని చట్టం చేయటం చట్టసభలో మహిళల ప్రాతినిధ్యానికి అత్యంత సహజమైన, సులభమైన, ప్రజాస్వామికమయిన, సబబయిన మార్గం ఇలా మహిళల ప్రాతినిధ్యాన్ని అవకాశంగా చేసుకుని పార్టీలలో చట్టబద్ధ సంస్కరణలకు నడుంకట్టటం, నేరమయ రాజకీయానికి, అక్రమార్జనకు సమాధి కట్టటం నేటిపరిస్థితులలో అత్యవసరమయిన సంస్కరణలు.

* * *

# పార్టీ రహిత ప్రభుత్వాలు పరిష్కారం కాదు

*నవంబర్ 30, 1998*

మధ్యప్రదేశ్, రాజస్థాన్, మిజోరం రాష్ట్రాలలోను, ఢిల్లీలోను ఎన్నికలు చకా చకా జరిగిపోయాయి. రాజస్థాన్, ఢిల్లీ, మధ్యప్రదేశ్‌లలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏర్పాటవుతున్నాయి. అలాగే మిజోరంలో అధికార కాంగ్రెస్ పార్టీ ఓడిపోయింది. ఇంతవరకు విపక్షంలో ఉన్న పార్టీకి అందలం దక్కింది. ఏ పార్టీ గెలిచి, ఎవరు ఓడినా ప్రజలకు ఒరిగేదేమీ లేదనీ, నిరంతరం ఓటమికి గురయ్యేది ప్రజలేనని అందరికీ తెలుసు. ఈ ఎన్నికలు రాజ్యవ్యవస్థలో సంక్షోభాన్ని మరింతగా ప్రస్ఫుటం చేశాయి. కొన్ని కారణాల వల్ల మధ్యప్రదేశ్‌ను మినహాయించి – అధికారం ఉన్నవాళ్ళమీద ప్రజలకు జుగుప్స ఏ స్థాయిలో ఉందో ఈ ఎన్నికలు తేటతెల్లం చేశాయి. వీటి ప్రభావం ఆతుకుల బొంతలాగా ఉన్న కేంద్రంలోని సంకీర్ణ ప్రభుత్వం మీద పడే అవకాశం ఉంది. ఇప్పటికే తుమ్మితే ఊడే ముక్కులా ఉన్న కేంద్రప్రభుత్వం ఎప్పుడు హరీమంటుందోనని కొందరి భయం, ప్రతిపక్షాలు కూడా ఇంతకంటే స్థిరమయిన, సమర్థమయిన ప్రభుత్వాన్ని ఇచ్చే అవకాశం ఏ మాత్రం కనిపించడం లేదు. నేడో, రేపో కాకుంటే వచ్చే ఏడాది మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలలో ఎన్నికలు జరిగాక అయినాసరే మళ్ళీ లోక్‌సభకు మధ్యంతర ఎన్నికలు తప్పేటట్లు లేవు. మళ్ళీ అంచనాలు, ఊహగానాలు, విజయోత్సవాలు, ఓటమితో తలదించుకోవటాలు, ఆర్భాటాలు, ప్రదర్శనలు, వాగ్దానాలు, వైఫల్యాలు, ప్రజల ఆగ్రహాలు, ప్రతిపక్షాల ఆవేశకావేషాలు, మళ్ళీ ఎన్నికలలో అధికార పక్షం చతికిలపడటాలు – ఇవన్నీ చర్విత చర్వణమే.

## తరచూ ఎన్నికలపై విసుగు వద్దు

అడపాదడపా ఎన్నికలు వస్తున్నాయని బెంబేలు పడనక్కరలేదు. సంక్షోభంలో ఉన్న వ్యవస్థలో ఎన్నికలవల్ల మంచే జరుగుతుంది. రాజకీయ అస్థిరత్వం వల్ల ఏం నష్టం చేకూరదు. ఎందుకంటే అధిక సంఖ్యాబలంతో అధికారంలో పదిలంగా కూర్చుని దేశమంతా అగ్నికి ఆహుతవుతుంటే నీరో చక్రవర్తిలా తాపీగా అధికార భోగాలలో

మునిగి తేలటం వల్ల ఇంతవరకు భారతదేశానికి అనుకున్నంత మంచి ఏమీ జరగలేదు. ఇప్పుడు ప్రత్యేకంగా కలిగే హాని ఏమీలేదు. ఎన్నికల వల్ల రెండు మంచి పరిణామాలు సంభవిస్తాయి. అడపాదడపా ఎన్నికలు రావడంతో, తాము కోట్ల పెట్టుబడి పెట్టినా గెలుస్తామోలేదో తెలియక, గెలిచినా అధికారపక్షంలో ఉంటామోలేదో తెలియక, గెలిచినా అధికారపక్షంలో ఉంటామో లేదో ఊహించలేక, అధికారంలో ఉన్నా మళ్ళీ ఎన్నికలు ఎప్పుడొస్తాయోనని చాలామంది రాజకీయ బేహారులు బెదురుతూ ఉండవలసి వస్తోంది. అందువల్ల రాజకీయాన్ని లాభసాటి బేరంగా, జనాన్ని మోసం చేసి కోట్లు వెనకేయటానికి పనికొచ్చే వ్యాపారంగా భావించేవారు. వేరే మార్గాలు వెతుక్కోటాన్ని తరచూ వచ్చే ఎన్నికలు ప్రోత్సహిస్తాయి. అలాగే ఎన్నికల సమయంలో ప్రజలు చురుకుగా, చైతన్యవంతంగా వ్యవహరిస్తారు. మామూలుగా దుష్పరిపాలనకు అలవాటు పడిపోయి, జీవన సమరానికి అంకితమయిపోయి, కాలక్షేపానికి, వినోదానికి, వాస్తవాన్ని మరవడానికి సినిమాలలో లీనమయిపోయి, టీవీకి అతుక్కుపోయే సగటు మనిషికి ఎన్నికలు ఇచ్చే వినోదం మరేవీ కల్గించవు. దాంతో ఎన్నికల సమయంలో అనుభవం నేర్పిన పాఠాలను మననం చేసుకోవటం తేలికవుతుంది. ప్రస్తుతానికి ఎన్నికలకు సంబంధించిన కొన్ని సంస్కరణలపై దృష్టి సారించాలి. ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ ఎం.ఎస్.గిల్ మొత్తం మీద ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని సంతృప్తిపడ్డారు. 95,000ల పోలింగ్‌స్టేషన్లలో ఏకకాలంలో ఎన్నికలు జరిగినా, భద్రతా దళాలను విపరీతంగా మోహరించకపోయినా మొత్తంమీద హింస పెద్దగా చెలరేగలేదని ఆయన ఆనందపడ్డారు. అంతమాత్రంచేత ఎన్నికలు సజావుగా, నిజాయితీగా, పూర్తిగా స్వేచ్ఛగా, ప్రలోభాలు లేకుండా, రిగ్గింగుతో పనిలేకుండా జరిగాయని భావిస్తే పప్పులో కాలు వేసినట్లే. ఎవరికి బలం, పలుకుబడి ఉన్నచోటవాళ్ళు ప్రశాంతంగా రిగ్గింగ్ చేసుకున్నారని మాత్రమే అర్థం! ఎన్నికలు జరగాలంటే అధికారంలో ఉన్న ప్రభుత్వాలను అమాంతం రద్దు చేసి వాటి స్థానంలో ఎన్నికల నిర్వహణకు తాత్కాలికంగా నిష్పక్షపాతంగా ఉండే పార్టీ రహిత ప్రభుత్వమో, గవర్నర్ ఆధ్వర్యంలో రాష్ట్రపతి పాలనో పెట్టాలని గిల్ సెలవిచ్చారు. కొద్దిరోజుల క్రితం ఒక టి.వి. కార్యక్రమంలో ఆయన చేసిన ఈ సూచనకు ప్రేక్షకులలో నూటికి 95 మంది మద్దతు తెలిపారు. వంటినొప్పికి వీపుమీద చాచి తన్నటం మందుకాదు! అలాగే ఎన్నికలలో అవకతవలకు తాత్కాలికంగా పార్టీరహిత ప్రభుత్వాలను ఏర్పాటు చేయటం పరిష్కారం కానేకాదు. దీని సాధ్యాసాధ్యాలు అటుంచి, అసలీ వాదనలో ఏమున్నా పస ఉందేమో కొంచెం లోతుగా పరిశీలించడం

అవసరం. గత పాతికేళ్ళుగా అధికారంలో ఉన్న పార్టీలలో నూటికి 90 పాళ్ళు ఎన్నికలలో ఓడిపోయాయి! నిజంగా అధికార దుర్వినియోగమే ఎన్నికల లోపాలకు కారణమయితే మరి గద్దెమీద కూర్చున్నవాళ్ళు ఎందుకు ఓడుతున్నారు? ఇదంతా 1996లో బంగ్లాదేశ్‌లో జరిగిన ఆందోళనలను, ఆపైన జరిగిన రాజ్యాంగ సవరణలను, ఎన్నికల సమయంలో పార్టీ రహిత ప్రభుత్వం ఏర్పాటు చేసే సంప్రదాయాన్ని ప్రవేశపెట్టటాన్ని చూశాక గిల్‌కు కలిగిన ఆలోచన. 1996 పార్లమెంటు ఎన్నికల సమయంలో శేషన్ ఎన్నికల కమిషనర్‌గా ఉండగానే ఆయనకకు ఈ ఆలోచన వచ్చింది. ఏదో ఒకనాడు భారత్‌లో కూడా అలాంటి సంప్రదాయం రావాలని ఆనాడు ఆయన తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ఇప్పుడు సాక్షాత్తు ప్రధాన ఎన్నికల కమిషనర్ కాబట్టి ఆ భావాన్నే మళ్ళీ మళ్ళీ ప్రకటించి, అది గొప్ప సంస్కరణగా మురిసిపోతున్నారు. వాస్తవాలను పరిశీలిస్తే ఇదెంత అనాలోచిత సూచనో, ఎంత తొందరపాటో బోధపడుతుంది. ఇంతకు ముందే చర్చించినట్లు గత పాతికేళ్ళుగా అధికారంలో ఉన్న పార్టీలు చాలామేరకు ఓటమిపాలవుతున్నాయి. ఇప్పటి ఎన్నికలలో కూడా ఇదే ఫలితాలు కానవస్తున్నాయి. కాబట్టి సమస్యకు ఇది సమాధానం కాదు. ఎన్నికలలో దారుణకృత్యాలు, అధికార దుర్వినియోగం, హింస, దౌర్జన్యం, ధనప్రభావం, సారాయి ప్రవాహం చోటు చేసుకుంటున్నట్లు అందరికీ తెలుసు. మొత్తంమీద చూస్తే భారతదేశం పాకిస్థాన్ వంటిదో, బంగ్లాదేశ్ వంటిదో ఎన్నికల ఫలితాలనే తారుమారు చేసే మరో దిక్కుమాలిన నియంతృత్వం దేశం వంటిదో కాదు. ఎన్ని లోపాలున్నా ఎన్నికల ఫలితాలను ఇంతవరకు ప్రభుత్వాలు తారుమారు చేసిన దాఖలాలు లేవు. ఆ విషయం ఎన్నికల నిర్వహణలో అనుభవం ఉన్న అందరికీ తెలుసు. ఎన్నికల సమయంలో జరిగే అవకతవకలు, రిగ్గింగు తప్ప ప్రభుత్వ ప్రమేయంతో పోలింగుకు ముందుకాని, పోలింగు పూర్తయ్యాక కాని బ్యాలట్ పేపర్లు మార్చటం, ఓట్ల లెక్కింపు సమయాన పెద్ద స్థాయిలో తారుమారు చేయటం అసాధ్యం. ఎన్నికల ప్రక్రియలో అలా జరిగే అవకాశమే లేదు. 1977లో ఎమర్జెన్సీ వ్యతిరేక ప్రభంజనంలో సాక్షాత్తూ ఆనాటి ప్రధాని, అంతులేని అధికారానికి ప్రతీక అయిన ఇందిరాగాంధీయే రాయ్‌బరేలీలో ఓడిపోయాడు. ఆమె కుమారుడు సంజయ్‌గాంధీ ఆమేథీలో ఓడారు. అలాగే 1983లో కర్ణాటకలో ముఖ్యమంత్రి గుండూరావు సైతం ఓడారు. 1989లో మన రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా ఉన్న ఎన్.టి. రామారావు ఎంత జనాకర్షణ ఉన్నా కల్వకుర్తిలో ఓడిపోయారు. ఇలా అధికారంలో ఉన్న పార్టీలతో పాటు, మహామహులు కూడా ఓడిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి.

సమస్య స్వరూపాన్ని సమగ్రంగా అర్థం చేసుకోలేక, పిడుగుకీ బియ్యానికి ఒకే మంత్రాన్ని జపించటం వల్ల ప్రయోజనం లేకపోగా, మన దేశాన్ని కూడా పనికిమాలిన మూడో శ్రేణి నియంతృత్వ దేశాలలో ఒకటిగా అందరూ భావించే ప్రమాదం ఉంది.

## రోగానికి తగిన చికిత్స

భారతదేశంలో ప్రజల అసహనానికి, జుగుప్సకు, అధికార పార్టీ పట్ల వ్యతిరేకతకు ఎన్నికల ఫలితాలు నిదర్శనాలుగా అనిపిస్తాయి. అది వాస్తవం కూడా. మరికాస్త దగ్గరగా వెళ్ళి నియోజకవర్గం స్థాయిలో ఏం జరుగుతుందో పరిశీలిస్తే మరిన్ని విషయాలు అవగతమవుతాయి. అభ్యర్థులను ఖరారు చేసే సమయంలో పార్టీలన్నీ పరీక్షకు హాజరవబోయే విద్యార్థులలాగా ఉత్కంఠతో, భయాందోళనలతో ఉంటాయి. పైకి బింకంగా ఉన్నా, ఖచ్చితంగా గెలుస్తాం అని విశ్వసించే పరిస్థితి ఏ పార్టీకి ఉండదు. వ్యాఖ్యాతలు విశ్లేషణ చేసి ముందుగానే కొంతమేరకు ఊహించవచ్చు. అలాగే అధికార పక్షాలకు ఎదురుదెబ్బ తగ్గలటం రాజ్యవ్యవస్థ సంక్షోభానికి నిదర్శనమైంది. కాబట్టి, అదే జరుగుతుందని అంచనాలు వేయవచ్చు. అలాగే అధికార పక్షాలకు ఎదురుదెబ్బ తగలటం రాజ్యవ్యవస్థ సంక్షోభానికి నిదర్శనమైంది. కాబట్టి, అదే జరుగుతుందని అంచనాలు వేయవచ్చు. అలాగే ఎన్నికల రోజు దగ్గరపడేనాటికో, ఎన్నికల ఫలితాలు వచ్చాకో ప్రభంజనలు దగ్గరపడేనాటికో, ఎన్నికల ఫలితాలు వచ్చాకో ప్రభంజనలు వీస్తున్నాయనో, ఒక పార్టీ ప్రభంజనం లేదా ఉప్పెనలో అన్నీ తుడిచిపెట్టుకుపోయాయనీ చెప్పుకోవచ్చు. నిజానికి ఎన్నికలకు ఒకటి రెండు నెలల ముందు ఏ పార్టీకి తమ భవిష్యతు ఎలా ఉంటుందో తెలియదు. నేటి లోపభూయిష్ఠపు ఎన్నికల ప్రక్రియలో ధనమదం, కండకావరం, కులబలం, సారాయి ప్రవాహం ఎంత ఎక్కువగా ఉంటే అంత గెలిచే అవకాశాలు ఉంటాయని అందరికీ తెలుసు. అందువల్ల ఏదో ఒకరకంగా గెలుపు సాధించాలనే ఆశతో అవినీతిపరులకు, విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేసేవాళ్ళకు, పెట్టుబడికి పదిరెట్లు ఫలితాలు ఆశించేవాళ్ళకు, నేరచరిత్ర ఉన్నవాళ్ళకు టిక్కెట్లు ఇస్తారు. ఎన్నికలు అయ్యాక ప్రజాభిప్రాయం మేరకే ఒక పార్టీ గెలిచి, మరో పార్టీ ఓడినట్లు తెలుస్తుంది. నిశితంగా పరిశీలిస్తే గెలిచిన అభ్యర్థులలో అధిక సంఖ్యాకులు ఒకే రకంగా కనిపిస్తారు. గెలుపు ఏ పార్టీదైనా స్వైర విహారం చేసేది నేరచరిత్ర గలవాళ్ళు, డబ్బు విరజిమ్మేవాళ్లు, కులరక్కసిని రెచ్చగొట్టేవాళ్ళు మాత్రమే. అందుకే ఎన్నికల్లో ఎవరు గెలిచినా, మరెవరు ఓడినా ప్రజలకు దక్కేది మాత్రం నిరంతర ఓటమి మాత్రమే.

జనం పని  పెనం పైనుంచి పొయ్యిలో పడ్డట్టు అవుతోంది. జనం చేసేదల్లా మళ్ళీ ఎన్నికలు ఎప్పుడొస్తాయా, నిన్న గెలిచినవాళ్ళను మళ్ళీ ఓడించి కసి తీర్చుకునేది ఎప్పుడా అని చకోరపక్షుల్లాగా ఎదురుచూడటమే. ఎన్నికల సంఘం ఆలోచించవలసింది. ఈ విషవలయాన్ని ఛేదించడం ఎలాగా అని. పార్టీ అభ్యర్థుల ఎంపికలో, నేరమయ రాజకీయాన్ని అంతం చేయటంలో, అధిక వ్యయాన్ని అరికట్టటంలో ఎన్నికల సంఘం చొరవ తీసుకొని నిర్దిష్టమైన సంస్కరణలను సూచించి ప్రజాభిప్రాయాన్ని మలచటం చాలా అవసరం. అలాగే చట్టంతో నిమిత్తం లేకుండా ఎన్నికల నిర్వహణలో గణనీయమైన మార్పుని సాధించే చర్యలు కొన్ని ఉన్నాయి. విచక్షణతో ఆ చర్యల్ని చేపట్టకుండా ఎన్నికల సమయంలో ప్రభుత్వాలనే రద్దు చేయాలనే సవరణను ప్రతిపాదించటం నిరర్థకం. ప్రజలను వాజమ్మలను చేసి తప్పుదోవపట్టించి ఏదో ఫలితాలు సాధిస్తున్నట్లుగా భ్రమింపచేయటం తప్ప ఇలాంటి శుష్కవాదనల వల్ల ఏ మాత్రం ఫలితం  లేదు. చేతిలో ఉన్న చర్యలు మాని ఎక్కడో ఏదో కావాలని కోరటం ఉట్టికెగరలేనమ్మ స్వర్గానికి ఎగిరిన చందంగా ఉంటుంది. ఇటీవల మనదేశంలో ఇలాంటి అసంబద్ధ వాదనలకు, అనాలోచిత వ్యాఖ్యలకు పాల్పడి బాధ్యతలను విస్మరించటం  రివాజయిపోతోంది. రాజ్యాంగ సంస్థలు తమ బాధ్యతలను గుర్తెరిగి ప్రజలలో తర్కబద్ధమైన ఆలోచనల్ని రేకెత్తిస్తే అది పరిష్కారాలకు దారితీస్తుంది. అలాకాక వితండ వాదనలతో, డొంకతిరుగుడు సమాధానాలతో కాలం వెళ్ళబుచ్చితే సమస్య పరిష్కారం కాదు. మరింత క్లిష్టమవుతుంది.

* * *

# పదవుల కోసం ఆరాటం ప్రజాసేవకేనా?

*ఆగస్టు 27, 2001*

నడుస్తున్న చరిత్రను సరిగ్గా ఆకళింపు చేసుకోవాలంటే కొన్ని సందర్భాలలో ఓ కుటుంబాన్నో, ఓ గ్రామాన్నో పరిశీలించటం అవసరం. రాష్ట్ర వ్యాప్తంగా, దేశ వ్యాప్తంగా రాజకీయాల్లో పొడచూపుతున్న విషపోకడలు గ్రామ స్థాయికి ఎలా పాకాయో కొన్ని ఉదంతాలు కళ్లకు కట్టినట్లు చూపెడుతున్నాయి. ఉదాహరణకు కృష్ణాజిల్లా విజయవాడ సమీపంలోని పోరంకి గ్రామాన్ని తీసుకుందాం. ఆ గ్రామంలో సుమారు ఎనిమిది వేల మంది ఓటర్లున్నారు. ఇటీవలి గ్రామపంచాయితీ ఎన్నికలలో సర్పంచ్ పదవికి నలుగురు పోటీ చేశారు. ఆ పదవికి ఏ రిజర్వేషనూ వర్తించక పోవటంతో పోటీ బలంగా ఉంది. నలుగురిలో ఇద్దరు ప్రధాన పార్టీల వత్తాసున్న బలమైన అభ్యర్థులు. పేరుకు పార్టీ రహితంగా ఎన్నిక జరిగినా, పార్టీల ప్రభావం బలంగా ఉంది. పంచాయితీ ఎన్నికలలో టి.డి.పి. అభ్యర్థి తరపున ఓటుకు 300 రూపాయల చొప్పున 5200 ఓటర్లకు డబ్బు పంపిణీకే ఒక్క అభ్యర్థి 16 లక్షల రూపాయలు ఖర్చు చేశారు! అదీకాక గ్రామంలో వార్డు సభ్యులుగా తన ప్యానెల్‌లో పోటీచేస్తున్న వారికి డబ్బు పంచారు. ఎందుకంటే వారి సహకారం, గెలుపు ఉంటే తన గెలుపు సునాయాసమవుతుంది. పార్లమెంటు ఎన్నికలు జరిగితే అభ్యర్థుల డబ్బు పంచినట్లన్నమాట! సరే ఎన్నిక అనగానే సారాయి పంపిణీ మనకు అలవాటయిపోయింది. ఇవన్నీ కలిపి టి.డి.పి అభ్యర్థి కనీసం రూ.25 లక్షలయినా ఖర్చు చేశారని ఆ గ్రామంలో అంచనా.

## పరిమితులు లేని ఖర్చు

కాంగ్రెస్ అభ్యర్థి అంత డబ్బు ఖర్చు చేయకపోయినా, ఆయనేం తక్కువ తిన్నవాడు కాదు. అదే 5000 ఓటర్లకే తలా 150 రూపాయలు ఆయన తరపున పంచారు. అంటే ఓటర్లకు డబ్బివ్వటానికి, సారాయి పోయించటానికి, ఇతర ఖర్చులకు కలిపి రూ.15 నుంచి రూ.20 లక్షలు ఖర్చయిందని ఆ గ్రామంలో అంచనా. అంటే కేవలం ఓ గ్రామపంచాయితీ ఎన్నికకు ఇరువురు అభ్యర్థులు కలిసి రూ. 40 లక్షలకు పైగా ఖర్చు చేశారు! ఆ ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి గెలిచారు. ప్రతి ఓటరుకు రూ.150

పంచిన అభ్యర్థి, ఓటరుకు రూ.300 పంచిన అభ్యర్థి కంటే ఎక్కువ ఓట్లు ఎలా పొందారు? కాంగ్రెస్ అభ్యర్థి ఈ ఎన్నికలలో పోటీకి కొంత పొలం అమ్మేశారట. ఉన్న భూమిని అమ్మి మరీ తమకు డబ్బు పంచారని ఓటర్లుకు సానుభూతి ఉంది. అందుకని డబ్బు తక్కువ పంచినా, పడ్డ 'కష్టానికి'విలువ కట్టి ఎక్కువమంది ఓట్లు వేశారు! తీరా చూస్తే ఆ గ్రామ పంచాయితీ వార్షిక ఆదాయం 45 లక్షలు. అందులో జీతభత్యాల ఖర్చు 27 లక్షలు. చాలా పంచాయితీలో మాత్రం కూడా ప్రజా పనులకోసం డబ్బు మిగలదు. మన ఎన్నికలలో మరో విచిత్రం ఈ ఉదంతంలో బయటపడుతుంది. డబ్బు ఖర్చు చేస్తే గెలుస్తామని గ్యారంటీ లేదు. కోట్లు ఖర్చు చేసినా ఓడిపోవచ్చు కాని అసలు డబ్బు ఖర్చు చేయకపోతే మాత్రం ఓటమి ఖాయం. టి.డి.పి. అభ్యర్థి కన్నా తక్కువ ఖర్చు చేసిన కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు సాధ్యమయింది. కాని కాంగ్రెస్ అభ్యర్థి అసలు డబ్బు ఖర్చుచేయకపోతే మాత్రం ఓటమి ఖాయమయ్యేది! కేవలం గ్రామ పంచాయితీ స్థాయి ఎన్నికలకు ఇంతింత ఎందుకు ఖర్చు పెడుతున్నారు? అసలు అసెంబ్లీ ఎన్నికలకే చట్ట ప్రకారం అభ్యర్థి పెట్టే ఖర్చు ఆరు లక్షల రూపాయలకు మించరాదు. అలాంటిది ఓ గ్రామానికే ఇద్దరు అభ్యర్థులు కలిసి రూ.40 లక్షలు ఎలా ఖర్చు పెట్టారు? పైగా పంచాయితీలను పెద్దగా అధికారాలు లేవని అందరికీ తెలుసు. ఇదేదో పోరంకి గ్రామంలో మాత్రమే జరిగిన అసాధారణ సంఘటనేమీ కాదు. చాలా గ్రామాలలో ఇదే జరుగుతోంది. సమీపంలో ఉన్న పెనమలూరు గ్రామంలో కోటి రూపాయలు ఖర్చయిందని, కానూరు గ్రామంలో కోటిన్నరకు చేరిందని అంచనాలు. పోనీ అదేదో కాస్త డబ్బున్న కృష్ణాజిల్లాకే పరిమితమనుకుంటే పొరపాటు. రాయలసీమలో వెయ్యి ఓట్లున్న గ్రామాలలో ఇద్దరు అభ్యర్థుల ఖర్చు పది లక్షలదాకా అయిన సందర్భాలున్నాయి. తెలంగాణాలో అంత ఖర్చు కనిపించకపోయినా, తక్కువేమీ కాదు. రాష్ట్రం మొత్తంలో ఇలా చూస్తే కేవలం గ్రామ పంచాయితీ ఎన్నికలకే రూ.500 కోట్లు ఖర్చయిన దాఖలాలు కనిపిస్తున్నాయి. అసలే వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందని మనందరికీ తెలుసు. గ్రామాలలో నిరుద్యోగం తాండవిస్తోంది. పంచాయితీలకు పెద్దగా నిధులు లేవు. అధికారాలు అసలే లేవు. అయినా ఇంతింత డబ్బు ఎలా ఖర్చుచేస్తున్నారు?

మన సమాజంలో ఆడంబరం, దర్పం, బడాయి ప్రధాన పాత్ర వహిస్తున్నాయి. తల్లిదండ్రులిచ్చిన ఆస్తిపాస్తులు తప్ప మరే స్వయం ప్రకాశం లేని వాళ్ళలో కూడా

ఏదో విధంగా అధికారం చేతబుచ్చుకుని  తమ 'ప్రతాపం' ప్రదర్శించాలనే కోరిక బలంగా ఉంది. 'అధికారం' కేంద్రంగా సమాజంలో అన్నీ దానిచుట్టూ పరిభ్రమించటం అందుకు కారణం. ప్రతి సంస్థలోను, క్లబ్బులోను, విద్యార్థి సంఘంలోను ఎన్నిక అనగానే మనకు పూనకం వస్తుంది! విద్యార్థి సంఘం ఎన్నికలకు లక్షలు ఖర్చుపెట్టిన సందర్భాలేనకం ఉన్నాయి. క్లబ్బు ఎన్నికలకు లెక్కకుమించి ఖర్చు పెట్టడం ఆనవాయితీ అయిపోయింది. ఇక కొంత భూమిగాని, ఇతర ఆస్తులు కాని, దోచుకునే అవకాశం గాని ఉన్న సంస్థలలో ఎన్నికలంటే పెట్టే ఖర్చుకు అంతే ఉండదు. సాధారణ ఎన్నికలలో జరిగే రిగ్గింగు, దొంగఓట్లు, ప్రలోభాలు, మోసాలు, అక్రమాలు – అన్నీ ఈ సంస్థల ఎన్నికలలో చోటు చేసుకుంటున్నాయి. ఇలా పోటీచేసి డబ్బు ఖర్చు చేసే వాళ్ళలో నూటికి 80 మంది ఎందుకూ కొరగాని వాళ్ళు! అయినా అధికార కాంక్ష, పటాటోపం మాత్రం విపరీతంగా కనిపిస్తాయి. అదే పంచాయితీలలో కూడా కనిపిస్తోంది. మంచి పేరున్న వాళ్ళు, డబ్బు ఖర్చు చేయకుండా తన నిజాయితీవల్ల సేవల వల్ల గెలిచే వాళ్ళు లేకపోలేదు. కాని అలాంటి వారి సంఖ్య చాలా తక్కువ. ఎనిమిదేళ్ళ క్రితం నేను నెదర్లాండ్సులో ప్రసిద్ధ సహకార బ్యాంకయిన రాబో బ్యాంకును సందర్శించాను. ఆ బ్యాంకు అత్యున్నత ప్రమాణాలతో నడుస్తున్న ఆర్థిక సంస్థ. మనదేశంలో అన్ని వాణిజ్య, సహకార బ్యాంకుల మొత్తంలో ఉన్న డిపాజిట్ల కంటే ఆ ఒక్క బ్యాంకులో రెట్టింపు డిపాజిట్లున్నాయి! ఆ బ్యాంకులో మొత్తం మూడు లక్షల మంది సభ్యులున్నారు. వాళ్ళ ప్రాథమిక సహకార బ్యాంకుకు (మన వ్యవసాయ పరపతి సంఘం లాంటి) ఎన్నిక జరిగితే పెద్దపోటీగాని, సంరంభం గాని కనిపించవు. నిజానికి నూటికి 90 సందర్భాలలో సభ్యులు తమలో మంచి సామర్థ్యం, అనుభవం ఉన్నవాళ్లను బతిమిలాడి, ఒప్పించి పదవిలో కూర్చొబెడతారు. పదవిని చేపడితే ఎన్నో బాధ్యతలుంటాయని, ఎంతో సమయాన్ని అందుకు కేటాయించవలసి వస్తుందని, సొంత వ్యాపారం లేదా వృత్తి కుంటుపడతాయని, కుటుంబంతో గడిపే సమయం తగ్గిపోతుందని, వ్యక్తిగత జీవనంలో ఇబ్బందులుంటాయని వారందరికీ బెరుకు. అందుకే ఎన్నికలలో పోటీ చేయటానికి ముందుకురారు. ఆ సంస్థలలో అపారంగా వనరులున్నాయి. ఎవరికయినా అప్పులిచ్చే అధికారం ఉంది. విపరీతమయిన లాభాలున్నాయి. అయినా ఎన్నికలలో నెగ్గి పదవిని చేపడితే డబ్బు సంపాదించవచ్చనే  ఆలోచనే వాళ్లకు తట్టదు! అలా ప్రాథమిక సంఘాలలో ఎన్నికయిన వాళ్లంతా కలిసి రాబో బ్యాంకు పాలకవర్గాన్ని ఎన్నుకుంటారు. బ్యాంకుకు 15 మంది సభ్యులతో పాలకవర్గం ఉంది. నెదర్లాండ్సులో

సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా ఆ బ్యాంకుకు ప్రముఖ స్థానం ఉంది. అంతకంటే పెద్ద వాణిజ్య బ్యాంకులు ఆ దేశంలో ఉన్నా, అది సహకార బ్యాంకు కావటం వల్ల, మూడు లక్షల కుటుంబాలను ప్రభావితం చేయటం వల్ల ఆ చిన్నదేశంలో రాబో బ్యాంకుకు అంతటి ప్రాముఖ్యం ఉంది. కాబట్టి సహజంగానే దేశ రాజకీయంలో ప్రధాన పాత్ర వహిస్తున్న నాయకులు చాలామంది రాబో బ్యాంకు పాలకవర్గంలో సభ్యులు. 15 మంది సభ్యులలో 14 మంది ఆనాడు దేశంలో అధికార పార్టీకి చెందినవారు. ఒక్కరు మాత్రం ప్రతిపక్షానికి చెందినవారు. బ్యాంకు అధ్యక్ష పదవి చాలా కీలకమయింది. ఆ సంస్థ భవిష్యత్తును పూర్తిగా నిర్దేశించే అధికారం, బాధ్యత అధ్యక్షుడిదే. బ్యాంకు 180 సంవత్సరాల చరిత్రలో ఆరుగురే అధ్యక్షులుగా పనిచేశారు. అత్యంత సమర్థుణ్ని అధ్యక్షుడుగా ఎన్నుకోవటం, ఓసారి అధ్యక్షుడయ్యాక ఆయనకు ఓపిక ఉన్నవాళ్ళు అతడి నాయకత్వాన్నే కొనసాగించటం ఆ బ్యాంకులో ఆనవాయితీ. నేను వెళ్ళిన సమయంలోనే అధ్యక్షుడి ఎన్నిక జరిగింది. మొత్తం 15 మంది సభ్యులలో 14 మంది అధికార పార్టీకి చెందిన వారున్నప్పుడు వారిలో ఒకరు అధ్యక్షులు కావటం, ఎంతో ప్రతిష్ఠ. అధికారం ఉన్న ఆ పదవికి పోటీలు పడటం మనకు సహజం. కాని నెదర్లాండ్సులో రాబో బ్యాంకులో మాత్రం అందరూ ఏకగ్రీవంగా ప్రతిపక్షానికి చెందిన ఒకే సభ్యుణ్ణి అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు! అదేదో అధికార పక్షంలో ఎవరు గెలవాలో ఒప్పందం కుదరక రాజీపడి చేసుకున్న నిర్ణయం కాదు. ఏ పోటీ లేకుండానే, ఆ సభ్యులంతా వచ్చే 25-30 సంవత్సరాల పాటు బ్యాంకు భవిష్యత్తును గురించి స్వచ్ఛందంగా, సంతోషంగా, ఆలోచించి నిర్ణయం తీసుకున్నారు. ఇది తెలిసిన నా ఆశ్చర్యానికి అంతులేదు. ఆ సభ్యులను ఎందుకిలా చేశారని ప్రశ్నించినప్పుడు వారిచ్చిన సమాధానం విని నేను అవాక్కయ్యాను. “బ్యాంకు అధ్యక్షుడు వచ్చే 30 ఏళ్లపాటు దాని భవిష్యత్తును నిర్దేశిస్తారు. మా అందరిలో భవిష్యత్తు పట్ల అవగాహన, ఆర్థిక విషయాలలో స్పష్టత, ముందుచూపు, సామర్థ్యం ఉన్న వ్యక్తి ఆయన. అందుకే అందరం కలిసి ఆయనను ఆ పదవిని చేపట్టమని కోరాం” అని వారు చెప్పారు! ఆ పరిస్థితికి, మన పరిస్థితికి ఎంత తేడా ఉందో వివరించనక్కరలేదు. మన మండల, జిల్లా పరిషత్తు ఎన్నికలు పూర్తికాగానే అధికార పార్టీ అధ్యక్షుడు తన పార్టీ శ్రేణులకు “ఇక సహకార సంఘాల ఎన్నికలకు సిద్ధపడండి. అందులో బలాబలాలు తేల్చుకుందాం” అని పిలుపిచ్చినట్లు పత్రికల్లో వార్తలచ్చాయి. ప్రతిసంస్థలో, ప్రతి రంగంలో పార్టీల రాజకీయాన్ని చొప్పించి, గందరగోళాన్ని సృష్టించి, చివరికి జనజీవనాని అతలాకుతలం

చేసి మన రాజకీయాన్ని, అధికార లాలసను చూస్తే మనం ఎంతగా ఎదగాల్సి ఉందో అర్థమవుతుంది.

## పెరుగుట విరుగుట కొరకే

మరి ఇంత దారుణంగా ఖర్చుపెట్టి స్థానిక ప్రభుత్వాలలో గెలిచాక అక్కడ కూడా భవిష్యత్తు మన రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలలలాగానే ఉంటుందా? లంచాలు, అవినీతి, ప్రజాధనం, దోపిడీ, అధికార దుర్వినియోగం నిర్విఘ్నంగా సాగుతాయా? మరి స్థానిక ప్రభుత్వాల ఏర్పాటు కోసం, వాటికి అధికారాలు అప్పగించటం కోసం మనమంతా చేస్తున్న పోరాటం వ్యర్థమేనా? అంత నిరాశ అక్కరల్లేదు. ప్రతిష్ట కోసం, భేషజం కోసం ఖర్చు పెట్టినా, ఇంత డబ్బు పోయాక అధిక సంఖ్యాకులు అవినీతికి పాల్పడటం ఖాయం. అయితే పంచాయితీలకి అధికారాలు లేవు కాబట్టి, ఇంత సొమ్ము పోయాక అధికారాలు  కూడా లేకపోతే ఎలాగని స్థానిక ప్రభుత్వాల ప్రతినిధులు పోరాడటం ఖాయం. ఓసారి అధికారం వచ్చాక తప్పులు చేస్తే, అవినీతికి పాల్పడితే ప్రజలకు కనువిప్పు కలగటం ఖాయం. వంద రూపాయలకు ఓటమ్ముకోవటం కన్నా మంచి వ్యక్తిని ఎన్నుకుని ఐదువేల రూపాయల విలువయిన లబ్ధిని మంచిపాలన ద్వారా, సౌకర్యాల ద్వారా పొందటం మెరుగని కాలక్రమేణా ప్రజలు తెలుసుకోవటం ఖాయం. అలాగే గ్రామ పంచాయితీల ఎన్నికలలో ఇంతింత డబ్బు రుచిచూసిన ఓటర్లు రేపు శాసనసభ ఎన్నికలలో మరింత డబ్బు కోసం చేయి చాపుతారు. పార్టీలు, అభ్యర్థులు కోట్లకొద్దీ ఖర్చు చేయాల్సి వస్తుంది. కాలం గడిచిన కొద్దీ ప్రభుత్వాల నుంచి అంత దోపిడీ చేసే అవకాశం కూడా లేక చాలామంది దివాలా తీయటం ఖాయం. రాజకీయం పేరుతో చేస్తున్న ఈ ఖర్చు కొన్ని కుటుంబాలను వీధిన పడవేస్తేనే అధికార మదోన్మత్తులయిన రాజకీయ నాయకులు ఈ ఉన్మాదం నుంచి బయటపడతారు. కాబట్టి 5-10 సంవత్సరాలలో రాజకీయంలో పరిణితి వస్తుంది. అధికార వికేంద్రీకరణ జరిగి ప్రజలకు తమ ఓటుకు, తమకందే సేవలకు మధ్య సంబంధం  బోధపడుతుంది. ఈలోగా ఈ కోట్ల రూపాయల ఖర్చు ఈ ఉన్మాదం, ఓట్ల కొనుగోలు, ప్రజాధనం దోపిడీ తాత్కాలికంగా తప్పవు. పెరుగుట విరుగట కొరకే!

* * *

# తరతమ భేదాలతో అన్నీ ఆ తాను ముక్కలే!

*జూన్ 03, 2002*

గతవారం జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ, రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ (టి.డి.పి) తమ వార్షిక సమావేశాలను ఆర్భాటంగా జరుపుకున్నాయి. రాజకీయంగా బద్ధశత్రువులైన ఆ రెండు పార్టీలూ మన రాజకీయాల్లో వైవిధ్యానికి ప్రతీకలు. కాంగ్రెస్ దేశంలోని అతిపెద్ద రాజకీయ సంస్థ. బహుశా దేశంలో ప్రతి గ్రామంలోను సభ్యులు, అభిమానులు, ఓటర్లు ఉన్న ఏకైక పార్టీ కాంగ్రెస్. ఆ పార్టీకి 117 సంవత్సరాల చరిత్ర ఉంది. స్వతంత్ర పోరాటంలో కాంగ్రెస్ పాత్ర నిరూపమానమయినది. నిజానికి ఆధునిక భారతదేశ చరిత్రను కాంగ్రెస్ నుంచి వేరు చేయలేం. ఎన్నో వైరుధ్యాలు, వైవిధ్యాలు, భాషలు ఉన్న సంక్లిష్ట భారతాన్ని సమైక్యంగా ఉంచటంలో కాంగ్రెస్ గణనీయమైన పాత్ర వహించింది. గత 55 సంవత్సరాలుగా పాలన, ప్రభుత్వ విధానాలు, సమాజం, ఆర్థిక వ్యవస్థలపై కాంగ్రెస్ ప్రభావం ఇతోధికంగా ఉంది. ప్రతిపక్షంలో ఉన్నా నేటికీ దేశంలోని అతిపెద్ద, అతి ప్రధానమైన పార్టీ కాంగ్రెస్. ఇక తెలుగుదేశం విషయానికి వస్తే దేశ రాజకీయాలలో కీలకపాత్ర వహిస్తున్న ప్రాంతీయ పార్టీ అది. ఎన్నో పార్టీల పేర్లు మారినా గతంలో ఉన్న పార్టీలకు సంప్రదాయాలకు అవి వారసత్వ సంస్థలు. తెలుగుదేశం పార్టీ 20 ఏళ్ళ క్రితం – కాంగ్రెస్ సంస్కృతికి, అవినీతికి, కుటుంబ రాజకీయాలకు వ్యతిరేకంగా ఆవిర్భవించింది. ఆ పార్టీకి 1982 కి పూర్వం రాజకీయ చరిత్ర లేదు. అయినా ఈ 20 ఏళ్ళలో 15 సంవత్సరాల పాటు తెలుగుదేశం పార్టీ మన రాష్ట్రానికే పరిమితం. సహజంగానే టి.డి.పి, విధానాలు, లక్ష్యాలు ప్రాంతీయమైనవి. కొన్ని అంశాలపై జాతీయ దృక్పథం ఉన్నా ఆ పార్టీ దృష్టి ప్రధానంగా రాష్ట్ర రాజకీయాల మీద, ఇక్కడి ప్రజల మనోభావాల మీద ఉంటుంది.

### కాంగ్రెసుకు నకలుగా మారిన పార్టీలు

అన్ని వైరుధ్యాలున్నా ఈ రెండు పార్టీల సమావేశాలు ఒకే తీరున జరిగాయి. రెండు పార్టీలలో ఉన్నది ఏక వ్యక్తి నాయకత్వమే. రెండింటిలోను వ్యక్తి, ఆరాధన, పూర్తి అధికార కేంద్రీకరణ, నినాదాల హోరు, విధానాలలేమి, ప్రత్యర్థులపైన తిట్ల

వర్షాలు, స్తోత్కర్ష కొట్టొచ్చినట్టు కనిపించాయి. కాంగ్రెస్ పార్టీలో ప్రబలిన అవినీతి, అహంకారం, అధికార వికేంద్రీకరణ, కుటుంబపాలనతో కూడిన కుహనా రాజకీయ సంస్కృతికి నిరసనగా దేశంలో ఎన్నో రాజకీయ పార్టీలు పుట్టాయి. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం కోసం ప్రజలలో పెల్లుబికిన ఆరాటం నుంచే తెలుగుదేశం పార్టీ కూడా పుట్టింది. విచిత్రమేమిటంటే ఆ రెండు పార్టీల నిర్వహణ, అనుసరిస్తున్న పద్ధతులు ఒకే విధంగా ఉన్నాయి. ఇది కేవలం ఓ పార్టీకి మాత్రమే వర్తించదు. వామపక్షాలను మినహాయించి దేశంలో అన్ని ప్రధాన రాజకీయపక్షాలూ కాంగ్రెస్ పార్టీ సంస్కృతిని పూర్తిగా వంటబట్టించుకున్నాయి. అవన్నీ కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా కాక, ప్రతిరూపాలుగా తయారయ్యాయి. భారతీయ జనతాపార్టీ కాంగ్రెస్ కంటే భిన్నమైనదని, నూతన రాజకీయ సంస్కృతికి శ్రీకారం చూడుతుందని, తనదైన వరవడిలో దేశ భవిష్యత్తును ప్రభావితం చేస్తుందని అధికారం సొంతలాభం కోసం కాక ప్రజల సంక్షేమం కోసమని రుజువు చేస్తుందని చాలామంది ఆశించారు. కానీ కాలక్రమేణా ఆ పార్టీ కూడా కాంగ్రెస్ సంస్కృతికి దాసోహమంది. ఏ అంశాలలో కాంగ్రెస్‌ను అనుకరించరాదో ఎక్కడ అనుకరిస్తోంది. అధినాయకత్వ ఆరాధన, అధికార కేంద్రీకరణ, రాష్ట్ర శాఖలపైన పూర్తి పెత్తనం – నేరచరితులకు, అక్రమార్జనపరులకు పెద్దపీట వేయటం, అవినీతి పునాదులపైన రాజకీయాన్ని నడపటం – ఇవన్నీ దేశంలోని రెండు ప్రధాన జాతీయ పార్టీలకు ఉమ్మడి లక్షణాలైపోయాయి. కాంగ్రెస్ కంటే భిన్నంగా ఉందనుకునే అంశాలలో ఛాందసవాదం, ఊహాజనిత గత వైభవస్మరణం, మతం పేరిట సమాజాన్ని విభజించే సంకుచితవాదం, అల్ప సంఖ్యాకవర్గాలలో అభద్రత భావాన్ని పెంచే దుందుడుకు చర్యలు కానవస్తున్నాయి.

ఇక ఇతర పార్టీల తీరును పరిశీలిస్తే, అవి ఆవిర్భవించిన నాటి భావాలు, ఆశయాలు, లక్ష్యాలు అడుగంటిపోయాయి. దళితులను రాజకీయంగా సంఘటితం చేసి వారి జీవన పరిస్థితులను సమూలంగా మార్చాలన్న సదాశయంతో బహుజన సమాజ్‌వాదీ పార్టీ (బి.ఎస్.పి) ఏర్పాటైంది. ఆ పార్టీ తరపున మాయవతి మూడుసార్లు దేశంలో అతిపెద్ద రాష్ట్రమయిన ఉత్తరప్రదేశ్‌కు ముఖ్యమంత్రి అయ్యారు. కాని పరిపాలనలో ఆ పార్టీ తీరును చూస్తే పదవుల పందారాలు, అధికార దుర్వినియోగం, ఎడాపెడా అక్రమార్జన ప్రధాన లక్షణాలుగా కనిపిస్తున్నాయి. ఆటగాళ్ళు మారారు కాని, ఆట నియమాలు మారలేదు. దళితుల పేరుతో గద్దెనెక్కినా, దీనజన జీవనాన్ని ప్రభావితం చేసే విధానాల రూపకల్పనలోను, సమాజంలోగాని, ఆర్థిక వ్యవస్థలోగాని,

వారికి కీలకపాత్ర  కల్పించే విద్యావ్యవస్థను రూపొందించటంలోను పూర్తిగా ఆ పార్టీ విఫలమయింది. నియంతృత్వానికి వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడి 1977లో తొలిసారిగా జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌ను గద్దెదింపిన జనతాపార్టీని, ఆ పార్టీ నుంచి వేరుపడ్డ ఇతరపక్షాల పరిస్థితిని పరిశీలిస్తే, కాంగ్రెస్ సంస్కృతి మన రాజకీయాలను ఎంతగా ప్రభావితం చేసిందో తెలుస్తుంది. కాంగ్రెస్‌కు, ఆ పార్టీలకు మధ్యనున్న ఒకే తేడా ఏమిటంటే కాంగ్రెస్ ఏకవ్యక్తి నిరంకుశత్వంలో సంఘటితంగా కనిపిస్తుండగా, ఆ పార్టీలు ముక్కలు చెక్కలయిపోయాయి. అలా వేరుపడ్డ ముక్కలలో రాజకీయంగా బలం సంతరించుకున్న పార్టీలో మళ్ళీ కాంగ్రెస్ మార్కు ఏక వ్యక్తి పాలన కనిపిస్తుంది. ఉదాహరణకు సమాజ్‌వాది పార్టీ ములాయం సింగ్ యాదవ్ జేబు సంస్థ...రాష్ట్రీయ జనతాదళ్ లాలూప్రసాద్ యాదవ్ కుటుంబ ఆస్తి... మిగిలిన వాళ్ళకంటే రెండడుగులు ముందుకు వేసి లాలూ తన భార్యకే ముఖ్యమంత్రి  పదవిని అప్పగించి తాను రిమోట్ కంట్రోల్‌తో ప్రభుత్వాన్ని నడుపుతున్నారు.  బీహార్‌లో ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు లాలూనే ముఖ్యమంత్రిగా భావించి ఆ విధంగానే సంబోధిస్తున్నారు! ఫెడరల్ స్ఫూర్తితో, అగ్ర కులాల దురంహకారానికి వ్యతిరేకంగా, దక్షిణాది భాషల పరిరక్షణ కోసం, ద్రవిడ సంస్కృతిని సగర్వంగా చాటడం కోసం పుట్టిన డి.ఎం.కె. దాని నుంచి వేరుపడ్డ ఎ.ఐ.ఎ.డి.ఎం.కె – రెండూ ఒక్క పేరుతో తప్ప మిగతా అన్ని రకాలుగా కాంగ్రెస్ పార్టీని అనుకరిస్తున్నాయి. ఇలా దేశంలో అన్ని పార్టీలు కాంగ్రెస్ తానులో ముక్కలుగా తయారయ్యాయి. ఎవరి చేతిలో పార్టీ పగ్గాలంటే వారి జేబు సంస్థలుగా, సొంత ఆస్తులుగా పార్టీలు మారిపోయాయి. పార్టీల కార్యకర్తలలో కూడా అధికశాతం మంది పార్టీలను కేవలం తమ స్వప్రయోజనాల కోసం తమను అందలాలెక్కచడం కోసం, తమ ప్రత్యర్థులను అణచివేయటం కోసం, అధికారాన్ని దుర్వినియోగం చేయడం కోసం ఉపయోగపడే సాధనాలుగా భావిస్తున్నారు.

పార్టీలలో నిజాయితీపరులు, సమాజ శ్రేయసు కోసం తపనపడేవారు, ప్రజాస్వామ్య సమాజాన్ని నడపటానికి, రాజకీయం నిర్వహించటానికి పార్టీలను సరైన వేదికలుగా భావించేవారు లేకపోలేదు. కాని అలాంటి వారి స్థితి కుడితిలో పడ్డ ఎలుకల చందాన తయారయింది. వివిధ వర్గాల ప్రయోజనాలను సమన్వయం చేసి ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల్ని భాగస్వాములుగా చేయటం కోసం ఆవిర్భవించిన పార్టీలు తమ విధి నిర్వహణలో పూర్తిగా విఫలమయ్యాయి. అవి కేవలం నాయకులు అధికారాన్ని పొంది, సొంత ఆస్తులను పెంచుకునేందుకు ప్రజాధనాన్ని ఏదో ఒక రూపేణ దోచుకునేందుకు పనికివచ్చే

సాధనాలుగా మారిపోయాయి.

## దూరమవుతున్న మధ్యతరగతి

ప్రజాస్వామ్యం ప్రధానంగా మధ్యతరగతి వారి వ్యవస్థ. స్వేచ్ఛ, ఆస్తిహక్కు, చట్టబద్ధపాలన ఈ మూడు సంపద సృష్టికి మూలస్తంభాలు. సంపదను స్వేచ్ఛగా సృష్టించాలని, ఆ విధంగా తాము పై కెదగాలని మధ్యతరగతి వారు నిరంతరం ఆరాటపడుతుంటారు. వారు సృష్టించిన సంపదతో సమాజ అవసరాలు తీరి అందరికీ మేలు చేకూరుతుంది. ఈ సమాజ ప్రయోజనమే ప్రజాస్వామ్యానికి, మధ్యతరగతి వారి ఆరాటానికి నైతిక ఆలంబన. అందుకే నిజమైన ప్రజాస్వామ్యం బతికి బట్టకట్టాలన్నా. సజావుగా నడవాలన్నా మధ్యతరగతి వారి పాత్ర చాలా కీలకమైనది. రాజకీయాలు అక్రమ వ్యాపారంగా, లంచగొండుల నెలవుగా మారటంతో ఎన్నికలలో హింసకు, నేర ప్రవృత్తికి, సీట్ల కొనుగోలుకు ప్రాధాన్యం పెరగటంతో ఎంతో కొంత శాతం నైపుణ్యం, విజ్ఞత, విలువలు ఉన్నవారు ఆ రాజకీయాలను, ఎన్నికలను ఆసహ్యించుకోవటం మొదలుపెట్టారు. ఎవరైనా మంచి ప్రతిభ ప్రదర్శించే యువతీ యువకులు రాజకీయంలోకి వెళ్ళాలని ఆరాటపడితే వారి కుటుంబాలు, సమాజం వారిని ఎద్దేవా చేస్తున్నాయి. కేవలం అసమర్థులు, ఎందుకూ కొరగానివాళ్ళు, విద్యలో ప్రతిభ ప్రదర్శించలేనివాళ్ళు మాత్రమే రాజకీయాల్లో చేరతారనే భావం సమాజంలో ప్రబలిపోయింది. అలాంటి వాళ్ళ ప్రాబల్యం పెరిగిన కొద్దీ రాజకీయాలు మరింత జుగుప్సాకరంగా తయారవుతున్నాయి. పరిస్థితి చెడిపోతున్న కొద్దీ మంచివాళ్ళు మరింత దూరమవుతున్నారు. ఇలా ఇదో విష వలయంగా మారింది.

## గుత్తాధిపత్యానికి తెరపడాలి

ప్రజాస్వామ్యంలో మార్పు కావాలంటే అందుకు మార్గం రాజకీయాలు, ఎన్నికలు. సమర్థులు, సచ్ఛీలురు, సదాశయంతో రాజకీయ ప్రవేశం చేసి, సమస్యలకు పరిష్కారాలను అన్వేషించి, ఆ మార్గాల్ని ప్రజలముందు పెట్టి, వారి మద్దతు పొంది, అధికారంలోకి వచ్చాక ఆ మార్పులను సాధించడం మంచి ప్రజాస్వామ్యాలలో నిరంతరం జరిగే ప్రక్రియ కాని రాజకీయాలు, ఎన్నికలు సమస్యకు పరిష్కారాలు కాకుండా అసలు అవే సమస్యలై కూర్చున్నాయి. దీనివల్ల మన పరిస్థితి మరింత జటిలమైంది. దాన్ని మార్చాలంటే రాజకీయ పార్టీల తీరు తెన్నులను మార్చాలి. కాని పార్టీలలో తిష్టవేసుకుకూర్చున్న గుత్తాధిపతులకు ఈ మార్పులు రుచించవు. ఎందుకంటే

సంస్కరణల వల్ల నష్టపోయే మొదటివర్గం ఈ ఆధునిక జమీందారులే! పార్టీల నిధుల సమీకరణ, ఎన్నికలలోను, ఇతరత్రా పెట్టే ఖర్చులు – వీటికి ఎటువంటి జమా ఖర్చుల లెక్కలు లేవు. చట్టంలో కొన్ని నిబంధనలున్నా, వాటిని కఠినంగా అమలు చేసే యంత్రాంగాన్ని పాటించకపోతే శిక్షపడే ఏర్పాటు కానీ లేకపోవడంతో ఆ నిబంధనలను అన్ని ప్రధాన పార్టీలు యథేచ్ఛగా విస్మరిస్తున్నాయి. ఇలా ప్రజాస్వామ్యం రాను రాను మరింత కుంటుపడుతోంది. అందుకే గత 10 సంవత్సరాలుగా ఎన్నికల్లో డబ్బు ప్రభావం, వారసత్వ రాజకీయాలు మరింతగా పెరిగాయి.

రాజకీయ పార్టీలను సంస్కరించి రాజకీయ సంస్కృతిని సమూలంగా మార్చకపోతే మన ప్రజాస్వామ్యానికి పట్టిన ఈ చీడ తొలగిపోదు. అందుకు రెండే మార్గాలున్నాయి. పార్టీలోని సాధారణ సభ్యులు ఈ నిరంకుశత్వాన్ని, దోపిడిని నిర్భయంగా ఎదిరించాలి. అధిక సంఖ్యాకులుగా ఉన్న సామాన్య సభ్యులు ప్రస్తుతం తీవ్రంగా నష్టపోతున్నారు. పార్టీ పేరుతో కష్టపడేది. నానాచాకిరీ చేసేది, ఎన్నికల్లో దొంగ ఓట్లు వేసేది, సభలు, సమావేశాలకు ఒళ్ళు హూనం చేసుకునేది ఈ సామాన్య కార్యకర్తలే. వీరంతా పల్లకీలు మోసే బోయీలుగా ఉంటే, ఆ పార్టీలలో పై స్థాయిలో ఉన్నవారు అధికారాన్ననుభవిస్తూ రాజభోగాలకు అలవాటుపడి పోయారు. రాజకీయంగా ఏదో ఒక రకమైన గుర్తింపు ఉంటే ప్రయోజనం చేకూరుతుందన్న భ్రమతో చాలామంది అమాయకులు ఈ రాజకీయ యజ్ఞంలో సమిధలవుతున్నారు. పరిస్థితిని గుర్తించి వారు తిరగబడితే పార్టీల నిర్వహణ తీరు మారుతుంది. ఎన్నికల వ్యవస్థను సమూలంగా మార్చాలి. ప్రస్తుతం ఉన్న ఎన్నికల తీరు పార్టీల నిరంకుశత్వాన్ని పెంచుతోంది. కొద్ది ఓట్లు మారినా ఫలితాలు తారుమారయ్యే పరిస్థితి వల్ల అక్రమాలకు పాల్పడనిదే నియోజకవర్గంలో గెలుపు అసాధ్యం కాదనడం వల్ల, ప్రధాన పార్టీల నాయకత్వాన్ని ఎదిరించే సాహసాన్ని ఎవరూ చేయలేకపోతున్నారు. ఎన్నికలకు సంబంధించి సంస్కరణలు తెచ్చి ఓట్ల శాతాన్నిబట్టి సీట్ల పొందే పద్ధతులను అలా జరగకుండా ఎన్ని పార్టీలు ఎంత ఆడంబరంగా సమావేశాలు జరుపుకున్నా, అందులో ప్రజలకేమీ పాత్ర ఉండదు. ఇవి ఓ ప్రైవేటు కంపెనీ స్వంత లాభాపేక్షతో జరుపుకునే సమావేశాలలాంటివి. కొందరు కోటేశ్వరులు తమ ఇళ్ళల్లో జరుపుకునే శుభకార్యాలలాంటివి. అటువంటి ఆర్భాటాల వల్ల పార్టీల చర్యలకు, ప్రజల ఆశలకు మధ్య అంతరం పెరుగుతుందే తప్ప తగ్గదు.

* * *

# నిర్దిష్టకాలావధికాదు నిర్దుష్ట కార్యాచరణ ముఖ్యం

*నవంబర్ 22, 1997*

లోక్‌సభ, శాసనసభలకు నిర్దిష్ట కాలపరిమితి ఉండాలని, మళ్ళీ మళ్ళీ మధ్యంతర ఎన్నికలు రాకుండా విధిగా ఐదేళ్లపాటు చట్టసభలు నడిచేలా సవరణలు తేవాలని ప్రభుత్వ సంకల్పంగా ప్రకటించారు. 1996 నుంచి ఇప్పటివరకు నలభై మాసాలలో మూడుసార్లు లోక్‌సభ ఎన్నికలు జరిగాయి. పార్టీలు మళ్లీ మళ్లీ ప్రజల ముందుకు వెళ్ళి సంజాయిషీ ఇచ్చుకోవటానికి సహజంగానే బిడియపడుతున్నాయి. కాబట్టి పార్టీలకు, అందునా అధికారంలో ఉన్న పార్టీలకు, ఒకసారి ఎన్నిక పూర్తయ్యాక మళ్ళీ ఐదేళ్ళ వరకు ప్రజల దగ్గరకు వెళ్ళే అవసరం లేకుండా ఉంటే బాగుండననిపిస్తుంది. మధ్యతరగతి ఓటర్లకూ తరచూ వచ్చే ఎన్నికలంటే జుగుప్స కలుగుతోంది. ప్రభుత్వాలు స్థిరంగా లేకపోతే నిర్ణయాలు తీసుకోవటం కష్టం. అందువల్ల పరిపాలన స్తంభించిపోవటం తథ్యం. దానికి తగ్గట్టు ఎన్నికలు ఎప్పుడు ముంచుకొస్తాయో తెలియనప్పుడు కఠిన నిర్ణయాలు తీసుకోకుండా దాటవేయటం, వీలున్నంత మేరకు తాత్కాలికంగా ప్రజాకర్షక నిర్ణయాలు తీసుకొని జనాన్ని మభ్యపెట్టే ప్రయత్నాలు చేయటం పరిపాటి. ఈ కారణాలవల్ల సుస్థిర ప్రభుత్వాలు కావాలని, మళ్ళీ మళ్ళీ ఎన్నికలు రాకూడదని, అందుకోసం చట్టసభలు విధిగా ఐదేళ్ళు కొనసాగేలా చట్టాలు కావాలని కోరటంలో ఆశ్చర్యం లేదు.

## సుస్థిర ప్రభుత్వం - మంచి పాలన

సుస్థిర ప్రభుత్వాలు ఉన్నంత మాత్రాన మంచి పాలన వస్తుందని విజ్ఞతతో కూడిన నిర్ణయాలు చేస్తారని ఆశించటం భ్రమ. మంచిపాలనకోసం సుస్థిరత్వం కావాలి కాని, సుస్థిరత్వం ఉన్నంత మాత్రాన మంచి పాలన రాదు. 1946లో ప్రధానమంత్రి పదవిని చేపట్టిన జవహర్‌లాల్‌నెహ్రూ 1964లో మరణించే వరకూ అధికారంలో ఉన్నారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన లాల్‌బహదూర్‌శాస్త్రి 1966లో అకాల మృత్యువాత పడటం వలన కొద్దికాలం పాటే పదవిలో ఉన్నారు. 1966లో ప్రధానమంత్రి అయిన ఇందిరాగాంధీ 1977 ఎన్నికలలో ఓడే వరకు

అధికారంలో ఉన్నారు. మళ్ళీ 1980 జనవరిలో జరిగిన ఎన్నికలలో గెలిచి అధికారం కైవసం చేసుకున్న ఇందిరాగాంధీ 1984 అక్టోబరు 31న హంతకుల ఉన్మాదానికి బలయ్యేవరకు తిరుగులేని అధిపత్యం చెలాయించారు. మధ్యలో 1977 లో వచ్చిన జనతా ప్రభుత్వం మాత్రం అంతర్గత కలహాల వల్ల అస్థిరత పాలయి – మొరార్జీదేశాయి రెండేళ్ళకు పైగా, చరణ్‌సింగ్ ఆరు నెలలపాటు ప్రభుత్వాన్ని నడిపారు. మళ్ళీ 1984లో ఇందిరాగాంధీ వారసుడిగా ప్రధాని పదవిని చేపట్టిన రాజీవ్‌గాంధీ 1989 అక్టోబరు ఎన్నికలలో ఓడేదాకా అధికారంలో ఉన్నారు. 1989–91 మధ్య 18 నెలల కాలంలో వి.పి.సింగ్, చంద్రశేఖర్ ప్రభుత్వాలు వచ్చిపోయాయి. 1991లో పి.వి. నరసింహారావు అధికారాన్ని చేపట్టి 1966లో సాధారణ ఎన్నికల దాకా పదవిలో ఉన్నారు. 1996 నుంచి ఇప్పటివరకు నలభై మాసాలలో దేవేంద్రగౌడ, గుజ్రాల్, వాజపేయిలు ప్రభుత్వాలను ఏర్పాటు చేశారు. 1946 నుంచి ఇప్పటివరకు 53 సంవత్సరాలలో 46 సంవత్సరాలపాటు కాంగ్రెస్ పార్టీ ఐదుగురు ప్రధానమంత్రులతో సుస్థిర పాలన వచ్చింది. అందులో నెహ్రూ కుటుంబానికి చెందిన ముగ్గురు నలభై ఏళ్లపాటు అధికారంలో కొనసాగారు. ఇంతకంటే స్థిరమైన పాలన ప్రజాస్వామ్యంలో మనం ఊహించలేం. కాని అలాంటి సుస్థిరత్వం వల్ల దేశంలో వనరుల మేరకు ఆర్థికాభివృద్ధి జరగలేదు. దళితులకు, బలహీనులకు సామాజిక న్యాయం అందలేదు. నిరుద్యోగం విపరీతంగా పెరిగింది. ప్రజల మౌలిక అవసరాలు తీరలేదు. అవినీతి అంతులేకుండా విస్తరించింది. పరిపాలన అంటేనే ప్రజలకు జుగుప్స కలిగింది. ఇవన్నీ చూసి, అనుభవించాక కూడా కేవలం సుస్థిర ప్రభుత్వాల వల్లనే మంచి పాలన వస్తుందని ఆశించటం అమాయకత్వం. మంచిపాలన కోసం, అవినీతిని అంతమొందించటం కోసం, ఎన్నికయిన వాళ్లు ప్రజలకు జవాబుదారీగా ఉండటం కోసం తగిన ఏర్పాట్లు చేయకుండా సుస్థిర ప్రభుత్వాలు ఉన్నా ప్రజలకు ఒరిగేదేమీ లేదు. అందువల్ల అవినీతి, దోపిడీ రాజ్యాంగబద్ధంగా కొనసాగుతాయి. అలాంటి శ్మశాన స్తబ్దత వల్ల కేవలం అధికారంలో ఉన్నవాళ్లకు, వాళ్ల కుటుంబాలకు, తాబేదార్లకు మాత్రం ప్రయోజనం చేకూరుతుంది.

## మెజారిటీ కోల్పోయినా పాలన సాధ్యమా?

చట్టం ద్వారా చట్టసభలు ఐదేళ్లు విధిగా కొనసాగాలని శాసిస్తే ఏం జరుగుతుందో చూద్దాం. లోక్‌సభలో మెజారిటీ ఉన్నంతకాలం ఓ ప్రభుత్వం ఎలాగూ ప్రస్తుత

రాజ్యాంగం ప్రకారం పదవిలో కొనసాగుతుంది. ప్రభుత్వాలూ స్థిరంగా ఉన్నా ఇప్పటికే చాలాసార్లు రాజ్యసభ మద్దతు లేని కారణంగా చట్టాలు చేయలేకపోతున్నారు. చట్టాలు చేసినా ఒత్తిళ్లకు లొంగి ఏళ్ళతరబడి వాటిని అమలు చేయలేకపోతున్నారు. ఉదాహరణకు ఎప్పుడో పి.వి. నరసింహారావు ప్రభుత్వ కాలంలో ఢిల్లీ రెంట్ కంట్రోలు చట్టాన్ని సవరిస్తూ చట్టాన్ని ఆమోదించారు. కొత్త భవన నిర్మాణాలను ప్రోత్సహించి ఇళ్ళ కొరత తీర్చాలన్నా, ఆర్థిక వ్యవస్థకు కాస్త దన్ను ఇవ్వాలన్నా రెంట్ కంట్రోలు చట్టాలను మార్చాలని చాలామంది ఆర్థికవేత్తలు, పారిశ్రామికవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఆ మేరకు చట్టం చేసి, అది రాష్ట్రపతి ఆమోదం పొందినా ఇంత వరకు అది అమలుకు నోచుకోలేదు! ఆ చట్టం చేశాక నరసింహారావు ప్రభుత్వం పోయి వరుసగా – 13 రోజుల వాజపేయి ప్రభుత్వం, ఆ తరువాత దేవేగౌడ, గుజ్రాల్ ప్రభుత్వాలు, మళ్ళీ వాజపేయి ప్రభుత్వం వచ్చాయి. కానీ, ఇంతవరకు ఆ చట్టాన్ని ప్రభుత్వ గెజెట్‌లో ప్రకటించి, దాని అమలుకు తేదీని నిర్ణయించలేకపోయారు! చాలాకాలంగా నామమాత్రపు అద్దె చెల్లిస్తున్న షాపుల యాజమానుల ఒత్తిడివల్ల ఆ చట్టాన్ని అమలుచేసే ప్రయత్నం నేటికీ జరగలేదు! చేసిన చట్టాన్ని ప్రకటించి, అమలు చేయలేని ప్రభుత్వాలు తమ రాజ్యాంగ ధర్మాన్ని విస్మరిస్తున్నాయి. అలాంటి ప్రభుత్వాలు ఉండి ఏం ప్రయోజనం? అలాంటప్పుడు చట్టసభలు ఎంతకాలం ఉన్నా ప్రజలకు ఒరిగేదేమిటి? మెజారిటీ మద్దతున్న ప్రభుత్వాలు మాత్రమే చట్టాలు చేయగల పరిస్థితి మంచిది కాదు. ఆచట్టాలను అమలు చేయటం కష్టమయినప్పుడు, ఓ ప్రభుత్వం చట్టసభలో మెజారిటీ మద్దతు కోల్పోతే అప్పుడు చట్టాలు ఎలా చేస్తారు? బడ్జెటును ఎలా ఆమోదిస్తారు? ప్రభుత్వానికి లోక్‌సభలో కూడా మద్దతు లేకపోతే, ఆ ప్రభుత్వం ఎలా పరిపాలన నిర్వహిస్తుంది? ఎవరికి బాధ్యత వహిస్తుంది? చట్టాలే చేయలేని చట్టసభలుండి ప్రయోజనం ఏమిటి? అలాగే ప్రభుత్వంలో ఉన్న ఒక పెద్ద పార్టీ నిరంకుశ ధోరణులను ప్రదర్శిస్తేనో, అక్రమాలకు పాల్పడితేనో దానికి మద్దతు ఉపసంహరించుకోవటం తప్పనిసరి కావచ్చు. అలాంటప్పుడు ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోతే, మరి ఆ చట్టసభ ఎలా నడుస్తుంది? ఉన్న ప్రభుత్వం కూలిపోయి, దానికి మద్దతు లేక, మరో ప్రభుత్వం ఏర్పడక, పాలన త్రిశంకు స్వర్గంలో ఉన్నప్పుడు మళ్ళీ ప్రజల తీర్పు కోరటం తప్ప మరో ప్రత్యామ్నాయం లేదు. అదీకాక, తాము ఏమి చేసినా, ఎన్నిసార్లు పార్టీలు ఫిరాయించినా, ఎన్నిసార్లు మద్దతులు ఉపసంహరించుకుని పంథా మార్చినా ఐదేళ్లపాటు కచ్చితంగా పదవులలో ఉంటామని,

ప్రజల ముందుకు పోనక్కరలేదని ధీమా ఉంటే చట్టసభ సభ్యులు రోజూ పార్టీలు మారుస్తారు. ఇప్పటికే పదవులనాశించో, డబ్బుకు లొంగో గ్రూపులు మార్చటం, ముఠాలు కట్టటం, పార్టీలు చీల్చడం, అర్థరాత్రి ప్రభుత్వాలను తల్లకిందులు చేయటం అనవాయితీ అయిపోయింది. పార్టీ ఫిరాయింపు నిషేధ చట్టం ద్వారా ఒకరిద్దరు సభ్యులు కాక మూడోవంతు మంది ఫిరాయిస్తే దాన్ని చట్టబద్ధం చేశారు! ఉత్తరప్రదేశ్ లాంటి చోట్ల స్పీకరు కైలాస్‌నాథ్ త్రిపాఠీ పుణ్యమా అని – 54లో 12 అంటే మూడోవంతు అయినట్లేనని కొత్త లెక్కసృష్టించి బి.యస్.పి.లోంచి ఫిరాయించిన వాళ్ల సభ్యత్వం రద్దు కాకుండా చేశారు. అలా అక్కడి ప్రభుత్వం అక్రమ పునాదుల మీద నిలుస్తోంది. అలాంటి చట్టసభలను ఏదోలా ఐదేళ్లు కొనసాగిస్తే ఇక అవినీతికి, అక్రమాలకు, ప్రజాధనం దోపిడీకి, సామాన్యులపై నిరంకుశత్వానికి, పాలకుల అహంకారానికి ఎలాంటి అవరోధం ఉండదు.

## జర్మన్ విధానం పరిశీలనార్హం

చట్టసభలకు విధిగా ఐదేళ్ళపదవీ కాలం ఉండాలని వాదించేవారు. జర్మన్ రాజ్యాంగాన్ని ఉటంకిస్తున్నారు. జర్మనీలో ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఎన్నుకునే దాకా ఉన్న ప్రభుత్వాన్ని తొలగించడం సాధ్యం కాదు. 67వ అధికరణం ప్రకారం ప్రతినిధుల సభ (పార్లమెంటు దిగువ సభ) కొత్త ఛాన్సెలర్ (ప్రధానమంత్రి) ను మెజారిటీ మద్దతుతో ఎన్నుకున్న తరువాత మాత్రమే ప్రస్తుతం ఉన్న ఛాన్సెలర్ పైన అవిశ్వాస తీర్మానాన్ని పెట్టి ఆమోదించవచ్చు. అయితే 68వ అధికరణం ప్రకారం ఛాన్సెలర్ సభ విశ్వాసాన్ని పొందలేకపోయినా, అధిక సంఖ్యాకుల మద్దతు కోల్పోయినా చట్టసభను రద్దుచేయమని అధ్యక్షుడికి సిఫార్సు చేయవచ్చు. అధ్యక్షుడు 21 రోజులలోగా ఆ సభను రద్దు చేయాలి. ఒకవేళ ఆ మూడు వారాలలోగా మెజారిటీ సభ్యులు మరో ఛాన్సెలర్‌ను ఎన్నుకుంటే సభను రద్దు చేయరాదు. అంటే ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏర్పాటుకు మార్గాలను జర్మన్ రాజ్యాంగం సుగమం చేసింది. అంతేగాని ఏ ప్రభుత్వమూ నిలవలేకపోయినా సభ కొనసాగాలని, ఎన్నికలు జరగరాదని నిబంధన లేదు. అలాగే ఛాన్సెలర్‌కు సభలో మెజారిటీ మద్దతు లేనప్పుడు, ప్రత్యామ్నాయ ప్రభుత్వం ఏర్పాటు కానప్పుడు, అత్యవసర చట్టాలను దిగువసభ ఆమోదించకపోయినా, ఎగువసభ ఆమోదంతో చట్టం చేసే వీలును జర్మన్ రాజ్యాంగం కల్పించింది. అంటే సంక్షోభ కాలంలో కనీసం అవసరమైన చట్టాలు చేసే అవకాశం ఉంది. అయితే మన దేశంలో

లోక్‌సభలో మద్దతు ఉన్న ప్రభుత్వాలలకే రాజ్యసభలో చట్టాలకు ఆమోదం పొందటం గగనంగా ఉంది! అలాంటప్పుడు ప్రభుత్వమే పతనమయ్యాక రాజ్యసభ చట్టాలు చేయడం జరిగే పని కాదు. వీటన్నింటిని నిశితంగా పరిశీలిస్తే చట్టసభలు ఐదేళ్లపాటు విధిగా ఉండాలని చట్టం చేయటం వల్ల ప్రయోజనం కంటే చిక్కులే ఎక్కువ ఉన్నాయి. చీటికిమాటికి అవిశ్వాస తీర్మానాలు పెట్టకుండా, ప్రభుత్వాలను విశ్వాస తీర్మానాలు పెట్టమని రాష్ట్రపతి, గవర్నర్లు ఆదేశించకుండా కొన్ని మార్పులు తేవచ్చు. పార్టీ ఫిరాయింపులు, దొంగ చీలికలని నిరోధిస్తూ చట్టపరంగా కట్టుదిట్టాలు చేయవచ్చు. అంతేగాని, ఎన్నికలంటే భయపడి, కట్టుదిట్టాలు చేయవచ్చు. అంతేగాని ఎన్నికలంటే భయపడి, బలవంతంగా ప్రభుత్వాలను సుస్థిరంగా ఉంచగలమన్న భ్రమతో చట్టసభ ఎవరి పని వారు చేసేలా చర్య తీసుకుంటే పరిస్థితి వేరు. అధికారాల విభజన ఉన్నచోట ప్రభుత్వాధినేతకు, చట్టసభ ఏనాడూ రద్దు కారాదని శాసనం చేయటం పార్లమెంటు వ్యవస్థలో అసంబద్ధం. అత్యంత ప్రమాదకరం. దానివల్ల రోజూ ప్రభుత్వాలు మారి మరింత అస్థిరత్వం పెరుగుతుంది. ఇలాంటి ప్రతిపాదన పార్లమెంటరీ వ్యవస్థలో జవాబుదారితనాన్ని హరించి వేస్తుంది. స్థిరత్వం కోసం, మంచి పాలన కోసం అధికారాల విభజన చేసి, ప్రభుత్వం, చట్టసభ ఎవరి పనివారు చేసేలా చర్య తీసుకుంటే పరిస్థితి వేరు. అధికారాల విభజన ఉన్నచోట ప్రభుత్వాధినేతకు, చట్టసభకు – రెండింటికీ సుస్థిరత ఉంటుంది. ఒకరి మనుగడను మరొకరు శాసించలేరు. ఇరువురూ సయోధ్య కోసం ప్రయత్నిస్తేనే చట్టాలు సాధ్యమవుతాయి. అది అమెరికా లాంటి దేశాలలో ఉంది. పార్లమెంటరీ వ్యవస్థలో ప్రభుత్వం, చట్టసభ విడదీయరానంతగా కలసి ఉంటాయి. ఒకరిమీద మరొకరి మనుగడ ఆధారపడి ఉంటుంది. అలాంటి వ్యవస్థలో చట్టసభలకు స్థిర కాలపరిమితి కల్పించటం ఆచరణ సాధ్యం కాదు. సమాజంలో స్థిరత్వం, సహజజీవనం లేనప్పుడ పైపై పూతల కృత్రిమ రాజకీయ స్థిరత్వానికి పూనుకోవటంపై ప్రమాదకరం.

* * *